సత్యమేవ జయతే

సాక్షి


WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 237

సోమవారం 18-11-2024

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | MUMBAI | BANGALORE | CHENNAI | DELHI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'ప్రజా ప్రతినిధులు చేయాల్సింది రెండే, ప్రజా సేవలో సమర్థతను చాటుకోవడమా! లేక తప్పుకోవడమా!'



మోదీకి నైజీరియా పురస్కారం

నైజీరియా రెండో అత్యున్నత జాతీయ పురస్కారాన్ని ఆ దేశాధ్యక్షుడు తినూబు చేతుల మీదుగా ప్రధాని మోదీ అందుకున్నారు.

వివరాలు 6లో ▸




విశ్వసుందరి విక్టోరియా కెజార్

మిస్ యూనివర్స్ 2024 అందాల పోటీలో డెన్మార్క్ యువతి విక్టోరియా గెలిచింది. దేశం తరఫున తొలి కిరీటాన్ని అందుకుంది.

వివరాలు 6లో ▸

గ్రీన్ హైడ్రోజన్.. కొత్త విజన్!



- రాష్ట్రంలో గ్రీన్ హైడ్రోజన్, అనుబంధ ఇంధనాల పరిశ్రమలపై సర్కారు ఫోకస్
- భారీ రాయితీ, ప్రోత్సాహకాలను ప్రకటించే యోచన
- ఇంటిగ్రేటెడ్ గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమోనియా, గ్రీన్ మిథనాల్ ప్రాజెక్టులకూ వర్తింపు
- తెలంగాణ రెన్యూవబుల్ ఎనర్జీ పాలసీ–2024లో ప్రకటించనున్న ప్రభుత్వం

- వివరాలు 2లో▶

వామ్మో.. 61



ఉద్యోగుల రిటైర్మెంట్‌లపై సర్కారు బెంబేలు • ఐదేళ్లలో 44 వేల మందికి తక్షణ బెనిఫిట్ల కింద రూ. 20 వేల కోట్లు చెల్లించాల్సి ఉండటమే కారణం

రూ. 350 కోట్లు — ప్రభుత్వ ఖజానాపై ప్రతి నెలా సగటున పడనున్న భారం.. ఇది ప్రతి సంవత్సరం పెరిగే అవకాశం

- రిటైర్మెంట్ వయసును 58 నుంచి 61కి పెంచిన గత సర్కార్
- ఫలితంగా 2021–24 వరకు నాటి ప్రభుత్వానికి ఉపశమనం
- ఆ తర్వాత నుంచి ఉద్యోగ విరమణలు మళ్లీ మొదలు
- ఎలా గట్టెక్కాలోనని తల పట్టుకుంటున్న ప్రభుత్వం
- ప్రస్తుతం మెడికల్ బిల్లులు, సరండర్ లీవ్‌ల చెల్లింపూ గగనమే

సాక్షి, హైదరాబాద్: 'ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024–25) మొదలుకొని రానున్న ఐదేళ్లలో ఏకంగా 44 వేల మంది ప్రభుత్వ ఉద్యోగులు రిటైర్ కానున్నారు. వీరికి రిటైర్మెంట్ బెనిఫిట్ల కింద సగటున రూ.30 లక్షల నుంచి కోటి రూపాయల వరకు చెల్లించాలి. ఇది రాష్ట్ర ప్రభుత్వ ఖజానాకు

మిగతా 2వ పేజీలో ▶

ఎన్ని ఎలక్ట్రిక్ వాహనాలు కొన్నా రాయితీ

రిజిస్ట్రేషన్ చార్జీలు, పన్నుల చెల్లింపు ఉండదు..

- ఎలక్ట్రిక్ వాహన విధానాన్ని సవరించిన ప్రభుత్వం..
- నేటి నుంచి అమల్లోకి.. గతంలో అన్ని కేటగిరీలు కలిపి తొలి 2,25,500 వాహనాలకే వర్తింపు.. ఇప్పుడు వాహనాల సంఖ్యపై సీలింగ్ ఎత్తివేత

-16లో

స్మార్ట్ కార్డు 'బట్వాడా' కష్టాలు

నిలిచిపోయిన ఆర్సీ, లైసెన్స్ స్మార్ట్ కార్డుల సరఫరా ● చార్జీలు చెల్లించకపోవటంతో బట్వాడా నిలిపేసిన పోస్టల్ శాఖ

సాక్షి, హైదరాబాద్: రవాణా, పోస్టల్ శాఖల మధ్య ఏర్పడిన సమస్య వాహనదారులకు కష్టాలు తెచ్చిపెట్టింది. రవాణాశాఖ జారీచేసే లైసెన్సులు, ఆర్సీ సహా అన్ని రకాల స్మార్ట్ కార్డుల బట్వాడాను తపాలాశాఖ నిలిపేయటంతో కార్డులు అత్యవసరమైన వాహనదారులు తీవ్ర సమస్యలు ఎదుర్కొంటున్నారు. 15 నెలలుగా కార్డుల బట్వాడా చార్జీలను తపాలా శాఖకు రవాణాశాఖ చెల్లించటం లేదు. దాదాపు రూ.2 కోట్ల చార్జీలు పెండింగ్‌లో ఉన్నట్లు సమాచారం. ఎంతకూ ఈ బిల్లు రాకపోవటంతో నవంబర్ ఒకటో తేదీ నుంచి పోస్టల్ శాఖ ఆర్టీఏ కార్యాలయాల నుంచి కార్డుల బట్వాడాకు సంబంధించిన ముందస్తు బుకింగ్‌తోపాటు సిద్ధమైన కార్డులను వాహనదారులకు చేరవేసే సేవలను కూడా నిలిపివేసింది. దీంతో ఆర్టీఏ కార్యాలయాల్లోనే దాదాపు 2 లక్షల కార్డులు పేరుకుపోయాయి. దీంతో జేబులో ఆర్సీ, లైసెన్స్ లేకుండా వాహనంతో రోడ్డెక్కితే ట్రాఫిక్ పోలీసులు ఫైన్ వేస్తున్నారని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆర్టీఏ కార్యాలయాల్లో పేరుకుపోయిన 2 లక్షల కార్డులు	15 నెలలుగా పోస్టల్ చార్జీలు చెల్లించని రవాణాశాఖ	వాహనదారుల నుంచి చార్జీలు వసూలు చేసి సొంత ఖాతాలోకి..	తపాలా శాఖకు రూ.2 కోట్ల బకాయి ఉన్నట్లు సమాచారం	కార్డులు రాక కష్టాలు పడుతున్న వాహనదారులు



రాబడి లెక్కే.. చెల్లింపు లెక్కలేదు

వాహనదారుల నుంచి వసూలు చేసే వివిధ రకాల చార్జీలను రవాణాశాఖ ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి జమ కడుతుంది. దీన్ని ఆదాయంగా ప్రభుత్వం భావిస్తుంది. తదుపరి సంవత్సరానికి ఈ ఆదాయాన్ని పెంచాలని రవాణా శాఖకు ప్రభుత్వం కొత్త టార్గెట్ నిర్దేశిస్తుంది. ప్రభుత్వం ఆదాయాన్ని అయితే వసూలు చేస్తోంది కానీ.. ఖర్చులకు కావల్సిన మొత్తాన్ని విడుదల చేయటంలేదు. 2014–15లో రూ.1,855 కోట్ల ఆదాయాన్ని రవాణాశాఖ ద్వారా పొందిన ప్రభుత్వం.. 2023–24 నాటికి రూ.6,990 కోట్లకు పెంచుకుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జూన్ నాటికి రూ.1,593 కోట్ల ఆదాయం పొందింది.

రూ.4 కోట్లు వసూలు చేసినా..

గత 15 నెలల్లో వాహనదారుల నుంచి 'కార్డుల బట్వాడా రుసుము'పేరుతో రవాణాశాఖ దాదాపు రూ.4 కోట్లు వసూలు చేసింది. ఇందులో రూ.2 కోట్లు తపాలాశాఖకు చెల్లించాల్సి ఉంది. 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ప్రభుత్వం రవాణాశాఖ ద్వారా రూ.6,990 కోట్లు రాబట్టుకుంది. ఇందులో రూ.2 కోట్లంటే సముద్రంలో నీటిబొట్టంతే. కానీ, ఆ చిన్న మొత్తాన్ని కూడా తపాలా శాఖకు చెల్లించలేకపోయింది. ఆర్సీ, లైసెన్సు, రెన్యువల్స్, కొన్ని రకాల డూప్లికేట్ స్మార్ట్ కార్డులను రవాణాశాఖ వాహనదారులకు పోస్టు ద్వారా చేరవేస్తుంది. ఆయా లావాదేవీకి సంబంధించి దరఖాస్తు సమయంలోనే ఆన్‌లైన్‌లో తపాలా బట్వాడా రుసుము వసూలు చేస్తుంది. తపాలా బట్వాడా చార్జీ కింద వాహనదారు నుంచి రూ.35 చొప్పున రవాణా శాఖ వసూలు చేసుకుంటోంది. పోస్టల్ శాఖకు మాత్రం ఒక్కో కార్డు బట్వాడాకు చెల్లిస్తున్నది రూ.17 మాత్రమే. కవర్ చార్జీ కింద మరో రూపాయి చెల్లిస్తుంది.

తపాలాశాఖ ఉదారం.. రవాణాశాఖ నిర్లక్ష్యం

రాష్ట్ర ప్రభుత్వ విభాగాలకు తన వంతుగా మెరుగైన సేవలు అందించేందుకు తపాలాశాఖ కొంత ఉదారంగానే వ్యవహరిస్తోంది. 'బుక్ నౌ.. పే లేటర్' విధానాన్ని ప్రారంభించి బట్వాడాకు సంబంధించిన పార్శిళ్లను ముందుగా బుక్ చేసి, వాటి రుసుములను తర్వాత చెల్లించినా ఫర్వాలేదు అన్న 'ఉద్దెర'పాలసీ తీసుకొచ్చింది. దీంతో కార్డుల బట్వాడా చేయించుకుంటూ.. రుసుములు తర్వాత చెల్లించే పద్ధతికి రవాణాశాఖ అలవాటు పడింది. చార్జీలు రాకున్నా సేవలు ఎందుకు అందిస్తున్నారని రెండేళ్ల క్రితం ఆడిట్ విభాగం తపాలాశాఖను ప్రశ్నించింది. తపాలాశాఖ అధికారులు ఇదే విషయాన్ని రవాణాశాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా వారి తీరు మారలేదు.

క్లుప్తంగా...

ధాన్యం ఉత్పత్తిలో తెలంగాణ టాప్

153 లక్షల మెట్రిక్ టన్నుల రికార్డు ఉత్పత్తి: మంత్రి ఉత్తమ్



సాక్షి, హైదరాబాద్: వరి ధాన్యం ఉత్పత్తిలో తెలంగాణ రాష్ట్రం కొత్త రికార్డు సృష్టించిందని పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. వానాకాలంలో 66.77 లక్షల ఎకరాల్లో వరి సాగుచేస్తే 153 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అయిందని తెలిపారు. ఇది తెలంగాణ రైతుల ఘన విజయమని కొనియాడారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు చెందిన మూడు బరాజ్‌లు పనిచేయకపోయినా వరి ఉత్పత్తిలో సాధించిన ఈ రికార్డు రాష్ట్ర ప్రభుత్వ పనితీరుకు అద్దం పడుతోందని ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రైతాంగానికి ప్రభుత్వం వెన్నుదన్నుగా నిలుస్తోందనడానికి పండిన ఈ పంటనే నిదర్శనమని అన్నారు. యావత్ భారతదేశంలోనే ఇది అరుదైన రికార్డు అని చెప్పారు.

22 జిల్లాల్లో ఇందిర మహిళా శక్తి కేంద్రాలు

ఒక్కొక్క భవన నిర్మాణానికి రూ.5 కోట్లు

సాక్షి, హైదరాబాద్: స్వయం సహాయక సంఘాలకు వివిధ రకాల శిక్షణ ఇచ్చి.. చైతన్యపరిచేందుకు అన్ని జిల్లాల్లో ఇందిరా మహిళా శక్తి కేంద్రాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో జిల్లా మహిళా సమాఖ్య పేరిట నిర్మించగా.. మిగిలిన 22 జిల్లాల్లో కొత్తగా వీటి నిర్మాణానికి చర్యలు చేపట్టింది. ఒక్కో ఇందిర మహిళా శక్తి కేంద్రం నిర్మాణానికి రూ.5 కోట్లు చొప్పున కేటాయించింది. మొత్తం 22 భవనాల నిర్మాణానికి రూ.110 కోట్లు మంజూరు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి లోకేశ్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇందిర మహిళా శక్తి భవన్‌లను శిక్షణ, మార్కెటింగ్, కామన్ వర్క్‌షెడ్, ఉత్పత్తుల ప్రదర్శన, మేళాలు, జీవనోపాధి, ఆర్థిక కార్యకలాపాల నిర్వహణకు వినియోగించనున్నారు. గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ముఖ్య కార్యనిర్వహణాధికారి పంపిన ప్రతిపాదనలను రాష్ట్ర ప్రభుత్వం పరిశీలించి ఆమోదించింది.

వరికి మద్దతు ధర.. బోనస్

శనివారం వరకు 12.23 లక్షల టన్నుల వడ్ల కొనుగోలు: అన్వేశ్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం వరి పంటకు మద్దతు ధరతో పాటు బోనస్ కూడా ఇస్తోందని తెలంగాణ రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ సుంకేట అన్వేశ్‌రెడ్డి తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో కాంటా పెట్టిన మూడు రోజుల్లోనే మద్దతు ధరతో పాటు బోనస్ కలిపి చెల్లిస్తున్నామని ఆదివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. రాష్ట్రంలో ధాన్యం సేకరణ కోసం రూ.30 వేల కోట్లు కేటాయించామని, శనివారం నాటికి రాష్ట్రవ్యాప్తంగా 12.29 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామని తెలిపారు. ఇందులో 2.76 లక్షల టన్నుల సన్న ధాన్యం ఉందని అన్నారు. ఇప్పటివరకు సన్నధాన్యానికి బోనస్ కింద రూ.33 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేసినట్టు వెల్లడించారు.

గ్రీన్ హైడ్రోజన్.. కొత్త విజన్!

రాష్ట్రంలో గ్రీన్ హైడ్రోజన్, అనుబంధ ఇంధనాల పరిశ్రమలపై సర్కారు ఫోకస్

భారీ రాయితీ, ప్రోత్సాహకాలను ప్రకటించే యోచన

- ఇంటిగ్రేటెడ్ గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమోనియా, గ్రీన్ మిథనాల్ ప్రాజెక్టులకూ వర్తింపు
- తెలంగాణ రెన్యూవబుల్ ఎనర్జీ పాలసీ–2024లో ప్రకటించనున్న ప్రభుత్వం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో గ్రీన్ హైడ్రోజన్, అనుబంధ ఉత్పత్తుల (డెరివెటివ్స్) పరిశ్రమలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం భారీ రాయితీలు, ప్రోత్సాహకాలను ప్రకటించబోతోంది. ఈ మేరకు త్వరలో తెలంగాణ రెన్యూవబుల్ ఎనర్జీ పాలసీ–2024ను రూపొందించింది. స్వచ్ఛమైన ఇంధనంగా ప్రాచుర్యంలోకి వచ్చిన గ్రీన్ హైడ్రోజన్‌ను రవాణా (హైడ్రోజన్ సెల్ ఆధారిత వాహనాలు)తోపాటు ఎరువులు, రసాయనాల తయారీ, ఇతర కర్మాగారాల్లో ఇంధనంగా ప్రోత్సహించడం ద్వారా 'నెట్ జీరో'ఉద్గారాల ఆర్థిక వ్యవస్థగా రాష్ట్రాన్ని తీర్చిదిద్దడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తోంది.

గ్రీన్ హైడ్రోజన్ తయారీ, డెరివేటివ్స్ వినియోగాన్ని పెద్ద ఎత్తున ప్రోత్సహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. గ్రీన్ హైడ్రోజన్ నుంచి ఉత్పత్తి చేసే గ్రీన్ అమోనియా, గ్రీన్ మిథనాల్ ఇంధనాలనే డెరివేటివ్స్‌గా పరిగణిస్తారు.

డీసాలినేషన్ ప్లాంట్లకు 20% పెట్టుబడి రాయితీ

గ్రీన్ హైడ్రోజన్, దాని డెరివేటివ్స్ తయారీ అవసరమైన డీసాలినేషన్ ప్లాంట్ల ఏర్పాటుకు 20శాతం పెట్టుబడి రాయితీ ఇస్తారు. ప్రతి ఎంఎల్‌డీ (రోజుకు మిలియన్ లీటర్ల) సామర్థ్యానికిగాను రూ.కోటికి మించకుండా ఈ రాయితీ వర్తిస్తుంది. ఇక గ్రీన్ హైడ్రోజన్ హబ్‌ల ఏర్పాటుకు కేంద్రం అందించే ఆర్థిక సాయానికి అదనంగా 25శాతం వరకు (రూ.10 కోట్లకు మించకుండా) రాష్ట్ర ప్రభుత్వం అందించనుంది. గ్రీన్ హైడ్రోజన్ రీఫ్యూయలింగ్ స్టేషన్ల ఏర్పాటుకు కూడా పెట్టుబడి వ్యయంలో 25శాతం రాయితీ అందిస్తారు. తొలి 10 యూనిట్లకు మాత్రమే వర్తిస్తుంది. వీటికి అవసరమైన పరికరాల కొనుగోళ్లపై పూర్తి ఎస్‌జీఎస్టీని రీయింబర్స్ చేస్తారు.

కర్బన ఉద్గారాల తగ్గింపు లక్ష్యంలో భాగంగా..

భూతాపాన్ని నియంత్రించేందుకు ప్రపంచవ్యాప్తంగా కర్బన ఉద్గారాలను తగ్గించాలన్న చర్చ చాలాకాలం నుంచి సాగుతోంది. ఈ క్రమంలో శిలాజ ఇంధనాలకు బదులుగా కాలుష్య రహిత 'గ్రీన్ హైడ్రోజన్'ను ఇంధనంగా వినియోగించాలనే ప్రతిపాదనలు ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వం 2022 ఫిబ్రవరిలో ప్రకటించిన నేషనల్ హైడ్రోజన్ మిషన్‌లో 2030 నాటికి దేశంలో ఏటా 5 మిలియన్ టన్నుల గ్రీన్ హైడ్రోజన్‌ను ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకుంది. ఇందుకు అనుగుణంగా రాష్ట్రంలో

పరికరాలపై 25% పెట్టుబడి రాయితీ!

ఎలక్ట్రోలైజర్ ఆధారిత గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్టులకు.. ప్రతి మెగావాట్ /1,400 టీపీఏకు గరిష్టంగా రూ.కోటి చొప్పున ఎలక్ట్రోలైజర్ పరికరాలు, ప్లాంట్ వ్యయంలో 25శాతం వరకు రాయితీని అందిస్తారు. కనీసం150 కేటీపీఏ సామర్థ్యముండే హైడ్రోజన్ ప్లాంట్లకే సబ్సిడీ ఇవ్వనున్నారు. ఇక గ్రీన్ హైడ్రోజన్ ప్లాంట్లలో వినియోగించే ఎలక్ట్రోలైజర్ పరికరాల తయారీ ప్రాజెక్టులకూ పెట్టుబడి వ్యయంలో 25శాతం వరకు రాయితీ అందిస్తారు. కనీసం 500 మెగావాట్ల సామర్థ్యం కలిగిన తొలి 5 ప్లాంట్లకే ఇది వర్తిస్తుం

'ఇంటిగ్రేటెడ్' ప్రాజెక్టులకూ సబ్సిడీలు

ఇంటిగ్రేటెడ్ గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమోనియా, గ్రీన్ మిథనాల్ (బయోజనిక్ కార్బన్ సహా) పరిశ్రమల ప్లాంట్, పరికరాల (ఎలక్ట్రోలైజర్ సహా) వ్యయంలో 25శాతం వరకు సబ్సిడీగా ప్రభుత్వం అందిస్తుంది. గ్రీన్ అమోనియా ప్లాంట్ల ప్రతి కేటీపీఏ సామర్థ్యానికి రూ.1.85 కోట్లు, గ్రీన్ మిథనాల్ ప్లాంట్ల ప్రతి కేటీపీఏ సామర్థ్యానికి రూ.2.25 కోట్లను పెట్టుబడి రాయితీగా ఇస్తుంది. గ్రీన్ హైడ్రోజన్, దాని డెరివేటివ్స్ నుంచి విమాన ఇంధనం (ఎస్ఏఎఫ్) తయారు చేసే ప్లాంట్లకూ ఈ రాయితీలు వర్తిస్తాయి.

ఇతర రాయితీ, ప్రోత్సాహకాలివీ..

- గ్రీన్ హైడ్రోజన్, అనుబంధ ఉత్పత్తుల ప్రాజెక్టుల స్థలాలకు వ్యవసాయేతర స్థలాలుగా తక్షణమే గుర్తింపు కల్పిస్తారు.
- వీటి ఉత్పత్తుల అమ్మకాలపై వసూలు చేసే రాష్ట్ర జీఎస్టీ మొత్తాన్ని ఐదేళ్లపాటు రీయింబర్స్ చేస్తారు.
- ప్రాజెక్టులకు ప్రభుత్వమే నీటిసరఫరా సదుపాయాన్ని కల్పిస్తుంది. నీటి చార్జీలపై ఐదేళ్లపాటు 25శాతం రాయితీ ఇస్తారు.
- గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్టులు కొనుగోలు చేసే పునరుత్పాదక విద్యుత్‌కు సంబంధించిన అంతర్రాష్ట్ర ట్రాన్స్‌మిషన్ చార్జీల్లో 50శాతం మేర ఐదేళ్ల పాటు రాయితీ ఇస్తారు. గరిష్టంగా మెగావాట్‌కు రూ.15లక్షల రాయితీ వర్తిస్తుంది.

గ్రీన్ హైడ్రోజన్ అంటే..?



సౌర, పవన విద్యుత్ వంటి కాలుష్య రహిత, పునరుత్పాదక విద్యుత్‌ను ఉపయోగించి నీటిని హైడ్రోజన్, ఆక్సిజన్‌గా విడగొట్టడం ద్వారా.. ఉత్పత్తి చేసే హైడ్రోజన్‌ను 'గ్రీన్ హైడ్రోజన్' అంటారు. వాహనాలతోపాటు ఎరువులు, ఉక్కు, సిమెంట్ పరిశ్రమల్లో వాడే కాలుష్య కారక సాంప్రదాయ ఇంధనాలకు బదులుగా.. గ్రీన్ హైడ్రోజన్‌ను వినియోగించాలన్నది లక్ష్యం. తద్వారా కాలుష్యాన్ని తగ్గించడం, భూతాపం పెరగకుండా చూడటం వంటివి సాధ్యమవుతాయి.



జార్ఖండ్ ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

జార్ఖండ్ ఖనిజ సంపదపై బీజేపీ కన్ను పడింది

ఆ రాష్ట్ర భవిష్యత్‌ను కాపాడాలంటే ఇండియా కూటమిని గెలిపించండి: డిప్యూటీ సీఎం భట్టి

సాక్షి, హైదరాబాద్: జార్ఖండ్ ప్రజలపై బీజేపీ నేతలకు ప్రేమ లేదని, ఆ రాష్ట్రంలో ఉన్న ఖనిజ సంపదపై ఆ పార్టీ నేతల కన్ను పడిందని జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల స్టార్ క్యాంపెయినర్, తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు. జార్ఖండ్‌లో ఉన్న అపార ఖనిజ సంపదను అదానీ, అంబానీలకు కట్టబెట్టాలనేది బీజేపీ ఉద్దేశమని ఆయన ఆరోపించారు. ఆదివారంరాత్రి జార్ఖండ్ ఎన్నికల ప్రచారంలో భాగంగా బొకారో అసెంబ్లీ పరిధిలోని శివండి, దుండిబజార్, ఆజాద్‌నగర్ ప్రాంతాల్లో ఇండియాకూటమి పక్షాన జరిగిన సభల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ జార్ఖండ్ బిడ్డల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని రాష్ట్ర సంపదను, వనరులను కాపాడేందుకుగాను ఇండియాకూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే జార్ఖండ్ ప్రజలకిచ్చిన ఏడు హామీలను అమలు చేస్తామన్నారు. జనాభా నిష్పత్తి ప్రకారం దేశ వనరులను పంపిణీ చేయాలనేది రాహుల్‌గాంధీ ఉద్దేశమని, తెలంగాణ ఎన్నికల్లోనూ ఇదే ప్రధానాంశంగా ప్రచారం చేశామని, తెలంగాణ ప్రజలు గుర్తించి కాంగ్రెస్‌కు అధికారం అప్పగించారని చెప్పారు. అధికారంలోకి వచ్చిన తర్వాత జార్ఖండ్ ప్రజలకు జనాభా నిష్పత్తి ప్రకారం సంపదను పంపిణీ చేస్తామని హామీ ఇచ్చారు. తెలంగాణలో అమలవుతున్న పలు అభివృద్ధి, సంక్షేమ పథకాల వివరాలను జార్ఖండ్ ప్రజలకు ఆయన వివరించారు. కాంగ్రెస్ పార్టీ నేతృత్వంలోని కూటమి అభ్యర్థులు గెలిచేలా కార్యకర్తలు, నేతలు అవిశ్రాంతంగా శ్రమించాలని, సమష్టిగా ప్రచారం చేసి పార్టీని విజయతీరాలకు చేర్చాలని కోరారు. ఈ సభల్లో జార్ఖండ్ నేతలు నిజాం అన్సారీ, మహేశ్‌సింగ్, గులాబ్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

గడువులోగా నివేదిక సమర్పిస్తాం

డెడికేటెడ్ కమిషన్ చైర్మన్ బూసాని వెంకటేశ్వరరావు



ఖమ్మం మయూరి సెంటర్: స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ల అమలుకు వివిధ సంఘాల నుంచి వచ్చిన ప్రతిపాదనలను క్రోడీకరించి ప్రభుత్వానికి నిర్ణీత సమయంలో నివేదిక సమర్పిస్తామని తెలంగాణ వెనుకబడిన తరగతుల డెడికేటెడ్ కమిషన్ చైర్మన్ బూసాని వెంకటేశ్వరరావు తెలిపారు. ఆదివారం ఖమ్మం కలెక్టరేట్‌లో ఉమ్మడి జిల్లా పరిధిలో రిజర్వేషన్ల అంశంపై నిర్వహించిన బహిరంగ విచారణలో రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు, కులసంఘాల నుంచి ఆయన వినతులు స్వీకరించి, వారి వాదనలు విన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రిజర్వేషన్ సంబంధిత అంశాలు మాత్రమే తెలియజేయాలని, మిగిలిన అంశాలు బీసీ కమిషన్ పర్యటనలో తెలపాలని సూచించారు. స్థానిక సంస్థల్లో వెనుకబడిన తరగతుల రిజర్వేషన్ దామాషా అమలుపై వివిధ సంఘాల నుంచి సేకరించిన ప్రతిపాదనలు, అభిప్రాయాలపై ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం నెల రోజుల్లో నివేదిక ఇస్తామని తెలిపారు. కమిషనర్ సెక్రటరీ బి.సైదులు, ఖమ్మం అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి, బీసీ సంక్షేమ శాఖ డీడీ వి.రమేశ్, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల అభివృద్ధి అధికారులు జి.జ్యోతి, ఇ.ఇందిర తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటి సర్వే కోసం కాంగ్రెస్ కనెక్టివిటీ సెంటర్

ఏ సందేహం వచ్చినా ప్రజలు మిస్డ్ కాల్ ఇస్తే చాలు

సాక్షి, హైదరాబాద్: ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వే కోసం అధికార కాంగ్రెస్ పార్టీ కనెక్టివిటీ సెంటర్‌ను ఏర్పాటు చేసింది. ఈ సెంటర్ ద్వారా సర్వేపై ప్రజలకు వచ్చే సమస్యలు, సందేహాలను నివృత్తి చేయనుంది. ఈ కనెక్టివిటీ సెంటర్‌ను సంప్రదించేందుకోసం మిస్డ్ కాల్ ఇవ్వాల్సిన ఫోన్ నంబర్ పోస్టర్‌ను ఆదివారం గాంధీభవన్‌లో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ ఆవిష్కరించారు. 72890 87272 అనే నంబర్‌కు మిస్డ్ కాల్ ఇవ్వడం ద్వారా సమగ్ర కుటుంబ సర్వేపై సామాన్య ప్రజలతో పాటు కాంగ్రెస్ పార్టీ నేతలు, కార్యకర్తలకు ఎలాంటి సందేహాలున్నా నివృత్తి చేసుకోవచ్చన్నారు. రోజుకు 2వేల మంది ఫోన్ చేసినా వారి సమస్యలను, సందేహాలను నివృత్తి చేసేందుకు వీలుగా ఈ సెంటర్‌లో ఏర్పాటు చేశారు.

67.72 లక్షల ఇళ్లలో సర్వే పూర్తి

58.3 శాతం పూర్తయిన ఇంటింటి కుటుంబ సర్వే

- 87.1 శాతంతో మొదటి స్థానంలో ములుగు జిల్లా
- 38.3%తో చిట్ట చివరన గ్రేటర్ హైదరాబాద్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ఇప్పటివరకు 58.3 శాతం పూర్తయింది. ఈ నెల 6వ తేదీన సర్వే ప్రారంభం కాగా... తొలి మూడు రోజులు ఇళ్ల గుర్తింపు, స్టికర్లు అంటించే కార్యక్రమం నిర్వహించారు. 9వ తేదీ నుంచి కుటుంబాల వివరాలు సేకరించి నమోదుచేసే ప్రక్రియ ప్రారంభించారు. రాష్ట్రవ్యాప్తంగా 1,16,14,349 ఇళ్లను గుర్తించగా, ఆదివారం సాయంత్రానికి 67,72,246 ఇళ్లలో సర్వే ప్రక్రియను పూర్తి చేశారు. ఈ సర్వేలో 87,807 మంది ఎన్యుమరేటర్లు, 8,788 మంది పర్యవేక్షకులు పాల్గొంటున్నారు.

సర్వేలో కీలకాంశాలు..

- సర్వేలో భాగంగా గుర్తించిన మొత్తం ఇళ్లు: 1,16,14,349. ఇందులో గ్రామీణ ప్రాంతంలో 64,41,183, పట్టణ ప్రాంతంలో 51,73,166 ఇళ్లు ఉన్నాయి.
- రాష్ట్రాన్ని 92,901 బ్లాకులుగా విభజించారు. ఇందులో గ్రామీణ ప్రాంతంలో 52,493, పట్టణ ప్రాంతంలో 40,408 బ్లాకులున్నాయి.
- సర్వేలో 87,807 మంది ఎన్యుమరేటర్లు పాల్గొంటున్నారు. గ్రామీణ ప్రాంతంలో 47,561 మంది, పట్టణ ప్రాంతంలో 40,246 మంది ప్రజల వివరాలు సేకరిస్తున్నారు.
- సర్వే తీరును సమన్వయం చేసేందుకు 8,788 మంది పర్యవేక్షకులను ప్రభుత్వం నియమించింది. ఇందులో 4,947 మంది గ్రామాల్లో, 3,841 మంది పట్టణ ప్రాంతంలో ఉన్నారు.
- ఆదివారం నాటికి ములుగు జిల్లాలో అత్యధికంగా 87.1 శాతం సర్వే పూర్తయింది. ఆ తర్వాత స్థానంలో నల్లగొండ జిల్లా 81.4 శాతం, జనగామ 77.6 శాతం, మంచిర్యాల 74.8 శాతం, పెద్దపల్లి జిల్లాలో 74.3 శాతం సర్వే పూర్తయింది. అత్యధిక జనసాంద్రత ఉన్న గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో మాత్రం ఇప్పటివరకు 38.3 శాతం మాత్రమే పూర్తయినట్లు అధికార వర్గాలు తెలిపాయి.

ఇదండీ జాగ్రత్త



వామ్మో.. 61 ఏళ్లు

▶ మొదటి పేజీ తరువాయి

పెద్ద భారంగా మారనుంది..'ఇది ఇటీవల 16వ ఆర్థిక సంఘం రాష్ట్రంలో పర్యటించిన సందర్భంగా ఆర్థిక శాఖ ఇచ్చిన నివేదికలోని ఓ ప్రధాన అంశం. ఆర్థిక శాఖ లెక్క ప్రకారం రానున్న ఐదేళ్ల కాలంలో ఖజానాపై దాదాపు రూ.20 వేల కోట్ల భారం పడనుందని అంచనా. అంటే సరాసరి నెలకు రూ.350 కోట్ల పైచిలుకు రిటైర్‌మెంట్ బెనిఫిట్ల కోసమే ఖర్చు చేయాల్సిన పరిస్థితి. గత ప్రభుత్వ హయాంలో మూడేళ్ల పాటు రిటైర్‌మెంట్లు లేకపోవడం, కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే మళ్లీ రిటైర్‌మెంట్లు ప్రారంభం కావడం, అప్పటి నుంచి ఉన్న భారం ఒక్కసారిగా మీద పడడంతో ఎలా నెట్టుకురావాలో అర్థం కాక ఆర్థిక శాఖ మల్లగుల్లాలు పడుతోంది.

పదవీ విరమణ వయసు పెంపుతో..

గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఉద్యోగుల పదవీ విరమణ వయసును 58 నుంచి 61 సంవత్సరాలకు పెంచింది. 2021లో తీసుకున్న ఈ నిర్ణయంతో 2024 మార్చి 31వరకు రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగుల రిటైర్‌మెంట్లు జరగలేదు. దీంతో వారికి రిటైర్‌మెంట్ బెనిఫిట్లు చెల్లించే అవసరం పడలేదు. ఆ తర్వాత నుంచి రిటైర్‌మెంట్లు మొదలవగా ఈ ఏడాది డిసెంబర్ వరకు మొత్తం 7,995 మంది రిటైరవుతారని చెబుతున్నారు. వీరికి తక్షణ బెనిఫిట్ల కోసం రూ.3,200 కోట్ల వరకు అవసరం కాగా సరిగ్గా చెల్లించలేని పరిస్థితి ఉంది. పైగా ఇక నుంచి ఈ భారం ప్రతి యేటా పెరుగుతుందని అంచనా. ప్రస్తుతం కనీసం నెలకు రూ.350 కోట్ల చొప్పున ఏడాదికి రూ.3,800 కోట్లు అవసరం అవుతాయని, రానున్న ఐదేళ్ల కాలంలో సుమారు రూ.20 వేల కోట్లు చెల్లించాల్సి వస్తుందని ఆర్థిక శాఖ అధికారులు చెపుతున్నారు.

ఏమేమి చెల్లించాలి?

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగి రిటైరైన తర్వాత చెల్లించాల్సిన బెనిఫిట్లు చాలానే ఉంటాయి. వారి మూల వేతనానికి అనుగుణంగా హెచ్‌ఆర్ఏ, సీసీఏ, డీఏలను కలుపుకొని లెక్కించిన వేతనానికి 10 రెట్లు ఆర్జిత సెలవుల (లీవ్ శాలరీ) రూపంలో ఇవ్వాల్సి ఉంటుంది. ఈ లీవ్ శాలరీల మొత్తం ఒక్కో ఉద్యోగికి సగటున రూ.8 లక్షల వరకు ఉంటుందని అంచనా. దీంతో పాటు గ్రాట్యుటీ కింద రూ.12 లక్షలు, కమ్యుటేషన్ రూపంలో మరో రూ.20 లక్షలు చెల్లించాలి. ఈ లెక్కల ప్రకారం చూస్తే కనీసం రూ.40 లక్షలు ఒక్కో ఉద్యోగికి చెల్లించాలన్న మాట. రానున ఐదేళ్లలో అంటే 2028 నాటికి రిటైర్ అయ్యే సంఖ్య నెలకు 10 వేలకు చేరుతుందని ఉద్యోగ సంఘాలు చెబుతున్నాయి. అప్పుడు నెలకు కనీసం రూ.400 కోట్లు అవసరమని అంచనా.

గడ్డు పరిస్థితుల్లో ఖజానా

రాష్ట్ర ప్రభుత్వ ప్రస్తుత పరిస్థితి ప్రకారం మార్చి నెల నుంచి రిటైరైన వారికి బెనిఫిట్లు చెల్లించడం కష్టసాధ్యంగా మారింది. ప్రస్తుతం ఉద్యోగుల మెడికల్ బిల్లుల చెల్లింపు కూడా సాధ్యం కాని పరిస్థితి ఉంది. సరెండర్ లీవ్స్ లాంటి చెల్లింపులు కూడా గగనమవుతున్నాయని ఆర్థిక శాఖ అధికారులు చెబుతున్నారు. దీనికి తోడు ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు ఒక డీఏ ప్రకటించింది. 2022 జూలై డీఏ ప్రకటించినా మరో నాలుగు డీఏలు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయి. గత ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ప్రభుత్వ ఉద్యోగులు సాధారణ జీవిత బీమా (జీఎల్ఐ) కింద జమ చేసుకున్న నిధులను కూడా వాడుకోవాల్సి వచ్చింది. ఇప్పుడు రిటైరయ్యే ఉద్యోగులకు వారి జీఎల్ఐతో పాటు జీపీఎఫ్‌లపై వడ్డీలు కూడా చెల్లించాల్సి వస్తోంది. ఈ చెల్లింపుల విషయంలో ఆర్థిక శాఖ తల పట్టుకుంటోంది. తమ బిల్లుల కోసం ఉద్యోగులు రోజూ సచివాలయం చుట్టూ తిరగాల్సి వస్తోంది. రిటైర్‌మెంట్‌కు మూడు నెలల ముందే బెనిఫిట్ల కోసం ప్రతిపాదనలు ప్రభుత్వానికి వెళతాయని, ఈ మూడు నెలల కాలంలో ప్రభుత్వ వీలును బట్టి ఆర్థిక అంశాలను సర్దుబాటు చేసుకుని ఉద్యోగుల బెనిఫిట్లు చెల్లించాల్సిందేనని ఉద్యోగ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

ఏ ఏడాది ఎంత మంది రిటైర్ అంటే..

సంవత్సరం	ఉద్యోగుల సంఖ్య
2024	7,995
2025	9,630
2026	9,719
2027	9,443
2028	7,213

(16వ ఆర్థిక సంఘానికి ప్రభుత్వం ఇచ్చిన నివేదికలోని లెక్కల ప్రకారం 2028లో 7,213 మంది రిటైర్ అవుతారన్నది అంచనా మాత్రమే. ఈ సంఖ్య 10 వేలకు చేరుతుందని ఉద్యోగ సంఘాలు చెబుతున్నాయి.)

‘మామునూరు’లో మరో ముందడుగు

ఎయిర్‌పోర్ట్‌కు అవసరమైన 253 ఎకరాల భూసేకరణకు రూ.205 కోట్ల నిధులు | సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన నేపథ్యంలో కీలక నిర్ణయం | రెండో రాజధానిగా వరంగల్ అభివృద్ధికి చర్యలు

సాక్షి, వరంగల్: మామునూరు విమానాశ్రయ నిర్మాణానికి వడివడిగా అడుగులు పడుతున్నాయి. 253 ఎకరాల భూసేకరణకు రూ.205 కోట్లు విడుదల చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. రన్‌వే విస్తరణకు కావాల్సిన 205 ఎకరాల భూమిని ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియాకు స్వాధీనం చేయాలని వరంగల్ జిల్లా కలెక్టర్‌కు సూచించింది. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి దశల వారీగా సమీక్షించి, మామునూరు విమానాశ్రయ స్థల సేకరణలో వేగం పెంచాలని అధికారులను ఆదేశించడం, రోజుల వ్యవధిలోనే స్థల సేకరణకు అవసరమైన నిధులు మంజూరు చేయించడంతో విమానాశ్రయ పనుల్లో ముందడుగు పడినట్టయ్యింది. ఎయిర్‌పోర్ట్ నిర్మాణానికి సంబంధించిన డిజైన్లతో కూడిన డీపీఆర్ వేగంగా సిద్ధం చేయాలని ఎయిర్‌పోర్ట్ అథారిటీకి ఆర్‌అండ్‌బీ శాఖ లేఖ కూడా రాసింది. వరంగల్‌కు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మంగళవారం రానున్న నేపథ్యంలో విమానాశ్రయానికి సంబంధించి ముందడుగు పడడంతో ప్రజల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

నెల రోజుల్లోనే పురోగతి ఇలా..

- ఈ ఏడాది అక్టోబర్ 23న రాజీవ్‌గాంధీ హైదరాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ లిమిటెడ్‌లో బోర్డు మీటింగ్ నిర్వహించారు. మామునూరు విమానాశ్రయ నిర్మాణానికి అడ్డంకిగా ఉన్న 150 కిలోమీటర్ల పరిధి ఒప్పందాన్ని జీఎమ్మార్ సంస్థ విరమించుకుంది.
- ఆ తర్వాత మంత్రి కోమటిరెడ్డి అధ్యక్షతన మామునూరు విమానాశ్రయ నిర్మాణానికి అవసరమైన 253 ఎకరాల భూసేకరణపై అధికారులకు దిశానిర్దేశం చేశారు.
- మంత్రి కొండా సురేఖతోపాటు ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాశ్‌రెడ్డి, కేఆర్.నాగరాజు, ఎంపీ కడియం కావ్య తదితరులు భూనిర్వాసితులతో సమావేశమై వారి డిమాండ్లను కలెక్టర్‌కు విన్నవించాలని కోరారు.
- ఆ తర్వాత కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆధ్వర్యాన రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించారు. భూసేకరణకు సంబంధించిన వివరాలను రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించడంతో అందుకు కావాల్సిన రూ.205 కోట్ల నిధులను మంజూరు చేసింది. సాధ్యమైనంత తొందరగా భూసేకరణ పూర్తి చేయాలని కలెక్టర్‌ను రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది.



అందరి దృష్టి పరిహారంపైనే..

ఎయిర్‌పోర్ట్‌కు సేకరించే భూములకు సంబంధించి ఎకరాకు గవర్నమెంట్ వ్యాల్యూ రూ.6లక్షలు ఉంది. భూనిర్వాసితులకు పరిహారం మూడింతలు చెల్లించాలనుకున్నా ఎకరాకు రూ.18 లక్షలు ఇచ్చే అవకాశముంది. రెవెన్యూ అధికారులు రూ.25 లక్షల వరకు చెల్లించే దిశగా ఆలోచన చేస్తున్నారు. రైతుల నుంచి ఒత్తిడి ఎక్కువైతే తమ విచక్షణాధికారాలు ఉపయోగించి ఇంకాస్త పెంచాలని యోచిస్తున్నారు. బహిరంగ మార్కెట్‌లో ఎకరాకు రూ.80 లక్షల నుంచి రూ.కోటి వరకు పలుకుతుండడంతో రైతుల నుంచి ప్రతిస్పందన ఎలా ఉంటుందోనని అధికారులు హైరానా పడుతున్నారు. మరోవైపు ఎన్ని వ్యవసాయ బావులు, బోర్లు పోతున్నాయనే వివరాలను సోమవారం నుంచి రెవెన్యూ అధికారులు సేకరించనున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన తర్వాత ఆయా గ్రామాల్లో సభలు నిర్వహించి పరిహారంపై స్పష్టతనిచ్చే అవకాశముంది.

క్లుప్తంగా...

పకడ్బందీ ఏర్పాట్లతో మూసీ నిద్రా?

మంత్రి శ్రీధర్‌బాబు ఎద్దేవా



సాక్షి, హైదరాబాద్: పకడ్బందీ ఏర్పాట్లు చేసుకుని బీజేపీ నేతలు మూసీ నిద్ర కార్యక్రమం నిర్వహించారని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు ఎద్దేవా చేశారు. నిజంగా మూసీ నిర్వాసితుల సమస్యలు తెలుసుకోవాలనే ఆలోచన బీజేపీ నేతలకు ఉంటే ఆలౌట్లు, మస్కిటో కాయిల్స్ అవసరమా? అని ప్రశ్నించారు. ఆయన ఆదివారం గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ మూసీ పరీవాహక ప్రాంతాల్లో ప్రజలు కలుషిత నీరు, గాలి మధ్య దుర్భర జీవితం గడుపుతున్నారని చెప్పారు. ఇప్పటికైనా బీజేపీ నేతలకు మూసీ కష్టాలు తెలిసి ఉంటాయన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీపై నిందలు వేస్తే.. మహారాష్ట్రలో ఓట్లు వస్తాయనే ఆలోచనతో బీజేపీ నేతలు మూసీ నిద్రను ఎంచుకున్నారని విమర్శించారు.

ఈసారి గంటైనా నిద్రపోండి

ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి ట్వీట్



సాక్షి, హైదరాబాద్: ఈసారి బీజేపీ నేతలు కనీసం ఒక గంటసేపైనా మూసీ ఒడ్డున నిద్రపోవాలని ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి ఎక్స్ వేదికగా కోరారు. ‘మూసీ ఒడ్డున బాధ్యతగల కేంద్ర మంత్రి కొత్త పరుపు, కొత్త బెడ్ షీట్, కాళ్లకు సాక్సులతో పాటు, కెమెరామెన్‌తో కలిసి 20 నిమిషాలపాటు నిద్ర పోవడం ద్వారా.. నిర్వాసితుల సమస్యలను ముందే ఊహించినట్టున్నారు. మూసీ పరీవాహక ప్రాంత ప్రజలకు నాణ్యమైన సాక్సులు అందించడంతో పాటు దోమలు ఎప్పుడు, ఎక్కడ కుడుతున్నాయో తెలుసుకునేందుకు వీలుగా ఇంటికో కెమెరామన్‌ను ఏర్పాటు చేసి, ఒక రాత్రి 20 నిమిషాల కంటే ఎక్కువగా నిద్ర పోయేందుకు తగిన సౌకర్యాలను కేంద్ర ప్రభుత్వం కల్పించాలి. ఈసారి వచ్చినప్పుడు గంటసేపయినా నిద్ర పోవాలని ప్రజల విజ్ఞప్తి’.. అని ట్వీట్‌లో ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. కాళ్ల నిండా సాక్సులు తొడుక్కుని నిద్రిస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని కెమెరామెన్ షూట్ చేస్తున్న ఫొటోను తన ట్వీట్‌కు జత చేశారు.

‘ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు వివరణ ఇస్తా’



సాక్షి, హైదరాబాద్: ఫార్మా పరిశ్రమ ఏర్పాటుపై రాష్ట్ర ప్రభుత్వ విధానాలను వివరిస్తూ తాను కూడా ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు వివరణ ఇస్తానని ఎంపీ బలరాం నాయక్ చెప్పారు. ఫార్మా కంపెనీల్లో స్థానికులకు ఉద్యోగాలిప్పిస్తామని, భూమికి బదులు భూమిని ఇస్తామని, నష్టపరిహారం చెల్లిస్తామని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ స్థానికులను రెచ్చ గొట్టి అధికారులపై దాడులు చేయిస్తున్నారని ఆరోపించారు. ఆయన ఆదివారం గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్రాన్ని అధోగతి పాల్జేసిన వారు కూడా మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. ఫార్మా పరిశ్రమ ఏర్పాటుపై పార్లమెంటులో కూడా చర్చ జరిగేలా చూస్తామని బలరాం నాయక్ వెల్లడించారు.

ఆరోపణలు నిరూపిస్తే రాజకీయ సన్యాసం

మాజీ ఎమ్మెల్యే రాజయ్యకు కడియం సవాల్



స్టేషన్‌ఘన్‌పూర్: అటవీభూములను ఆక్రమించినట్లు తనపై నిరాధార ఆరోపణలు చేస్తున్నవారు సాక్ష్యాలతో నిరూపిస్తే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి రాజకీయాల నుంచి తప్పుకుంటానని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. జనగామ జిల్లా ఘన్‌పూర్‌లోని తన క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. మాజీ ఎమ్మెల్యే రాజయ్య తనపై చేస్తున్న ఆరోపణలను నిరూపించాలని, లేనిపక్షంలో దళితబంధు పేరిట పేద దళితులను ఏవిధంగా దగాచేశారో బయటపెడతానని అన్నారు. అటవీభూమల విషయంలో తన దగ్గరికి వచ్చిన రైతులు తమకు పట్టా ఉన్నా యని చెప్పగా.. కలెక్టర్, డీఎఫ్‌ఓతో సమీక్ష నిర్వహించి ఆ భూములు రైతులకే చెందాలని చెప్పినట్లు పేర్కొన్నారు. తప్పుడు ఆరోపణలు చేస్తున్న రాజయ్య నిరూపించాలని, లేనిపక్షంలో రాజకీయాల నుంచి తప్పుకోవాలని హితవు పలికారు.

ఢిల్లీకి చేరిన ‘లగచర్ల’!

గిరిజన రైతుల అరెస్టులపై విచారణకు డిమాండ్

- వెంటనే సహాయం అందించి రక్షణ కల్పించాలనే విజ్ఞప్తులు
- ఆదివారం ఢిల్లీకి చేరుకున్న బాధిత కుటుంబాల సభ్యులు
- నేడు జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్.. మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేయనున్న బాధితులు



ఢిల్లీ విమానాశ్రయంలో లగచర్ల బాధితులతో బీఆర్‌ఎస్ పార్టీ నేతలు

సాక్షి, న్యూఢిల్లీ/బొంరాస్‌పేట: సీఎం రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గం లగచర్లలో అధికారులపై దాడి, గిరిజన రైతుల అరెస్టుల అంశం ఢిల్లీకి చేరింది. రైతుల అరెస్టులపై తక్షణమే విచారణ జరిపించాలని... బాధితులకు వెంటనే సహాయం అందించి, రక్షణ కల్పించాలంటూ ఇప్పటికే జాతీయ ఎస్సీ, ఎస్టీ, బీసీ కమిషన్లకు ఆన్‌లైన్ ద్వారా 19 ఫిర్యాదులు అందాయి. అంతేకాదు నేరుగా ఈ కమిషన్లతోపాటు మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్సీ)కు ఫిర్యాదు చేసేందుకు కొందరు లగచర్ల బాధితులు, కుటుంబ సభ్యులు ఆదివారమే ఢిల్లీకి చేరుకున్నారు. సోమవారం జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్, ఎన్‌హెచ్‌ఆర్సీలను కలసి.. సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం, పోలీసులపై ఫిర్యాదు చేయనున్నారు. బాధితులకు మద్దతుగా బీఆర్‌ఎస్ మాజీ మంత్రి సత్యవతిరాథోడ్, ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్, ఎమ్మెల్యేలు కోవ లక్ష్మి, అనిల్‌జాదవ్ కూడా ఢిల్లీకి వెళ్లారు.

పోలీసులు వేధిస్తున్నారంటూ ఆందోళన

వికారాబాద్ జిల్లా దుద్యాల్ మండలంలో ఫార్మా విలేజీ కోసం రాష్ట్ర ప్రభుత్వం భూసేకరణ చేపట్టింది. తాము భూములు ఇవ్వబోమంటూ అక్కడి గిరిజన రైతులు కొంతకాలం నుంచి ఆందోళన చేస్తున్నారు. ఇటీవల భూసేకరణ అంశంపై గ్రామసభ నిర్వహించేందుకు అధికారులు వెళ్లగా.. స్థానికులు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో కొందరు కలెక్టర్, అధికారులపై దాడికి దిగారు. ఈ ఘటనపై తీవ్రంగా స్పందించిన పోలీసులు.. మూడు కేసులు నమోదు చేసి, 20 మందికిపైగా అరెస్టు చేశారు. మరికొందరి కోసం గాలింపు జరుపుతున్నారు. అయితే పోలీసులు తమ పట్ల అమానుషంగా వ్యవహరిస్తున్నారని గిరిజన కుటుంబాలు ఆరోపిస్తున్నాయి. తమ భూములు కోల్పోతామేమోనన్న భయంతోనే నిరసన వ్యక్తం చేశామని చెబుతున్నాయి. కానీ పోలీసులు అర్ధరాత్రి గ్రామానికి విద్యుత్‌సరఫరా ఆపేసి మరీ, ఇళ్లపై దాడి చేశారని బాధిత కుటుంబాల వారు ఆరోపిస్తున్నారు. తమ వారిని తీవ్రంగా కొట్టి అరెస్టు చేశారని.. మహిళలను కూడా వేధించారని పేర్కొంటున్నారు. ఈ అంశంలో కల్పించుకుని తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నారు. సోమవారం ఎస్సీ, ఎస్టీ, మానవ హక్కుల కమిషన్లకు ఈ అంశాలపై ఫిర్యాదులు చేయనున్నారు.

నేడు లగచర్లకు ఎస్టీ కమిషన్ జాతీయ సభ్యుడి రాక

కొడంగల్ రూరల్: లగచర్ల, ఫార్మా విలేజీ ప్రతిపాదిత ప్రాంతాల్లో సోమవారం ఉదయం 10 గంటలకు ఎస్టీ కమిషన్ జాతీయ సభ్యుడు హుస్సేన్ నాయక్, గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కల్యాణ్‌నాయక్, ఎంపీలు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, డీకే అరుణ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి పర్యటించనున్నట్లు గిరిజన మోర్చా నేతలు తెలిపారు. వారు బాధిత కుటుంబాలకు భరోసా ఇవ్వడంతో పాటు, గిరిజనుల అభిప్రాయాలు తెలుసుకుంటారని వెల్లడించారు.

రాష్ట్రంలో ఇద్దరు సీఎంలు..

- వారే రేవంత్‌రెడ్డి, కేటీఆర్‌లు..
- కేంద్ర మంత్రి బండి సంజయ్



సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: ‘రాష్ట్రంలో ఇద్దరు ముఖ్యమంత్రులున్నారు.. ఒకరు రేవంత్‌రెడ్డి, మరొకరు కేసీఆర్ కొడుకు కేటీఆర్. వారే ఆర్‌కే బ్రదర్స్.. ఈ రెండు కుటుంబాలకు సంబంధాలున్నాయి. వ్యాపారపరంగా కూడా సంబంధాలున్నాయి. ఈ విషయం నేను నిరూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటారా? నాకు రేవంత్‌రెడ్డికి సంబంధాలున్నట్లు మీరు నిరూపిస్తే నేను రాజకీయాల నుంచి తప్పుకుంటా’అని కేంద్ర మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్.. కేటీఆర్‌కు సవాల్ విసిరారు. ఆదివారం సంగారెడ్డిలో ఓ వివాహ వేడుకలో పాల్గొనేందుకు వచ్చిన ఆయన అక్కడే విలేకరులతో మాట్లాడారు. బీజేపీని అడ్డుకునేందుకు కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలు కొట్లాడుకున్నట్లు డ్రామా చేస్తున్నాయని ఆరోపించారు. ఫాంహౌస్‌లో ఉన్న కేసీఆర్, ఢిల్లీలోని కాంగ్రెస్ అధిష్టానంతో సెటిల్‌మెంట్ చేసుకున్నారని ఆయన ఆరోపించారు. అందుకోసమే ఫోన్‌ట్యాపింగ్, కాళేశ్వరం, ఈ ఫార్ములా, ధరణి స్కాం కేసుల కథ కంచికే అన్నట్లు తయారైందని ఎద్దేవా చేశారు. లగచర్లలో కలెక్టర్‌పై జరిగిన దాడి ఘటనకు సూత్రధారి కేటీఆర్ అని తేలినా అరెస్టు చేయకపోవడం సిగ్గుచేటన్నారు. ఇక్కడ భూములు కోల్పోతున్న రైతుల సమస్యను పక్కదారి పట్టించేందుకే దాడుల అంశాన్ని తెరపైకి తెచ్చారని ఆరోపించారు. బీఆర్‌ఎస్ విధ్వంసక పార్టీగా మారిందని, ఆ పార్టీని తెలంగాణలో నిషేధించాలని బండి సంజయ్ డిమాండ్ చేశారు.

‘ఫార్మా’ విషయంలో అన్ని పార్టీలది ఒకే రాజకీయం

- ఫార్మా సిటీ వ్యతిరేక పోరాట కమిటీ

సాక్షి, హైదరాబాద్: ఫార్మా విలేజ్, ఫార్మా సిటీల ఏర్పాటు విషయంలో అన్ని పార్టీలది ఒకే రాజకీయమని, అభివృద్ధి ముసుగులో పేదలను దోచి..పారిశ్రామిక వేత్తలకు పట్టంగట్టడమేనని ఫార్మాసిటీ వ్యతిరేక పోరాట సమితి ఆరోపించింది. ఉద్యోగాల భ్రమలతో తరతరాలను కాపాడిన భూమిని వదులుకోవటానికి యాచారం మండల ప్రజలు సిద్ధంగా లేరని వారు స్పష్టం చేశారు. కొడంగల్ ప్రజలపై ఎనలేని ప్రేమ చూపుతున్న కేటీఆర్, వారి పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఫార్మాసిటీ ప్రాజెక్టు ఎలా తెచ్చారని ప్రశ్నించారు. ఈ మేరకు ఫార్మా సిటీ వ్యతిరేక పోరాట కమిటీ తరఫున సభ్యులు కవుల సరస్వతి, కేవీఎస్.దాస్, నిరంజన్, కనేమోని గణేష్, మద్రి భగవంతరెడ్డి తదితరులు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రతిపక్షంలోకి రాగానే కేటీఆర్ ఇప్పుడు రాజకీయ లబ్ధికోసం కొడంగల్ ప్రజలపై ఎనలేని ప్రేమ చూపుతున్నారని విమర్శించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఫార్మా అంటేనే భూతమని, మేం అధికారంలోకి వస్తే ఫార్మాసిటీని, భూసేకరణను రద్దు చేస్తామని రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారని, ఇప్పుడు వాటిని మరిచారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే ఫార్మాసిటీని, భూసేకరణను సీఎం రేవంత్‌రెడ్డి రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఫార్మాసిటీకి ఇచ్చిన పర్యావరణ అనుమతుల రద్దుకు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీ ఈటల కృషి చేయాల న్నారు. ప్రకటన విడుదల చేసిన వారిలో ముత్యాల మహిపాల్‌రెడ్డి, కల్లు కొండల్‌రెడ్డి, అన్వేకర్ దేవోజీ, పాడి రైతు సోమయ్య, బొద్దు సందీప్‌రెడ్డి, ఆరేపల్లి లింగం, వెంకటేష్, శంకర్, పాండురంగాచారి కూడా ఉన్నారు.

కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తాం

గ్రామీణ మహిళలకు పారిశ్రామికవేత్తలుగా శిక్షణ: సీతక్క



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకొన్నదని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి సీతక్క తెలిపారు. గ్రామీణ మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేలా కార్యాచరణ రూపొందిస్తున్నట్లు వెల్లడించారు. ఈ నెల 19న హన్మకొండలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ మైదానంలో ప్రజాపాలన విజయోత్సవ సభ నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ సభ మహిళా సాధికారత నేపథ్యంతో సాగేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. సభ ఏర్పాట్లపై ఆదివారం సంబంధిత అధికారులతో మంత్రి సమీక్షించారు. రాష్ట్రంలోని మహిళల సాధికారతకు మరింత ఊతం అందేలా ప్రభుత్వం కొత్త కార్యక్రమాలు చేపట్టనున్నట్లు మంత్రి తెలిపారు. మహిళా సంఘాలకు సోలార్ విద్యుత్ ప్లాంట్లు కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని వెల్లడించారు. ఈ సంఘాల సభ్యులకు బీమా సౌకర్యం కల్పిస్తున్నామని చెప్పారు. ట్రాన్స్ జెండర్ల కోసం జిల్లా కేంద్రాల్లో ప్రత్యేక క్లినిక్‌లను కూడా ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. ఈ సమావేశంలో పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి లోకేష్ కుమార్, సెర్ప్ సీఈఓ దివ్యా దేవరాజన్, మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్, డైరెక్టర్ కాంతి వెస్లీ తదితరులు పాల్గొన్నారు.

వేలాదిమంది పేదలను ఎక్కడకు వెళ్లగొడతారు?

- ‘మూసీనిద్ర’ కార్యక్రమంలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



గోల్నాక తులసీరామ్‌నగర్‌లో మూసీ ప్రాంత ప్రజలతో మాట్లాడుతున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



మీడియాతో మాట్లాడుతున్న డాక్టర్ లక్ష్మణ్

అంబర్‌పేట/మలక్‌పేట: దశాబ్దాల తరబడి మూసీ పరీవాహక ప్రాంతాల్లో నివసిస్తూ..కష్టపడి కట్టుకున్న ఇళ్లను ప్రభుత్వం కూలగొడితే తామంతా ఎక్కడకు వెళ్లాలి అనే ఆవేదనలో అక్కడి ప్రజలు ఉన్నారని కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం మూసీ పరీవాహక ప్రాంత ప్రజలపై కక్షపూరిత ధోరణి అవలంభిస్తుందని మండిపడ్డారు. వేలాదిమంది పేద ప్రజలను నిరాశ్రయులను చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం మూసీ సుందరీకరణ పనులు చేపట్టాలని కిషన్‌రెడ్డి డిమాండ్ చేశారు. మూసీ బాధితుల కోసం బీజేపీ చేపట్టిన మూసీనిద్ర కార్యక్రమంలో భాగంగా గోల్నాక డివిజన్ పరిధిలోని తులసీరామ్‌నగర్‌లో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి నిద్రించారు. ఆదివారం ఉదయం నిద్ర లేచినంతరం బస్తీ వాసులతో కలిసి అల్పాహారం తీసుకున్నారు. బస్తీల్లో పర్యటించి అక్కడి ప్రజల జీవన పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. పరీవాహక ప్రాంతాల్లో నివసించే ప్రజలు మూసీతో ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోవడం లేదని తాను గమనించినట్టు కిషన్‌రెడ్డి చెప్పారు. వందేళ్ల క్రితం మూసీనదికి నిజాం రాజు ప్రహరీ నిర్మించారని, ప్రస్తుతం అలాంటి ప్రహరీ నిర్మించి పేదల ఇళ్ల జోలికి వెళ్లరాదని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. తాను మూసీ పక్కన నివసించే శంకరమ్మ ఇంట్లో నిద్రించి వారి ఇబ్బందులను తెలుసుకున్నానని, ఇలాంటి శంకరమ్మలు ఎంతో మంది ఆవేదనతో ఉన్నారన్నారు. పేదల ఇళ్లకు ఇబ్బంది లేకుండా మూసీ సుందరీకరణ చేస్తామంటే బీజేపీ శ్రేణులు శ్రమదానం చేస్తాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు చింతల రాంచంద్రారెడ్డి, గౌతమ్ రావు, అజయ్‌కుమార్, రవీందర్‌గౌడ్ పాల్గొన్నారు.

లగచర్ల ఘటన ప్రభుత్వ పనితీరుకు నిదర్శనం : డాక్టర్ లక్ష్మణ్

లగచర్ల ఘటన రాష్ట్ర ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమని బీజేపీ ఎంపీ డాక్టర్ లక్ష్మణ్ అన్నారు. మూసారంబాగ్ శాలివాహననగర్‌లో మూసీనిద్ర ముగింపు కార్యక్రమం సందర్భంగా ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మూసీ బాధితులకు భరోసా కల్పించడానికి చేపట్టిన మూసీనిద్ర కార్యక్రమాన్ని అపహాస్యం చేస్తూ అధికార మదంతో కాంగ్రెస్ నేతలు మాట్లాడుతున్నారన్నారు. మూసీనీటిని శుద్ధి చేయాలని, పరిశుభ్రమైన నీరు ప్రవహించేలా చేసి నల్లగొండ, భాగ్యనగర్ ప్రజలకు ఉపశమనం కలిగించాలన్నారు. ఈ సమావేశంలో భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్‌రెడ్డి, కార్పొరేటర్లు బొక్క భాగ్యలక్ష్మి మధుసూదన్‌రెడ్డి, కొత్తకాపు అరుణా రవీందర్‌రెడ్డి, మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్‌చందర్ పాల్గొన్నారు.

ఫొటోల కోసమే బీజేపీ మూసీ నిద్ర

- ఇద్దరం కలిసి మూసీ దగ్గర మూడు నెలలు ఉందామా?
- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్ సవాల్
- బీఆర్‌ఎస్ గ్రాఫ్ పడిపోయిన ప్రతీసారి కిషన్‌రెడ్డి తెరపైకి వస్తారని విమర్శ



సాక్షి, హైదరాబాద్: ‘ఫొటోషూట్ కోసమే బీజేపీ నేతలు మూసీ నిద్ర చేశారు. దోమల మందు, ఈగల మందు కొట్టుకుని అక్కడకు వెళ్లారు. అయినా ఒక్కరోజు అక్కడ నిద్రపోతే ఏం తెలుస్తుంది? మూడు నెలలు అక్కడ ఉంటే ప్రజల అవస్థలు తెలుస్తాయి. నేను కూడా వస్తా. మనిద్దరం కలిసి మూసీ ప్రాంతంలో మూడు నెలలు బస చేద్దాం రండి’అని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బి. మహేశ్‌కుమార్‌గౌడ్ సవాల్ చేశారు. మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టును ఆపేందుకు బీజేపీ, బీఆర్‌ఎస్ కలిసి కుట్ర చేస్తున్నాయని ఆరోపించారు. ఆదివారం గాంధీభవన్‌లో విలేకరుల సమావేశంలో మహబూబాబాద్ ఎంపీ పి. బలరాం నాయక్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శులు అల్లం భాస్కర్, చరణ్‌కౌశిక్ యాదవ్‌లతో కలిసి ఆయన మాట్లాడుతూ.. రాజకీయంగా బీఆర్‌ఎస్ గ్రాఫ్ పడిపోయిన ప్రతిసారి కిషన్‌రెడ్డి బయటకు వస్తారని, బీఆర్‌ఎస్‌ను కాపాడేందుకు ప్రయత్నం చేస్తారని ఆరోపించారు. మూసీ ప్రాంతంలో ఒక్క రోజు నిద్రతో బీజేపీ ఏం సాధించిందో చెప్పాలని డిమాండ్ చేశారు. గుజరాత్‌లో సబర్మతి రివర్‌ఫ్రంట్‌కు ఓ న్యాయం, తెలంగాణలోని మూసీ పునరుజ్జీవానికి మరో న్యాయమా? అని ప్రశ్నించారు. ప్రపంచంతో తెలంగాణ పోటీ పడుతుందని అనగానే గుజరాత్‌ను తెలంగాణ ఎక్కడ వెనక్కు నెడుతుందో అనే భయం బీజేపీ నేతలకు పట్టుకుందని ఎద్దేవా చేశారు.

ప్రజలు మార్పును చూస్తారు

తెలంగాణ రాష్ట్రంగా రైజింగ్ దశలో ఉందని, అభివృద్ధిలో మార్పును ప్రజలు చూస్తారని మహేశ్‌కుమార్‌గౌడ్ అన్నారు. తమది బుల్డోజర్ పాలన కాదని, కిషన్‌రెడ్డిని నడిపించే అన్న యోగి ఆదిత్యనాథ్‌ది బుల్డోజర్ పాలన అని విమర్శించారు. లగచర్ల దాడి వెనుక బీఆర్‌ఎస్ నేత కేటీఆర్ ఉన్నారని స్పష్టంగా తేలిందని, అందుకే ఆ అంశాన్ని పక్కదోవ పట్టించేందుకు కాళ్లకు సాక్సులు వేసుకొని కిషన్‌రెడ్డి తెరపైకి వచ్చారని ఎద్దేవా చేశారు. బీజేపీ, బీఆర్‌ఎస్‌లలో ఏ పార్టీకి ఆపద వచ్చినా పరస్పరం సాయం చేసుకుంటారని విమర్శించారు. మూసీ ప్రాజెక్టు వద్ద కాంగ్రెస్ ప్రభుత్వం రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తోందని కిషన్‌రెడ్డి అంటున్నారని, ఒకవేళ అక్కడ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తే కిషన్‌రెడ్డి ప్లాటు కొనుక్కుంటాడేమో తెలుపాలని డిమాండ్ చేశారు.

గురుకులాల్లో మృత్యుఘోష

- 11 నెలల్లో 42 మంది విద్యార్థుల మృతి
- మొద్దునిద్ర వీడని సర్కార్: మాజీ మంత్రి హరీశ్‌రావు



సాక్షి, హైదరాబాద్: గురుకులాల్లో విద్యార్థులు వరుసగా ప్రాణాలు కోల్పోతున్నా ప్రభుత్వం మొద్దు నిద్ర వీడడం లేదని మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ నేత టి. హరీశ్‌రావు ధ్వజమెత్తారు. 11 నెలల కాంగ్రెస్ పాలనలో 42 మంది విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారని, ఇవి ముమ్మాటికీ ప్రభుత్వ హత్యలేనని ఒక ప్రకటనలో ఆరోపించారు. సంగారెడ్డి జిల్లా బీసీ బాలికల గురుకుల పాఠశాలలో శనివారం మరో విద్యార్థిని ఆత్మహత్య చేసుకోవడం కలచివేసిందని అన్నారు. ఎంతో భవిష్యత్తు ఉన్న విద్యార్థులు అర్ధాంతరంగా ప్రాణాలు కోల్పోతుంటే, వారిని కాపాడాల్సిన ప్రభుత్వం చోద్యం చూడడం శోచనీయమని విమర్శించారు. వాంకిడిలోని గురుకుల పాఠశాల విద్యార్థిని గత 17 రోజులుగా నిమ్స్‌లో వెంటిలేటర్‌పై కొట్టుమిట్టాడుతున్నదని, బాసరలో ట్రిపుల్ ఐటీ విద్యార్థిని బలవన్మరణానికి కారణం ఎవరని ప్రశ్నించారు. గత 11 నెలల్లో సగటున నెలకు ముగ్గురు విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. బీఆర్‌ఎస్ పాలనలో దేశానికి రోల్ మోడల్‌గా నిలిచిన గురుకులాలు, కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యంతో రోజురోజుకు దిగజారిపోతున్నాయని అన్నారు. విద్యార్థుల మరణాలకు ప్రభుత్వం బాధ్యత వహించి, మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే గురుకులాలు నరకకూపాలుగా మారాయని ధ్వజమెత్తారు. విద్యాశాఖతోపాటు సంక్షేమ శాఖ, గిరిజన శాఖ, మైనార్టీ శాఖల నిర్వహణలో ముఖ్యమంత్రి నిర్లక్ష్యం అభం శుభం తెలియని విద్యార్థుల పాలిట శాపంగా మారిందని విమర్శించారు. గురుకులాల భోజనంలో నాణ్యత లేకుంటే జైలుకే అని బాలల దినోత్సవం నాడు సీఎం ప్రగల్భాలు పలకడం తప్ప, ఎలాంటి కార్యాచరణ చేపట్టలేదని విమర్శించారు.

‘లగచర్ల’ డైవర్షన్‌కే మూసీ నిద్ర

- కిషన్‌రెడ్డిపై కేటీఆర్ ట్వీట్



సాక్షి, హైదరాబాద్: రేవంత్‌రెడ్డికి కమలదళం రక్షణ కవచంగా తయారైందని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. రేవంత్‌రెడ్డి అనే స్నేహితుడిని కాపాడుకునేందుకు.. కిషన్‌రెడ్డి చీకటి రాజకీయం చేస్తున్నారని ‘ఎక్స్’వేదికగా ధ్వజమెత్తారు. కిషన్‌రెడ్డి చేసిన మూసీనిద్ర తోడుదొంగల నాటకంగా తన ట్వీట్‌లో అభివర్ణించారు. ‘కిషన్‌రెడ్డి గారూ.. ఇప్పుడు మూసీ బాధితుల ఆక్రందనలు గుర్తొచ్చాయా? లగచర్ల ఘటన డైవర్షన్ కోసం కాదా మీ మూసీ నిద్ర’అని ప్రశ్నించారు. ‘హైడ్రాను మొదట స్వాగతించింది మీరైతే.. బుల్డోజర్లను అడ్డుకుంటామన్నది మేము.. రేవంత్‌ను మొదట అభినందించింది మీరైతే.. మూసీ బాధితులకు భరోసానిచ్చింది మేము..’అని పేర్కొన్నారు. రేవంత్‌ను కాపాడటం కోసమే ఈ డైవర్షన్ డ్రామాలని పేర్కొన్న కేటీఆర్.. లగచర్ల రైతులకు తెలంగాణ బీజేపీ పంగనామాలు పెడుతోందని వ్యాఖ్యానించారు.

అదానీ, అంబానీలతో పోరాటం బూటకమేనా?

దేశవ్యాప్తంగా భూసేకరణపై వ్యతిరేక స్వరం వినిపించినా అదానీ, అంబానీలపై విరుచుకుపడినా ఏంలాభమని కేటీఆర్ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీని ప్రశ్నించారు. భూసేకరణపై దేశవ్యాప్తంగా చేస్తున్న రణగర్జన తెలంగాణలో ఎందుకు అడ్డుకోలేకపోయిందని, కొడంగల్ రైతుల కన్నీటికి ఎందుకు కారణమైందని ‘ఎక్స్’వేదికగా ట్వీట్ చేస్తూ కేటీఆర్ నిలదీశారు. ‘రామన్నపేటలో అదానీ ఫ్యాక్టరీకి ద్వారాలు తెరిచింది కాంగ్రెస్ పాలిత రాష్ట్రమే కదా..ఎందుకు అభ్యంతరం చెప్పలేదు’అని ప్రశ్నించారు. ‘నేను కొట్టినట్టు చేస్తా... నువ్వు ఏడ్చినట్టు చేయి అనే ఒప్పందమా? రేవంత్ – అదానీలతో వ్యాపార బంధమా’అని వ్యాఖ్యానించిన ఆయన.. ‘అదానీ – అంబానీలపై మీ పోరాటం ఓ బూటకం , తెలంగాణకు కాంగ్రెస్ తరతరాల దరిద్రం’అని పేర్కొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వ పాలనపై ఏఐసీసీకి సంతృప్తి ఎందుకు ?

రాష్ట్ర ప్రభుత్వ పాలనపై ఏఐసీసీకి సంతృప్తి చెందిందనే వార్తలపై కేటీఆర్ మండిపడ్డారు. అసలు రాష్ట్రంలో పాలన అనేది లేదని...ఇంతకంటే దిక్కుమాలిన ప్రకటన ఇంకోటి ఉండదని ధ్వజమెత్తారు. ఈ మేరకు ‘ఎక్స్’లో ట్వీట్ చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనపై ఏఐసీసీకి అంత సంతృప్తి ఎందుకో చెప్పాలని ప్రశ్నల వర్షం కురిపించారు. ‘తెలంగాణ రైతులకు సంకెళ్లు వేసినందుకా? కొడంగల్‌లో బలవంతంగా భూములు గుంజుకున్నందుకా? మూసీ ప్రాజెక్టులో భాగంగా వేల ఇళ్ల కూల్చివేతకు సిద్ధమైనందుకా? హైడ్రా పేరిట పేద ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నందుకా’అని ప్రశ్నించారు.

నేడు ఢిల్లీకి కేటీఆర్

సాయంత్రం 4 గంటలకు కాన్‌స్టిట్యూషన్ క్లబ్‌లో ప్రెస్‌మీట్

సాక్షి, హైదరాబాద్: బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు ఒకరోజు పర్యటన కోసం సోమవారం ఢిల్లీకి వెళ్లనున్నారు. ఉదయం 8 గంటలకు శంషాబాద్ విమానాశ్రయం నుంచి ఢిల్లీకి బయలుదేరుతారు. సాయంత్రం నాలుగు గంటలకు ఢిల్లీలోని కాన్‌స్టిట్యూషన్ క్లబ్‌లో మీడియా సమావేశంలో పాల్గొంటారు. జాతీయ మీడియాతో ముఖాముఖి నిర్వహిస్తారు. లగచర్లలో ఫార్మా విలేజ్ కోసం భూ సేకరణ పూర్వాపరాలు, గిరిజనులపై కేసులు, చిత్ర హింసలు వంటి అంశాలను కేటీఆర్ మీడియా సమావేశంలో ప్రస్తావించనున్నారు. రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలపై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ స్పందించడం లేదని విమర్శిస్తున్న కేటీఆర్.. ఇదే అంశాన్ని ఢిల్లీలో లేవనెత్తే అవకాశం ఉంది. ఈ నెల 12న ఢిల్లీకి వెళ్లి అమృత్ స్కీమ్ పేరిట కుంభకోణం జరుగుతోందని కేంద్రమంత్రికి కేటీఆర్ ఫిర్యాదు చేశారు. వారంలోనే మరోమారు ఆయన ఢిల్లీకి వెళ్తుండటం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. కేటీఆర్ ఇటీవలి ఢిల్లీ పర్యటనపై కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పరస్పర విమర్శలు, సవాళ్లు చేసుకున్నాయి.

ప్రతిష్టాత్మక ‘టైకాన్’ కేరళ-2024కు కేటీఆర్

ప్రతిష్టాత్మక టైకాన్ కేరళ-2024 సదస్సుకు హాజరు కావాలని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కె.టి.రామారావుకు ఆహ్వానం అందింది. ది ఇండస్ ఆంత్రప్రెన్యూర్స్ (టీఐఈ–టై) ఆధ్వర్యంలో ఈ సదస్సు డిసెంబర్ 4, 5 తేదీల్లో కొచ్చిలోని గ్రాండ్ హయత్ హోటల్‌లో జరగనుంది. కేరళ రాష్ట్రంలోనే అతిపెద్ద ఈవెంట్ గా పేరున్న 13వ టైకాన్‌లో వివిధ రంగాల సీఈవోలు, స్టార్టప్ వ్యవస్థాపకులు, పరిశ్రమ నిపుణులు సహా 1,000 మందికి పైగా పాల్గొంటారు. డిసెంబర్ 5వ తేదీ సాయంత్రం 4 గంటలకు జరగనున్న టైకాన్ అవార్డులు, ముగింపు వేడుకలకు కె.టి.రామారావును ప్రత్యేకంగా ఆహ్వానించారు.



“మీ సమస్యలు కాదు, మీ కలలు మిమ్మల్ని నడపాలి.
- రాల్ఫ్ వాల్డో ఎమర్సన్

సాక్షి
సోమవారం, 18 నవంబర్ 2024

సందిగ్ధ జ్ఞానం

జ్ఞానానికి, అజ్ఞానానికి మధ్య ఉన్నది ‘అ’భేదమే కదా అనుకుంటాం కానీ, ఆ రెండింటికీ మధ్య ఏడు సముద్రాలంత దూరం ఉంది. అజ్ఞానమనే చీకటి ఒడ్డు నుంచి, జిజ్ఞాస అనే అలల మీదుగా, జ్ఞానమనే వెలుగుల తీరం వైపు సాగే ప్రయాణంలో ఆనందమే మనకు తెప్పవుతుంది. అందుకే జ్ఞానానందమనే మాట పుట్టింది. అయితే, ఆ ఆనందాన్ని అంటిపెట్టుకుని ఒక విషాదమూ ఉంటుంది. అది ఏమిటంటే... మన ఊహకు అందనంత వయసున్న ఈ అనంతవిశ్వంలో భూమి ఒక గోళీకాయ కన్నా కూడా చిన్నదనుకుంటే, దానిపై జీవించే మనిషి నలుసుపాటి కూడా చేయడు. అతని అస్తిత్వాన్ని కాలం కొలమానంతో కొలిస్తే అది కొన్నిక్షణాలను మించదు. కనుక అనంతవిశ్వం గురించిన జ్ఞానం సంగతలా ఉంచి, ఈ భూమి గురించి, ఈ భూమి మీద తన మనుగడ గురించిన జ్ఞానం మొత్తాన్నే ఒక మనిషి తన జీవితకాలంలో సంగ్రహించుకోవడం అసాధ్యం. అదీ అసలు విషాదం.

మనిషిలో మెదడు ఎప్పుడు వికసించిందో అప్పుడే అతనిలో విశ్వం గురించిన జ్ఞానాన్వేషణ మొదలై, వేలసంవత్సరాలుగా కొనసాగుతూనే ఉంది. చంద్రుడి వృద్ధి, క్షయాలను అనుసరించి కాలగణనాన్నీ, ఋతుభ్రమణాన్ని అనుసరించి వేటజంతువుల గుర్తింపునూ మనిషి ప్రారంభించి వాటిని ఒక పొడవాటి ఎముకపై నమోదు చేయడం నక్షత్రాలు, రాశులతో ముడిపడిన జ్యోతిర్విజ్ఞానానికి నాంది అయిందంటారు. ఆపైన మొక్కల సేకరణ నుంచి, పెరటిసాగుకు; అక్కడి నుంచి వ్యవసాయానికి సాగే క్రమంలో ఆహారవిజ్ఞానాన్ని బహుముఖాలుగా విస్తరించుకుంటూ వెళ్ళాడు. రాతిపనిముట్ల తయారీలో సాంకేతికజ్ఞానాన్ని, ఏదో అతీతశక్తి ఈ విశ్వాన్ని సృష్టించి నడిపిస్తోందన్న ఊహ నుంచి మత, ఆధ్యాత్మిక విజ్ఞానాన్ని; నియమ నిబంధనలు, కట్టుబాట్లతో కలసి జీవించడం నుంచి సంస్కృతిని సంతరిస్తూ, నిర్మిస్తూ వచ్చాడు. ఇందులో ప్రతిదీ జ్ఞానాన్వేషణలో మేలి మలుపే; జ్ఞానపు నిచ్చెన నధిరోహించడంలో నిశ్చయాత్మకమైన మెట్టే. నగరాల నిర్మాణం మీదుగా నాగరికతాదిశగా సాగిన ఈ యాత్రలో ఇంతవరకు మనిషి ఎక్కడా మడమ తిప్పింది లేదు; ఆకాశమే హద్దుగా ఆ యాత్ర ఇప్పటికీ కొనసాగుతూనే ఉంది. అయినా సరే, సంపూర్ణజ్ఞానం మనిషికి ఎప్పటికీ అందని ఎండమావిలా ఊరిస్తూనే ఉంది. కనిపించని జ్ఞానచంద్రుడి చీకటిపార్శ్వం అదే.

సంకేతాల నుంచి లిపిని అభివృద్ధి చేసుకుని జ్ఞానాన్ని పుస్తక రూపంలో భద్రపరచడం ఈ క్రమంలో మరొక మెరుపుల మజిలీ. మొదట్లో విశ్వసృష్టి, దేవుడు, మతం, ఆధ్యాత్మికత, శాస్త్ర విజ్ఞానం, సాంకేతికజ్ఞానం వగైరా వింగడింపు లేకుండా తనకు తెలిసిన జ్ఞానం మొత్తాన్ని, తనకు తెలిసిన ప్రక్రియలో ఒకేచోట రాశిపోసిన ఉత్సాహం మనిషిది. అందుకే గణితశాస్త్రాన్ని కూడా పద్యాల్లో చెప్పిన పావులూరి మల్లన్నలు మన దేశంలో, మన సాహిత్యంలో కనిపిస్తారు. తర్వాత తర్వాత జ్ఞానం అనేక శాఖలు గల మహావృక్షంగా ఎదిగిపోయి, ఒక మనిషి తన జీవితకాలంలో ఏ ఒక్క శాఖనూ పూర్తిగా తేరి చూసే వీలుకుండా నిలువుగా అడ్డంగా విస్తరించిపోయింది. తన కళ్ళ ముందే ఉన్న, తన నిత్యజీవనంతో ముడిపడి ఉన్న, తన అనుభవంలోకి వచ్చే అనేక విషయాల ఆనుపానులు తెలియకుండానే మనిషి తన జీవితకాలాన్ని ముగించవలసి రావడం కన్నా పెనువిషాదం ఇంక ఏముంటుంది?

ప్రసిద్ధ కథారచయిత పెద్దిభొట్ల సుబ్బరామయ్య ‘ఇంగువ’ అనే కథలో ఈ విషాదాన్నే ఒకింత హాస్యగంభీరస్ఫోరకంగా చిత్రిస్తారు. అందులో రాజశేఖరం అనే వ్యక్తిని ఇంగువ ఎలా తయారవుతుందనే ప్రశ్న చిరకాలంగా వేధిస్తూ ఉంటుంది. అతను వృద్ధాప్యంలో మంచం పడతాడు. ఒక మిత్రుడు అతణ్ణి చూడడానికి వెడతాడు. రాజశేఖరం అతి కష్టం మీద నోరు తెరచి అదే ప్రశ్న అడుగుతాడు. దానికి సమాధానం తెలుసుకోకుండానే జీవితం చాలిస్తానేమోనన్న బెంగ అతని ముఖంలో కనిపిస్తుంది. మిత్రుడు వెంటనే వెళ్ళి ఇంకో మిత్రుని కలసి సమాధానం కనుక్కొని తిరిగి వస్తాడు. కానీ అప్పటికే రాజశేఖరం కన్నుమూస్తాడు. ఇప్పటిలా ఇంటర్నెట్ అందుబాటులోకి వచ్చి, గూగుల్ శోధించి ఉంటే, ‘ఫెరులా’ అనే మొక్క నుంచి పుట్టే జిగురే గట్టిపడి ఇంగువగా తయారవుతుందనీ, ‘అసాఫోటిడా’ అనేది దాని శాస్త్రీయ నామమనీ, ఈ మొక్క ఎక్కువగా ఇరాన్ ఎడారుల్లో, అఫ్గానిస్తాన్, ఉజ్బెకిస్తాన్ పర్వతప్రాంతాలలో సాగవుతుందనీ రాజశేఖరం తెలుసుకుని ఉండేవాడు.

అలాగని అతనికా అదృష్టం లేకపోయిందనడానికీ వీల్లేదు. ఇంటర్నెట్ ఆధారిత బహుళ మాధ్యమాలతో సమాచారవిప్లవం కొత్తపుంతలు తొక్కిందనుకునే ఈ రోజున కూడా చిన్న చిన్న సందేహాలు తీరకుండానే దేహం చాలించే రాజశేఖరాలు ఉంటూనే ఉన్నారు. జ్ఞానతీరానికి ఏ కొంచెమైనా దగ్గరవడానికి ఏ అత్యాధునిక సాధనాలూ సాయపడడం లేదు. పరిమిత జీవితకాలం అతని నిస్సహాయతను ఇప్పటికీ గుర్తుచేసి వెక్కిరిస్తూనే ఉంది. మరోవైపు సమాచార ఉల్బణం నుంచి నిక్కమైన సమాచారానికి బదులు అసత్యాలు, అర్ధసత్యాలు, వక్రీకరణలు పుట్టుకొచ్చి జ్ఞానాన్వేషణను అజ్ఞానాన్వేషణగా మార్చివేశాయి. అలా వ్యాప్తిలోకి వచ్చినదే ‘ఫేక్’ లేదా నకిలీ సమాచారమనే మాట. నేటి రాజశేఖరాలను వేధిస్తున్నది కేవలం సమాచార రాహిత్యం కాదు, నిజమో, అబద్ధమో తెలియని సమాచార సందిగ్ధం. జ్ఞాన, అజ్ఞానాల మధ్య ఆ మాత్రపు అక్షరభేదాన్ని కూడా తుడిచేసి పూర్తి అభేదాన్ని స్థాపించే యుగంలో ఉన్నాం. అదీ విషాదం!

వెనక్కి నడవమంటున్నారా?

కామెంట్



కరణ్ థాపర్

మహిళల భద్రత కోసమని చెబుతూ ఈమధ్య ఉత్తరప్రదేశ్ మహిళా కమిషన్ కొన్ని మూర్ఖపు సలహాలిచ్చింది. వాటి ప్రకారం... మగ టైలర్లు ఆడవాళ్ల దుస్తుల కొలతలు తీసుకోకూడదు; మగవాళ్లు జిమ్ముల్లో ఆడవాళ్లకు ట్రెయినర్లుగా ఉండకూడదు. వాళ్ల ఉద్దేశం మంచిదే కావొచ్చు. కానీ ఇది ఇంకో రకమైన తాలిబనిజం అవుతుంది. ఎందుకంటే, ఇలాంటివి చివరకు మహిళలకు కీడే చేస్తాయి. వారి వ్యక్తిగత ఎంపికకు భంగం కలిగిస్తాయి. ఇది ఇంతటితోనే ఆగుతుందా? ఫిజియోథెరపిస్టులుగా, దంతవైద్యులుగా, డాక్టర్లుగా, ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న మహిళల పరిస్థితి ఏమిటి? వీరందరినీ కేవలం మహిళలకు మాత్రమే సేవలందించేలా చేయాలా? అందుకే ఈ ప్రతిపాదనలు హాస్యాస్పదమైనవే కాదు, అర్థంలేనివి కూడా!

మన మంచి కోసమేనని చెబుతూ కొందరు తరచూ కొన్ని పిచ్చి సూచనలు చేస్తూంటారు. వీటిని నేను పెద్దగా పట్టించుకోను. కానీ ఈ మధ్య ఉత్తరప్రదేశ్ మహిళా కమిషన్ కొన్ని మూర్ఖపు సలహాలిచ్చింది. అవి ఎంత మూర్ఖమైనవంటే మనం వాటిని గట్టిగా పట్టించుకోవాల్సిన అవసరం ఉంది. వీటిపట్ల మౌనంగా ఉంటే, అవన్నీ సమ్మతమే అనుకునే ప్రమాదముంది.

‘బహిరంగ, వాణిజ్య స్థలాల్లో మహిళల భద్రతను పెంచడం ఎలా?’ అన్న అంశంపై ఈ సూచనలు వచ్చాయి. ఉద్దేశం చాలా మంచిది. కానీ ప్రతిపాదించిన సలహాలు మాత్రం నవ్వు పుట్టించేలా ఉన్నాయి. మగ టైలర్లు ఆడవాళ్ల దుస్తుల కొలతలు తీసుకోకూడద న్నది ఒకానొక సలహా. అలాంటప్పుడు పురుషులు మహిళల వస్త్రాలు కూడా తయారు చేయకూడదా? మహిళలు మాత్రమే సిద్ధం చేయాలా? బహుశా ఇది ఇకపై అమల్లోకి తెస్తారేమో! సెలూన్లలోనూ మహిళలకు క్షౌర క్రియలు చేయడం ఇకపై పురుషులకు నిషిద్ధం. అలాగే జిమ్, యోగా సెషన్లలోనూ మగవాళ్లు మహిళలకు శిక్షణ ఇవ్వడానికి అనుమతి లేదు.

ఇంతటితో అయిపోయిందనుకోకండి. అన్ని పాఠశాలల బస్సుల్లోనూ మహిళా సెక్యూరిటీ సిబ్బంది ఉండాలన్న సలహా కూడా వచ్చింది. బహుశా పురుషులు ఎవరూ యువతులను, చిన్న పిల్లలను భద్రంగా ఉంచలేరని అనుకున్నారో... వారి నుంచి ముప్పే ఉందను కున్నారో మరి! మహిళల వస్త్రాలమ్మే చోట మహిళా సిబ్బంది మాత్రమే ఉండాలట. పురుషులను అస్సలు నమ్మకూడదన్న కాన్సెప్టు నడుస్తోందిక్కడ. మహిళలను ప్రమాదంలో పడేయకుండా పురుషులు వారికి సేవలు అందించలేరన్నమాట.

ఉత్తర ప్రదేశ్ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ బబితా చౌహాన్ ఈ సలహాలు, సూచనలపై ఏమంటున్నారంటే... మహిళల భద్రతను పటిష్ఠం చేసేందుకు మాత్రమే కాకుండా, మహిళల ఉపాధి అవకాశాలను మెరుగుపరిచేందుకు కూడా వీటిని ఉద్దేశించినట్లు చెబుతున్నారు. ఈ సలహాలను ‘‘మహిళల భద్రత కోణంలోనూ, అలాగే ఉపాధి కల్పన కోణంలోనూ’’ ఇచ్చినట్టు మొహమాటం లేకుండా ఆమె చెబుతున్నారు. ఇంకోలా చెప్పాలంటే, రకరకాల ఉద్యోగాల్లో పురుషులపై నిషేధం విధిస్తున్నారన్నమాట. తద్వారా మహిళలకు కొత్త రకమైన అవకాశాలు కల్పిస్తున్నారనుకోవాలి.



సరే... వీటి ద్వారా మనకర్థమయ్యేది ఏమిటి? అసలు ఏమైనా అర్థముందా వాటిల్లో? అలాటి ప్రతిపాదనలు అవసరమా? న్యాయమైనవేనా? అనవసరంగా తీసుకొచ్చారా? మరీ నమ్మశక్యం కాని విధంగా ఉన్నాయా?

ఇప్పటివరకూ చెప్పినదాన్ని బట్టి నా ఆలోచన ఏమిటన్నది మీకు అర్థమై ఉంటుంది. కొంచెం వివరంగా చూద్దాం. మొదటగా చెప్పుకోవాల్సింది... ఈ ప్రతిపాదనల వెనుక పురుషులపై ఉన్న అపనమ్మకం గురించి! పురుష టైలర్లు, క్షురకులు, దుకాణాల్లో పనిచేసే వారి సమక్షంలో మహిళల భద్రతకు ముప్పు ఉందని భావిస్తున్నారు. చిన్నపిల్లల రక్షణ విషయంలోనూ మనం మగ సిబ్బందిని నమ్మడం లేదంటే... వాళ్లకేదో దురుద్దేశాలను ఆపాదిస్తున్నట్లే!

పైగా... ఈ ప్రతిపాదనలు కాస్తా మహిళల జీవితాల తాలూకు వ్యక్తిగత గోప్యతకు భంగం కలిగించేవి కూడా! తాము సొంతంగా నిర్ణయాలు తీసుకునే అవకాశం లేకుండా చేస్తున్నాయి. పురుషులు బాగా రాణిస్తున్న రంగాల్లో, వారి సేవలను తాను వినియోగించుకోవాలని ఒక మహిళ నిర్ణయించుకుంటే ఈ ప్రతిపాదనల పుణ్యమా అని అది అసాధ్యమవుతుంది.

ఇంకోలా చూస్తే ఇది తాలిబనిజంకు ఇంకో దిశలో ఉన్న ప్రతిపాదనలు అని చెప్పాలి. అఫ్గానిస్తాన్‌లో తాలిబన్లు మహిళలను తిరస్కరిస్తున్నారు. ఇక్కడ పురుషులను మహిళలకు దూరంగా ఉంచుతున్నారు. వారి దుర్మార్గమైన మనసులను విశ్వసించకూడదు; కాబట్టి వారిని మహిళలకు దూరంగా ఉంచాలి.

ఇప్పుడు చెప్పండి... ఈ ప్రతిపాదనలు వాస్తవంగా అవసరమా? ఇలాగైతే పురుషుల దుస్తులమ్మే దుకాణాల్లో మహిళలు పని చేయకూడదు మరి! మహిళా జిమ్ శిక్షకులు పురుషులకు ట్రెయినింగ్ ఇవ్వకూడదు. ఫిజియోథెరపిస్టులుగా, దంతవైద్యులుగా, డాక్టర్లుగా, ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న మహిళల పరిస్థితి ఏమిటి? వీరందరినీ కేవలం మహిళలకు మాత్రమే సేవలందించేలా చేద్దామా? పురుష రోగులకు, వినియోగదారులకు సేవలు అందించడానికి అనుమతిద్దామా? మగ శిక్షకులు, దుకాణాల్లోని మగ సేవకులను నమ్మలేని పరిస్థితి ఉన్నప్పుడు... స్త్రీలు పేషెంట్లుగా, వినియోగదారులుగా వచ్చినప్పుడు వాళ్లు ఎలా ఎక్కువ నమ్మకస్తులవుతారు?

నేను ఇదంతా ఎందుకు చెబుతున్నానో మీకు ఇప్పటికి అర్థమైందనే అనుకుంటున్నా. పురుషులు నిర్వహిస్తున్న పనులపై నమ్మకం లేకపోతే... మహిళలపై కూడా అదే అవిశ్వాసం ఉంటుంది కదా! అప్పుడు అదే ప్రశ్న కదా ఉత్పన్నమయ్యేది! పురుషులను అస్సలు నమ్మడం లేదని చెప్పడం ద్వారా ఉత్తరప్రదేశ్ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ ఏ రకమైన సందేశం ఇవ్వదలచుకున్నారు? కొంచెం ఆలోచించి చూడండి.

మహిళల విషయంలో వివక్ష చూపేవారిని మిసోజినిస్ట్ అంటూ ఉంటారు. ఈ లెక్కన బబితా చౌహాన్‌ను మిసాండ్రిస్ట్ అనాలి. మహిళల పట్ల వివక్ష చూపడం ఎంత తప్పో... పురుషులపై చూపడం కూడా అంతే తప్పు. అయితే మిసోజినీ గురించి మనకు కొద్దోగొప్పో పరిచయం ఉంది కానీ మిసాండ్రిస్టుల విషయం నేర్చుకోవాల్సే ఉంది. ఈ పనికిమాలిన విషయానికి మనం బబితా చౌహాన్‌కు కృతజ్ఞులుగా ఉండాలి.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల ‘మనసులోని మాట’లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

తీసుకోలేనివి...



జీవిత పరమార్థం అర్థం చేసుకోవడమే విజయ రహస్యం. మీకు ఎప్పటికీ ఇవ్వలేని దానిని ఎవరూ మీ నుండి తీసుకోలేరని మీరు అర్థం చేసుకున్నప్పుడు స్వేచ్ఛగా ఉంటారు. గౌరవం, సమగ్రత, జవాబుదారీతనం, వినయం, వృత్తి నైపుణ్యం, పట్టుదల, ధైర్యం... అలాంటివి.

– వెలీనా త్చకరోవా, వ్యాఖ్యాత

కొందరు వేరే!



ట్విట్టర్ వేదిక మీద ఒక మగవాడు నన్ను బూతులు తిట్టాడు. నిమిషాల్లో పదిమంది మగవాళ్లు నాకు మద్దతుగా వచ్చారు. నాకున్న మగ ఫాలోవర్స్‌లో చాలామంది ఎవరైనా నన్ను దూషిస్తే వెంటనే రిపోర్ట్ చేస్తారు. కొన్నిసార్లు కనీసం నాకు తెలియకుండానే! అందరూ మగవాళ్లూ ఒకటి కాదని నేను చెబుతున్నది!

– దీక్షా కంద్‌పాల్, కామెంటేటర్

ఇంటిదే మందు



దయచేసి మీ ఇంటి ఆహారాన్ని ఇష్టపడటం ప్రారంభించండి. ఆరోగ్యకరమైన శరీరానికి ఉత్తమ మార్గం బయటి ఆహారాన్ని నివారించడం.

– జోయితా, ఫిజీషియన్

అవే చెబుతాయి!



ఒక ఇంటర్వ్యూలో, అభ్యర్థులు తాము ఇచ్చే సమాధానాల్లో కంటే, చివరలో అడిగే ప్రశ్నల ద్వారా తమ గురించి ఎక్కువగా వెల్లడిస్తారు.

– పర్మీందర్ సింగ్, గూగుల్ మాజీ సీఈఓ

(నహీ) ఛలో అయోధ్య!



అయోధ్యలోని రామమందిరాన్ని దర్శించాలనుకుంటే, దయచేసి వద్దు. నేను వెళ్లాను, చాలా నిరాశ కలిగించింది. మురికి, దుమ్ము, గందరగోళానికి తోడు ఇంకా చాలా పనులు జరగాల్సే ఉన్నాయి. కంప్యూటర్‌లో చూపించిన రామమందిరంలా కనబడాలంటే కనీసం రెండేళ్లు పడుతుంది.

– రాజేంద్ర కుంభట్, వ్యాపారవేత్త

బీజం అప్పడే...



ప్యారిస్‌లో నేను విద్యార్థినిగా ఉన్నప్పుడు స్కర్టు ధరించడం చూసిన ఒక గడ్డం మనిషి అది ఇస్లాం ప్రకారం ఎంత అసభ్యకరమైనదో నాకు ఉపన్యాసం ఇచ్చిన రోజును నేను ఎప్పటికీ మరిచిపోలేను. నాకు మాటలు రాలేదు. “నేను మొరాకోలో కూడా ఇదే ధరిస్తాను” అన్నాను. పరిస్థితులు ఎంత దారుణంగా మారనున్నాయో అప్పుడే నాకు అర్థమైంది.

– జీనెబ్ రిబోవా, మొరాకో రచయిత్రి

మరవలేని కృషి



భారతదేశ చరిత్ర ప్రపంచవ్యాప్తంగా ఉన్న చరిత్రకారులకు ఇప్పుడు స్ఫూర్తిదాయకంగా ఉండటానికి కారణం – భారతదేశంలోని చరిత్రకారుల అసాధారణమైన పాండిత్యం. వారు చాలా క్లిష్టమైన పరిస్థితుల్లో పనిచేశారు.

– అభిషేక్ కైకర్, చరిత్రకారుడు

ఆయన జీవితం స్ఫూర్తిమంతం

ఈ దేశంలో నిజమైన పోరాట యోధుల చరిత్ర వెలుగులోకి రాకమునుపే, నకిలీ విజేతలు వెలిగిపోయారు. ఇప్పుడు ఆ మూసను బద్దలుకొట్టడమే ఈ తరం చేయాల్సిన పని. ‘నా అన్వేషణలో కత్తి చంద్రయ్య’ అనే జీవితగాథ రాసిన కత్తి కళ్యాణ్ చేసింది ఇదే! ఈ పుస్తకాన్ని చదువుకుంటూ ముందుకు వెళ్తే ఒక మహామనిషితో కరచాలనం చేస్తాం. తెలుగు నేల నుంచి ఆవిర్భవించిన తొలి దళిత కలెక్టర్ ‘పేదల కలెక్టర్’గా ఎట్లా ఎదిగి వచ్చాడో తెలుసుకుంటాం. ఆయన చేసిన సేవలకు ఆయనే గనుక ఉన్నతవర్గంలో పుట్టి ఉంటే ఈ పాటికి ఆయన పేరు నలుదిశలా మార్మోగేది. 1924లో నిరుపేద రైతుకూలీ కుటుంబంలో జన్మించిన కత్తి చంద్రయ్య చదువే లోకంగా ఎదిగి వచ్చారు. ఆంధ్రా యూనివర్సిటీతో పాటు మద్రాసులో సైతం ఉన్నత విద్యను అభ్యసించారు. ప్రకాశం జిల్లా ఏర్పడిన తరువాత మొదటి కలెక్టర్‌గా ఆయన పనిచేశారు. ఆ తరువాత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలకు సైతం ఆయన కలెక్టర్‌గా సేవలందించారు. ఏ జిల్లాలో ఉద్యోగం చేసినా తనదైన మార్క్ ఉండేది. సంక్షేమ ఫలాలను ప్రజలకు అందించాలన్నా, ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా కాపాడి, పేదలకు పంచాలన్నా కత్తి చంద్రయ్యకే సాధ్యం అనేలా ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించారు.



ఆయనలో ఒక గొప్ప మేధావి ఉన్నాడు. పురాతన చరిత్రను తెలుసుకోవడం, పత్రికలకు, మ్యాగజైన్‌లకు వ్యాసాల రూపంలో రాసి ప్రచారం చేయడం అభిరుచిగా పెట్టుకున్నారు. ముఖ్యంగా మంచి పాఠకుడిగా ఆయన అనేక పుస్తకాలు అధ్యయనం చేశారు. అలాగే తన పరిశోధనలో తెలుసుకున్న విషయాలను ఈ సమాజం ముందు పెట్టడానికి విలువైన రచనలు చేశారు. ‘దళిత్ ఎకానమీ’ అనే రచన అందులో ఒకటి. తెలుగు సాహిత్యంపై ఉన్న మక్కువతో వేమన వంటి ప్రజా కవులను గురించి కూడా వ్యాసాలు రాశారు.

ఈ పుస్తకంలో చంద్రయ్య కాలం నాటి దినపత్రికల కటింగ్‌లను పొందుపరిచాడు రచయిత. అది చాలా శ్రమతో కూడుకున్న పని. ఇవాళ పరాజిత జాతుల చరిత్రలన్నీ వెలికితీసే పని మరింతగా జరగాలి. నిజం చెప్పులేసుకునేలోపే, అబద్ధాలు ప్రపంచమంతా తిరిగి వస్తున్న యుగంలో మనం జీవిస్తున్నాం. నిజాలకు పట్టం కట్టాలి, నిజమైన ఆదర్శనీయుల చరిత్రను ఈ సమాజానికి అందించాలి. ఈ పుస్తకం విరివిగా ప్రజల్లోకి వెళ్లాలి. ముఖ్యంగా విద్యార్థులు చదవాలి. చంద్రయ్య పేరు మీద ఉత్తమ అధికారులకూ, పరిశోధకులకూ, చరిత్ర రచయితలకూ అవార్డులివ్వాలి. ఇందుకోసం ప్రజలు, ప్రభుత్వాలు పూనుకోవాలి. ఆ దిశలో వ్యవహరించడానికి అవసరమైన చైతన్యం కలిగించడానికి ఈ పుస్తకం ఒక దారి చూపుతుంది.

– డా॥ పసునూరి రవీందర్, కేంద్ర సాహిత్య అకాడెమి యువ పురస్కార గ్రహీత । 63030 08268

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ-మెయిల్: editpage@sakshi.com
ఎడిట్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలను ఆ యా రచయితల వ్యక్తిగత అభిప్రాయాలుగా గమనించాలి.

కలలూ కన్నీళ్ళ కలబోతలో పూలూ ముళ్ళూ!

సందర్భం



గౌరవ్

ఆవంత్స సోమసుందర్ స్వీయ చరిత్ర ‘కలలు–కన్నీళ్ళు’ తెలుగు సాహిత్యంలో విశిష్టమైన రచన. ఎనిమిది దశాబ్దాల పాటు తెలుగు సాహిత్యంతో మమేకమైన ఒక మహాకవి మనసుతో వ్యక్తీకరించిన అరుదైన ఆత్మకథ. స్వాతంత్ర్యోద్యమ పూర్వం నాటి పరిస్థితులు మొదలుకొని ఆధునిక కాలంలో వెల్లువెత్తిన అనేక అభ్యుదయ ఉద్యమాలకు సోమసుందర్ ప్రత్యక్ష సాక్షి. అందుకేనేమో వజ్రాయుధ కవిగానే కాక విలక్షణమైన విమర్శకుడిగా, ‘కళాకేళి’ పత్రికా స్థాపకునిగా, కమ్యూనిస్టు ఉద్యమశీలిగా, అన్నింటినీ మించి నిరంతర స్వాప్నికుడిగా కలకాలం జీవించారు.

కవులు జీవిత చరిత్రలు రాసి మెప్పించడం అరుదు. తెలుగులో ఆ సంఖ్య మరీ తక్కువ. అలాంటిది రెండు భాగాలుగా ఆత్మకథను రాసి... ముఖ్యంగా మొదటి భాగంలో అసాధారణ రచనా కౌశలాన్ని చూపిన ఘనత సోమసుందర్‌కే చెల్లుతుంది. సరిగ్గా ఇరవై ఏళ్ళ క్రితం 2005లో ‘కళాకేళి’ తరపున ప్రచురించిన ‘కలలు – కన్నీళ్ళు’ తెలుగు సాహిత్యంలో నిస్సందేహంగా ఒక అద్భుతమైన అక్షర కళా శిల్పం.

‘నాకంటూ ఒక జీవితం ఏర్పడ్డాక... మొదటి జ్ఞాపకం మా అమ్మ... మలి జ్ఞాపకమూ మా అమ్మే. అందుకే మాతృవందనంతోనే దీన్ని ప్రారంభిస్తున్నాను. మా అమ్మే నిరంతర స్మృతి వీచిక... మా అమ్మ నన్ను విడిచి వెళ్ళక ముందే నేను మా అమ్మను విడిచి వెళ్ళిపోయాను; దూరంగా... అనంతంగా... సుదీర్ఘమైన ఎడబాటుగా. బాట మారింది. ఉనికి మారింది. ఆశ్రయం మారింది. అమ్మా మారింది...’

1924 నవంబరు 18న శంఖవరంలో పుట్టినప్పటికీ, బాల్యంలోనే దత్తునిగా పిఠాపురానికి వలస వచ్చిన పసి జ్ఞాపకాల్ని స్పృశిస్తూ ఆత్మకథలో సోమసుందర్ రాసిన ఆరంభ వాక్యాలు ఇవి.

నాలుగేళ్ళ ప్రాయంలోనే తల్లి ఎడబాటుకు లోనైన పసి హృదయం బహుశా ఆనాడే కార్చిన కన్నీటి ధారల్ని కవితా పంక్తులుగా మార్చే ప్రక్రియను అభ్యసించి ఉంటుంది. భవిష్యత్తులో శ్రామిక వర్గం తరపున ప్రాతినిధ్యం వహించే బలమైన వజ్రాయుధ కలం ఆవిర్భావానికి అంకురార్పణ ఆనాడే జరిగిందేమో!

మూడొందల పుటల ‘కలలు–కన్నీళ్ళు’ ఆత్మకథ అంతా ఒకెత్తయితే, దీనికి సో.సు. రాసిన ఐదు పుటల ముందుమాట ఒకటీ ఒకెత్తు. రూసో మహాశయుడి మాట, ‘రెక్కల చేప కథ విప్పింది’ అంటూ ప్రపంచంలోని చాలా మంది ప్రముఖ కవులు, రచయితలు, మేధావుల ఆత్మ కథలను స్థూలంగా పాఠకుడికి పరిచయం చేశారు. అలా చేస్తూనే స్వీయచరిత్ర రాయటం ఎంత కష్టమో వివరించారు. గాంధీ, నెహ్రూ వంటి నేతలు మొదలు వర్జీనియా ఉల్ఫ్, జీన్‌పాల్ సార్త్రే వంటి పాశ్చాత్య మేధావుల స్వీయ చరిత్రల్ని గురించి చెబుతారు. అవి కాక, ఏనుగుల వీరాస్వామి, కందుకూరి వీరేశలింగం, చలం వంటి వారి ఆత్మకథల గురించి కూడా తడుముతారు. ఇన్నింటిలోకీ సో.సు.ను ప్రభావితం చేసింది మాత్రం డామ్ మోరీస్ రాసిన ‘మై సన్స్ ఫాదర్’ అనే ఆత్మకథ. సోమసుందర్ అనితర సాధ్యమైన అధ్యయనశీలతకి ఈ మున్నుడే ఒక ప్రతీక. ముందుమాటకి ముగింపుగా సో.సు, ‘నా చేతిలోని లేఖినిని మృత్యువు తప్ప వేరెవ్వరూ అపహరించలేరని’ అంటారు. అలా అన్న మాటల్ని నిలుపుకొని 2016 ఆగష్టు 16న చివరి శ్వాస వరకూ విస్తృతమైన సారస్వత సేవ కావించిన అరుదైన ప్రజాకవి సోమసుందర్.



అల్లూరి సీతారామరాజుకి ఆశ్రయం ఇచ్చిన కుటుంబ నేపథ్యం నుండీ అల్లారు ముద్దుగా సంస్కృత శ్లోకాలు, సంగీత కచేరీలు, నాటకాలు, సినిమాలు, కౌమార ప్రేమ కలాపాలు... ఇలా ఒకటేమిటి ఎన్నో వర్ణాలు మనకి సో.సు. జీవితంలో కనబడతాయి. హైస్కూల్ విద్యార్థిగా స్టూడెంట్ యూనియన్ సభలకని కోల్‌కతా వెళ్ళినప్పుడు హౌరా బ్రిడ్జి మీద చూసిన జీవచ్ఛవానికి కలత చెంది నవ యువకుడు పట్టిన కలం, కట్టిన కవిత తెలుగు నేలమీద దశాబ్దాల పాటు వెల్లువలా సాగింది. తెలంగాణ సాయుధ పోరాటంలో నినాదమై రగిలింది. ‘హే నిజాం పాదుషా, ఖబడ్దార్ !’ అని హెచ్చరించింది. నిషేధానికి గురైె చరిత్ర సృష్టించింది.

‘కవిత్వమూ, కమ్యూనిజమూ తప్ప మరే ధ్యాసా నాకు లేదు’ అని తన ఆత్మకథలో ప్రకటించుకున్న సో.సు. జీవితాన్ని ఆ రెంటికే అంకితం చేశారు. సుమారు ముప్పై మూడు భాగాల్లో ఎన్నెన్నో అపురూప విషయాల్ని నమోదు చేశారు. పిఠాపురం సంస్థానంలో సాహిత్య వాతావరణం మొదలుకొని రాష్ట్రవ్యాప్తంగా పెల్లుబికిన అభ్యుదయ కవితోద్యమం వరకూ ఎంతో హృద్యంగా చెప్పారు. హైదరాబాదు కవి మిత్రుల నుండీ మద్రాసు మేధా సాంస్కృతిక ప్రవంతి దాకా, విశ్వనాథ సత్యనారాయణ, శ్రీశ్రీ వంటి వారితో అనుభవాలు, మిత్రులతో చేసిన ఉత్తర భారత యాత్రా విశేషాలు... ఒక్కటేమిటి తన జీవన చిత్రంలోని గాఢమైన రంగులన్నిటినీ ఆత్మకథ రూపంలో పాఠక లోకానికి అందించారు సో.సు.

అయితే, ఎందుకనో తెలీదు కానీ సోమసుందర్ స్వీయచరిత్రకి రావాల్సిన గుర్తింపు సాహితీ లోకంలో సైతం రాలేదు. విశాలమైన పచ్చిక బయళ్ళ పైన పిండార బోసినట్లు ‘నా జీవితంలో మంచిపనులు ఎన్ని చేశానో అంతకు మించిన చెడ్డ పనులు చేశాను. అందుకే మంచి పనులు సవిస్తరంగా ఏకరువు పెట్టలేదు. చెడ్డపనులు మచ్చుకు కొన్నే చెప్పకుండా విడిచిపెట్టనూలేదు. అసలు జీవితం అంటే ఏమిటి? చెడ్డ పనులు రహస్యంగా చేసుకుంటూ పోవడం. మంచి పనులు తక్కువే అయినా బహిరంగంగా చేయడం...’ అని చెప్పుకున్న సోమసుందర్ ధైర్యాన్ని, పారదర్శకతను చదివి అంగీకరించి, స్వీకరించేందుకు కూడా కొంత సాహసం కావాలేమో అనిపిస్తుంది. బహుశా అందుకనే వృద్ధాప్యంలో డిక్టేట్ చేసి రాయించిన సో.సు. స్వీయచరిత్ర రెండో భాగం ‘పూలు, ముళ్ళు’ అంతగా కదిలించదు. ఏదో భారంగా రాసినట్టు సాగుతుంది. ఇదంతా ఒకెత్తయితే ఏకకాలంలో కవిగా, కార్యకర్తగా కూడా మసిలిన ఆయన కార్యదీక్ష ఒక్కటీ ఒకెత్తు. స్వాతంత్ర్యం వచ్చే నాటికి జైల్లో శిక్ష అనుభవిస్తూ కూడా ఈ దేశంలో సోషలిజం కోసం నిబద్ధతతో కృషి చేసిన సో.సు. తర్వాత కాలంలో పూర్తిస్థాయి సాహితీవేత్తగా మారారు.

ప్రజా చైతన్యమే లక్ష్యంగా సకల సాహితీ ప్రక్రియలను ప్రయోగించారు. లిటరరీ ట్రస్ట్ స్థాపించి ఎందరో యువకవుల్నీ, రచయితల్నీ పురస్కారాలతో ప్రోత్సహించారు. శతాధిక గ్రంథాల్ని రచించి తెలుగులో ఎన్నదగిన అభ్యుదయ దిక్సూచిగా భాసించారు. ఆయన స్ఫూర్తిని అందుకుని కొనసాగించగలగడమే మహాకవి ఆవంత్స సోమసుందర్‌కు మనం ఇచ్చే అర్థవంతమైన ఆత్మీయ నివాళి.

వ్యాసకర్త సామాజిక కార్యకర్త । 90320 94492
(నేడు ఆవంత్స సోమసుందర్ శతజయంతి)

గ్రహం అనుగ్రహం
శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీక మాసం, **తిథి:** బ.తదియ రా.10.00 వరకు, తదుపరి చవితి, **నక్షత్రం:** మృగశిర రా.7.24 వరకు, తదుపరి ఆరుద్ర, **వర్జ్యం:** రా.3.41 నుండి 5.13 వరకు, **దుర్ముహూర్తం:** ప.12.10 నుండి 12.58 వరకు, తదుపరి ప.2.25 నుండి 3.13 వరకు, **అమృతఘడియలు:** ఉ.10.54 నుండి 11.43 వరకు; **రాహుకాలం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **యమగండం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **సూర్యోదయం:** 6.09, **సూర్యాస్తమయం:** 5.21.

యాదగిరి క్షేత్రంలో భక్తుల రద్దీ

ధర్మ దర్శనానికి 4 గంటల సమయం

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో భక్తుల రద్దీ నెలకొంది. కార్తీక మాసంలో ఆదివారం సెలవు రోజు కావడంతో హైదరాబాద్, సికింద్రాబాద్‌లతో పాటు వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు స్వామిని దర్శించుకునేందుకు పెద్ద ఎత్తున తరలివచ్చారు. దీంతో ఆలయ పరిసరాలు, క్యూలైన్లు, ప్రసాద విక్రయశాల, క్యూకాంప్లెక్స్, బస్టాండ్లు, కల్యాణ కట్ట, లక్ష్మీ పుష్కరిణి, నిత్య కల్యాణ మండపం, ముఖ మండపం క్యూలైన్‌లో భక్తులు అధికంగా కనిపించారు. ధర్మ దర్శనానికి 4 గంటలు, వీఐపీ దర్శనానికి గంటన్నర సమయం పట్టిందని భక్తులు తెలిపారు. శ్రీస్వామి వారిని 45 వేలకు పైగా భక్తులు దర్శించుకున్నారు. ఇక శ్రీసత్యనారాయణస్వామి వ్రత పూజల్లో భక్తులు అధికంగా పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ఉదయం నుంచే వ్రతాలను జరిపించేందుకు కొండ కింద గల మండపం వద్ద భక్తులు బారులుదీరారు. వ్రత పూజలతో రూ.10,04,800 రాగా.. వివిధ పూజలతో నిత్యాదాయం రూ.64,26,176 వచ్చినట్లు ఆలయాధికారులు వెల్లడించారు.


వీఐపీ దర్శనం క్యూలైన్‌లో భక్తుల కిటకిట


గౌహతి హైకోర్టు జడ్జి జస్టిస్ మిథాలి ఠాకూరియాకు లడ్డూ ప్రసాదం, శ్రీస్వామి వారి చిత్ర పటాన్ని అందజేస్తున్న ఈఓ భాస్కర్‌రావు

యాదగిరిలో గౌహతి హైకోర్టు జడ్జి

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామిని ఆదివారం గౌహతి హైకోర్టు జడ్జి జస్టిస్ మిథాలి ఠాకూరియా తన కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా జస్టిస్ మిథాలి ఠాకూరియాకు ఆలయ అర్చకులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. గర్భాలయంలోని స్వయంభూ, ప్రతిష్ఠ అలంకారమూర్తులను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు వేదాశీర్వచనం చేయగా, ఈవో భాస్కర్‌రావు లడ్డూ ప్రసాదంతో పాటు శ్రీస్వామి వారి చిత్రపటాన్ని బహూకరించారు.


ధారూరు జాతరలో దైవసందేశం వినిపిస్తున్న పాస్టర్లు, హాజరైన భక్తులు


జాతరలో భక్తులకు అభివాదం చేస్తున్న దక్షిణ కొరియా మత ప్రబోధకుడు రెవరెండ్ ఇసాక్

ధారూరు.. భక్తులు పోటెత్తారు

- మార్మోగిన మెథడిస్టు క్రిస్టియన్ జాతర

ధారూరు: వికారాబాద్ జిల్లా ధారూరు మెథడిస్టు క్రిస్టియన్ జాతరకు ఆదివారం భక్తులు పోటెత్తారు. ఆరు రోజుల పాటు సాగిన ఉత్సవాలు ఆదివారం ప్రత్యేక ప్రార్థనలతో ముగిశాయి. జాతరకు తమిళనాడు, మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోని వివిధ జిల్లాల నుంచి 2లక్షల మంది హాజరయ్యారు. ప్రత్యేక ఆహ్వానితునిగా దక్షిణ కొరియా నుంచి రెవరెండ్ మిచెల్ ఇసాక్ హాజరయ్యారు. ప్రత్యేక అతిథులుగా దక్షిణ భారతదేశం రీజినల్ కాన్ఫరెన్స్ బిషప్ ఎస్ఎల్ కర్కరే, ఆయన సతీమణి కమల్ కర్కరే, హైదరాబాద్ రీజియన్ కాన్ఫరెన్స్ బిషప్ ఎంఏ డేనియల్, ఆయన భార్య ఆశా డేనియల్ పాల్గొన్నారు. వీరికి జాతర కార్యదర్శులు స్టీవెన్ రవికుమార్, సెబాస్టియన్, జాతర ఇన్‌చార్జి రెవరెండ్ మార్క్ డీఎస్ స్వాగతం పలికారు. బిషప్ ఎస్ఎల్ కర్కరే దైవసందేశం వినిపించారు.

నైజీరియాలో ఆలేరువాసిపై ప్రధాని మోదీ ప్రశంసలు


ప్రదీప్ ఫొటోపై సంతకం చేస్తున్న ప్రధాని

ఆలేరు రూరల్: విదేశీ గడ్డపై నివసిస్తూ నిరంతరం భారతీయ సంస్కృతి పరిరక్షణకు ప్రయత్నిస్తున్న తెలుగు ప్రవాస భారతీయ యువకుడిని ప్రధాని మోదీ అభినందించారు. యాదాద్రి జిల్లా ఆలేరులోని క్రాంతినగర్ కాలనీకి చెందిన బిర్యాని ప్రదీప్ నైజీరియాలో పని చేస్తూ పలు ఆఫ్రికా దేశాల్లో భారతీయ సంస్కృతి, విలువల వ్యాప్తి కోసం కృషి చేస్తున్నారు. ఈ క్రమంలో ఆఫ్రికా ఖండంలోని ఎత్తైన కిలిమంజారో పర్వత శిఖరాన్ని కూడా అధిరోహించారు. ప్రదీప్ కృషిని గుర్తించిన నైజీరియాలోని భారత రాయబార కార్యాలయ అధికారులు ఆ దేశంలో పర్యటిస్తున్న భారత ప్రధానికి ప్రదీప్ గురించి తెలిపారు. దీంతో అబూజాలో ప్రధాని ఆదివారం ప్రదీప్‌ను సన్మానించారు. కిలిమంజారో పర్వత శిఖరాన్ని అధిరోహించిన సందర్భంగా ప్రదీప్ తన చేతిలో ప్రధాని మోదీ చిత్రాన్ని పట్టుకొని దిగిన ఫొటోపై మోదీ సంతకం చేశారు.

ఆన్‌లైన్ బెట్టింగ్‌తో యువకుడి ఆత్మహత్య

- రూ.25 లక్షల నష్టం


స్వామిగౌడ్ (ఫైల్)

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): రాజన్నసిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలానికి చెందిన యువకుడు ఆన్‌లైన్ బెట్టింగ్‌లో నష్టపోయి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సింగారం గ్రామానికి చెందిన బండి స్వామిగౌడ్ (35) ఐదేళ్లుగా తండ్రి నారాయణతో కలిసి పాల డెయిరీ నిర్వహిస్తున్నాడు. ఆటో కూడా నడుపుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఆన్‌లైన్ బెట్టింగ్‌కు అలవాటుపడ్డ స్వామిగౌడ్ రూ.25 లక్షల వరకు కోల్పోయాడు. అప్పులు తీర్చే మార్గం లేక గడ్డి మందు తాగగా, ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. వారం రోజులుగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. స్వామిగౌడ్‌కు భార్య శ్వేత, కుమారుడు సాద్విన్(5), కూతురు వర్షిత (4) ఉన్నారు.

పోలీస్ వర్సెస్ ప్రభాకర్‌రావు!

ఫోన్ ట్యాపింగ్ కేసులో ఆయనను అమెరికా నుంచి రప్పించడానికి ప్రయత్నాలు

- ప్రభాకర్‌రావు పాస్‌పోర్టు సస్పెండ్ చేయించిన పోలీసులు
- శాశ్వతంగా రద్దు చేయాలంటూ కేంద్రానికి లేఖ
- మరోవైపు పాస్‌పోర్ట్ సస్పెన్షన్‌ను సవాల్ చేసిన న్యాయవాదుల టీమ్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో (ఎస్ఐబీ) కేంద్రంగా జరిగిన అక్రమ ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక నిందితుడైన ఆ విభాగం మాజీ చీఫ్ టి.ప్రభాకర్‌రావును అమెరికా నుంచి రప్పించడానికి పోలీసులు అన్ని ప్రయత్నాలు చేస్తున్నారు. వాటిని తిప్పికొట్టడానికి ప్రభాకర్‌రావు కూడా అక్కడి నుంచే పావులు కదుపుతున్నారు. దీనితో పోలీసులు వెర్సస్ ప్రభాకర్‌రావు అన్నట్టుగా మారింది.

పరిణామాలను గమనించి అమెరికా వెళ్లిపోయి..

ఎస్ఐబీకి సుదీర్ఘకాలం నేతృత్వం వహించిన టి.ప్రభాకర్‌రావు గత ఏడాది డిసెంబర్ 4న అసెంబ్లీ ఎన్నికల ఫలితాలను చూసిన వెంటనే రాజీనామా చేశారు. అక్రమ ఫోన్ ట్యాపింగ్ కేసు, తర్వాతి పరిణామాలను గమనించిన ఆయన... ఈ ఏడాది మార్చిలో తిరుపతి వెళ్లి, అటు నుంచే చెన్నై మీదుగా అమెరికా వెళ్లిపోయారు. ప్రస్తుతం అక్కడి టెక్సాస్‌లో ఉండి, వైద్యం చేయించుకుంటున్నట్టు తెలుస్తోంది. ప్రభాకర్‌రావు తనపై అరెస్టు వారెంట్ జారీ చేయవద్దంటూ కోర్టులో అఫిడవిట్ దాఖలు చేసిన సమయంలో... తాను వైద్యం కోసం అమెరికా వచ్చానని, షెడ్యూల్ ప్రకారం జూన్ 26న తిరిగి వస్తానని వివరణ ఇచ్చారు. జూలైలో ఈ–మెయిల్ ద్వారా దర్యాప్తు అధికారికి లేఖ రాసిన ఆయన... తనపై తప్పుడు కేసు, నిరాధార ఆరోపణలతో ఏర్పడిన మానసిక వేదన కారణంగా ఆరోగ్యం మరింత క్షీణించిందని, ఇప్పట్లో తిరిగి రాలేనని స్పష్టం చేశారు. అప్పటి నుంచి పోలీసులు ఆయనపై రెడ్ కార్నర్ నోటీసుల జారీ కోసం ప్రయత్నాలు చేస్తూనే.. కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖతోనూ (ఎంఈఏ) సంప్రదింపులు జరుపుతున్నారు.

తొలుత పాస్‌పోర్ట్ ఇంపౌండ్ చేయించి...

రాష్ట్ర పోలీసులు తొలుత రీజనల్ పాస్‌పోర్టు కార్యాలయం (ఆర్‌పీఓ) ద్వారా ప్రభాకర్‌రావు, మరో నిందితుడు శ్రవణ్‌రావుల పాస్‌పోర్టులను ఇంపౌండ్ (సస్పెన్షన్) చేయించారు. ఆపై ప్రభాకర్‌రావు పాస్‌పోర్టును పూర్తిగా రద్దు చేయాలంటూ మరో ప్రతిపాదన పంపారు. ప్రస్తుతం ఆ ఫైల్ విదేశీ వ్యవహారాల శాఖ (ఎంఈఏ) వద్ద పెండింగ్‌లో ఉంది. ప్రభాకర్‌రావు తన న్యాయవాదుల ద్వారా పాస్‌పోర్టు ఇంపౌండ్ చేయడాన్ని ఎంఈఏ జాయింట్ సెక్రటరీ వద్ద సవాల్ చేశారు. ఈ వివాదం పరిష్కారమైతే తప్ప పాస్‌పోర్టు రద్దుపై నిర్ణయం తీసుకోవడానికి ఆస్కారం లేదు. అయితే ఎవరైనా వ్యక్తిపై చార్జ్‌షీట్ దాఖలు కావడం, న్యాయస్థానం తగిన ఆదేశాలు జారీ చేయడం, నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ కావడం జరిగితే.. పాస్‌పోర్టు ఇంపౌండ్, రద్దుకు అవకాశం ఉంటుంది. ప్రభాకర్‌రావు విషయంలో ఈ మూడూ జరిగిన నేపథ్యంలో.. ఆయన పాస్‌పోర్టు త్వరలోనే రద్దవుతుందని పోలీసులు భావిస్తున్నారు.

రద్దయినా ఇప్పట్లో రావడం కష్టమే!

ప్రభాకర్‌రావు పాస్‌పోర్టు రద్దు అయినా ఆ సమాచారం ఎంఈఏ, ఇమిగ్రేషన్ అధికారుల వద్ద మాత్రమే ఉంటుంది. ఆయన అమెరికా నుంచి మరో దేశానికి రాకపోకలు సాగించినా దీని ద్వారా గుర్తించలేరు. కేవలం పాస్‌పోర్టు పేజీలు అయిపోవడం, గడువు తీరిపోవడం, పోగొట్టుకోవడం వంటివి జరిగి.. ఆ దేశంలో ఉన్న భారత రాయబార కార్యాలయానికి వెళ్లినప్పుడు మాత్రమే అధికారులు దాన్ని స్వాధీనం చేసుకుంటారు. ఎమర్జెన్సీ సర్టిఫికెట్ జారీ చేయడం ద్వారా బలవంతంగా భారత్‌కు పంపుతారు. అలా కాకుండా ప్రభాకర్‌రావు తనంతట తానుగా తిరిగి వస్తే.. విమానాశ్రయంలో ఇమిగ్రేషన్ అధికారులు పట్టుకుని పోలీసులకు అప్పగిస్తారు. ప్రభాకర్‌రావును అమెరికా ప్రభుత్వమే తిప్పిపంపాలంటే మాత్రం పాస్‌పోర్టు రద్దు తర్వాత కేంద్ర హోంశాఖ (ఎంహెచ్ఏ) ద్వారా అమెరికా దేశ ఏజెన్సీలను సంప్రదించాల్సి ఉంటుందని నిపుణులు చెప్తున్నారు.

వీసాలో గడువులో మతలబులు ఎన్నో...

కొన్నేళ్లుగా తరచూ అమెరికాకు వెళ్లి వస్తున్న, కుటుంబీకులు అక్కడే ఉంటున్న ప్రభాకర్‌రావు వంటి వారికి సాధారణంగా 10 నుంచి 15 ఏళ్ల గడువుతో కూడిన వీసాలు లభిస్తుంటాయి. అయితే ఒకసారి ఆ దేశంలో అడుగుపెట్టిన తర్వాత గరిష్ఠంగా 180 రోజులలోపు తిరిగి వెళ్లాలనే నిబంధన ఉంది. దీనితో ప్రస్తుతం ఆయన 179 రోజులు అక్కడ ఉండి.. సమీపంలోని కెనడా, లేదా మరో దేశానికి కొన్ని రోజులు వెళ్లి రావొచ్చు. అలా మరో 179 రోజులు అమెరికాలో ఉండొచ్చు. అయితే ప్రభాకర్‌రావు వైద్యం చేయించుకుంటున్న నేపథ్యంలో వీసా గడువు తేలిగ్గా పొడిగించుకునే అవకాశం ఉంటుందనే అభిప్రాయాలు ఉన్నాయి.

ప్రాణం ఉండగానే ప్లాస్టిక్ కవర్‌లో చుట్టి..

- రోడ్డు పక్కన పసికందును పడేసి వెళ్లిన యువకుడు
- చికిత్స పొందుతూ శిశువు మృతి


ప్లాస్టిక్ కవర్‌లో మగ శిశువు

సుభాష్‌నగర్: అప్పుడే పుట్టిన పసికందును ప్రాణం ఉండగానే కవర్లో చుట్టి రోడ్డు పక్కన ఉన్న ఆటోలో పడవేసి వెళ్లిపోయిన విషాదకర సంఘటన సూరారం పరిధిలో చోటుచేసుకుంది. విశ్వకర్మ కాలనీ ప్రధాన రోడ్డులో ఆదివారం తెల్లవారుజామున 3.15 గంటల సమయంలో ఓ యువకుడు సూరారం వైపు నుంచి వచ్చి అప్పుడే పుట్టిన మగ బిడ్డను ప్లాస్టిక్ కవర్లో చుట్టి రోడ్డు పక్కన నిలిపి ఉన్న ఆటోలో పడవేసి వెళ్లిపోయాడు. రోజు మాదిరిగానే ఉదయం 7.53 గంటల సమయంలో ఆటో డ్రైవర్ తన వాహనాన్ని తీసుకెళ్లే ముందు శుభ్రం చేస్తుండగా కవర్ కనిపించింది. అందులో కదలికలు గమనించి విప్పి చూడగా మగ శిశువు కనిపించింది. ఆ విషయం స్థానికులకు చెప్పటంతో బిడ్డను చూసేందుకు చాలామంది గుమికూడారు. వారిలో వనజ తనకు పిల్లలు లేరని, ఆ బిడ్డను పెంచుకొంటానని చెప్పి మల్లారెడ్డి ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆ బాబు మృతి చెందాడు. శిశువును గుర్తు తెలియని వ్యక్తి ఆటోలో వదిలి వెళ్తున్న దృశ్యాలు అక్కడ ఉన్న సీసీ కెమెరాలో నమోదయ్యాయి. ఆ వీడియో ఆధారంగా పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

మొబైల్ కోసం గొడవ.. బాలిక ఆత్మహత్య


మోతె శ్రావ్య (ఫైల్)

కరీంనగర్ క్రైం: సెల్‌ఫోన్ కోసం తమ్ముడితో గొడవ పడిన అక్క ఆత్మహత్య చేసుకున్న ఘటన కరీంనగర్ టూటౌన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గోదాంగడ్డకు చెందిన మోతె శ్రావ్య శనివారం సాయంత్రం తన తమ్ముడితో సెల్‌ఫోన్ కోసం గొడవ పడింది. తమ్ముడు మొబైల్ ఇవ్వకపోవడంతో క్షణికావేశంలో ఇంట్లో ఉన్న ఇనుపపైపునకు చున్నీతో ఉరేసుకుంది. కొన ఊపిరితో ఉన్న శ్రావ్యను తల్లిదండ్రులు ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది.

ఆదిలాబాద్‌కు చేరిన పులి

వేర్వేరు చోట్ల ఎద్దు, ఆవుపై దాడి


చాందూర్‌లో పులి దాడిలో గాయపడిన ఎద్దు

ఉట్నూర్ రూరల్: పులి మళ్లీ ఆదిలాబాద్ జిల్లాలోకి ప్రవేశించింది. నిర్మల్ జిల్లా నుంచి శనివారం రాత్రి ఆదిలాబాద్ జిల్లాలోకి చొరబడింది. ఉట్నూర్, నార్నూర్ మండలాల్లో ఆదివారం పలుచోట్ల కనిపించినట్లు స్థానికులు తెలిపారు. ఉట్నూర్ మండలం చాందూర్ గ్రామ శివారులో రాజుల్‌గూడ గ్రామానికి చెందిన కుమ్ర ఆనంద్‌కు చెందిన ఎద్దుపై దాడి చేసింది. అక్కడి నుంచి నార్నూర్ మండలం జామ్‌డాకు చేరుకుంది. శివారులో మేత మేస్తున్న మందలోని ఒక ఆవుపై దాడి చేయగా కాపరి కేకలు వేశాడు. దీంతో పులి అక్కడి నుంచి జారుకుందని స్థానికులు తెలిపారు. ఆయా ప్రాంతాలను డీఎఫ్‌వో ప్రశాంత్ బాజీరావు పాటిల్ పరిశీలించారు. సమీప గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

రైతులకు ఇబ్బంది కలగొద్దు

కొనుగోలు కేంద్రాల్లో మెరుగైన సౌకర్యాలు: మంత్రి తుమ్మల


సూర్యాపేట మండలం టేకుమట్ల కొనుగోలు కేంద్రంలో రైతుతో మాట్లాడుతున్న వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

సూర్యాపేట : ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అధికారులను వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ఆదేశించారు. ఆదివారం ఖమ్మం నుంచి హైదరాబాద్‌కు వెళ్తూ మార్గమధ్యలో సూర్యాపేట జిల్లా టేకుమట్ల ఐకేపీ కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి ధాన్యం కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి ఐకేపీ కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్ల సమయంలో రైతులకు అన్ని వసతులు కల్పించాలని అక్కడి అధికారులకు సూచించారు.



మహిళలు... మరాఠాలు

మహారాష్ట్ర ఎన్నికల్లో ప్రధానాంశాలు

పార్టీల ప్రచారమంతా వాటి చుట్టే

మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల పోరు చివరి దశకు చేరుకుంది. నేటి సాయంత్రంతో ప్రచారానికి తెర పడనుంది. దాంతో ఓటర్లను ఆకట్టుకునేందుకు అధికార మహాయుతి, విపక్ష ఎంవీఏ కూటములు రెండూ చివరి విడత ప్రయత్నాలను ముమ్మరం చేశాయి. గతంతో పోలిస్తే మహారాష్ట్ర రాజకీయ రంగస్థలం ఈసారి నానారకాలుగా చీలిపోయి కన్పిస్తుండటం విశేషం. ప్రధాన ప్రాంతీయ పార్టీలైన శివసేన, ఎన్సీపీ గత అసెంబ్లీ ఎన్నికల అనంతర పరిణామాల్లో రెండుగా చీలిపోవడం తెలిసిందే. దాంతో ఈ ఎన్నికల్లో సత్తా చాటి తమదే అసలు పార్టీ అని నిరూపించుకునేందుకు షిండే సేన, ఉద్ధవ్ వర్గం; అజిత్ ఎన్సీపీ, శరద్ పవార్ వర్గం తహతహలాడుతున్నాయి. షిండే సేన, అజిత్ ఎన్సీపీ, బీజేపీ అధికార మహాయుతిగా; ఉద్ధవ్ సేన, శరద్ పవార్ ఎన్సీపీ, కాంగ్రెస్ విపక్ష మహా వికాస్ అఘాడీగా మోహరించాయి. ఈ ఎన్నికల్లో రెండు కూటముల భాగ్యరేఖలనూ మహిళా ఓటర్లు, మరాఠా రిజర్వేషన్లే చాలావరకు తేల్చనున్నట్టు రాజకీయ పరిశీలకులు అంచనా వేస్తున్నారు. దాంతో పార్టీల ప్రచారం కూడా చాలావరకు మహిళలు, మరాఠా కోటా చుట్టే కేంద్రీకృతమై సాగింది.

- సాక్షి, నేషనల్ డెస్క్

ఓటింగ్‌లో మహిళల జోరు

మహారాష్ట్రలో పురుషులతో పోలిస్తే మహిళలే చాలా ఎక్కువ సంఖ్యలో ఓటేస్తూ వస్తున్నారు. పలు ఎన్నికలుగా ఇది కొట్టొచ్చినట్టు కన్పిస్తోంది. 2019 అసెంబ్లీ ఎన్నికల్లో కూడా పురుషుల్లో కేవలం 61 శాతం ఓటింగ్ నమోదైతే ఏకంగా 79 శాతం మంది మహిళలు ఓటెత్తారు. దాంతో మహిళా శక్తిపై ఈసారి పార్టీలన్నీ గట్టిగా దృష్టి సారించాయి. మహిళల ఓట్ల కోసం హోరాహోరీ ప్రయత్నాల్లో తలమునకలుగా ఉన్నాయి. ముఖ్యంగా ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా విపక్ష ఎంవీఏ కూటమి జోరు సాగడంతో ఎన్డీఏ సారథి బీజేపీ అప్రమత్తమైంది. అసెంబ్లీ ఎన్నికల్లో ఆ పరిస్థితిని తలకిందులు చేసేందుకు కృతనిశ్చయంతో ఉంది. మహిళలను ఆకట్టుకునేందుకు ఎన్నికల వేళ మహాయుతి సర్కారు పలు పథకాలు, తాయిలాలు ప్రకటించింది. 21-65 ఏళ్ల మధ్య వయసున్న అల్పాదాయ వర్గాల మహిళలకు నెలకు రూ.1,500 అందించే లడ్కీ బహిన్ పథకం అందులో భాగమే. ఇది ఏకంగా సగం మంది మహిళా ఓటర్లను, అంటే దాదాపు 2 కోట్ల పై చిలుకు మందిని తమను అనుకూలంగా మారుస్తుందని బీజేపీ కూటమి ఆశలు పెట్టుకుంది. వారి ఓట్లను గుండుగుత్తగా కొల్లగొడితే అధికారాన్ని సునాయాసంగా నిలుపుకోవచ్చని లెక్కలు వేసుకుంటోంది. దాంతో ఈ పథకానికి విరుగుడుగా ఎంవీఏ కూటమి తమను గెలిపిస్తే నెలకు ఏకంగా రూ.3,000 నేరుగా ఖాతాల్లోకే వేస్తామని మహిళలకు హామీ ఇచ్చింది. దీంతోపాటు మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తామని పేర్కొంది. నిరుద్యోగ యువతకు నెలకు రూ.4,000 అందిస్తామన్న హామీ కూడా యువతుల్లో బాగా పని చేస్తుందని కాంగ్రెస్ ఆశలు పెట్టుకుంది. టేబుల్

మహారాష్ట్రలో మొత్తం ఓటర్లు	9.7 కోట్లు
పురుషులు	4.93 కోట్లు
మహిళలు	4.6 కోట్లు

రెబెల్స్ కాక

తిరుగుబాటు అభ్యర్థులు కూడా పార్టీల విజయావకాశాలను గట్టిగానే దెబ్బ తీసేలా కన్పిస్తున్నారు. ముఖ్యంగా మహాయుతి కూటమికి ఈ సమస్య ఎక్కువగా ఉంది. ఆ కూటమి అభ్యర్థులపై ఏకంగా 69 మంది తిరుగుబాటు అభ్యర్థులు పోటీలో ఉన్నారు. వీరు చీల్చే ఓట్లు చాలాచోట్ల ఫలితాలను తారుమారు చేసి చివరికి తమ అధికారానికే ఎసరు పెడతాయేమోనన్న ఆందోళన మహాయుతి నేతలను వెంటాడుతోంది. ముఖ్యంగా 62 స్థానాలున్న కీలకమైన విదర్భ ప్రాంతంలో చాలా చోట్ల మహాయుతి రెబెల్స్ బరిలో ఉన్నారు. విపక్ష ఎంవీఏ కూటమికి కూడా రెబెల్స్ బెడద తప్పడం లేదు. కాంగ్రెస్ నుంచి ఏకంగా 29 మంది తిరుగుబాటు అభ్యర్థులు బరిలో నిలిచారు. మాట వినకపోవడంతో వారందరినీ పార్టీ సస్పెండ్ చేసింది. వీరికి జంప్ జిలానీలు తోడయ్యారు. మహారాష్ట్రలో గత ఐదేళ్లలో నేతల గోడదూకుళ్లు రికార్డు సృష్టించాయి. ఏ నాయకుడు ఏ పార్టీలో ఉన్నాడో కూడా చెప్పలేని పరిస్థితి! వీళ్లు కూడా ఆయా పార్టీల అవకాశాలను గట్టిగానే దెబ్బ తీసేలా కన్పిస్తున్నారు.

పార్టీ	రెబెల్స్
బీజేపీ	43
శివసేన (షిండే)	12
ఎన్సీపీ (అజిత్)	14
కాంగ్రెస్	29

మరాఠా రిజర్వేషన్లు

ఇక మరాఠా రిజర్వేషన్ల రగడ ఈనాటిది కాదు. విద్యా, ఉపాధి అవకాశాల్లో తాము వెనకబడి ఉన్నామని, నిర్లక్ష్యానికి గురవుతున్నామని వారిలో ఎప్పటినుంచో అసంతృప్తి గూడుకట్టుకుని ఉంది. వారి హక్కుల సాధనకు మరాఠా నేత మనోజ్ జరంగే పాటిల్ చేస్తున్న ఆందోళనకు కొన్నేళ్లుగా అపూర్వ ఆదరణ దక్కుతోంది. రాష్ట్ర జనాభాలో మరాఠాలు ఏకంగా 31 శాతానికి పైగా ఉన్నారు. దాంతో పార్టీలన్నీ అప్రమత్తమయ్యాయి. కీలకమైన మరాఠా ఓటు బ్యాంకును ప్రసన్నం చేసుకునే ప్రయత్నాల్లో పడ్డాయి. ఓబీసీ కోటా నుంచి మరాఠాలను మినహాయించడంపై తమను జరంగే తీవ్రంగా దుయ్యబడుతుండటం బీజేపీకి మింగుడుపడటం లేదు. మరాఠాలకు అన్యాయం జరగనిచ్చే ప్రసక్తే లేదని మహాయుతి కూటమి నేతలు, అభ్యర్థులు పదేపదే చెబుతున్నా ఆ సామాజిక వర్గం నుంచి వారికి పెద్దగా సానుకూల స్పందన కన్పించడం లేదు. దాంతో ఓబీసీలు, గిరిజన సామాజిక వర్గాల ఓట్లపై మహాయుతి కూటమి గట్టిగా దృష్టి సారించింది. వారికోసం కార్పొరేషన్ల ఏర్పాటుతో పాటు పలు వాగ్దానాలు చేసింది.

రైతులు, నిరుద్యోగం

వీటికి తోడు రైతుల అసంతృప్తి మరో ప్రధాన ఎన్నికల అంశంగా కన్పిస్తోంది. ఇటీవలి అకాల వర్షాలు రాష్ట్రంలో సాగుపై తీవ్ర ప్రభావం చూపాయి. ప్రభుత్వం ఆదుకుంటుందని భావించిన రైతులకు నిరాశే ఎదురైంది. దాంతో షిండే సర్కారుపై వారంతా గుర్రుగా ఉన్నారు. దీనికి తోడు ఎగుమతులపై నిషేధం ఉల్లి రైతులను బాగా దెబ్బ తీసింది. ఇవన్నీ తన పుట్టి ముంచేలా కన్పిస్తుండటంతో దాంతో రైతులను ఆకట్టుకునేందుకు మహాయుతి సర్కారు ఆపసోపాలు పడుతోంది. పంట రుణాల మాఫీ వంటి పలు హామీలు గుప్పించింది. ఇక మహారాష్ట్రలో ప్రబలంగా ఉన్న మరో సమస్య నిరుద్యోగం. దీనికి తోడు మహారాష్ట్రకు కేటాయించిన పలు భారీ ప్రాజెక్టులు వరుసగా ప్రధాని నరేంద్ర మోదీ స్వరాష్ట్రం గుజరాత్‌కు తరలుతున్న వైనం ప్రజల్లో తీవ్ర అసంతృప్తికి దారి తీస్తోంది.



డెన్మార్క్ యువతికి విశ్వసుందరి కిరీటం

న్యూఢిల్లీ: విశ్వసుందరి-2024 పోటీలో డెన్మార్క్ యువతి విక్టోరియా కెజార్ హెల్విగ్ విజేతగా నిలిచింది. మిస్ యూనివర్స్ కిరీటం సొంతం చేసుకుంది. డెన్మార్క్ భామ విశ్వసుందరిగా నెగ్గడం ఇదే మొట్టమొదటిసారి కావడం విశేషం. 73వ మిస్ యూనివర్స్ పోటీ మెక్సికో రాజధాని మెక్సికో సిటీలో శనివారం రాత్రి జరిగింది. 120కిపైగా దేశాల నుంచి అందాల సుందరీమణులు పాల్గొన్నారు. విక్టోరియా మొదటిస్థానంలో నిలిచింది. మిస్ నైజీరియా చిడీమా అడెట్షినా రెండో స్థానంలో, మిస్ మెక్సికో మారియా ఫెర్నాండా బెల్ట్రాన్ మూడో స్థానంలో నిలిచారు. 2023లో మిస్ యూనివర్స్‌గా విజయం సాధించిన నికరాగ్వా సుందరి షెన్నిస్ పాలాసియో 2024గాను మిస్ యూనివర్స్‌గా నెగ్గిన విక్టోరియాకు లాంఛనంగా కిరీటం అలంకరించారు. ''నూతన శకం ఆరంభమైంది. 73వ విశ్వసుందరిగా అవతరించినందుకు మీకు అభినందనలు. ప్రపంచవ్యాప్తంగా మహిళల్లో స్ఫూర్తి నింపేలా మీ ప్రయాణం ముందుకు సాగాలని కోరుకుంటున్నాం'' అని ఇన్‌స్టాగామ్‌లో మిస్ యూనివర్స్ పోటీల నిర్వాహక బృందం పోస్టు చేసింది. 21 ఏళ్ల విక్టోరియా వజ్రాలు విక్రయించే సంస్థలో పని చేస్తున్నారు. జంతువుల రక్షణ కోసం పోరాడుతున్నారు. మరోవైపు మిస్ యూనివర్స్ పోటలో భారత్ తరఫున రియా సింఘా పాలుపంచుకున్నారు. టాప్-30 సెమీఫైనలిస్టుల జాబితాలో స్థానం సంపాదించారు. పోటీలో తుదివరకూ నిలవలేకపోయారు. మెక్సికోలో మిస్ యూనివర్స్ పోటీ జరగడం ఇదే మూడోసారి. బెలారస్, ఎరిత్రియా, గినియా, మకావు, మాల్దీవ్స్, మాల్డోవా, ఉజ్బెకిస్తాన్ దేశాలు తొలిసారిగా పోటీలో పాల్గొన్నాయి.

షేక్ హసీనాను అప్పగించాలని భారత్‌ను కోరుతాం: యూనస్

ఢాకా: మాజీ ప్రధానమంత్రి షేక్ హసీనాను అప్పగించాలని భారత్‌ను కోరుతామని బంగ్లాదేశ్ మధ్యంతర ప్రభుత్వ చీఫ్ అడ్వైజర్ మొహమ్మద్ యూనస్ చెప్పారు. మధ్యంతర ప్రభుత్వానికి 100 రోజులు పూర్తయిన సందర్భంగా ఆయన ఆదివారం బంగ్లాదేశ్ ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. దేశంలో మైనార్టీలతో సహా అన్ని వర్గాల ప్రజలకు తగిన భద్రత కల్పించడానికి పటిష్టమైన చర్యలు చేపట్టామని తెలిపారు. బంగ్లాదేశ్‌లో కొన్ని నెలల క్రితం జరిగిన హత్యల విషయంలో సమాచారం సేకరిస్తున్నామని, దోషులకు శిక్ష పడాల్సిందేనని తేల్చిచెప్పారు. విద్యార్థులు తదితరుల తిరుగుబాటు నేపథ్యంలో హసీనా ఉన్నపళంగా దేశం వీడటం, కొద్ది నెలలుగా భారత్‌లో ఆశ్రయం పొందుతుండటం తెలిసిందే. ఆ అల్లర్లలో పలువురు మృతి చెందడానికి కారకురాలంటూ హసీనాపై మధ్యంతర ప్రభుత్వం పలు అభియోగాలు మోపింది. వాటిపై విచారణకు వీలుగా హసీనాను అప్పగించాలని బంగ్లా కొంతకాలంగా భారత్‌ను కోరుతూ వస్తోంది.



నటి కస్తూరికి రిమాండ్

సాక్షి, చెన్నై: తెలుగువారిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేసులో సినీ నటి కస్తూరికి ఈనెల 29 వరకు రిమాండ్ విధిస్తూ చెన్నై ఎగ్మూర్ కోర్టు ఆదివారం ఆదేశాలిచ్చింది. దాంతో ఆమెను చెన్నై శివారులోని పుళల్ కేంద్ర కారాగారానికి తరలించారు. తెలుగు వారిని, మహిళలను కించపరిలా అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ కస్తూరిపై తమిళనాడులో ఆరు కేసులు నమోదయ్యాయి. దాంతో కొద్ది రోజులుగా అజ్ఞాతంలో ఉన్న ఆమెను హైదరాబాద్‌లో శనివారం రాత్రి అరెస్టు చేశారు. అక్కడి నుంచి ఆదివారం ఉదయాన్నే చెన్నై తీసుకొచ్చారు. చింతాద్రిపేట పోలీసుస్టేషన్‌లో విచారణ అనంతరం ఎగ్మూర్ కోర్టు న్యాయమూర్తి రఘుపతి రాజ ముందు హాజరు పరిచారు. రిమాండ్ విధించడంతో భద్రత నడుమ కారాగారానికి తరలించారు.

నైజీరియాతో భాగస్వామ్యానికి అత్యధిక ప్రాధాన్యం: మోదీ

నైజీరియా అధ్యక్షునితో భేటీ • ద్వైపాక్షిక సంబంధాల బలోపేతానికి నిర్ణయం • ఉగ్రవాదం, వేర్పాటువాదం, డ్రగ్స్‌పై ఉమ్మడి పోరు

అబూజా: నైజీరియాతో వ్యూహాత్మక భాగస్వామ్యానికి భారత్ అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని ప్రధాని నరేంద్ర మోదీ చెప్పారు. మూడు దేశాల పర్యటనలో భాగంగా ఆయన ఆదివారం ఉదయం నైజీరియా చేరుకున్నారు. భారత ప్రధాని నైజీరియాలో పర్యటిస్తుండడం 17 ఏళ్ల తర్వాత ఇదే మొదటిసారి. నైజీరియా అధ్యక్షుడు బోలా అహ్మద్ తినూబుతో మోదీ సమావేశమయ్యారు. ప్రతినిధుల స్థాయిలో ఈ చర్చలు జరిగాయి. భారత్-నైజీరియా మధ్య రక్షణ, వాణిజ్యం, ఇంధనం వంటి కీలక రంగాల్లో సంబంధాల బలోపేతమే లక్ష్యంగా చర్చలు జరిగాయి. ఉగ్రవాదం, పైరసీ, రాడికలైజేషన్‌పై ఉమ్మడి పోరాటం సాగించాలని నేతలు నిర్ణయించారు. గ్లోబల్ సౌత్ ఆకాంక్షలు నెరవేర్చే దిశగా కలిసికట్టుగా పనిచేయాలని తీర్మానించుకున్నారు. వ్యవసాయం, రవాణా, చౌక ఔషధాలు, పునరుత్పాదక ఇంధన వనరులు, డిజిటలీకరణ తదితరాల్లో తమ అనుభవాన్ని నైజీరియాతో పంచుకోవడానికి సిద్ధమని మోదీ తెలిపారు. ఉగ్రవాదం, వేర్పాటువాదం, పైరసీ, మాదక ద్రవ్యాల అక్రమ రవాణా వంటి సవాళ్లను ఎదుర్కోవడానికి ఉమ్మడిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. భారత్ అందిస్తున్న అభివృద్ధి సహకార భాగస్వామ్యాన్ని తినూబు ప్రశంసించారు.

మూడు ఒప్పందాలపై సంతకాలు

మోదీ, తినూబు భేటీ సందర్భంగా భారత్, నైజీరియా మధ్య మూడు అవగాహన ఒప్పందాలు కుదిరాయి. సాంస్కృతిక మార్పిడి, కస్టమ్స్ విభాగంలో సహకారం, సర్వే రంగంలో సహకారం కోసం ఒప్పందాలపై ఇరు పక్షాలు సంతకాలు చేశాయి. నైజీరియా అధ్యక్షుడితో ఫలవంతమైన చర్చలు జరిగాయని మోదీ ఎక్స్‌లో పోస్టు చేశారు. రెండు దేశాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత ముందుకు తీసుకెళ్లడంపై సంప్రదింపులు జరిపామని పేర్కొన్నారు. ''నైజీరియాలో 60 వేల మంది భారతీయులున్నారు. రెండు దేశాల మధ్య సంబంధాలకు వారు పునాదిరాయిగా నిలుస్తున్నారు. భారతీయుల రక్షణకు చర్యలు చేపడుతున్నందుకు నైజీరియా అధ్యక్షుడికి కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం నైజీరియా నుంచి మోదీ బ్రెజిల్ చేరుకున్నారు. అక్కడ జీ20 సదస్సులో పాల్గొంటారు. తర్వాత గయానాలో పర్యటిస్తారు.

మోదీకి అవార్డు ప్రదానం చేస్తున్న నైజీరియా అధ్యక్షుడు తినూబు



మోదీకి నైజీరియా అత్యున్నత పురస్కారం

భారత ప్రధాని నరేంద్ర మోదీ నైజీరియా రెండో అత్యున్నత జాతీయ పురస్కారం అందుకున్నారు. 'ద గ్రాండ్ కమాండర్ ఆఫ్ ద ఆర్డర్ ఆఫ్ ద నైజీరియా'ను అధ్యక్షుడు తినూబు చేతుల మీదుగా స్వీకరించారు. బ్రిటన్ రాణి దివంగత ఎలిజబెత్ తర్వాత ఈ పురస్కారం అందుకున్న రెండో విదేశీ నేత మోదీ. ఇది ఆయనకు 17వ అంతర్జాతీయ అవార్డు. ''ఇది గొప్ప గౌరవంగా భావిస్తున్నా. ఈ అవార్డును 140 కోట్ల మంది భారతీయులకు, భారత్-నైజీరియా స్నేహానికి అంకితం చేస్తున్నా'' అని మోదీ తెలిపారు.

హైపర్ సోనిక్ పరీక్ష సక్సెస్

చరిత్రాత్మక ఘట్టం: రాజ్‌నాథ్ సింగ్



న్యూఢిల్లీ: భారత సైనిక దళాల్లో మరో కీలక అస్త్రం చేరింది. ఒడిశా తీరంలోని ఏపీజే అబ్దుల్ కలాం దీవిలో దీర్ఘశ్రేణి హైపర్‌సోనిక్ క్షిపణిని విజయంతంగా పరీక్షించారు. గగనతల రక్షణ వ్యవస్థలకు చిక్కకుండా అత్యధిక వేగంతో దూసుకెళ్లి, శత్రువుల స్థావరాలను ధ్వంసం చేయడం ఈ క్షిపణి ప్రత్యేకత. ప్రపంచవ్యాప్తంగా ఈ తరహా మిస్సైల్ కలిగి ఉన్న అతికొద్ది దేశాల జాబితాలో భారత్ చేరింది. ఈ పరీక్షను చరిత్రాత్మక ఘట్టంగా రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అభివర్ణించారు. క్రిటికల్, అడ్వాన్స్‌డ్ మిలటరీ టెక్నాలజీ కలిగిన దేశాల సరసన చేరామంటూ హర్షం వ్యక్తంచేశారు. అత్యాధునిక ఆయుధాలు సమకూర్చుకునే విషయంలో కీలక మైలురాయిని అధిగమించామని పేర్కొంటూ ఆయన 'ఎక్స్'లో పోస్టుచేశారు. అద్భుతమైన ఘనత సాధించామని ఉద్ఘాటించారు. డీఆర్‌డీఓతోపాటు సైనిక దళాలకు ఆయన అభినందనలు తెలియజేశారు.

ప్రత్యేకతలేమిటి?

- దీర్ఘశ్రేణి హైపర్‌సోనిక్ క్షిపణిని హైదరాబాద్‌లోని డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం మిస్సైల్ కాంప్లెక్స్‌లో దేశీయ పరిజ్ఞానంతో అభివృద్ధి చేశారు. రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ(డీఆర్‌డీఓ)తోపాటు పలు ప్రభుత్వం, ప్రైవేట్ రంగ సంస్థలు సహకారం అందించాయి. ఇది వివిధ రకాల పేలోడ్స్‌ను 1,500 కిలోమీటర్లకు పైగా దూరానికి మోసుకెళ్లగలదు. ప్రయాణం మధ్యలో దిశను మార్చుకోగలదు.
- సాధారణంగా హైపర్‌సానిక్ మిస్సైల్స్ పేలుడు పదార్థాలు లేదా అణు వార్‌హెడ్లను మోసుకెళ్తాయి. ధ్వని వేగం కంటే ఐదు రెట్లు అధిక వేగంతో దూసుకెళ్తాయి. అంటే గంటకు 1,220 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తాయి.
- కొన్ని అడ్వాన్స్‌డ్ హైపర్‌సోనిక్ మిస్సైల్స్ ధ్వని వేగం కంటే 15 రెట్లు వేగంతో ప్రయాణిస్తాయి.
- ప్రస్తుతం రష్యా, చైనా దేశాలు హైపర్‌సోనిక్ క్షిపణుల అభివృద్ధిలో ముందంజలో ఉన్నాయి. ఫ్రాన్స్, జర్మనీ, ఆస్ట్రేలియా, జపాన్, ఇరాన్, ఇజ్రాయెల్ తదితర దేశాలు సైతం ఈ తరహా క్షిపణుల అభివృద్ధిపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాయి.
- చైనా సరిహద్దుల్లో తరచూ ఉద్రిక్తతలు చోటుచేసుకుంటున్న నేపథ్యంలో అత్యాధునిక సైనిక శక్తిని బలోపేతం చేసుకోవాలని ఇండియా నిర్ణయించుకుంది. ఇందులో భాగంగా మొట్టమొదటి దీర్ఘశ్రేణి హైపర్‌సోనిక్ క్షిపణిని పరీక్షించింది.
- తదుపరి తరం ఆయుధ వ్యవస్థలు, డ్రోన్లు, కృత్రిమ మేధ(ఏఐ)తో పని చేసే ఆయుధాలు, పరికరాల అభివృద్ధికి భారత్ ప్రాధాన్యం ఇస్తోంది.
- పృథ్వీ, ఆకాశ్, అగ్ని తదితర క్షిపణులను డీఆర్‌డీఓ గతంలో అభివృద్ధి చేసిన సంగతి తెలిసిందే.


అమెరికా ఇంధన మంత్రిగా క్రిస్ రైట్



వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైన డొనాల్డ్ ట్రంప్ తన మంత్రివర్గాన్ని, అధికార యంత్రాంగాన్ని ఏర్పాటు చేసుకొని పనిలో నిమగ్నమయ్యారు. అమెరికా ఇంధన శాఖ మంత్రిగా క్రిస్ రైట్‌ను నియమిస్తూ తాజాగా నిర్ణయం తీసుకున్నారు. ట్రంప్‌నకు క్రిస్ రైట్ భారీగా విరాళాలు అందజేశారు. ఆయన ప్రచారానికి సహకరించారు. డెన్వర్‌లోని లిబర్టీ ఎనర్జీ అనే సంస్థకు క్రిస్ రైట్ సీఈఓగా పని చేస్తున్నారు. శిలాజ ఇంధనాల వాడకాన్ని ఆయన ప్రోత్సహిస్తుంటారు. చమురు, గ్యాస్ ఉత్పత్తికి గట్టి మద్దతుదారుడు. వాతావరణ మార్పులకు వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటాలను ఆయన వ్యతిరేకిస్తున్నారు. కాలుష్యాన్ని కట్టడి చేయడానికి ప్రపంచమంతా శిలాజేతర ఇంధన వనరుల వైపు పరుగులు తీస్తుండగా, ట్రంప్ మాత్రం శిలాజ ఇంధనాలకే ప్రాధాన్యం ఇస్తుండడం గమనార్హం. ఇంధన మంత్రిగా క్రిస్‌రైట్‌ను నియమించడంతో అమెరికా శిలాజ ఇంధనాల వాడకం మరింత పెరుగుతుందనడంలో సందేహం లేదు. పేదలను పేదరికం నుంచి బయటకు తీసుకురావాలంటే శిలాజ ఇంధనాల వాడకం మరింత పెరగాలని క్రిస్ రైట్ వాదిస్తున్నారు. ఆయన గతంలో ప్రభుత్వానికి లేఖ రాశారు. ప్రభుత్వంలో పని చేసిన అనుభవం ఆయనకు లేదు. క్రిస్ రైట్‌ను ఇంధన శాఖ మంత్రిగా ట్రంప్ నియమించడం వెనుక అమెరికాలోని చమురు లాబీ ఒత్తిళ్లు ఉన్నట్లు తెలుస్తోంది.

ఆప్‌కు, మంత్రి పదవికి గహ్లోత్ రాజీనామా

న్యూఢిల్లీ: మరికొన్ని రోజుల్లో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న తరుణంలో ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్)కి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. సీనియర్ నాయకుడు, ఢిల్లీ రవాణా శాఖ మంత్రి కైలాశ్ గహ్లోత్ ఆదివారం ఆ పార్టీకి, మంత్రిపదవికి రాజీనామా చేశారు. ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయడంలేదని, ప్రజా సంక్షేమంపై దృష్టి పెట్టడం లేదని, రాజకీయ ఆకాంక్షలదే పైచేయిగా మారుతోందని కైలాశ్ గహ్లోత్ ఆరోపించారు. తన రాజీనామా లేఖను పార్టీ జాతీయ కన్వీనర్, మజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు పంపించారు. ''ప్రజల హక్కుల పరిరక్షణ కోసం పోరాటం చేయడానికి బదులుగా మనం సొంత రాజకీయ అజెండా కోసం పోరాడుతున్నాం. సొంత ప్రయోజనాల కోసం ఆరాటపడే ధోరణి నానాటికీ పెరుగుతోంది'' అని లేఖలో ఆక్షేపించారు. కేజ్రీవాల్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఖరీదైన భవంతిని నిర్మించుకోవడాన్ని ఆయన తప్పుపట్టారు. మన పార్టీ నిజంగా సామాన్య ప్రజల సంక్షేమం కోసమే కృషి చేస్తోందా? అనేదానిపై ప్రజల్లో అనుమానాలు ఉన్నాయని చెప్పారు. మంత్రి పదవికి కైలాశ్ గహ్లోత్ చేసిన రాజీనామాను ఢిల్లీ ముఖ్యమంత్రి అతిశీ ఆమోదించారు. ఆప్‌లో ప్రముఖ నాయకుడైన కైలాశ్ రాజీనామా చేయడంతో ఆ పార్టీకి అసెంబ్లీ ఎన్నికల్లో ప్రతికూలంగా మారుతుందని పరిశీలకులు అంచనా వేస్తున్నారు.



బీజేపీ కుట్ర: సంజయ్ సింగ్

గహ్లోత్ రాజీనామాపై ఆప్ రాజ్యాసభ సభ్యుడు సంజయ్ సింగ్ స్పందించారు. ఆయన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ), ఆదాయపు పన్ను శాఖ విచారణను ఎదుర్కొంటున్నారని, బీజేపీలో చేరడం తప్ప మరో దారి లేదని చెప్పారు. కైలాశ్ రాజీనామా బీజేపీ నీచ రాజకీయ కుట్రకు నిదర్శనమని మండిపడ్డారు. ఐదేళ్లపాటు మంత్రి పదవి అనుభవించి, ఇప్పుడు రాజకీయ లబ్ధి కోసం బీజేపీలో చేరడానికి సిద్ధపడ్డారని విమర్శించారు. అయితే ఆప్ చీఫ్ కేజ్రీవాల్ విధానాలు నచ్చకే నేతలు పార్టీని వీడుతున్నారని బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి షెహజాద్ పూనావాలా పేర్కొన్నారు. ఆ పార్టీ ఇప్పుడు కేజ్రీవాల్ ప్రయోజనాల కోసమే పనిచేసే సంస్థగా మారిపోయిందన్నారు. ఆప్ ధనవంతుల పార్టీగా రాజకీయ రూపాంతరం చెందిందని అన్నారు. గహ్లోత్ నిర్ణయాన్ని ఢిల్లీ బీజేపీ అధ్యక్షుడు వీరేంద్ర సచ్‌దేవా స్వాగతించారు.

ప్రాజెక్టుల తరలింపుతో మహారాష్ట్రకు తీవ్ర అన్యాయం

కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంకగాంధీ

ముంబై: మహారాష్ట్రకు దక్కాల్సిన కీలక ప్రాజెక్టులను కుట్రలతో గుజరాత్‌కు తరలించారని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంకగాంధీ వాద్రా ఆరోపించారు. ప్రాజెక్టులు తరలిపోవడంతో మహారాష్ట్రకు తీవ్ర అన్యాయం జరిగిందని, యువతకు ఉద్యోగాలు రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఫాక్స్‌కాన్, ఎయిర్‌బస్ వంటి పెద్ద సంస్థలు గుజరాత్‌కు వెళ్లిపోయాయని గుర్తుచేశారు. ఉద్యోగాలు, ఉపాధి లేకపోవడంతో ప్రజలు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని వాపోయారు. ఆదివారం మహారాష్ట్రలోని గడ్చిరోలీ జిల్లాలో ఎన్నికల ప్రచార సభలో ప్రియాంక మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ విధానాలు మహారాష్ట్రకు అన్యాయం చేసేలా ఉంటున్నాయని విమర్శించారు. రాష్ట్రంలో మహా వికాస్ అఘాడీ(ఎంవీఏ) అధికారంలోకి వస్తే సోయాబీన్ పంటకు క్వింటాల్‌కు రూ.7 వేల చొప్పున చెల్లిస్తామని హామీ ఇచ్చారు. దేశంలో నేడు అదానీ మాత్రమే సురక్షితంగా ఉన్నారని నిధులన్నీ ఆయన జేబుల్లోకే చేరుతున్నాయని మండిపడ్డారు.

రెండో రోజూ ఎదురు కాల్పులు

చర్ల: ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణపూర్, కాంకేర్ జిల్లాల సరిహద్దులో నార్త్ అబూజ్‌మడ్ పరిసరాల్లో ఆదివారం కూడా ఎదురుకాల్పులు కొనసాగాయి. రెండు జిల్లాల సరిహద్దుల్లోని అటవీ ప్రాంతంలో మావోయిస్టులు, పోలీసులకు మధ్య శనివారం జరిగిన ఎదురు కాల్పుల్లో ఐదుగురు మావోయిస్టులు మృతి చెందడం తెలిసిందే. పలువురు మావోయిస్టులు దాడి నుంచి తప్పించుకున్నట్టు పోలీసులు భావిస్తున్నారు. వారికోసం కూంబింగ్ చేస్తుండగా ఆదివారం కూడా మరోసారి ఎదురుకాల్పులు జరిగాయని పోలీసులు తెలిపారు.


సాక్షి హైదరాబాద్

సోమవారం ı 18 ı నవంబర్ ı 2024



నడిరోడ్డుపై హంగామా

చార్మినార్ ఆర్టీసీ బస్టాప్ రోడ్డులో ఇద్దరు ఆటో డ్రైవర్లు ఆదివారం సాయంత్రం హంగామా చేశారు. గంజాయి మత్తులో కర్రలతో దాడులకు పాల్పడి న్యూసెన్స్ సృష్టించారు. -8లో



ఇంపైన ఆర్ట్.. 'ఇకెబనా'

ప్రపంచంలోని అద్భుతమైన ప్రకృతిని కళ్లకు కట్టినట్లు చూపించే ఇకెబనా కళకు హైదరాబాద్‌లో విశేష ఆదరణ లభిస్తోంది. జపాన్‌కు చెందిన ఈ కళ ట్రెండ్‌గా మారుతోంది. - సిటీప్లస్‌లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం
31.0/19.0

నగరంలో సోమవారం ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఉదయం పొగమంచు కురుస్తుంది. సాయంత్రం చల్లని గాలులు వీచే అవకాశం ఉంది.







'ప్రీమిథాన్'.. మారథాన్

నెలలు నిండక ముందే జన్మించే శిశువుల సంరక్షణ, వారికి నాణ్యమైన వైద్య సేవలపై అవగాహన కల్పించేందుకు ఓ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని టీవర్క్స్ వేదికగా 'ప్రీమిథాన్-2024' పేరిట మినీ మారథాన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా 5కె, 10కె రన్‌లలో పెద్ద సంఖ్యలో ఔత్సాహికులు పాల్గొన్నారు. అంతకు ముందు 'ది హోప్ రన్' పేరిట నిర్వహించిన 3 ఆర్‌డీ ఎడిషన్ మినీ మారథాన్‌ను రాష్ట్ర ఐటీ శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్‌రంజన్ బ్రిటీష్ డిప్యూటీ హై కమిషనర్ గారెత్‌వెన్ ఓవెన్, టీ వర్క్స్ సీఈఓ జోగిందర్, రెయిన్‌బో చిల్డ్రన్స్ ఆస్పత్రుల సీఎండీ డాక్టర్ రమేష్ కంచర్ల తదితరులతో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. టీ వర్క్స్ వద్ద ప్రారంభమైన ఈ మినీ మారథాన్ మైండ్‌స్పేస్ మీదుగా హైటెక్‌సిటీ వరకు సాగింది. మహిళలు, వృద్ధులు, చిన్నారులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. - రాయదుర్గం

ధ్రువీకరణ పత్రాల కోసం తిప్పలు!

కులగణన సర్వేలో రెవెన్యూ సిబ్బంది బిజీబిజీ

- కుల, ఆదాయ, ఈడబ్ల్యూఎస్ ధ్రువీకరణ పత్రాలకు పెరిగిన తాకిడి
- మీసేవ, తహసీల్ ఆఫీసుల చుట్టూ విద్యార్థుల ప్రదక్షిణలు
- సమీపిస్తున్న పలు పోటీ, అర్హత పరీక్షల దరఖాస్తు గడువు
- అమలుకాని సిటిజన్ చార్టర్.. పని ఒత్తిడి పేరుతో కాలయాపన

సాక్షి, సిటీబ్యూరో: మొన్నటి వరకు మూసీ సర్వే...ఆ తర్వాత కుల గణన సర్వేలో రెవెన్యూ సిబ్బంది బిజీబిజీగా మారడంతో విద్యార్థులకు కుల, ఆదాయ, ఈడబ్ల్యూఎస్ ధ్రువీకరణ పత్రాలకు తిప్పలు తప్పడం లేదు. పలు అర్హత, పోటీ పరీక్షల గడువు సమీపిస్తున్నా... సకాలంలో ధ్రువీకరణ పత్రాలు అందకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మీ సేవలో చేసుకున్న దరఖాస్తు పత్రాలకు సంబంధించి రశీదులు తీసుకొని తహసీల్దార్ ఆఫీసుల చుట్టూ చక్కర్లు కొడుతున్నా ఫలితం లేకుండా పోతోంది. నిర్ణీత గడువులోగా పత్రాలు అందక ఇబ్బందులు పడుతున్నారు. తాజాగా జేఈఈ మెయిన్స్-2025 పరీక్షకు ఈ నెల 21తో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే గడువు ముగుస్తుండటంతో ఆదాయ, కుల, ఈడబ్ల్యూఎస్ ధ్రువీకరణ పత్రాల కోసం దరఖాస్తులు చేసుకున్న అభ్యర్థులు ఆందోళనకు గురవుతున్నారు. రెవెన్యూ సిబ్బంది సర్వేలో నిమగ్నమైన కారణంగా ధ్రువీకరణ పత్రాల ఆమోదంలో తీవ్ర జాప్యం జరుగుతుందనే ఆరోపణలు సర్వత్రా వినవస్తున్నాయి.



పైరవీకారులకు పెద్దపీట

సాధారణ పౌరులను రోజుల తరబడి తిప్పించుకుంటున్న అధికారులు.. పైరవీకారులకు మాత్రం పెద్దపీట వేస్తున్నారనే ఆరోపణలు లేకపోలేదు. మీ సేవలో దరఖాస్తు చేసుకున్న తర్వాత రశీదును పట్టుకుని పైరవీకారుడి వద్దకు వెళ్లి ఎంతో కొంత డబ్బులు చెల్లిస్తే కేవలం 24 గంటల వ్యవధిలో ఆయా సర్టిఫికెట్లు ఆన్‌లైన్‌లో జారీ అవుతున్నట్లు ఆరోపణలున్నాయి. అదే డబ్బులు చెల్లించని సాధారణ ప్రజలకు మాత్రం రోజుల సమయం పడుతున్న పరిస్థితి కనిపిస్తోంది. అయితే సర్టిఫికెట్ల జారీలో అలసత్వంపై ప్రశ్నిస్తే వివిధ పనుల ఒత్తిడి అంటున్న అధికారులు అదే పైరవీకారులు సిఫార్సు చేసే వాటికి మాత్రం ఎక్కడ ఉన్నా మరీ తెప్పించుకొని విచారణ నివేదిక సమర్పించడం పరిపాటిగా తయారైంది.

సిటిజన్ చార్టర్ అమలేది..?

మీ సేవలో దరఖాస్తు చేసుకున్న వివిధ రకాల సర్టిఫికెట్లను నిర్ణీత గడువులోగా జారీ చేయాలని సిటిజన్ చార్టర్ స్పష్టం చేస్తోంది. ఉదాహరణకు ఇన్‌కం సర్టిఫికెట్ ఏడు రోజుల్లోగా ఇవ్వాలని, కులం, నివాస ధ్రువీకరణ పత్రాలను పక్షం రోజుల్లోగా, నాన్ క్రిమిలేయర్ తదితర సర్టిఫికెట్లను 30 రోజుల్లోగా క్షేత్రస్థాయిలో పరిశీలించి జారీ చేయాల్సి ఉంటుంది. వీటితోపాటు మరికొన్నింటిని కూడా నిర్ణీత కాలవ్యవధిలో ఇవ్వాలనే నిబంధనలున్నాయి. అయితే ఎక్కడ తహసీల్ ఆఫీసుల్లో కూడా సిటిజన్ చార్టరు అమలవుతున్న పరిస్థితి కనిపించడంలేదు.



- 'సోనీ జింజర్ గార్లిక్ పేస్ట్' పేరుతో నగరంలో సరఫరా
- గుట్టురట్టు చేసిన నార్త్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు
- ఎనిమిది మంది అరెస్టు, భారీగా నకిలీ సరుకు స్వాధీనం

ఆరోగ్యం అల్లంత దూరం!

రసాయనాలతో అల్లం-వెల్లుల్లి మిశ్రమం తయారీ

సాక్షి, సిటీబ్యూరో: సాధారణంగా మార్కెట్‌లో లభించే జింజర్-గార్లిక్ పేస్ట్‌లో ఏముంటాయి? అని అడిగితే... అల్లం-వెల్లుల్లి అంటూ ఠక్కున చెప్పేస్తాం. అయితే ఓల్డ్ బోయిన్‌పల్లికి చెందిన షకీల్ మాత్రం వెల్లుల్లికి రసాయనాలు జోడించి ఈ మిశ్రమాన్ని తయారు చేస్తున్నాడు. కొన్నేళ్లుగా నగరంలోని ప్రధాన హోటళ్లు, రెస్టారెంట్లకు సరఫరా చేస్తూ ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతున్నాడు. దీనిపై సమాచారం అందుకున్న ఉత్తర మండల టాస్క్‌ఫోర్స్ అధికారులు ఆదివారం దాడి చేశారు. ఆరుగురిని అరెస్టు చేసి భారీగా రసాయనాలు, నకిలీ అల్లం-వెల్లుల్లి పేస్ట్ స్వాధీనం చేసుకున్నట్లు డీసీపీ వైవీఎస్ సుధీంద్ర తెలిపారు.

బోయిన్‌పల్లి కేంద్రంగా ఐదేళ్లుగా దందా...

ఓల్డ్ బోయిన్‌పల్లిలోని రాజరాజేశ్వరి నగర్ ప్రాంతానికి చెందిన మహ్మద్ షకీల్ అహ్మద్ దాదాపు ఐదేళ్లుగా అల్లం-వెల్లుల్లి తయారీ కార్ఖానా నిర్వహిస్తున్నాడు. ఇందులో మహ్మద్ సమీర్ అన్సారీ మేనేజర్‌గా, మహ్మద్ గులఫ్రజర్ డిస్ట్రిబ్యూటర్‌గా, మహ్మద్ ముస్తార్ అసిస్టెంట్ మేనేజర్‌గా, రంజిత్ కుమార్, మోను కుమార్, బిర్వాల్ షా, ఇనాయత్, మహేష్ కుమార్ కార్మికులుగా పని చేస్తున్నారు. ఈ మిశ్రమాన్ని 'సోనీ జింజర్ అండ్ గార్లిక్ పేస్ట్' అనే బ్రాండ్ పేరుతో విక్రయిస్తున్నారు. కొన్నాళ్లు సజావుగానే వ్యాపారం చేసినప్పటికీ మార్కెట్‌లో పెరిగిన ముడి సరుకు ధరలతో తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు పొందాలని తప్పుడు మార్గం అనుసరించారు.

వెల్లుల్లికి సిట్రిక్ యాసిడ్ కలిపి తయారీ...

నగర మార్కెట్‌లో అల్లం ధర కేజీ రూ.100 నుంచి రూ.135 మధ్య ఉండగా... సిట్రిక్ యాసిడ్ రూ.60 నుంచి రూ.80 మధ్య ఉంటోంది. దీంతో నాసిరకం, కుళ్లిన వెల్లుల్లిని ఖరీదు చేస్తున్న షకీల్, సమీర్ అందులో అల్లానికి బదులు ఆ తరహా రుచి, వాసన ఇచ్చే సిట్రిక్ యాసిడ్ కలుపుతున్నారు. దీనివల్ల తక్కువ రేటులో నకిలీ అల్లం-వెల్లుల్లి పేస్టు తయారు కావడంతో పాటు కొన్ని రోజులు అలా ఉంచడం ద్వారా రసాయన ప్రక్రియ జరిగి దాని బరువు గణనీయంగా పెరిగిపోతోంది. ఆపై ఈ మిశ్రమాన్ని డబ్బాల్లో ప్యాక్ చేసి, స్టాంపులు వేసి విక్రయానికి సిద్ధం చేస్తున్నారు. సాధారణ జింజర్-గార్లిక్ పేస్ట్ కంటే కేజీ రూ.20 తక్కువకు అమ్ముతూ నగరంలోని ప్రధాన హోటళ్లు, రెస్టారెంట్లుకు సరఫరా చేస్తున్నారు.

షకీల్ గ్యాంగ్ దాదాపు ఐదేళ్లుగా నగర వ్యాప్తంగా 'సోనీ జింజర్ అండ్ గార్లిక్ పేస్ట్' పేరుతో తమ నకిలీ సరుకు సరఫరా చేస్తోంది. దీన్ని కూడా కార్ఖానాలోని ప్లాస్టిక్ డ్రమ్ముల్లో, అత్యంత అపరిశుభ్రత మధ్య, కార్మికులకు గ్లౌజులు వంటి లేకుండా తయారు చేస్తోంది. వీరి వ్యవహారంపై ఉత్తర మండల టాస్క్‌ఫోర్స్ పోలీసులకు సమాచారం అందింది. ఇన్‌స్పెక్టర్ కె.సైదులు నేతృత్వంలో ఎస్సైలు శ్రీనివాసులు దాసు, పి.గగన్‌దీప్, సి.రాఘవేందర్‌రెడ్డి ఆదివారం కార్ఖానాపై దాడి చేశారు. పరారీలో ఉన్న షకీల్ మినహా మిగిలిన ఎనిమిది మందిని అరెస్టు చేశారు. 1500 కేజీల వెల్లుల్లి పేస్టు, 55 కేజీల సిట్రిక్ యాసిడ్, మిక్సింగ్ యంత్రాలు తదితరాలు స్వాధీనం చేసుకున్నారు. ఈ నకిలీ, నాసికరం అల్లం-వెల్లుల్లి పేస్ట్ తినడం వల్ల జీర్ణవ్యవస్థ దెబ్బతింటుందని, పేగులతో పాటు అన్న వాహిక, అన్నాశయానికి తీవ్రమైన నష్టం వాటిల్లుతుందని వైద్యులు చెబుతున్నారు.

జీర్ణ వ్యవస్థకు తీవ్రమైన నష్టమే..

సమగ్ర సర్వేలో వివరాలు అందించిన కలెక్టర్

బంజారాహిల్స్: సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సమాచార సేకరణ కోసం చేపట్టిన సమగ్ర సర్వేలో హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తమ పూర్తి వివరాలను ఎన్యుమరేటర్‌కు అందజేశారు. ఆదివారం బంజారాహిల్స్ రోడ్డు నెంబర్-13లోని కలెక్టర్ బంగ్లాకు వెళ్లిన సూపర్‌వైజర్ బాహుసింగ్, ఎన్యుమరేటర్ శాంతిలక్ష్మీలు ఆయనకు 75 ప్రశ్నలతో కూడిన సర్వే ఫారాన్ని అందజేశారు. క్షుణ్ణంగా దరఖాస్తును పరిశీలించిన కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అందులోని అన్ని ప్రశ్నలకు వివరాలు నమోదు చేసి అధికారులకు అందజేశారు. సమగ్ర సర్వే జరుగుతున్న తీరును వారిని అడిగి తెలుసుకున్నారు.



సమగ్ర సర్వేలో పాల్గొన్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

'బుద్ధుడి నుంచి గద్దర్ వరకు..'

పుస్తకావిష్కరణ

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆదివారం జీవీవీ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సీనియర్ ట్రేడ్ యూనియన్ నాయకుడు బొజ్జ భిక్షమయ్య రచించిన 'బుద్ధుడి నుంచి గద్దర్ వరకు..', ప్రముఖ రచయిత డాక్టర్ కాలువ మల్లయ్య రచించిన 'అస్పృశ్య యోధుడు' పుస్తకాలను ఆవిష్కరించారు. ఈసందర్భంగా హాజరైన మాజీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కాకి మాధవ రావు మాట్లాడుతూ అభ్యుదయ శక్తులన్నీ ఏకం కావాలని, అందుకు తాను వారధిగా పని చేస్తానని చెప్పారు. కమ్యూనిస్టులు, అంబేడ్కరిస్టుల మధ్య అంతరం ఏర్పడిందని, వాటిని పూడ్చడానికి తాను కృషి చేస్తున్నట్లు తెలిపారు. బీసీ కమిషన్ మాజీ చైర్మన్ బి.ఎస్. రాములు తదితరులు పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కాకి మాధవరావు తదితరులు

ఎలివేటెడ్ కారిడార్లకు నిధులెట్లా?

- అంతర్జాతీయ సంస్థల నుంచి రుణాలకు సన్నాహాలు
- ప్రతిపాదిత మార్గాల్లో ఆస్తుల సేకరణకు ఏర్పాట్లు
- ఇప్పటికే క్షేత్రస్థాయిలో చెట్లపై అధ్యయనం చేపట్టిన కమిటీ
- తక్కువ వడ్డీరేట్లతో రుణాలు లభిస్తే పనులు ప్రారంభించే అవకాశం

సాక్షి, సిటీబ్యూరో: నగరానికి ఉత్తరం వైపు ప్రతిపాదించిన ఎలివేటెడ్ కారిడార్‌ల నిర్మాణం కోసం నిధుల సేకరణపై ప్రభుత్వం దృష్టి సారించింది. ప్యారడైజ్ నుంచి శామీర్‌పేట్ ఓఆర్ఆర్ జంక్షన్ వరకు, ప్యారడైజ్ నుంచి డైరీఫామ్ వరకు రెండు మార్గాల్లో ఆరు లేన్‌లతో ఎలివేటెడ్ కారిడార్‌లను నిర్మించేందుకు ప్రణాళికలను రూపొందించిన సంగతి తెలిసిందే. డైరీఫామ్ వరకు నిర్మించనున్న కారిడార్‌లో పైన మెట్రో రైల్ నిర్మాణం చేపట్టాలనే ప్రతిపాదన కూడా ఉంది. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా భావిస్తోన్న ఈ ప్రాజెక్టు కోసం ఇప్పటి వరకు కంటోన్మెంట్ ప్రాంతంలో భూముల సేకరణతో పాటు ప్రైవేట్ వ్యక్తుల నుంచి సేకరించవలసిన ఆస్తులను కూడా హెచ్ఎండీఏ గుర్తించింది. అలాగే ఈ రెండు రూట్‌లలో ఉన్న చెట్లపైన కూడా ఇటీవల అధికారులు క్షేత్రస్థాయిలో అధ్యయనం చేపట్టారు. తప్పనిసరిగా తొలగించవలసిన వాటితో పాటు రీలొకేషన్ చేసేందుకు అవకాశం ఉన్న చెట్లను కూడా ట్రీ ప్రొటెక్షన్ కమిటీ గుర్తించింది. ఈ క్రమంలోనే కారిడార్‌ల నిర్మాణానికి కావలసిన నిధుల సేకరణపైన అధికారులు దృష్టి సారించారు.



తక్కువ వడ్డీ రేట్లకు రుణాలిచ్చే సంస్థలేవీ..

ప్యారడైజ్ నుంచి శామీర్‌పేట్ ఓఆర్ఆర్ జంక్షన్ వరకు 18.1 కిలోమీటర్‌ల దూరం నిర్మించనున్న ఎలివేటెడ్ కారిడార్‌కు రూ.2232 కోట్లతో అంచనాలను రూపొందించారు. వెస్ట్ మారేడుపల్లి, కార్ఖానా, తిరుమలగిరి, బొల్లారం, అల్వాల్, హకీంపేట్, తూంకుంట నుంచి శామీర్‌పేట్ ఓఆర్ఆర్ జంక్షన్ వరకు నిర్మిస్తారు. అలాగే ప్యారడైజ్ నుంచి డైరీఫామ్ వరకు నిర్మించనున్న 5.5 కిలోమీటర్ల మార్గంలో తాడ్‌బండ్, బోయిన్‌పల్లి జంక్షన్ల మీదుగా రహదారులను విస్తరిస్తారు. ఈ కారిడార్ కోసం రూ.1580 కోట్లు ఖర్చుకానున్నట్లు అంచనా. భవిష్యత్తులో ఇదే కారిడార్‌పైన డబుల్‌డెక్కర్ మెట్రో లైన్ నిర్మించాలనే ప్రతిపాదన ఉంది. ఈ రెండు కారిడార్‌ల నిర్మాణం పూర్తయితే హైదరాబాద్ నుంచి ఉత్తర తెలంగాణ జిల్లాలకు రాకపోకలు మరింత సులభతరమవుతాయి. ఈ రూట్‌లలో వాహనాల రద్దీకి శాశ్వత పరిష్కారం లభిస్తుంది. ఇప్పటి వరకు క్షేత్రస్థాయిలో వివిధ రకాల సర్వేలు పూర్తి చేశారు. త్వరలో ఆస్తుల సేకరణకు నోటిఫికేషన్ ఇవ్వనున్నారు. ప్రైవేట్ వ్యక్తులకు టీడీఆర్ పద్ధతిలో పరిహారం ఇవ్వాలనే ప్రతిపాదన కూడా ఉంది. ఈ కార్యాచరణను కొనసాగిస్తూనే మరోవైపు నిధుల సేకరణపైన హెచ్ఎండీఏ అధికారులు దృష్టి సారించారు. ఈ దిశగా పలు అంతర్జాతీయ రుణ సంస్థలతో సంప్రదింపులు జరుపుతున్నట్లు అధికారులు తెలిపారు. తక్కువ వడ్డీ రేట్లకు రుణాలు ఇచ్చేందుకు ముందుకు వచ్చే సంస్థల నుంచి అప్పు తీసుకోవాలని భావిస్తున్నారు. జైకా, హడ్కో వంటి పలు సంస్థలతో చర్చలు కొనసాగుతున్నాయని ఒక అధికారి చెప్పారు. అలాగే ఈ రెండు కారిడార్‌లలో సుమారు 10 వేలకు పైగా చెట్లు ఉన్నాయి. కంటోన్మెంట్ ప్రాంతంలో వందల ఏళ్ల నాటి మహావృక్షాలు కూడా ఉన్నాయి. సాధ్యమైనంత వరకు చెట్లను తొలగించవలసిన అవసరం లేకుండా ప్రతి చెట్టుకు మ్యాపింగ్‌తో పాటు జియో కోఆర్డినేట్స్ ఏర్పాటు చేస్తున్నారు. హెచ్ఎండీఏ అర్బన్ ఫారెస్ట్రీ, అటవీశాఖ, పలు స్వచ్ఛంద సంస్థలతో కూడిన ట్రీ ప్రొటెక్షన్ కమిటీ ఇటీవల క్షేత్రస్థాయిలో పర్యటించింది. 60 శాతం చెట్లను అన్ని విధాలుగా రక్షించేందుకు చర్యలు చేపట్టనున్నారు. 40 శాతం చెట్లను మాత్రం ట్రాన్స్‌లొకేట్ చేసే అవకాశం ఉంది.

ఎలివేటెడ్ కారిడార్లతో ప్రయోజనాలు..

ఎలివేటెడ్ కారిడార్లు నిర్మిస్తున్న ప్రాంతాల్లో ప్యారడైజ్ జంక్షన్ వద్ద రోజుకు సగటున 1,57,105 వాహనాలు (ప్యాసింజర్ కార్ యూనిట్ ఫర్ డే -పీసీయూ) పయనిస్తుంటే, ఓఆర్ ఆర్ జంక్షన్ సమీపంలో 72,687 వాహనాలు పయనిస్తున్నాయి. ఇరుకైన రహదారి కావడం, ఇంత పెద్ద మొత్తంలో వాహనాల రాకపోకలతో నిత్యం వాహనదారులు, ఆయా ప్రాంతాల ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. తరచుగా ప్రమాదాలు జరుగుతున్నాయి. అత్యవసర సమయాల్లో గమ్యాన్ని చేరుకోలేక ప్రయాణికులు తీవ్ర ఒత్తిడికి, అసహనానికి గురవుతున్నారు. వాహనాల రద్దీ వల్ల గంటలకొద్దీ ట్రాఫిక్ నిలిచిపోతోంది. ఎలివేటెడ్ కారిడార్లతో సమయం కలిసిరావడంతో పాటు ఇంధనంపై అయ్యే వ్యయం తగ్గనుంది. అలాగే ప్రమాదాలను కూడా నియంత్రించేందుకు అవకాశం ఉంటుంది.

తొలిరోజు గ్రూప్ -3 పరీక్షలు ప్రశాంతం

పరీక్ష కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన కలెక్టర్

సాక్షి, సిటీబ్యూరో: టీజీపీఎస్సీ ఆధ్వర్యంలో గ్రూప్-3 పరీక్షలు తొలి రోజు నగరంలో ఆదివారం ప్రశాంతంగా జరిగాయి. మెహిదీపట్నంలోని జి.పుల్లారెడ్డి డిగ్రీ, పీజీ కళాశాలలోని పరీక్ష కేంద్రాలను హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆకస్మికంగా సందర్శించి పరీక్ష జరుగుతున్న తీరును పరిశీలించారు. ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని ఆయన సూచించారు. ఉదయం జరిగిన గ్రూప్-3 పేపర్-1 పరీక్షకు 102 పరీక్ష కేంద్రాల్లో 45918 అభ్యర్థులకు గాను 18967 అభ్యర్థులు పరీక్షకు(41.31శాతం) మంది హాజరుకాగా, 26951 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన పరీక్ష-2కు 18,831 అభ్యర్థులు (41.01శాతం) హాజరు కాగా, 27,087 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు.

బాలింతను ఎగ్జామ్ సెంటర్‌కు చేర్చిన మలక్‌పేట పోలీసులు

మలక్‌పేట: దిల్‌సుఖ్‌నగర్‌లో గ్రూప్-3 ఎగ్జామ్ రాయడానికి వచ్చిన ఓ బాలింత పొరపాటున తనకు కేటాయించిన కాలేజీకి కాకుండా నోబుల్ కాలేజ్ పరీక్షా కేంద్రానికి వచ్చారు. అక్కడే విధి నిర్వహణలో ఉన్న మలక్‌పేట ఏసీపీ శ్యామ్‌సుందర్, ఇన్‌స్పెక్టర్ పిడమర్తి నరేష్ ఈ విషయం గమనించి బాలింతను తన వాహనంలో సరైన సెంటర్‌కు సకాలంలో తీసుకెళ్లారు.బాలింత, ఆమె తల్లి పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

3 కిలోమీటర్లు..మూడు నిమిషాల్లో...

సుభాష్‌నగర్: బాలానగర్‌లోని గీతాంజలి కాలేజీకి వెళ్లాల్సిన ఓ విద్యార్థిని పొరపాటున చింతల్‌లోని గౌతమీ కాలేజీకి రావడంతో..ఆ విద్యార్థినిని జీడిమెట్ల ట్రాఫిక్ సీఐ శ్రీనివాస్ మూడు నిమిషాల్లో మూడు కిలోమీటర్ల దూరం తన వాహనంలో తీసుకెళ్లి ఆమె పరీక్షా కేంద్రానికి చేర్చారు. విద్యార్థిని విలువైన సమయాన్ని కాపాడారు. తన సెంటర్ ఇక్కడ లేదని తెలుసుకుని ఇబ్బంది పడుతుండగా, అప్పటికే కేవలం ఐదు నిమిషాలు మాత్రమే సమయం ఉండగా అక్కడే ఉన్న ట్రాఫిక్ సీఐ శ్రీనివాస్ స్పందించారు. రెండు నిమిషాల ముందే ఆమెను పరీక్ష కేంద్రానికి చేర్చారు.



బాలింతను పోలీసు వాహనంలో ఎగ్జామ్ సెంటర్‌కు తీసుకెళ్తున్న పోలీసులు



నిజాం కాలేజీ వద్ద..



సికింద్రాబాద్‌లో నెంబర్ చూసుకుంటున్న అభ్యర్థులు

ప్రొస్టేట్ కేన్సర్ పై అవగాహన

'అపోలో', ది బైకెర్నీ క్లబ్ బైక్ ర్యాలీ



సాక్షి, సిటీబ్యూరో: ప్రోస్టేట్ క్యాన్సర్ పై అవగాహన కల్పించేందుకు అపోలో క్యాన్సర్ సెంటర్, ది బైకెర్నీ క్లబ్‌తో కలిసి బైక్ ర్యాలీ నిర్వహించాయి. పురుషుల క్యాన్సర్ నెల నేపథ్యంలో 'బీ ది బెస్ట్ యూ' పేరుతో విజయవంతంగా బైక్ ర్యాలీ జరిగింది. బేగంపేటలోని తెలంగాణ టూరిజం భవన్ నుంచి ఆస్పత్రి యూరో ఆంకాలజిస్ట్ డాక్టర్ సంజయ్ కుమార్ అద్దాల జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. కాగా, రవాణా శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రపంచవ్యాప్తంగా పురుషుల్లో ఎక్కువగా వస్తున్న క్యాన్సర్‌లో ఒకటైన ప్రోస్టేట్ క్యాన్సర్‌ను ముందస్తుగా గుర్తించడం ముఖ్యమని డాక్టర్ సంజయ్ పేర్కొన్నారు. సరైన సమయంలో సరైన చికిత్స తీసుకోవడం కీలకమని వివరించారు. ఈ ర్యాలీలో భారీ సంఖ్యలో ఔత్సాహికులు, పలువురు వైద్య నిపుణులు పాల్గొన్నారు.

కల్తీ కల్లు.. ఆరోగ్యానికి చిల్లు



క్లోరోహైడ్రేట్, డైజోఫామ్, ఆల్ఫాజోలమ్‌లతో కల్లు తయారీ

- మోతాదుకు మించి రసాయనాలు కలపడంతో ప్రమాదం
- పట్టించుకోని జిల్లా ఎక్సైజ్ అధికారులు
- మామూళ్లమత్తులో జోగుతున్న వైనం



సాక్షి, రంగారెడ్డిజిల్లా: జిల్లాలో 'కల్తీ' కల్లు మాఫియా రెచ్చిపోతోంది. మోతాదుకు మించి రసాయనాలు కలిపి తయారు చేస్తున్న ఈ కల్లును తాగుతున్న అమాయక కూలీలు, పేదలు ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. ఎప్పటికప్పుడు కల్లు అమ్మకాలపై తనిఖీలు నిర్వహించి పరీక్షలు నిర్వహించాల్సిన శంషాబాద్, సరూర్‌నగర్ అబ్కారీ అధికారులు వారిచ్చే ముడుపులు పుచ్చుకుని కిమ్మనడం లేదనే ఆరోపణలున్నాయి. ఫలితంగా ఇటీవల మీర్‌పేటలోని నందనవనం బస్తీకి చెందిన ఓ మహిళ కల్తీకల్లు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లింది. మోతాదుకు మించి రసాయనాలు కలిపి, కల్తీ కల్లును తయారు చేసి ప్రజారోగ్యంతో ఆటలాడుతున్న కల్తీ కల్లు మాఫియాపై ఉక్కుపాదం మోపాల్సిన ఎక్సైజ్‌శాఖ వారికి అండగా నిలుస్తుండటంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

బస్తీలే కల్లు కాంపౌండ్లకు అడ్డాలు

ప్రకృతి సిద్ధమైన తాటి, ఈత చెట్ల నుంచి తీసిన కల్లు ఆరోగ్యకరమైంది. స్వచ్ఛమైన ఈ కల్లును సేవించడం వల్ల కిడ్నీ సంబంధిత సమస్యలు సైతం తొలగుతాయి. సాధారణంగా చెట్ల సంఖ్య ఎక్కువగా ఉన్న చోట్ల కల్తీ తక్కువ. డిమాండ్ మేరకు ఉత్పత్తి లేకపోవడం, అప్పటి వరకు ఈ వృత్తిపై ఆధారపడిన గీత కార్మికులు కూడా ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవడం ఫలితంగా కల్లుకు కొరత ఏర్పడింది. గుడుంబా దొరక్క పోవడం, మద్యం ధరలు ఎక్కువగా ఉండటంతో రోజువారీ కూలీలు కృత్రిమంగా లభించే కల్లుకు అలవాటుపడుతున్నారు. ప్రజల్లోని ఈ బలహీనతను కొంత మంది కల్లు వ్యాపారులు సొమ్ము చేసుకుంటారు. తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించాలనే ఆశతో క్లోరోహైడ్రేట్, డైజోఫామ్, ఆల్ప్రాజోలమ్ వంటి ప్రమాదకరమైన రసాయణాలను వినియోగించి కల్తీ కల్లును తయారు చేస్తున్నారు. తయారీలో మోతాదుకు మించి రసాయణాలను వినియోగిస్తుండడంతో దీన్ని సేవించిన వారు అస్వస్థతకు గురై ఆస్పత్రుల్లో చేరుతున్నారు. శంషాబాద్, రాజీవ్‌గాంధీనగర్, మీర్‌పేట్, అబ్దుల్లాపూర్‌మెట్, బొంగుళూరుగేటు, ఆదిబట్ల, యాచారం, చేవెళ్ల, షాద్‌నగర్, షాబాద్, కడ్తాల్ శివారు ప్రాంతాల్లో ఈ కల్తీ కల్లు విక్రయాలు ఎక్కువగా జరుగుతున్నాయి. నిజానికి ప్రస్తుత సీజన్‌లో తాటి చెట్లకు ఆశించిన స్థాయిలో కల్లు ఉత్పత్తి కాదు. ఒకటి రెండు తాటి చెట్ల నుంచి కల్లును సేకరించినా, ఇది వారి సొంత అవసరాలకు కూడా సరిపోదు. కానీ జిల్లాలోని ఏ ప్రధాన రోడ్డు వెంట చూసినా కృత్రిమ కల్లు దుకాణాలే దర్శనమిస్తున్నాయి. ఎప్పటికప్పుడు ఆయా దుకాణాల్లో తనిఖీలు నిర్వహించి, నమూనాలు సేకరించాల్సిన ఎక్సైజ్ అధికారులు తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తుండటంపై అనేక విమర్శలు వెల్లు వెత్తుతున్నాయి.

ఒక లైసెన్సు.. రెండు దుకాణాలు

శంషాబాద్ పట్టణంలోని ఓ ప్రధాన కల్లు దుకాణంలో సభ్యుల మధ్య జరిగిన గొడవతో కల్లు విక్రయాలు రోడ్డుపైకి వచ్చాయి. గొడవల కారణంగా దాదాపు నెల రోజులుగా దుకాణం తెరవని విక్రయదారులు తమ దందాను మాత్రం యథేచ్ఛగా రోడ్డెక్కించారు. దాదాపు మూడు వందల సభ్యులతో ఉన్న ఈ దుకాణంలో కొంత కాలంగా వ్యాపారుల మధ్య గొడవలు కొనసాగుతున్నాయి. ఒకే దుకాణంలో రెండు వేర్వేరు విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేశారు. అయితే ఎక్సైజ్ నిబంధనల మేరకు ఒక లైసెన్స్‌పై రెండు విక్రయ కేంద్రాలు నడిపిస్తున్న విషయం తెలుసుకున్న ఆబ్కారీ అధికారులు ఒక లైసెన్స్‌పై ఒకటే దుకాణం నడిపిచాలని హెచ్చరించారు. వ్యాపారులు మాత్రం ఇదేమి పట్టనట్టుగా దందా కొనసాగిస్తున్నారు. రైల్వేస్టేషన్ నుంచి వీకర్ సెక్షన్ కాలనీ మీదుగా ఉన్న రోడ్డుపైనే కల్లు విక్రయాలు జరుపుతుండటంతో కాలనీ వాసులు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా.. ఫలితం లేదు.

నాడీ వ్యవస్థ దెబ్బతింటుంది

డైజోఫాం ఇతర రసాయనాలతో తయారు చేసిన కృత్రిమ కల్లును సేవించిన వారిలో నాడీ వ్యవస్థ దెబ్బతింటుంది. నీరసం, ఒంటి నొప్పులతో పాటు కోమాలోకి వెళ్లే ప్రమాదం ఉంది. మానసిక విక్షణ కోల్పోయి పిచ్చిగా ప్రవర్తిస్తుంటారు. ఈ సమయంలో ఏదైనా అనుకోని ప్రమాదం జరిగితే ప్రాణాలకే ప్రమాదం. ఈ క్షతగాత్రులకు సర్జరీల సమయంలో నొప్పి నివారణ కోసం ఇచ్చే మత్తు ఇంజక్షన్లు సైతం పని చేయవు. మోతాదుకు మించిన డోసు ఇంజక్షన్లు ఇవ్వాల్సి వస్తుంది. సాధ్యమైనంత వరకు ఈ కల్లును సేవించక పోవడమే ఉత్తమం.

– డాక్టర్ రాజేశ్, న్యూరో సర్జన్

30న మాల మహానాడు సదస్సు

కాచిగూడ: ఈ నెల 30వ తేదీన బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించనున్న మాలమహానాడు రాష్ట్ర సదస్సు నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం జాతీయ అధ్యక్షుడు డాక్టర్ వీఎల్ రాజు తెలిపారు. ఆదివారం నారాయణగూడలోని మాలమహానాడు కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ, క్రీమిలేయర్ అమలు కోసం ఇప్పటికే హైకోర్టు రిటైర్డ్ జడ్జి జస్టిస్ షమీర్ అక్తర్‌తో ఏకసభ్య కమిషన్ నియమించి ప్రక్రియను వేగవంతం చేసిందన్నారు. ఇంత జరుగుతున్నా మాల, మాల ఉపకులాల ఎమ్మెల్యేలు, మంత్రులు, ఎమ్మెల్సీలు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ ఏర్పాటులో మాలల పాత్రే కీలకమని, అధికారంలోకి వచ్చిన తరువాత మాలలకు వెన్నుపోటు పొడిచి ద్రోహం చేస్తోందని ఆరోపించారు. మాల ఎమ్మెల్యేలు సీఎం రేవంత్ రెడ్డికి పాలేర్లుగా ఉండటం సిగ్గు చేటన్నారు. మాల జాతి సంక్షేమం కోసం వెంటనే మాల ప్రజాప్రతినిధులు తమ పదవులకు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు జేఏ న్‌రావు, జాతీయ ఉపాధ్యక్షుడు జొన్నలగడ్డ భాస్కర్‌రావు, న్యాయవాది వడ్లమూరి కృష్ణస్వరూప్, ఆర్‌పీఐ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.అశోక్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు డాక్టర్ వీఎల్ రాజు

నడిరోడ్డుపై హంగామా

గంజాయి మత్తులో తన్నుకున్న ఇద్దరు ఆటో డ్రైవర్లు



చార్మినార్ బస్టాండ్ నడి రోడ్డులో గొడవ పడుతున్న ఆటో డ్రైవర్లు



గంటల తరబడి ఎక్కడికక్కడ నిలిచిపోయిన ట్రాఫిక్

చార్మినార్: చార్మినార్ ఆర్టీసి బస్టాప్ రోడ్డులో ఇద్దరు ఆటో డ్రైవర్లు ఆదివారం సాయంత్రం హంగామా చేశారు. గంజాయి మత్తులో కర్రలతో దాడికి పాల్పడ్డారు. ఎవరు.. ఎవరిని.. ఎందుకు.. కొడుతున్నారో వారికే తెలియని పరిస్థితులు నెలకొన్నాయి. రాకపోకలు సాగిస్తున్న వాహనదారులకు ముచ్చెమటలు పట్టించారు. దీంతో గంటల తరబడి ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయాయి. కొంత మంది వాహన దారులు సర్ది చెప్పే ప్రయత్నం చేయడంతో వారిని సైతం నెట్టివేస్తు దుర్భాషలాడారు.

కనిపించని పోలీసులు...

ఇంత జరుగుతున్నా...సంఘటనా స్థలానికి పోలీసులు సకాలంలో రాకపోవడం గమనార్హం. అసలే వీకెండ్ అయిన ఆదివారం కావడంతో సహజంగానే సాధారణ రోజుల కన్నా..ఆదివారం సందర్శకుల రద్దీ ఎక్కువగా ఉంది. గతంలో తొలగించిన చార్మినార్ ఆర్టీసి బస్టాండ్ భవనం ఎదురుగా ఉన్న ప్యారిస్ కేఫ్ రోడ్డులో ఈ గలాటా జరిగింది. ఇక్కడ లా అండ్ ఆర్డర్ పోలీసులతో పాటు ట్రాఫిక్ పోలీసులు సైతం విధినిర్వాహణలో కనిపించ లేదు. ఆదివారం సాయంత్రం 5 గంటల ప్రాంతంలో చోటు చేసుకున్న ఈ సంఘటన చార్మినార్, హుస్సేనీఆలం, మొఘల్‌పురా లా అండ్ ఆర్డర్ పోలీసు స్టేషన్ల సరిహద్దులో జరిగింది. అయితే సంఘటన జరిగిన ప్రదేశం మొఘల్‌పురా పోలీసు స్టేషన్ పరిధిలోకి వస్తుందని పోలీసులు చెబుతున్నారు.

అఘాయిత్యాలను అరికట్టేందుకు 'వావ్ ఉమెన్ ఆన్ వీల్స్'



గన్‌ఫౌండ్రీ: మహిళలు, బాలికలపై జరుగుతున్న అఘాయిత్యాలను అరికట్టేందుకు జీతో లేడీస్ వింగ్ హైదరాబాద్ ఆధ్వర్యంలో 'వావ్ ఉమెన్ ఆన్ వీల్స్' పేరిట ట్రెజర్ హంట్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం అవగాహన కల్పించారు. అబిడ్స్‌లోని సెయింట్ జార్జ్ గ్రామస్ స్కూల్ నుంచి ప్రారంభమైన ఈ యాత్ర నగరంలోని పలు ప్రాంతాల్లో తిరుగుతూ సికింద్రాబాద్ క్లబ్‌లో ముగిసింది. ఈ సందర్భంగా సంస్థ చైర్మన్ సుధా కమ్టీ మాట్లాడుతూ..మహిళా సాధికారత, మహిళలపై హింసను నిర్మూలించడానికి ఈ కార్యక్రమాన్ని రూపొందించినట్లు తెలిపారు. మహిళల కోసం సురక్షితమైన, సాధికారత కలిగిన సమాజాన్ని రూపొందించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు మహాలక్ష్మీ రామన్‌గౌడ్, సురేఖ ఓంప్రకాష్, సంస్థ కార్యదర్శి టీనా, కోశాధికారి అనిత, నూతు, మధు, రేఖ, సరిత, తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై దృష్టి

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఐటీ శాఖపై ప్రత్యేక దృష్టి సారించిందని రాష్ట్ర మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. ఆదివారం నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో అఖిలభారత ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో వివిధ ప్రైవేటు కంపెనీల బాధిత ఉద్యోగులతో ప్రజా విచారణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గత మూడు దశాబ్దాలుగా ఐటీపై కాంగ్రెస్ పార్టీ ప్రత్యేక దృష్టి సారించిందని గుర్తు చేశారు. ప్రైవేటు కంపెనీలు ఉద్యోగులకు వచ్చే సమస్యలపై శాశ్వత పరిష్కారం ఉండేలా పాలసీ విధానం ఉండాలని సూచించారు. బ్రెయిన్ ఎంటర్ ప్రైజెస్ బాధితుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీనిచ్చారు. ఐఐటీ, ఐఐఎం చదివినవారికి ఇటువంటి పరిస్థితి రావడం చాలా బాధకరమన్నారు. ఉద్యోగులను మోసం చేస్తే ఖచ్చితంగా చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్, ఏఐపీసీ చైర్మన్ ప్రవీణ చక్రవర్తి పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఏఐ ఎక్స్‌పో



సాక్షి, సిటీబ్యూరో: సరికొత్త ఆలోచనలతో ఏఐ వంటి అత్యాధునిక సాంకేతిక అంశాల ఆధారంగా భవిష్యత్తు సమస్యలకు పరిష్కారాలను సృష్టించిన విద్యార్థుల ప్రతిభ ఆకట్టుకుంది. కేఎల్‌హెచ్ బాచుపల్లి క్యాంపస్‌లోని ఏఐఎంఎల్ ప్రాజెక్ట్ ఎక్స్‌పోలో విద్యార్థులు రూపొందించిన వివిధ ఆవిష్కరణలను ప్రదర్శించారు. ప్రిడిక్టివ్ అనలిటిక్స్, హెల్త్‌కేర్‌లో ఏఐ, ఇంటెలిజెంట్ టెక్ సొల్యూషన్స్ వంటి విభిన్న అంశాలతో కూడిన ప్రాజెక్టులను ఆసక్తికరంగా సమర్పించారు. ముఖ్య అతిథిగా తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (టాస్క్), తెలంగాణ ప్రభుత్వ ఐటీఈ-సీ విభాగం, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, శ్రీకాంత్ సిన్హా, గౌరవ అతిథిగా టీసీఎస్ చీఫ్ ఇన్నోవేషన్ ఆఫీసర్ బాల ప్రసాద్ పెద్దిగారితో పాటు పలు పరిశ్రమలకు చెందిన భిన్న రంగాల ప్రముఖులు, నిపుణులు హాజరయ్యారు.

కత్తితో దాడి చేసిన రౌడీషీటర్

చాంద్రాయణగుట్ట: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తికి ఆసుపత్రి చికిత్స విషయంలో తలెత్తిన వివాదంలో రౌడీషీటర్.. ఓ కుటుంబంపై కత్తులతో దాడి చేసిన సంఘటన ఫలక్‌నుమా పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాల ప్రకారం... సంజయ్‌గాంధీనగర్ నవాబ్‌సాబ్‌కుంటకు చెందిన వాహబ్ కామాటిపురా మీదుగా కారులో ప్రయాణిస్తుండగా ఓ యువకుడు (19) ద్విచక్ర వాహనంపై వచ్చి కారును ఢీకొని గాయాలకు గురయ్యాడు. వాహబ్ తన బంధువైన గఫూర్ ఖాన్‌కి సమాచారం అందించాడు. హుటాహుటినా అతడిని ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స చేయిస్తుండగా గఫూర్ ఖాన్‌కు రౌడీషీటర్ అసద్ ఫోన్ చేసి దూషించడం మొదలుపెట్టాడు. దీంతో నీ అడ్రస్ చెప్పు అన్ని అడగగా గఫూర్ ఖాన్ తెలపడంతో శనివారం రాత్రి అసద్ మరో నలుగురితో కలిసి వచ్చి కత్తితో గాయపరిచాడు. అసద్‌ను ఆపడానికి ప్రయత్నించిన గఫూర్ ఖాన్ సోదరుడి కుమారులు జుబైన్ ఖాన్, సోహైల్ ఖాన్, సోదరి కుమారులు సాహైబ్, రహీం ఖాన్‌లను కూడా కత్తితో దాడి చేశారు. కేసు నమోదు చేసుకున్న ఫలక్‌నుమా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

దేవతామూర్తుల విగ్రహాల చోరీ

నిందితుల కోసం గాలిస్తున్న పోలీసులు

మీర్‌పేట: పూజ కోసం తెచ్చిన దేవతామూర్తుల పంచలోహ విగ్రహాలను దొంగలు ఎత్తుకెళ్లిన సంఘటన మీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. టీచర్స్‌కాలనీలో నిర్మాణంలో ఉన్న శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో స్థానిక అయ్యప్ప మాలధారులు పూజలు నిర్వహిస్తున్నారు. ఆదివారం పూజ ఉండడంతో అయ్యప్ప సేవా సమితి వారి నుంచి అయ్యప్పస్వామి, గణపతి, సుబ్రమణ్య స్వామి వార్ల పంచలోహ విగ్రహాలను తీసుకొచ్చి గుడి ఆవరణలో ఉంచారు. రాత్రి 12 గంటల వరకు పూజలు చేసిన అయ్యప్ప స్వాములు అనంతరం వెళ్లిపోయారు. ఉదయం 5 గంటలకు తిరిగి ఆలయం వద్దకు రాగా విగ్రహాలు కనిపించలేదు. విషయం తెలుసుకున్న ఆలయ చైర్మన్ కొండల్‌రెడ్డి అర్ధరాత్రి వేళ గుర్తు తెలియని వ్యక్తులు ఆలయంలోకి ప్రవేశించి విగ్రహాలను చోరీ చేసినట్లు మీర్‌పేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దొంగలను పట్టుకునేందుకు నాలుగు బృందాలతో గాలిస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ నాగరాజు తెలిపారు.

ధాన్యం కొనుగోలులో ఇబ్బందులు పెట్టొద్దు

సాక్షి రంగారెడ్డి జిల్లా: ధాన్యం కొనుగోళ్లలో రైతులను ఇబ్బందులకు గురి చేస్తే ఆందోళన తప్పదని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మర్పల్లి అంజయ్య యాదవ్ పేర్కొన్నారు. యాచారం మండల కేంద్రంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం పేరుకే ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించిందని, అధికారులు పెట్టే నిబంధనలతో రైతులేవరూ ధాన్యం విక్రయించే విషయంలో ఆసక్తితో లేరని అన్నారు. నాణ్యత ప్రమాణాల పేరుతో అధికారులు రైతులను ఇబ్బందులకు గురి చేయడంతో తక్కువ ధర వస్తున్న దళారులకే ధాన్యాన్ని విక్రయిస్తున్నారని అన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా నిబంధనలు సడలిస్తే రైతులకు మేలు జరిగే అవకాశం ఉంటుందని అన్నారు. లేని పక్షంలో కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ఆందోళన చేపడుతామని హెచ్చరించారు.

సండే సరదాగా..



ఆదివారం సాయంత్రం నగర వాసులు ట్యాంక్‌బండ్‌పై సరదాగా గడిపారు. చల్లని గాలులు వీస్తుండగా నగర అందాలు చూస్తూ.. సెల్ఫీలు దిగుతూ ఎంజాయ్ చేశారు.



'కిషోరి మేళా' పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రూమ్ టు రీడ్ ప్రతినిధులు

బంజారాహిల్స్: రూమ్ టు రీడ్ ఇండియా ట్రస్ట్ సంస్థ ఆధ్వర్యంలో బాలికా విద్య కార్యక్రమం క్యాంపెయిన్‌లో భాగంగా కిషోరి మేళాను ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మార్పు దిశగా కౌమారులు అనే అంశంపై చర్చించారు. అడ్వొకేట్లు లక్ష్మీదేవి, అన్నపూర్ణ, కెరీర్ ఎక్స్‌పర్ట్ శ్యాం తదితరులు ముఖ్యఅతిథులుగా హాజరై బాలికలపై ఎలాంటి అఘాయిత్యాలు జరుగుతున్నాయి, వాటిని ఎలా ఎదుర్కోవాలి..కౌమార దశలో ఎలా జాగ్రత్తగా ఉండి కెరీర్ వైపు ముందుకుసాగి లక్ష్యాన్ని చేరుకోవాలో వివరించారు. అనంతరం కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రూమ్ టు రీడ్ ప్రతినిధులు సరిత, రాధిక, యమున, స్వప్న, మమతలతో పాటు 320 మంది విద్యార్థినులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి ఇంట్లో సర్వే


సమగ్ర సర్వేలో మాజీ మంత్రి దగ్గుపాటి వెంకటేశ్వరరావు

బంజారాహిల్స్: సమగ్ర కుటుంబ కులగణన సర్వేలో భాగంగా బంజారాహిల్స్ రోడ్డునెంబర్-13 సాయినగర్‌లో నివసించే మాజీ మంత్రి దగ్గుపాటి వెంకటేశ్వరరావు ఇంట్లో సంబంధిత అధికారులు సర్వే నిర్వహించారు. సూపర్‌వైజర్ బాహుసింగ్, ఎన్యుమరేటర్ శాంతిలక్ష్మి ఆదివారం ఉదయం దగ్గుపాటి నివాసానికి వెళ్లి ఆయనకు ప్రశ్నావళిని అందించారు. దరఖాస్తులోని సమాచారంతో కూడిన అన్ని ఖాళీలను వెంకటేశ్వరరావు భర్తీ చేసి ఎన్యుమరేటర్‌కు అందజేశారు.

ఉచిత బస్సు పథకంతో రోడ్డునపడ్డాం

ఆటో డ్రైవర్ల ఆందోళన


నందినగర్‌లో నిరసన తెలుపుతున్న ఆటో డ్రైవర్లు

బంజారాహిల్స్: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహిళలకు ఉచిత బస్సు పథకం వల్ల ఆటోడ్రైవర్ల జీవితాలు రోడ్డున పడ్డాయని ఆటో డ్రైవర్లు నిరసన వ్యక్తం చేశారు. ఆదివారం పలు ఆటో యూనియన్ సంఘాల ఆధ్వర్యంలో బంజారాహిల్స్ రోడ్ నెం.14 లోని నందినగర్ ఆటోస్టాండ్‌లో ఆటో డ్రైవర్లు బిక్షాటన చేసి నిరసన తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకం తమను రోడ్డున పడేలా చేయగా, మరోవైపు కార్పొరేట్ సంస్థలైన ఓలా, ఉబర్, ర్యాపిడో వంటి వల్ల తమ ఉపాధి పూర్తిగా దెబ్బతిన్నదని దీన్ని నుంచి ప్రభుత్వమే తమను కాపాడాలని ఆందోళన వ్యక్తం చేశారు.

కోతుల కోసం బోన్ల ఏర్పాటు


కోతుల కోసం బోన్ ఏర్పాటు చేస్తున్న వెటర్నరీ సిబ్బంది

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డునెంబర్-1లోని కేర్ ఆస్పత్రి వెనుక ఉన్న వెంకటరమణ కాలనీలో కోతులు తిరుగుతున్నాయని, తమకు సమస్యగా మారిందని, వాటిని పట్టుకోవాలంటూ స్థానికులు జీహెచ్ఎంసీ వెటర్నరీ విభాగం డిప్యూటీ డైరెక్టర్ చక్రపాణిరెడ్డికి ఫిర్యాదు చేశారు. దీనికి స్పందించిన అధికారులు వెంకటరమణ కాలనీలో కోతులను పట్టుకునేందుకు బోన్లు ఏర్పాటు చేశారు. ఎక్కడైనా కోతులు సంచరిస్తూ ఇబ్బందిపెడితే వెటర్నరీ అధికారులు బోన్లు ఏర్పాటు చేసి వాటిని పట్టుకుని అడవుల్లో వదిలేస్తుంటారని జీహెచ్ఎంసీ ఖైరతాబాద్ జోనల్ వెటర్నరీ అధికారి వివేకానంద తెలిపారు. ఇక్కడ కూడా కొన్ని కోతులు సంచరిస్తున్నాయని ఫిర్యాదులు ఎక్కువగా రావడంతో బోన్లు ఏర్పాటు చేశామన్నారు. కోతులు బోన్‌లో చిక్కిన తర్వాత వాటిని అడవుల్లో వదలడం జరుగుతుందన్నారు.

సామ్నిఫెరా హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్ ప్రారంభం


సెంటర్‌ను ప్రారంభిస్తున్న సిమ్రాన్‌చౌదరి

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్-45లో నూతనంగా ఏర్పాటు చేసిన సామ్నిఫెరా హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్‌ను సినీ నటి సిమ్రాన్ చౌదరి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సామ్నిఫెరా హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్‌ను ప్రారంభించడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఇక్కడ అత్యాధునిక టెక్నాలజీతో మన శరీరంలో రోగ లక్షణాలను ముందుగానే కనిపెట్టి వాటికి ఎలాంటి ట్రీట్‌మెంట్ ఇవ్వాలో తెలియపర్చడం శుభపరిణామన్నారు. తాను ప్రతిరోజూ యోగా చేస్తానని, అందుకే తాను యాక్టివ్‌గా ఉంటానన్నారు. ఈ కార్యక్రమంలో సామ్నిఫెరా ఫౌండర్ అండ్ చైర్మన్ సెల్వకుమార్, డైరెక్టర్ కార్తీక్‌కుమార్, హంమెడ్ టెక్నాలజీస్ డైరెక్టర్ నిగమ్‌గుప్తా, బిజినెస్ హెడ్ శివరంజని తదితరులు పాల్గొన్నారు.

అభినందనలు


డాక్టర్ వెన్నెల గద్దర్‌తో సీ.హెచ్.బాలకృష్ణ

లిబర్టీ: తెలంగాణ సాంస్కృతిక సారథిగా నియమితులైన డాక్టర్ వెన్నెల గద్దర్‌కు రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా ఆర్‌పీఐ జాతీయ కార్యదర్శి సీ.హెచ్.బాలకృష్ణ అభినందించారు. వెన్నెల గద్దర్‌ను నియమిస్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేయడంతో ఆదివారం ఆమెను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. తెలంగాణ సంస్కృతి సారథిగా తెలంగాణ పాటలు, జానపద గేయాలు, కళారూపాలను విస్తరింప చేయాలని వెన్నెల గద్దర్‌ను కోరారు.

అద్దెకు ఫుట్‌పాత్‌లు..!

- అక్రమార్జనలో భవన యజమానులు
- చిరువ్యాపారుల జేబులకు చిల్లు
- పట్టించుకోని జీహెచ్ఎంసీ, ట్రాఫిక్ పోలీసులు

కొందరు భవన యజమానులు తమ ఇంటి ముందు భాగంతోపాటు ఫుట్‌పాత్‌లను చిరు వ్యాపారులకు అద్దెకిస్తూ అక్రమార్జనకు పాల్పడుతున్నారు. ఇది నగరంలో ఎక్కడా చూసినా ఇదే పరిస్థితి కనిపిస్తోంది. ముఖ్యంగా బంజారాహిల్స్‌లో తమ షాపులు, ఇళ్ల ఎదుట పాన్‌డబ్బాలు, బడ్డీకొట్లు ఇతర షాపులకు అనుమతి ఇస్తూ వారి వద్ద నెలకు రూ. 15 వేల నుంచి రూ. 20 వేల వరకు వసూలు చేస్తున్నారు. అయితే దీనిని నిలువరించాల్సిన అధికారులు మాత్రం అన్ని తెలిసినా మిన్నకుండిపోతున్నారు. దీంతో చిరు వ్యాపారులతోపాటు జీహెచ్ఎంసీకి నష్టం వాటిల్లుతోంది.



రోడ్డునెంబర్-14 బసవతారకం ఆస్పత్రి నందినగర్ రోడ్డులో ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలు

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డునెంబర్-14లోని బసవతారకం కేన్సర్ ఆస్పత్రి పక్కన యాడ్‌లైఫ్ ముందు నుంచి నందినగర్ బ్రహ్మాకుమారీస్‌కు వెళ్లే రోడ్డులో ఫుట్‌పాత్‌లు, రోడ్లపై టీకొట్లు, మిర్చి బజ్జీ బండ్లు, పాన్ డబ్బాలు, పండ్ల షాపులు ఇతర వస్తువుల విక్రయాలతో నిండిపోయాయి. ఇక్కడి భవన యజమానులు తమ ఇళ్లు, షాపుల ముందు వీటిని ఏర్పాటు చేసి చిరువ్యాపారుల నుంచి నెలనెలా అద్దెలు వసూలు చేస్తున్నారు. ఒక్కో వ్యాపారి నుంచి రూ.15 వేల దాకా దండుకొంటూ సొమ్ము చేసుకుంటున్నారు. ఫుట్‌పాత్‌లు, రోడ్లపై ఈ వ్యాపారాలను ఏర్పాటు చేయిస్తూ చిరువ్యాపారుల పొట్ట కొడుతున్నట్లు ఇటీవల ట్రాఫిక్ పోలీసులు నిర్వహించిన ఆపరేషన్ రోప్‌లో ఫుట్‌పాత్ చిరువ్యాపారులు తమ గోడు వెళ్లబోసుకున్నారు. శ్రీకృష్ణానగర్, ఇందిరానగర్, కమలాపురికాలనీ, శ్రీనగర్‌కాలనీ, ఫిలింనగర్ అపోలో రోడ్డు ఇలా ఎక్కడ చూసినా ఇళ్ల యజమానులు తమ ముందు భాగాన్ని ఫుట్‌పాత్, రోడ్లపై వ్యాపారులకు అద్దెలకు ఇస్తూ నెలనెలా కిరాయిలు వసూలు చేస్తున్నట్లుగా ట్రాఫిక్ పోలీసులకు పెద్ద ఎత్తున ఫిర్యాదులు అందాయి. ఎక్కడ చూసినా భవన యజమానులు తమ ఇంటి ముందు భాగాన్ని షాపులు, హోటళ్లకు అద్దెలకు ఇవ్వడమే కాకుండా ఫుట్‌పాత్‌లను కూడా పాన్‌డబ్బాలు, టీకొట్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, జ్యూస్ సెంటర్లకు అద్దెకు ఇస్తూ అక్రమంగా వసూలు చేస్తున్నారు. ఇటీవల ఈ తరహా ఫిర్యాదులు ట్రాఫిక్ పోలీసులకు పెద్దఎత్తున అందుతున్నాయి. అయితే ఫుట్‌పాత్‌లను ఆక్రమించి షాపులు ఏర్పాటు చేసుకున్న వాటిని తొలగించడంలో జీహెచ్ఎంసీ, టౌన్‌ప్లానింగ్ అధికారులు పూర్తిగా విఫలమవుతున్నారు. టౌన్‌ప్లానింగ్ అధికారులకు అక్రమ నిర్మాణాల వద్దకు వెళ్లి వసూలు చేయడంలో ఉన్న శ్రద్ధ ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపులో మాత్రం చూపించడం లేదు. ఇంకోవైపు ట్రాఫిక్ పోలీసులు ఫుట్‌పాత్‌లపై ఏర్పాటు చేసిన ఆక్రమణలను తరచూ తొలగిస్తున్నా ఆ తెల్లవారే సరికి మళ్లీ యథావిధిగా వాటిని ఏర్పాటు చేస్తూ దర్జాగా వ్యాపారాలు చేస్తున్నారు. అపోలో ఆస్పత్రి ముందు భవన యజమానులు దాదాపు 70 వరకు ఫుట్‌పాత్‌లపై డబ్బాలు ఏర్పాటు చేయించి రూ. 20 వేల వరకు దర్జాగా వసూలు చేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. పంజగుట్ట, ఖైరతాబాద్, చింతల్‌బస్తీ, బంజారాహిల్స్ రోడ్డునెంబర్-12, రోడ్డునెంబర్-10, రోడ్డునెంబర్-3, అన్నపూర్ణ రోడ్డు, జూబ్లీహిల్స్, ఫిలింనగర్, బంజారాహిల్స్ రోడ్డునెంబర్-14 తదితర ప్రాంతాల్లో ఈ దందా జోరుగా కొనసాగుతున్నది. ఇప్పటికైనా ట్రాఫిక్ పోలీసులు స్పందించి వీటిని తొలగించి అద్దెలు వసూలు చేస్తున్న ఇంటి యజమానులపై క్రిమినల్ కేసులు పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

నీటి సరఫరాపై బస్తీవాసుల్లో అయోమయం

పీజేఆర్ ఎస్పీఆర్‌హిల్స్ సంఘం అధ్యక్షుడు వేముల యాదయ్య



రహమత్‌నగర్: అధికార, ప్రతిపక్ష నాయకుల ప్రకటనలతో రిజర్వాయర్ ద్వారా మంచినీరు ఎప్పుడు వస్తుందోనని బస్తీవాసులు అయోమయం చెందుతున్నారని పీజేఆర్ ఎస్పీఆర్ హిల్స్ ఉమ్మడి బస్తీ ఐక్యత సంఘం నాయకులు వాపోయారు. ఎస్పీఆర్‌హిల్స్ పీజేఆర్ ఆలయ ఆవరణలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆ సంఘం అధ్యక్షుడు వేముల యాదయ్య మాట్లాడుతూ రహమత్‌నగర్, బోరబండ డివిజన్‌లోని చాలా బస్తీల్లో నేటికి సక్రమంగా మంచినీరు సరఫరా కాక అక్కడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల అధికార, ప్రతిపక్ష నాయకులు రిజర్వాయర్‌ను సందర్శించి చేసిన ప్రకటనలతో బస్తీవాసులకు స్పష్టత లేకుండా పోయిందన్నారు. రెండు డివిజన్‌లోని బస్తీలకు త్వరితగతిన రిజర్వాయర్ ద్వారా నీరందించాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో తాము ఆందోళనకు సిద్ధమవుతామని తెలిపారు. ఈ సమావేశంలో సంఘం చైర్మన్ సీతారాంరెడ్డి, కోశాధికారి బాలయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీ రాగిని యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

అక్రమ పార్కింగ్‌లతో నిత్యం ట్రాఫిక్ జాం..!


తాజ్‌మహల్ హోటల్ ముందు భారీగా నిలిచిన వాహనాలు

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్-92లోని తాజ్‌మహల్ హోటల్ ముందు అక్రమ పార్కింగ్‌లతో నిత్యం ట్రాఫిక్‌జాం అవుతుంది. రోడ్డు పక్కన విచ్చలవిడిగా అక్రమ పార్కింగ్ చేస్తుండటంతో అసలే ఇరుకుగా ఉన్న ఈ రోడ్డులో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. ఈ హోటల్‌కు వస్తున్న కస్టమర్లకు అనుగుణంగా పార్కింగ్ సౌకర్యం లేకపోవడంతో వాహనాలను దర్జాగా రోడ్డు పక్కన నిలుపుతున్నారు. అంతేకాకుండా తాజ్‌మహల్ హోటల్ యాజమాన్యం మరింత దౌర్జన్యంగా ఎదురుగా ఉన్న కేబీఆర్ పార్కు, జీహెచ్ఎంసీ పార్కింగ్ స్థలాన్ని కూడా పూర్తిగా ఆక్రమించేసింది. ఇంత జరుగుతున్నా జూబ్లీహిల్స్ ట్రాఫిక్ పోలీసులు పట్టించుకున్న పాపానపోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. పార్కుకు వాకింగ్‌కు వచ్చేవారు ఈ పార్కింగ్ స్థలంలో వాహనాలు నిలుపుదామంటే ఉదయం, సాయంత్రం వేళల్లో ఈ హోటల్ కస్టమర్ల వాహనాలతో నిండిపోతుందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ హోటల్ భవనానికి సరిపడా పార్కింగ్ సౌకర్యం ఏర్పాటు చేయడంలో యాజమాన్యం పూర్తిగా విఫలమైంది. దీంతో ఫుట్‌పాత్‌తో పాటు రోడ్లపైనే అక్రమ పార్కింగ్‌లు ఇబ్బందిగా మారాయి. ఇప్పటికైనా ట్రాఫిక్ పోలీసులు ఈ అక్రమ పార్కింగ్‌లపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

'కాంగ్రెస్‌ది ప్రజా ప్రభుత్వం కాదు.. అణచివేసే ప్రభుత్వం'



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రాంబాబు నాయక్

పంజగుట్ట: రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం కాదు ప్రజలు, అణగారిన వర్గాలను అణచివేసే ప్రభుత్వం నడుస్తుందని సేవాలాల్ సేన రాష్ట్ర అధ్యక్షులు ఆంగోత్ రాంబాబు నాయక్ ఆరోపించారు. వికారాబాద్ జిల్లా, లగచర్ల ఫార్మ బాధితులు అమాయక గిరిజనులను అరెస్టు చేసి ఒక్కొక్కరిపై ఏడు సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి వారిని చిత్రహింసలు పెట్టడం సరికాదన్నారు. గిరిజనుల ఓట్లతో గెలిచిన రేవంత్ ప్రభుత్వం గిరిజనులను అణచివేసేందుకు యతిస్తే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని ఆయన హెచ్చరించారు. ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పాలన, ఆలోచనా విధానాలు పిచ్చోడి చేతికి రాయి ఇచ్చినట్లుగా ఉందన్నారు. అభివృద్ధికి ఎవ్వరూ అడ్డుకాదని, కానీ అమాయక గిరిజనులను అణచివేసి, వారిపై థర్డ్‌డిగ్రీ ప్రయోగించి అభివృద్ధి చేస్తామనడం దారుణమన్నారు. వెంటనే ఫార్మ ఏర్పాటుకు 1400 ఎకరాల లంబాడీల భూసేకరణ ఆపాలని, రైతులపై పెట్టిన కేసులు వెంటనే ఉపసంహరించుకొని వారిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లగచర్ల బాధితులకు న్యాయం జరిగేవరకు సేవాలాల్ సేన వారికి అండగా ఉంటుందని పేర్కొన్నారు. ఇదే విషయమై గాంధీభవన్‌లో సోమవారం కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్‌లకు వినతి పత్రం ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు రవినాయక్, రవి రాథోడ్, సునీత, బానోత్ రవీందర్ నాయక్, ఆంగోతు మోతిలాల్ నాయక్, రఘు పాల్గొన్నారు.

డిసెంబర్ 15న '5కె రన్ ఫర్ గోమాత'

కాచిగూడ: గోమాతకు జాతీయ తల్లి హోదా కల్పించాలని శ్రీ దక్షిణేశ్వర్ కేదారనాథ్ టెంపుల్ ట్రస్ట్, మేడ్చల్ సర్వదళ గోరక్షణ మండలి జాతీయ అధ్యక్షుడు జయపాల్ సింగ్ నయాల్ డిమాండ్ చేశారు. ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గో సంరక్షణను ప్రోత్సహించి, గోమాతకు జాతీయ తల్లి హోదా కల్పించేందుకు ఒక బలమైన ఉద్యమాన్ని నిర్మించడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. గోమాతకు జాతీయ తల్లి హోదా కల్పించాలని డిమాండ్ చేస్తూ డిసెంబర్ 15న ఆదివారం హైదరాబాద్ నెక్లెస్ రోడ్డులో '5కె రన్ ఫర్ గోమాత' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన వెల్లడించారు.


పోస్టర్ ఆవిష్కరిస్తున్న జయపాల్ సింగ్

బిర్సా ముండా పోరాటం చిరస్మరణీయం


నివాళులు అర్పిస్తున్న దీపక్‌రెడ్డి, కుమార్ పవార్

రహమత్‌నగర్ (బోరబండ): బ్రిటీష్ పాలకుల అరాచాలకు వ్యతిరేకంగా బిర్సా ముండా పోరాడిన తీరు చిరస్మరణీయమని బీజేపీ జూబ్లీహిల్స్ నియోజకవర్గం నాయకుడు లంకల దీపక్‌రెడ్డి కొనియాడారు. బోరబండ డివిజన్‌లో బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి వాంకుడోతు కుమార్‌పవార్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన బిర్సా ముండా జయంతి వేడుకల్లో దీపక్‌రెడ్డి పాల్గొని నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రిటీష్ పాలకుల ప్రజావ్యతిరేక పాలనను ఎండగడుతూ ఆదివాసీలను ఏకం చేసి జంగ్ సైరన్ మోగించాడని కొనియాడారు. ఆదివాసీలు బిర్సా ముండాను స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ బీజేపీ అధ్యక్షుడు కొత్త వెంకటేశ్, షర్మిలాజాదవ్, అనంతలక్ష్మీ, గణేష్‌రెడ్డి, తంగలపెల్లి లక్ష్మణ్ , కృష్ణమోహన్, శరణ్‌రెడ్డి, నాగేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

సర్వేకు ప్రజలు సహకరించాలి


సర్వే వివరాలను పరిశీలిస్తున్న కుమారస్వామి

లిబర్టీ: సమగ్ర సర్వే జరుగుతున్న తీరును బీసీ దళ్ జాతీయ అధ్యక్షులు డి. కుమారస్వామి పరిశీలించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న సమగ్ర కుటుంబ సర్వేలో సమగ్రంగా వివరాలు సేకరిస్తున్నారా అన్న అంశంపై ఆయన ఎన్యుమరేటర్లను ఆరా తీశారు. బీసీలు, ఎస్టీలు, మైనార్టీలు ఇతర వర్గాలు అన్ని సామాజిక వర్గాలు సర్వేకు సహకరిస్తున్నారని ఎన్యుమరేటర్లు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాలకు సంక్షేమ ఫలాలు అందాలంటే పూర్తిస్థాయిలో వివరాలు ఉంటేనే అది సాధ్యమవుతుందన్నారు. సర్వేకు వచ్చిన ఎన్యుమరేటర్లకు ప్రజలు పూర్తి సహకారాలు అందించాలని ఆయన కోరారు.

రహమత్‌నగర్‌లో సీపీఎం నాయకుల ప్రచారం


ప్రచారం నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

రహమత్‌నగర్: సీపీఎం నగర మహాసభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు రహమత్‌నగర్ డివిజన్‌లోని పలు బస్తీల్లో వారు పర్యటించి కరపత్రాలు అందచేస్తూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రహమత్‌నగర్ డివిజన్ పార్టీ కార్యదర్శి జూకటిస్వామి మాట్లాడుతూ ఈనెల 30, డిసెంబర్ 1వ తేదీల్లో వెంగళరావునగర్ శ్రీనివాస్‌నగర్ వెస్ట్ కమ్యూనిటీ హాల్లో జరిగే 23వ నగర మహాసభలకు విజయవంతం చేయాలని కోరారు. రహమత్‌నగర్ డివిజన్ నుంచి అత్యధికంగా పార్టీ శ్రేణులు, కార్మికసంఘాల నాయకులు సభలకు తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో నగర నాయకులు వెంకటేశ్, దశరథ్, జోన్ నాయకులు అశోక్, శేషగిరిరావు, దేవదాస్, పార్వతమ్మ, సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

బంజారాహిల్స్: అనుమానాస్పదస్థితిలో ఓ యువకుడు మృతి చెందిన ఘటన జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే... నంద్యాల సమీపంలోని నందికొట్కూరుకు చెందిన మంగలి సురేష్‌బాబు (30) కొంతకాలంగా శ్రీకృష్ణానగర్‌లోని స్టైస్ హెయిర్ కటింగ్ సెలూన్‌లో పనిచేసేవాడు. ఇటీవల తన స్వగ్రామానికి వెళ్లి తిరిగి శనివారం సాయంత్రం వచ్చాడు. హెయిర్ కటింగ్ సెలూన్ యజమాని ప్రభాకర్‌తో మళ్లీ ఇక్కడే పని చేస్తానని చెప్పి శనివారం రాత్రి సెలూన్‌లోనే పడుకున్నాడు. ఆదివారం ఉదయం ప్రభాకర్ సెలూన్‌కు వచ్చి తలుపు తట్టగా షట్టర్ తెరవలేదు. ఎంతకూ తెరవకపోయేసరికి చుట్టుపక్కల వారి సహాయంతో షట్టర్‌ను తెరవగా సెలూన్‌లో సురేష్‌బాబు ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించాడు. వెంటనే ప్రభాకర్ పోలీసులకు సమాచారం ఇచ్చాడు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అయితే మద్యానికి బానిసైన సురేష్‌బాబు భార్య, ముగ్గురు పిల్లలను వదిలేసి హైదరాబాద్‌లో ఉంటున్నట్లుగా పోలీసులు గుర్తించారు.

భవన నిర్మాణ వ్యర్థాలను తొలగించిన హైడ్రా

సాక్షి ఎఫెక్ట్..

బంజారాహిల్స్: 'కూల్చి వారం దాటినా మొదలుకాని రోడ్డు పనులు' శీర్షికన ఆదివారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి హైడ్రా స్పందించింది. కూల్చిన ప్రాంతంలో డెబ్రీస్‌ను పూర్తిగా తొలగించారు. ఫిలింనగర్ రోడ్డునెంబర్-9లో సొసైటీకి చెందిన ఖాళీ స్థలంలో ఫిలింనగర్ సొసైటీ మహిళా కల్చరల్ సెంటర్ భవనాన్ని నిర్మించారు. అయితే ఈ స్థలం రోడ్డుకు చెందినదని ఫిర్యాదులు రావడంతో ఈ నెల 9వ తేదీన హైడ్రా అధికారులు అక్రమ నిర్మాణాలను నేలమట్టం చేసి వెళ్లిపోయారు. అక్కడ డెబ్రీస్ అలాగే ఉండడం, రోడ్డు వేయకపోవడంతో ఈ స్థలం మళ్లీ కబ్జాకు గురయ్యే అవకాశం ఉందని 'సాక్షి' పత్రిక కథనాన్ని ప్రచురించింది. దీనికి స్పందించిన హైడ్రా కూల్చిన ప్రాంతంలో గుట్టలుగా పేరుకుపోయిన భవన నిర్మాణ వ్యర్థాలను లారీల ద్వారా తరలించారు. ఈ స్థలంలో రోడ్డు కూడా వేసేందుకు సిద్ధమవుతున్నారు.


నిర్మాణ వ్యర్థాలను తొలగిస్తున్న హైడ్రా సిబ్బంది

'నమ్మినందుకు నట్టేట ముంచారు'

న్యాయం చేయాలంటూ బిల్డర్ ఇంటి ఎదుట బాధితుల ధర్నా


సునీల్‌కుమార్ ఆహుజ ఇంటి ముందు ధర్నా చేస్తున్న బాధితులు

బంజారాహిల్స్: కొంపల్లిలోని సినీ ప్లానెట్ పక్కన సిద్ధి కన్వెన్షన్ వెనుక ఆరున్నర ఎకరాల్లో 650 ఫ్లాట్లు నిర్మిస్తున్నామంటూ 2020 అక్టోబర్‌లో ప్రీ లాంచింగ్ ముసుగులో 450 మంది బాధితుల నుంచి రూ.70 కోట్లు వసూలు చేసి మోసగించిన బిల్డర్ ఫైనాన్షియర్ ఇంటి ముందు బాధితులు ఆదివారం ఉదయం ధర్నా నిర్వహించారు. ఫైనాన్షియర్ సునీల్‌కుమార్ ఆహుజ బిల్డర్‌తో కుమ్మక్కై రూ.200 కోట్ల విలువైన భూమిని ఫ్రీగా కొట్టేద్దామని చూస్తున్నాడని, తమకు న్యాయం చేయాలంటూ బ్యానర్లు, ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ 2020 అక్టోబర్‌లో సినీ ప్లానెట్ వెనుక ఆరున్నర ఎకరాల స్థలంలో ఫ్లాట్లు నిర్మించడానికి భారతి బిల్డర్స్ అధినేతలు ములుకూరి శివరామకృష్ణ, ధూపాటి నాగరాజులు ఇచ్చిన ప్రకటన చూసి ఆకర్షితులమయ్యామని, 450 మంది వరకు ఒక్కొక్కరు రూ.10 లక్షల చొప్పున ప్రీ లాంచింగ్‌లో మొత్తం రూ.70 కోట్లు చెల్లించామన్నారు. ల్యాండ్ రిజిస్ట్రేషన్ అయ్యిందని, కస్టమర్లకు ఎంఓయూలు కూడా ఇచ్చారన్నారు. అయితే ములుకూరి శివరామకృష్ణ, ధూపాటి నాగరాజు ఇద్దరూ కలిసి కస్టమర్ల నమ్మకాన్ని వమ్ము చేస్తూ ఈ స్థలాన్ని ఎమ్మెల్యే కాలనీకి చెందిన ఫైనాన్షియర్ సునీల్‌కుమార్ ఆహుజా వద్ద ఏడాదికి 48 శాతం వడ్డీతో రూ.38 కోట్లు అప్పుగా తీసుకుని తనఖా పెట్టారన్నారు. వడ్డీ రూపంలో నెలకు రూ.2 కోట్లు చెల్లిస్తూ వచ్చారన్నారు. వడ్డీలు కట్టడం ఆపేశాక ఈ స్థలాన్ని సునీల్‌కుమార్ ఆహుజ తన పేరుపై సేల్‌డీడ్ చేయించుకున్నారని ఆరోపించారు. సునీల్‌కుమార్ ఆహుజ శ్రీ భారతి బిల్డర్స్ పేరుతో మరో సంస్థను ఏర్పాటు చేసి ఇక్కడ ఇళ్లు నిర్మించేందుకు ఒప్పందం కుదుర్చుకుని రూ.6 కోట్లు హెచ్ఎండీఏకు ఫీజు కూడా చెల్లించాడన్నారు. ఈ మోసాన్ని గ్రహించిన తాము గత ఏప్రిల్‌లో గచ్చిబౌలి సీసీఎస్‌లో మోసగాళ్లపై చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలంటూ ఫిర్యాదు చేశామని తెలిపారు. దీంతో భారతి బిల్డర్స్ అధినేతలు ములుకూరి శివరామకృష్ణ, ధూపాటి నాగరాజు, పొన్నారి, సునీల్‌కుమార్ ఆహుజ, ఆశీష్‌కుమార్ ఆహుజలపై సీసీఎస్ పోలీసులు చీటింగ్ కేసు నమోదు చేశారని తెలిపారు. ఈ కేసు నుంచి సునీల్‌కుమార్ ఆహుజ, ఆశీష్‌కుమార్ ఆహుజ ఇద్దరూ అరెస్టు కాకుండా తప్పించుకునేందుకు దుబాయ్‌కు పారిపోయారన్నారు. శివరామకృష్ణ, నాగరాజు, పొన్నారి తదితరులను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారని పేర్కొన్నారు. ఇంత జరుగుతున్నా తమకు న్యాయం చేయకపోగా, ఈ ఆరున్నర ఎకరాల స్థలాన్ని కబ్జా చేసేందుకు సునీల్‌కుమార్ ఆహుజ యత్నిస్తూ గేటుకు తాళం కూడా వేసుకున్నాడని, సేల్‌కమ్ ఏజీపీ కూడా చేయించుకున్నాడని ఆరోపించారు. ఇప్పటికైనా తమకు భూమి లేదా చెల్లించిన డబ్బుకు 12 శాతం వడ్డీతో తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఆపరేషన్ లేకుండా వాల్వ్ మార్పిడి!

- సరికొత్త విధానాలు, పద్ధతులపై చర్చ
- ముగిసిన హైదరాబాద్ వాల్వ్స్‌-2024

సాక్షి, సిటీబ్యూరో: శస్త్రచికిత్సతో పనిలేకుండా వాల్వ్ మార్పిడి పద్ధతుల(టీఏవీఐ, టీఎంవీఆర్, టీపీవీఆర్)ను అభివృద్ధి చేయడం లక్ష్యంగా 2019లో ఏర్పాటైన హైదరాబాద్ వాల్వ్స్ మూడో ఎడిషన్ రెండు రోజుల సమావేశం ఆదివారం పార్క్ హయత్‌లో ముగిసింది. 2002లో ప్రపంచంలో తొలి ట్రాన్స్‌కాథెటీర్ ఆర్టిక్ వాల్వ్ మార్పిడి(టీఏవీఆర్) నిర్వహించిన ప్రొఫెసర్ అలైన్ క్రిబియర్ జ్ఞాపకార్థం ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హైదరాబాద్ వాల్వ్స్ సీనియర్ కార్డియాలజిస్ట్ డాక్టర్ పీసీ రథ్ మాట్లాడుతూ కార్డియాలజిస్టులు ఒకే వేదికపైకి వచ్చి ఎన్నో వినూత్న విషయాలను తెలుసుకునేందుకు ఈ కార్యక్రమం దోహదపడిందని పేర్కొన్నారు. మార్గదర్శకుల నుంచి మరిన్ని మెళకువలు నేర్చుకునేందుకు ఇది వేదికగా నిలిచిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో దేశ, విదేశాల నుంచి వచ్చిన ప్రముఖ కార్డియోథొరాసిక్ శస్త్రచికిత్స నిపుణులు, ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్టుల మార్గదర్శకత్వంలో 12 క్లిష్టమైన స్ట్రక్చరల్ హార్ట్ కేసులపై లోతైన చర్చలు జరిగాయన్నారు. కార్యక్రమంలో సీనియర్ కార్డియాలజిస్ట్ డాక్టర్ మనోజ్ కుమార్ అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు.



ప్రిమెచ్యూరిటీ డే అవగాహన వాకథాన్‌ను జెండా ఊపి ప్రారంభిస్తున్న నటుడు ఆది సాయికుమార్


వేడుకల్లో ఆది సాయికుమార్, డాక్టర్ బొల్లినేని భాస్కర్ రావు తదితరులు

జాగ్రత్తలతోనే ప్రిటర్మ్ పిల్లలు సురక్షితం

గచ్చిబౌలి: నెలలు నిండక ముందే పుట్టే(ప్రిటర్మ్) పిల్లల విషయంలో తల్లిదండ్రులు జాగ్రత్తగా ఉండాలని టాలీవుడ్ నటుడు ఆది సాయికుమార్ అన్నారు. ఆదివారం కొండాపూర్ కిమ్స్ కడల్స్ హాస్పిటల్ ఆధ్వర్యంలో 'ప్రపంచ ప్రీ మెచ్యూరిటీ డే'ను పురస్కరించుకొని నిర్వహించిన వాకథాన్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆది మాట్లాడుతూ అన్ని జాగ్రత్తలు తీసుకునే వైద్యులున్న చోట ప్రసవమయ్యేలా చూసుకుంటే పుట్టే పిల్లలకు ఇబ్బంది ఉండదన్నారు. కిమ్స్ గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ సీఎండీ డాక్టర్ బొల్లినేని భాస్కర్‌రావు మాట్లాడుతూ ప్రీ మెచ్యూరిటీపై అవగాహన కల్పించేందుకు వాకథాన్ నిర్వహించామని తెలిపారు. కిమ్స్ కడల్స్ నియోనాటాలజీ విభాగం క్లినికల్ డైరెక్టర్ డాక్టర్ అపర్ణ మాట్లాడుతూ ప్రతి ఎనిమిది మంది పిల్లల్లో ఒకరు నెలలు నిండక ముందే పుడుతున్నారని పేర్కొన్నారు. తల్లికి బీపీ, మధుమేహం ఉండటం, ముందుగానే నొప్పులు వస్తుండటంతో ప్రసవం చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పలువురు వైద్య నిపుణులు, పీడియాట్రీషియన్లు, నర్సులు, ఫిజియోథెరపిస్ట్‌లు తదితరులు పాల్గొన్నారు.

నగరంలో నేడు

- ఎన్టీఆర్ స్టేడియంలో కోటి దీపోత్సవం సాయంత్రం 5.30 నుంచి రాత్రి 9 గంటల వరకు జరుగుతుంది.
- గచ్చిబౌలిలోని ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజీ ఆఫ్ ఇండియా క్యాంపస్‌లోని సెంటినరీ కన్వెన్షన్ సెంటర్ ఆడిటోరియంలో సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు ప్రత్యేక హెల్త్ టాక్ కార్యక్రమం జరుగుతుంది.
- స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో గచ్చిబౌలి స్టేడియంలో ఫిఫా ఫ్రెండ్లీ ఫుట్‌బాల్ మ్యాచ్ రాత్రి 7.30 గంటలకు మొదలవుతుంది. కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభించనున్నారు.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

మెప్మా.. పనిభారమెట్లా చెప్మా!

40 మంది ఉద్యోగులు పనిచేయాల్సిన చోట విధుల్లో ముగ్గురే..

- భారంగా మారిన 7,245 మహిళా సంఘాల నిర్వహణ
- గ్రూపులకు రూ.26 కోట్లు, వ్యక్తిగత రుణాల పంపిణీ కష్టమే..
- అవగాహన కార్యక్రమాలపై పర్యవేక్షణ చేయలేక పాట్లు


మేడ్చల్ కలెక్టరేట్

సాక్షి,సిటీబ్యూరో: మేడ్చల్ జిల్లాలోని పట్టణ ప్రాంత పేద మహిళల ఆర్థిక స్వావలంబన లక్ష్యంగా ఇందిరా మహిళా శక్తి పథకం అమలుకు సిద్ధమవుతున్న మెప్మాకు సిబ్బంది కొరత తలకు మించిన భారమవుతోంది. నగర శివారు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో విస్తరిస్తున్న 13 పట్టణాల్లో 7,245 మహిళా స్వయం సహాయక సంఘాలు ఉండగా, వీటికి రుణాల పంపిణీ, ప్రభుత్వ పథకాల చేరవేత, మహిళలకు అవగాహన కార్యక్రమాల నిర్వహణ వంటి పర్యవేక్షణ చేపట్టటానికి మంజూరు పోస్టింగ్‌లకు అనుగుణంగా 40 మంది ఉద్యోగులు ఉండాల్సిన చోట ఒక జిల్లా అధికారి, ఇద్దరు ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. ఇందిరా మహిళా శక్తి పథకంపై మహిళలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించడానికి మెప్మా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తోంది. జిల్లాలో పీర్జాదిగూడ, బోడుప్పల్, నిజాంపేట, జవహర్‌నగర్, కొంపెల్లి, దుండిగల్, మేడ్చల్, గుండ్లపోచంపల్లి, తూముకుంట, నాగారం, దమ్మాయిగూడ, ఘట్‌కేసర్, పోచారం పురపాలక సంఘాలు, 7,245 మహిళా స్వయం సహాయక సంఘాలు ఉన్నాయి. ఇటీవల మరో 28 గ్రామ పంచాయతీలు ఏడు పురపాలక సంఘాలలో విలీనం కావటంతో మహిళా సంఘాల సంఖ్య పదుల సంఖ్యలో పెరిగే అవకాశముంది.

- ఆయా సంఘాల్లోని మహిళలకు ఇందిరా మహిళా శక్తి పథకం కింద ఉపాధి కల్పనకు రూ.51 కోట్లు వెచ్చిస్తున్నారు. 130 మహిళా గ్రూపులకు ఉపాధి కల్పనలో భాగంగా రూ.26 కోట్లు వెచ్చిస్తుండగా, వ్యక్తిగత ఉపాధి సంస్థల ఏర్పాటుకు సంబంధించి 900 మంది మహిళలకు రూ.25 కోట్లు అందజేయటానికి చర్యలు తీసుకుంటున్నారు. ఈ కార్యక్రమాలన్నీ విజయవంతంగా నిర్వహించటానికి మెప్మా జిల్లా కార్యాలయంలో ఒక జిల్లా స్థాయి అధికారితోపాటు ఇద్దరు ఉద్యోగులు మాత్రమే ఉండటం వల్ల ప్రభుత్వ ప్రాధాన్యతా కార్యక్రమాలు, పథకాలు కుంటుపడుతున్నాయి.
- విధులు నిర్వహిస్తున్న అధికారి, ఇద్దరు ఉద్యోగులు పనిభారంతో నానా ఆగచాట్లకు గురవుతున్నారు. ఏదైనా పనిపై ఫీల్డ్‌కు వెళ్లితే... జిల్లా కార్యాలయం ఖాళీ కుర్చీలతో దర్శనమిస్తోందని పలు మహిళా సంఘాల గ్రూపు లీడర్లు వాపోతున్నారు.
- మహిళా గ్రూపుల్లో అర్హులైన సభ్యులకు ప్రభుత్వం అందించే రుణాలు పంపిణీ చేయటంతోపాటు ఉపాధికి సంబంధించిన యూనిట్లు ఏర్పాటు చేసుకునేలా మెప్మా పర్యవేక్షణ చేయాల్సి ఉంటోంది. ఉపాధి యూనిట్లలో భాగంగా మహిళా సంఘాలు, ఇందులోని సభ్యులు క్యాంటీన్లు, మీసేవా కేంద్రం, ఈవెంట్ మేనేజ్‌మెంట్, స్ట్రీట్ వెండర్ కలెక్టివ్స్/కోల్డ్ స్టోరేజీ, క్యాటరింగ్ సర్వీస్, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ తదితరాలతోపాటు వ్యక్తిగత ఉపాధి కింద కూరగాయలు, పండ్ల దుకాణాలు, బేకరీ, డెయిరీ, డెయిరీ ప్రొడక్ట్స్, మైక్‌సెట్స్, సౌండ్‌సెట్స్, బ్యూటీ వెల్నెస్ సెంటర్స్, టెంట్ హౌస్, ఫ్యాన్సీ స్టోర్, కిరాణ, జనరల్ స్టోర్స్, ఫుడ్‌కు సంబంధించినవి ఏర్పాటు చేయటంలో మెప్మా చురుకైన భూమిక నిర్వహించాల్సి ఉంటుంది. సరిపడా సిబ్బంది లేని కారణంగా ఇబ్బందులు తప్పటం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై ఉన్నతాధికారులకు తాజా పరిస్థితిని నివేదించిన సంబంధిత జిల్లా అధికారులు మంజూరు పోస్టింగ్‌లకు అనుగుణంగా ఉద్యోగుల భర్తీపై కొండంత ఆశతో ఎదురు చూస్తున్నారు.

గ్రూప్ 3 పరీక్షాకేంద్రాల తనిఖీ


ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గ్రూప్‌-3 పరీక్షలను తనిఖీ చేసిన మేడ్చల్ కలెక్టర్ గౌతమ్ పోట్రు

కూకట్‌పల్లి: తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో ఆదివారం కూకట్‌పల్లిలోని హోలీమేరీ, అవినాశ్ డిగ్రీ కాలేజీలు, ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో జరుగుతున్న గ్రూప్‌-3 పరీక్షలను మేడ్చల్‌-మల్కాజ్‌గిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ పోట్రు తనిఖీ చేశారు. ఆయా గదుల్లో పరీక్ష నిర్వహణ తీరును ఆమర పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయని అన్నారు.

ఉప్పల్‌లో జిల్లాస్థాయి తైక్వాండో పోటీలు



ఉప్పల్: జిల్లా స్థాయి తైక్వాండో పోటీలు ఆదివారం ఉప్పల్‌లోని లక్ష్మారెడ్డి కాలనీ కమ్యూనిటీ హాల్‌లో జరిగాయి. ఈ పోటీలకు మేడ్చెల్‌లోని వివిధ అకాడెమీలు, పాఠశాలలకు చెందిన 165 మంది బాలబాలికలు హాజరయ్యారు. కాలనీ అధ్యక్షుడు ఎం.హనుమంతరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. జిల్లా తైక్వాండో అసోసియేషన్ అధ్యక్షుడు డి.సుధీర్, కార్యదర్శి జి.శివకుమార్, కోచ్ పృథ్వీ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో విజేతలకు పతకాలు అందించారు.

మహేష్‌కుమార్ గౌడ్‌కు ఇందిరాగాంధీ అవార్డు



చార్మినార్: కాంగ్రెస్ పార్టీలో మూడు దశాబ్దాలుగా ఎనలేని కృషి చేస్తున్న టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్ గౌడ్‌ను ఈఏడాది ఇందిరాగాంధీ ఎక్స్‌లెన్సీ అవార్డు–2024కు ఎంపిక చేసినట్లు తెలంగాణ మేధావుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రాజ్‌నారాయణ ముదిరాజ్ తెలిపారు. జాతీయ సమైక్యత, మత సామరస్యం, శాంతి స్థాపనకు ప్రజల్లో ఎన్నో చైతన్య కార్యక్రమాలు చేపట్టినందుకు ఆయనను ఈ అవార్డుకు ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా సోమవారం నార్సింగిలోని తన నివాసంలో ఆయనకు ఈ అవార్డు అందజేయనున్నట్లు డాక్టర్ రాజ్‌నారాయణ ముదిరాజ్ తెలిపారు.

662 మంది బాలికలకు సైకిళ్ల పంపిణీ

ఉత్సాహంగా రోటరీ క్లబ్ గవర్నర్స్ మీట్



సనత్‌నగర్: రోటరీ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ నార్త్ (డిస్ట్రిక్ట్ 3150) ఆధ్వర్యంలో బేగంపేటలోని టూరిజం ప్లాజా హోటల్‌లో ఆదివారం 'గవర్నర్స్ మీట్'నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణతోపాటు ఏపీలోని కొన్ని జిల్లాలకు చెందిన 662 మంది పేద విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన డిస్ట్రిక్ట్ గవర్నర్ శరత్‌చౌదరి మాట్లాడుతూ సామాజిక సేవలో రోటరీ క్లబ్ ప్రతినిధులు ముందువరుసలో ఉండాలన్నారు. బాలిక విద్యను మరింత ప్రోత్సహించే విధంగా వారికి సైకిళ్లను అందజేసినట్లు చెప్పారు. ఆడ పిల్లలు చదువుకుంటేనే సమాజ వికాసం సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ గవర్నర్ శైలేష్ గుమ్మిడెలి, మోహన్ వంశీ, క్లబ్ అధ్యక్షుడు బీఆర్‌వీ సుశీల్‌కుమార్, సెక్రటరీ వెంకట మురళి, కోశాధికారి నరేష్ రామన్, హరిహర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా వసతిగృహాలపై నిఘా

- ఐటీ కారిడార్‌లో సేఫ్టీ స్టే ప్రాజెక్ట్
- సీసీ కెమెరాలు, రికార్డ్‌ల తనిఖీలు

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్‌లో ఐటీ, ఐటీఈఎస్ రంగంలో గ్లోబల్ కంపెనీలు పెరుగుతున్నాయి. దేశవ్యాప్తంగా ఐటీ, ఐటీఈఎస్ నిపుణులు మెరుగైన ఉద్యోగాల కోసం నగరానికి తరలివస్తున్నారు. ఇక్కడ పనిచేయడం, నివాసం ఉండటం సురక్షితంగా భావిస్తున్నారు. ఐటీ విభాగంలో మహిళలు పెద్దసంఖ్యలో ఉంటున్నారు. వీరిలో చాలామంది సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని వసతిగృహాలు, పేయింగ్ గెస్ట్‌హౌస్‌లు, హాస్టళ్లలో ఉంటున్నారు. సైబరాబాద్‌లోని ఐటీ కారిడార్‌లో నివసిస్తున్న మహిళా ఉద్యోగులకు భద్రమైన, సురక్షితమైన వాతావరణాన్ని కల్పించేందుకు సైబరాబాద్ ఉమెన్ అండ్ చైల్డ్ సేఫ్టీ వింగ్ పోలీసులు కట్టుదిట్టమైన ప్రణాళికలు చేపడుతున్నారు.

సేఫ్ స్టే ప్రాజెక్ట్..

సైబరాబాద్ ఉమెన్ సేఫ్టీ విభాగం సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్(ఎస్సీఎస్సీ)తో కలిసి అనేక కార్యక్రమాలను చేపడుతోంది. ఇందులో భాగంగా తాజాగా ఐటీ కారిడార్‌లోని మహిళా ఉద్యోగుల భద్రత కోసం 'సేఫ్ స్టే'ప్రాజెక్ట్‌ను ప్రారంభించింది. మహిళా ఉద్యోగులు ఉంటున్న పేయింగ్ గెస్ట్‌లు, హాస్టళ్లలోని రక్షణ, భద్రతా చర్యలను సమీక్షించడమే ఈ ప్రాజెక్ట్ ముఖ్య ఉద్దేశం. వసతి గృహాల్లోని సీసీటీవీ కెమెరాలు, రికార్డుల నిర్వహణ తదితరాలను తనిఖీ చేస్తారు. ఇప్పటివరకు 267 హాస్టళ్లను ఆడిట్ చేశామని, మాదాపూర్ జోన్ పరిధిలోని ఆరు క్లస్టర్లలో వచ్చే మూడు నెలల్లో వివిధ దశల్లో ఆడిట్ ఉంటుందని ఉమెన్ అండ్ చైల్డ్ సేఫ్టీ వింగ్ డీసీపీ సృజన కర్ణం తెలిపారు. ఎస్సీ, ఎస్సీ, మహిళా విభాగానికి చెందిన 50 మంది వాలంటీర్లు, షీ టీమ్స్ ఈ ఆడిట్‌లను నిర్వహిస్తారని పేర్కొన్నారు.

రేవంత్ పాలనలో పేదలకు ప్రశాంతత లేదు: ఈటల

చైతన్యపురి: రాష్ట్రంలో రేవంత్ ప్రభుత్వం వల్ల పేదలకు ప్రశాంతత లేకుండా పోయిందని మల్కాజ్‌గిరి పార్లమెంటు సభ్యుడు ఈటల రాజేందర్ విమర్శించారు. మూసీ నిద్ర కార్యక్రమం ముగింపు సందర్భంగా ఆదివారం చైతన్యపురిలో విలేకరులతో ఆయన మాట్లాడారు. తాను రాజకీయాల కోసం మాట్లాడటం లేదని, 25 ఏళ్లుగా తెలంగాణ ప్రజల దుఃఖాన్ని చూసిన వాడినని అన్నారు. ముఖ్యమంత్రి అహంకార పూరిత మాటలతో ప్రజాక్షేత్రంలో తిరగలేరని, గత ఐదు నెలలుగా హైదరాబాద్ ప్రజలకు కంటిమీద కునుకు లేదని పేర్కొన్నారు. కనీసం నోటీసులు ఇవ్వకుండానే చెరువుల పక్కన ఉన్న ఇళ్లు కూల్చారని, ఇళ్లలో సామాను తీసుకునే సమయం కూడా ఇవ్వకుండా బూటు కాళ్లతో తన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏదో ఉద్ధరిస్తారని కాంగ్రెస్‌కు ఓటు వేస్తే, గూడు లేకుండా చేసి తమ బతుకుల్లో మట్టికొట్టారని ప్రజలు గగ్గోలు పెడుతున్నారని అన్నారు. డెలివరి అయ్యేవరకు ఇల్లు కూల్చొద్దని గీత అనే తొమ్మిది నెలల గర్భిణీ ప్రాధేయపడినా ప్రభుత్వం చలించటం లేదని ఈటల విమర్శించారు. చైతన్యపురిలో మహేష్ అనే వ్యక్తి పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు యత్నించాడని, లక్ష్మమ్మ అనే స్థానికురాలికి హార్ట్ ఎటాక్ వచ్చిందని పేర్కొన్నారు. మూసీ పరిసరాల్లోని విలువైన భూములపై రేవంత్ కన్నుపడిందని ఆరోపించారు. ప్రజలు వెంట పడి తరిమేరోజు దగ్గరలోనే ఉందని హెచ్చరించారు. సమావేశంలో చైతన్యపురి కార్పొరేటర్ రంగా నర్సింహ గుప్త, కొత్తపేట కార్పొరేటర్ పవన్‌కుమార్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి, నాయకులు రుద్రారపు శంకర్, వినోద్‌యాదవ్, ఫణిగిరి కాలనీవాసులు పాల్గొన్నారు.


విలేకరులతో మాట్లాడుతున్న ఎంపీ ఈటల రాజేందర్

కంటోన్మెంట్‌కు రాష్ట్ర ప్రభుత్వం నిధులు ఇవ్వలేదు

బోర్డు సభ్యుడు రామకృష్ణ

కంటోన్మెంట్: ఎలివేటెడ్ కారిడార్‌ల కోసం అప్పగించిన కంటోన్మెంట్ భూముల పరిహారం విషయంలో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అవగాహనా రాహిత్యంతో మాట్లాడుతున్నారని, కంటోన్మెంట్ బోర్డు సివిలియన్ నామినేటెడ్ సభ్యుడు రామకృష్ణ అన్నారు. ఆదివారం ఇక్కడ ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కంటోన్మెంట్‌కు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి నిధులు విడుదల కాలేదన్నారు. ప్రతిపాదిత ఎలివేటెడ్ కారిడార్‌ల కోసం కంటోన్మెంట్ బోర్డు 24.6 ఎకరాల భూమిని అప్పగించిందని, ఇందుకుగానూ రాష్ట్ర ప్రభుత్వం రూ.323 కోట్లు చెల్లించాల్సి ఉందన్నారు. ఈ నిధులను కేంద్ర ప్రభుత్వ కన్సాలిడేటెడ్ ఫండ్‌లో జమ చేయకుండా, అంతే విలువ కలిగిన పనుల కోసం కేటాయించాలని బోర్డు తరపున కేంద్రాన్ని కోరామని చెప్పారు. కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్, ఎంపీ ఈటల విజ్ఞప్తుల మేరకు రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సానుకూలంగా స్పందించారని తెలిపారు. దీనికి సంబంధించి తాను ఐదు నెలలుగా రాసిన లేఖల ప్రతులను రామకృష్ణ బహిర్గతం చేశారు. పరిహారం నిధులు కంటోన్మెంట్‌కు దక్కేలా చేయడంలో సీఈఓ మధుకర్ నాయర్ సైతం ఎంతో కృషి చేశారని తెలిపారు. ఈ నేపథ్యంలోనే రాష్ట్ర ప్రభుత్వం ఆ నిధులతో కంటోన్మెంట్‌లో డ్రైనేజీ, నాలాల అభివృద్ధికి ముందుకొచ్చిందన్నారు. ఇందులో రాష్ట్ర ప్రభుత్వం చేసిందేమీ లేదన్నారు. పరిహారం నిధులతో పనులు చేపడుతూ, అవి రాష్ట్ర ప్రభుత్వ నిధులని చెప్పడం మంత్రి అవగాహనా రాహిత్యానికి నిదర్శనమని అన్నారు.


మాట్లాడుతున్న బోర్డు సభ్యుడు రామకృష్ణ

మూసీ బాధితులకు బీజేపీ భరోసా: ఎంపీ


మూసీ పరీవాహక బాధితులతో మాట్లాడుతున్న కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

బండ్లగూడ: మూసీ నదీ పరీవాహక బాధితులకు బీజేపీ అండగా ఉంటుందని చేవెళ్ల పార్లమెంట్ సభ్యుడు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి హామీ ఇచ్చారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ హైదర్ షా కోట్, విఘ్నేశ్వర కాలనీ, గ్రీన్ హౌస్‌లలో బీజేపీ నాయకులు మూసీ నిద్ర కార్యక్రమం చేపట్టారు. విశ్వేశ్వర్‌రెడ్డి, మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు ప్రేమోదర్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డిలు ఆదివారం ఉదయం మూసీ పరీవాహక ప్రాంతంలోని పలు బస్తీల్లో పర్యటించి బాధితులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా విశ్వేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ మూసీ పరీవాహక ప్రాంతంలో గత కాంగ్రెస్ ప్రభుత్వమే ఇళ్ల నిర్మాణాలకు అనుమతులు ఇచ్చిందని, ఇప్పుడే అదే కాంగ్రెస్ ప్రభుత్వం ఇళ్లు రివర్ బెడ్‌లో, బఫర్ జోన్‌లో ఉన్నాయంటూ కూల్చేందుకు ప్రయత్నిస్తోందని విమర్శించారు. బాధితుల ఇళ్లను కూల్చకుండా తమ పార్టీ పోరాడుతుందని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పేందుకు ప్రజలంతా సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

వెన్నెల గద్దర్‌కు సత్కారం



అల్వాల్: రాష్ట్ర సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్‌గా నియమితులైన ప్రజాయుద్ధనౌక గద్దర్ కుమార్తె వెన్నెల గద్దర్‌ని ఆదివారం పలువురు ప్రజాసంఘాలు, యూనియన్ నాయకులు, అభిమానులు శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లా ఏఐటీయూసీ డిప్యూటీ జనరల్ సెక్రటరీ జి.మహేందర్, ఏఐటీయూసీ మున్సిపల్ అవుట్‌సోర్సింగ్ అల్వాల్ ప్రధాన కార్యదర్శి సయ్యద్ కౌసర్, డీఎస్.శేఖర్ తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు వెంకటాపురంలోని గద్దర్ స్మృతివనం వద్ద వెన్నెల నివాళులు అర్పించారు. గద్దర్ ప్రజల మనిషి అని, జీవితాంతం ప్రజల కోసమే పనిచేశారని ఆమె అన్నారు. తనకు ఈ బాధ్యతలు అప్పగించడం ద్వారా గద్దర్‌ని గౌరవించినట్టు అయిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఇతర మంత్రులు, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌లకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గద్దర్ సతీమణి విమల గద్దర్, గుండి నగేష్ తదితరులు పాల్గొన్నారు.

సుల్తానాకు అబుల్ కలాం ఆజాద్ పురస్కారం

నాంపల్లి: కేంద్ర తొలి విద్యాశాఖ మంత్రి, దివంగత మౌలానా అబుల్ కలాం ఆజాద్ గొప్ప పరిపాలనాదక్షుడని, నిరంతరం విద్యా వ్యాప్తి కోసం పరితపించాడని మాజీమంత్రి రవీంద్ర నాయక్ కీర్తించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాల మాజీ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ సయ్యదా తలత్ సుల్తానాకు మౌలానా అబుల్ కలాం ఆజాద్ పురస్కారాన్ని అందజేశారు. ఈ పురస్కారం సియాసత్ ఉర్దూ దినపత్రిక కార్యాలయంలో తెలంగాణ ఉర్దూ ఫోరం, మజర్ ఎడ్యుకేషన్ సొసైటీ సంస్థల సంయుక్తాధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన రవీంద్ర నాయక్ మాట్లాడుతూ ప్రతి ఏటా జాతీయ విద్యాదినోత్సవాలను నిర్వహిస్తూ జాతిని జాగృతం చేసే కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. తెలంగాణ ఉర్దూ ఫోరం అధ్యక్షుడు ఇస్మాయిల్ అన్సారీ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఆమేర్ అలీఖాన్, కాంగ్రెస్ నాయకులు ఎస్.కె.అఫ్జలుద్దీన్, ఉపాధ్యాయురాలు అర్షియా నాయీద్, న్యాయవాది ఖైసర్ హజ్రా అన్సారీ, డాక్టర్ సయ్యద్ ఇఫ్తెకార్, సహెద్ సిద్దీఖీ, మహ్మద్ ఐజాజ్ ఉజ్ జమా, సనావుల్లా తదితరులు పాల్గొన్నారు.


సుల్తానాకు పురస్కారాన్ని అందజేస్తున్న రవీంద్రనాయక్

గోశాలలో 'మహా అన్నకూట్'


అన్నకూట్‌లో భాగంగా మహా యజ్ఞం నిర్వహిస్తున్న నిర్వాహకులు


ఆవుకు మొక్కుతున్న భక్తులు

పెద్ద ఎత్తున పాల్గొన్న భక్తులు

మైలార్‌దేవ్‌పల్లి: మహా అన్నకూట్ మహోత్సవ్ కార్యక్రమాన్ని గగన్ పహాడ్‌లోని సత్యం శివం సుందరం గోశాలలో ఆదివారం నిర్వహించారు. దక్షిణ భారత దేశంలోనే అతిపెద్ద గోశాలగా సత్యంశివం సుందరం పేరు గాంచింది. .ప్రధాన నిర్వాహకుడు దరంరాజ్ రాంఖా 84 సంవత్సరాల వయస్సులో ఇప్పటికీ గౌనివాస్‌ను వన్ మ్యాన్ ఆర్మీగా నిర్వహిస్తున్నారు. ఆరు వేలకుపైగా ఆవులకు ఆశ్రమం కల్పించి వాటి సంరక్షణ చేస్తున్నారు. ప్రతి సంవత్సరం అన్నకూట్ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. అన్నకూట్ పండగను కొత్త ఆరంభంగా జరుపుకొంటారు. అన్నకూట్ అంటే ఆహార పర్వతం అని అర్థం. అనేక రకాల ఆహార పదార్థాలను భగవంతుడికి సమర్పించేదే అన్నకూట్ అని ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా పండిట్ హరిశ్చంద్రజీ కులకర్ణి మహాలక్ష్మి పంచకుండి మహాయజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సాక్షి సిటీ ప్లస్
11
హైదరాబాద్, సోమవారం, 18, నవంబర్, 2024

ప్రపంచంలోని అద్భుతమైన ప్రకృతిని కళ్లకు కట్టినట్లు చూపించే ఇకెబనా కళకు హైదరాబాద్‌లో విశేష ఆధరణ లభిస్తోంది. జపాన్‌కు చెందిన ఈ కళ ప్రస్తుతం నగరంలో ట్రెండ్‌గానూ మారుతోంది. పర్యాటక ప్రాంతాలు, స్టార్ హోటల్స్, ఉన్నత శ్రేణి కుటుంబాల గృహాలంకరణ, శుభకార్యాలు, ఈవెంట్స్ ఇలా పలు సందర్భాల్లో ప్రత్యేకమైన ఇకెబనా అలంకరణకు ఆసక్తి చూపిస్తున్నారు. దీంతో నగరంలోని కళాకారులకు చేతినిండా పని ఉంటుంది. ఉపాధి కోణంలోనే కాకుండా అధిక సంఖ్యలో సంపన్న వర్గాల కుటుంబాలకు చెందిన మహిళలు తమ గృహాలంకరణ కోసం ఈ కళను నేర్చుకుంటున్నారు. ఇందుకోసం దేశ, విదేశాల నుంచి ప్రత్యేకమైన పూలను దిగుమతి చేసుకుంటారు. దీంతోపాటు మన పెరట్లో లభించే పూలు, మొక్కలతో సులభమైన పద్ధతుల్లో అద్భుతమైన కళాకృతులను తయారు చేస్తున్నారు. - సాక్షి, సిటీ బ్యూరో



డాజ్లింగ్.. డిజైర్..

సాక్షి, సిటీబ్యూరో: మారుతీ సుజుకీ ఇండియా సరికొత్త మోడల్ డాజ్లింగ్ డిజైర్ నగర మార్కెట్‌లోకి అడుగు పెట్టింది. ఎల్‌బీనగర్‌లోని మారుతీ సుజుకీ ఎరీనా కళ్యాణి మోటార్స్‌లో ఈ కార్‌ను జబర్దస్త్ ఫేం వర్ష విడుదల చేశారు. అత్యాధునిక సాంకేతికత, ట్రెండ్‌కు అనుగుణంగా రూపొందించిన డాజ్లింగ్ డిజైర్ సరి కొత్త బెంచ్ మార్క్ సృష్టిస్తుందని, ఇది ఫైవ్ స్టార్ సేఫ్టీ రేటింగ్‌లను పొందిందని కళ్యాణి మోటార్స్ సీఈఓ వేంకటేశ్వరరావు వివరించారు.



విద్యార్థుల భవిత కోసం..

సాక్షి, సిటీబ్యూరో: విద్యార్థులే దేశ భవిష్యత్తు.. వారి భవిత కోసం ఎంత చేసినా తక్కువే... అనే దారిలో నడుస్తూ వారికి చేతనైన సాయం చేసేందుకు ముందుంటున్నారు సామాజిక వేత్త శైలజా రెడ్డి. శైలజా ఆర్యన్ ఫౌండేషన్ పేరుతో సంస్థ స్థాపించి సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఆదివారం ఆమె పుట్టినరోజు సందర్భంగా రోటరీ క్లబ్ కంటోన్మెంట్ సికింద్రాబాద్ శాఖతో కలిసి లక్ష్మీనగర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించారు. పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ఏటా స్కాలర్‌షిప్స్ ఇస్తామని తెలిపారు. ఈ సందర్భంగా 9, 10వ తరగతి విద్యార్థులకు అవసరమైన వస్తువులు, పుస్తకాలు పంపిణీ చేశారు.

‘రీడిఫైన్’ ఫైనల్స్‌లో పూనె విజేత

సాక్షి, సిటీబ్యూరో: ప్రముఖ పవర్‌సొల్యూషన్స్ కంపెనీ క్యుమ్మిన్స్ ఇండియా లిమిటెడ్ ఆధ్వర్యంలో బిజినెస్ స్కూల్స్ నిర్వహించే ప్రతిష్టాత్మక కేస్ స్టడీ కాంపిటీషన్ రీడిఫైన్ తుది పోటీల్లో నగరానికి చెందిన ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ గ్రాండ్ ఫైనల్స్‌కి చేరగలిగింది. అయితే తుది పోటీల్లో పూనె విజయాన్ని దక్కించు



కుంది. ఈ విషయాన్ని క్యుమ్మిన్స్ ప్రతినిధులు తెలిపారు. హైదరాబాద్ సహా ముంబయి, లక్నో తదితర 6 నగరాలకు చెందిన టీమ్స్ ఫైనల్స్‌లో పోటీ పడగా పూనెలోని సింబియోసిస్ సెంటర్ ఫర్ మేనేజ్‌మెంట్ అండ్ హ్యూమన్ రిసోర్స్ డెవలప్‌మెంట్‌కు చెందిన టీమ్ మస్కిటీర్స్ గెలుపు దక్కించుకుందన్నారు.



22 నుంచి హైలైఫ్ ఎగ్జిబిషన్

బంజారాహిల్స్: ఈ నెల 22 నుంచి హెచ్ఐసీసీ నోవోటెల్‌లో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే హైలైఫ్ లైఫ్‌స్టైల్ ఎగ్జిబిషన్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఇందుకు సంబంధించిన సన్నాహక కార్యక్రమం బంజారాహిల్స్ రోడ్ నెం.10లో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ మూడు రోజుల పాటు నిర్వహించే ఈ భారీ లైఫ్‌స్టైల్ ఎగ్జిబిషన్‌లో దేశ వ్యాప్తంగా వివిధ రాష్ట్రాల ప్రసిద్ధిగాంచిన డిజైనర్ల జ్యువెలరీతో పాటు దుస్తులు, యాక్ససరీస్ అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా మోడల్స్ ఎగ్జిబిషన్‌లో ప్రదర్శించబోయే దుస్తులు, ఆభరణాలను ప్రదర్శించి ఆకట్టుకున్నారు.







ఇంపైన ఆర్ట్.. ఇకెబనావో

మనసు దోచేస్తున్న జపనీస్ ఆర్ట్

హైదరాబాద్ వైబ్స్

- అలంకరణ ప్రియులను ఆకట్టుకుంటున్న ఆకృతులు
- కోర్సులు నేర్చుకోవడానికి నగరవాసుల ఆసక్తి
- పర్యాటకం, స్టార్ హోటల్స్, ఉన్నత శ్రేణి ఇళ్లల్లో

ఇటీవలి కాలంలో భాగ్యనగరంలోని ప్రముఖ పర్యాటక ప్రాంతాల నుంచి, స్టార్ హోటల్స్ వంటి ప్రదేశాల్లో ప్రాచుర్యం పొందుతున్న కళ ఇకెబనా. అయితే అధిక శాతం మంది తమ ఇంటిని అలంకరించుకోవడంలోనూ ఈ కళకు పదును పెడుతున్నారు. దీంతో పాటు పలువురు తమ ఆర్థికి స్థితిగతులకు సాయపడుతుందని, ఈ ఆకృతులు మనస్సుకు ఎంతగానో ప్రశాంతత ఇస్తున్నాయని మరి కొందరు ఈ కళపై మక్కువ పెంచుకుంటున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో లభించే ప్రతి వస్తువుతోనూ ఈ ఆర్ట్‌లో అలంకరించొచ్చు. ప్రత్యేకించి ఈ వస్తువులే ఉండాలన్న నిబంధనలేమీ లేవు.

వృథాను అరికట్టే కళ..

వివిధ ఆకృతుల కోసం చెట్లను కొట్టేయడం, పూలను వృథా చేయడం వంటివాటికి స్వస్తిపలకాలని, ఉన్న వాటితోనే కనువిందైన ఆకృతులను తయారు చేయవచ్చంటున్నారు పలువురు ఆర్టిస్టులు. జపాన్‌కు చెందిన ఇకెబనా ఆర్ట్‌కు సుమారు 100 ఏళ్ల చరిత్ర ఉంది. హైదరాబాద్‌లో గత 35 ఏళ్లుగా ఈ కళకు మంచి ఆదరణ లభిస్తోంది. కరోనా సమయంలో కాస్త నెమ్మదించినా, ప్రస్తుతం కళాకారులకు డిమాండ్ పెరిగింది. జపాన్‌కు చెందిన ది ఒహరా స్కూల్ ఆఫ్ ఇకెబానా సర్టిఫికెట్ కోర్సులు హైదరాబాద్‌లో అందుబాటులో ఉన్నాయి. దేశంలో సబ్ గ్రాండ్ మాస్టర్లు నలుగురు ఉండగా అందులో ఓ ప్రముఖ మాస్టర్ మన హైదరాబాద్‌కు చెందిన వ్యక్తి రేఖారెడ్డి కావడం గమనార్హం.

ఆకులు, పూలతో సులువుగా..

నగరంలో ఇకెబనా ఆర్ట్‌కు ఆదరణ పెరుగుతోంది. చాలా మంది హాబీ కోసం నేర్చుకుంటున్నారు. కళ విలువ తెలుసుకుంటున్నారు. ఆకులు, పూలతో ఇంత సులువుగా తయారు చేసిన ఆకృతులతో మనస్సుకు ఎంతో ప్రశాంతంగా ఉంటుంది. ప్రకృతిని ఎలా ఆస్వాదించొచ్చనేది తెలుస్తుంది. మన సంప్రదాయం ప్రకారం ప్రకృతిలోని చెట్లు, పుట్టలను పూజిస్తాం. జపానీస్ కూడా అలాగే చేస్తారని పలువురు ఆర్టిస్టులు చెబుతున్నారు.





ఏటా ఐదురోజుల వర్క్ షాప్..

ఇకెబనా ఆర్ట్‌ను ఇంట్లోనే నేర్చుకోవచ్చు. నా దగ్గర వైద్యులు, లాయర్లు, ప్రొఫెసర్లు, గృహిణులు, చాలా మంది నేర్చుకున్నారు. కళకు ఉన్న ప్రాముఖ్యత ఇటీవలె తెలుస్తోంది. చెట్లను కాపాడటం, అందుబాటులో ఉన్న వనరులతో గ్రీనరీని తయారు చేస్తాం. ప్రస్తుతం అందరూ నేర్చుకుంటారు. ఈ కళకు గుర్తింపు తెచ్చేందుకు ఏటా 5 రోజుల వర్క్ షాప్ నిర్వహిస్తాను. ఐదేళ్ల నుంచి 18 ఏళ్ల వరకూ అందరూ వచ్చి నేర్చుకుంటారు. చివరల్లో మినీ ఎగ్జిబిషన్ మాదిరి ఏర్పాటు చేస్తాం. ఆకులు, పూలను గౌరవించడం నేర్చుకుంటారు. ఇదొక హాబీ, కమర్షియల్ కాదు. చెట్లను కట్ చేయకుండా ఎండిన కొమ్మలతోనూ కళను ప్రోత్సహించొచ్చు.

- రేఖారెడ్డి, హైదరాబాద్ చాప్టర్స్ అధ్యక్షురాలు.



50 శాతం ఫీజు రాయితీ..

ఇకెబనా ఆర్ట్‌ని ఇంజినీరింగ్ చదివే సమయంలోనే నేర్చుకున్నాను. ఎప్పటికైనా ఉపయోగపడుతుందన్నారు. కోర్సుపూర్తి చేసి, జపాన్ నుంచి సర్టిఫికెట్స్ తీసుకున్నాను. వారాంతాల్లో, లేదా కుదిరినప్పుడు ఇంట్లో కళాకృతులు తయారు చేయడం అలవాటుగా మారింది. ఎగ్జిబిషన్స్ జరిగినపుడు పాల్గొనడం, మా గురువుకు సహకరించడం చేశాను. ఉన్నత విద్య కోసం యూఎస్ వెళ్లిపోయాను. మాస్టర్స్ ఇన్ మేనేజ్‌మెంట్ ఇన్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్ కోర్సులో రీసెర్చ్ అసిస్టెంట్ స్కాలర్ కోసం హార్టికల్చర్ విభాగం అధికారులు నాకున్న సర్టిఫికెట్స్, ఎగ్జిబిషన్ ఫొటోలు చూసి ఇంప్రెస్ అయ్యారు. ఉద్యోగం ఇచ్చారు. నాకున్న ఇకెబనా ఆర్ట్ సర్టిఫికెట్‌తో కోర్సు ఫీజులో సుమారు 50 శాతం తగ్గించారు. ఇది పెద్ద ఊరట కల్పించింది. - దివ్య, హైదరాబాద్



ఇంటికోసం.. ఇష్టంగా..

‘ఇండియన్ రీసెర్చ్ అసిస్టెంట్ షిప్ దొరకాలన్నా చాలా కష్టమైన టాస్క్ ఉండేది. హార్టీకల్చర్ డిపార్ట్‌మెంట్‌లో ఈ ఆర్ట్ ఒక భాగం. ఆ క్లాస్‌కి రీసెర్చ్ అసిస్టెంట్‌గా పనిచేశాను. ఎన్ని గంటలు పనిచేస్తే దానికి అన్ని డబ్బులు వచ్చేవి. ప్రిపరేషన్ మెటీరియల్, క్లాస్‌లో సాయం వంటివి చేస్తుండేదాన్ని.. 2019లో హైదరాబాద్ వచ్చేశాక ఇక్కడ జరిగే కార్యక్రమాల్లో పాల్గొంటున్నా. నాకు సమయం చిక్కినపుడు ఇష్టమున్న ఆర్ట్‌ని ఇంట్లోనే ఎరేంజ్ చేస్తుంటాను. ఊరెళ్లినపుడు జొన్నలతో తయారు చేస్తాను. దేనితో అయినా ఈ ఆర్ట్ తయారు చేయొచ్చు. ఇంటిని అందంగా తయారు చేయడం, ఆహ్లాదకరమైన వాతావరణం క్రియేట్ చేస్తుంటాను. నేను నేర్చుకున్న తొలినాళ్లలో పూలు కొనుగోలుచేసి కళాకృతిని తయారు చేసేదాన్ని.. అయితే ఇది అంత సులువు కాదు. ప్రస్తుతం ఫ్లవర్ షాపులు అందుబాటులోకి వచ్చాయి. అవసరానికి మనకు పూలు దొరుకుతున్నాయి. అలా కాకుండా మన దగ్గర ఉన్న వాటితోనే మంచిగా డిజైన్ చేయొచ్చన్నది అలవాటైంది. మా నాన్నకి గార్డెనింగ్ ఇష్టం. ఎక్కడైనా కొంత మెటీరియల్ తెచ్చేవారు. దాన్ని నేను వినియోగించేదాన్ని’ అని చెప్పుకొచ్చారు నగరానికి చెందిన ఆర్టిస్ట్ దివ్య.

‘ఫార్ములా’-4 ఛేదించాడు..





- ఎఫ్-4 ఛాంపియన్ అఖిల్ అలీ భాయ్
- రేసింగ్‌లోనూ దూసుకుపోతున్న హైదరాబాద్
- భవిష్యత్తులో సిటీలోనూ జరగాలి : నాగచైతన్య

సాక్షి, సిటిబ్యూరో: ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ఇండియన్ రేసింగ్ ఫెస్టివల్‌లో హైదరాబాద్ బ్లాక్‌బర్డ్స్ సత్తా చాటింది. టాలివుడ్ స్టార్ అక్కినేని నాగచైతన్యకు చెందిన హైదరాబాద్ బ్లాక్‌బర్డ్స్ టీం రేసర్ అఖిల్ అలీ భాయ్ ఫార్ములా 4 విభాగంలో చాంపియన్‌గా నిలిచారు. దీనితో అక్కినేని నాగచైతన్య సంతోషాన్ని వ్యక్తం చేశారు. కోయంబత్తూర్ కరీ మోటార్ స్పీడ్‌వే వేదికగా ఆదివారం జరిగిన ఈ రేసింగ్‌లో చాంపియన్‌గా నిలువగా, లీగ్ 2024లో గోవా ఏసెస్ జేఏ విజేతగా నిలిచింది. చివరి రోజు ఐఆర్‌ఎల్ రేసులో రౌల్ హైమాన్, గాబ్రియేలా జిల్కోవా అద్భుత ప్రదర్శన కనబరిచారు. ఈ సందర్భంగా చై ‘సాక్షి’తో ప్రత్యేకంగా తన అనుభవాలను పంచుకున్నారు.

అభిమానులకు ధన్యవాదాలు..

హైదరాబాద్ రేసింగ్ లవర్స్‌కి ప్రత్యేక ధన్యవాదాలు. నాగచైతన్యతో కలిసి ట్రోఫీ అందుకోవడం మంచి మెమొరీగా మిగిలిపోతుంది. భవిష్యత్తులోనూ రేసింగ్ లీగ్‌కి ప్రణాళిక ప్రకారం ప్రాక్టీస్ చేస్తాను. ఈ విజయం నా కెరియర్‌ను మలుపు తిప్పుతుంది.

- అఖిల్ అలీ భాయ్



ఈ సీజన్ చాలా కఠినం..

ఈ సీజన్ రేసింగ్ చాలా కఠినంగా కొనసాగింది. ప్రతి డ్రైవర్‌కి ట్రోఫీ చేజింగ్ లా మారింది. నేను రేసర్‌గా మారడానికి నా కుటుంబం అందించిన సహకారం మాటల్లో వర్ణించలేని. పని పట్ల అంకిత భావం, ఆత్మస్థైర్యం ఉంటే జెండర్‌తో పనిలేదు.

- లారా క్యామ్స్ టారస్, మోటార్స్ స్పోర్ట్స్ వుమెన్ డ్రైవర్

రేసింగ్‌తో మంచి అనుబంధం..

నాకు చిన్నప్పటి నుంచి రేసింగ్ అంటే ఇష్టం. చెన్నైలో ఉన్నప్పటి నుంచే రేసింగ్ తో అనుబంధం ఉంది. ప్రస్తుతం హైదరాబాద్ బ్లాక్‌బర్డ్స్ ఓనర్‌గా మారినప్పటికీ మన టీం చాంపియన్‌షిప్ గెలవడం గర్వంగా ఉంది. మిగతా క్రీడల్లానే భారత్‌లో రేసింగ్ వృద్ధిలోకి రావడంలో మా వంతు కృషి చేస్తున్నాం. ఈ రేసింగ్ ఫెస్టివల్‌లో వుమెన్ డ్రైవర్స్ పాల్గొనడం, మహిళా సాధికారతకు నిదర్శనంగా నిలిచింది. నాకు కార్ రేసింగ్ చేయడం మంచి హాబీ.. చిన్నప్పుడు నుంచి ఫార్ములా జీపీ రేసింగ్ అభిమానిస్తూ పెరిగాను. కానీ ఇండియన్ రేసింగ్‌లో పాల్గొనక పోవచ్చు. నా సినిమాల్లో రేసర్‌గా మంచి క్యారెక్టర్ వస్తే కచ్చితంగా చేస్తాను.

- అక్కినేని నాగచైతన్య, హైదరాబాద్ బ్లాక్ బర్డ్స్ ఓనర్

రాజ్యాధికారమే బీసీల అంతిమ లక్ష్యం

- అందుకోసం అవసరమైతే మిలిటెంట్ పోరాటం: ఆర్.కృష్ణయ్య



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆర్.కృష్ణయ్య, వి.హనుమంతరావు తదితరులు

కాచిగూడ: రాజ్యాధికార సాధనే బీసీల అంతిమ లక్ష్యమని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య అన్నారు. ఆ లక్ష్య సాధన కోసం బీసీలంతా సంఘటితంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. అవసరమైతే మిలిటెంట్ పోరాటాలకు కూడా సిద్ధంగా ఉండాలని కోరారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ అధ్యక్షతన ఆదివారం కాచిగూడ అభినంద్ గ్రాండ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆర్ కృష్ణయ్య పాల్గొన్నారు. ఈ నెల 25వ తేదీన రవీంద్రభారతిలో నిర్వహించే 'బీసీల సమరభేరి' పోస్టర్‌ను కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత వి.హనుమంతరావుతో కలిసి ఆయన ఆవిష్కరించారు. దేశ జనాభాలో సగానికిపైగా ఉన్న బీసీలకు 78 ఏళ్ల స్వతంత్ర భారతదేశంలో పూర్తిస్థాయి వాటా దక్కలేదని ఆవేదన వ్యక్తంచేశారు. జనగణనలో భాగంగా కులగణన చేపట్టాలని, బీసీల జనాభాకు అనుగుణంగా బీసీ రిజర్వేషన్లు పెంచాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగ సవరణ చేసి పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టాలని, చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని, కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వశాఖను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. బీసీల సమరభేరి కార్యక్రమానికి పార్టీలకతీతంగా బీసీలంతా తరలి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తంగెళ్లముడి నందగోపాల్, నీల వెంకటేష్, వేముల రామకృష్ణ, ఉదయ్ నేత, మట్టా జయంతి గౌడ్, సుధాకర్, ర్యాగ రమేష్, రఘుపతి, పరశురామ్, రవి తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చిన మాట ప్రకారం వరికి బోనస్: కోదండరెడ్డి

సాక్షి, హైదరాబాద్: ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం సన్న ధాన్యానికి రూ.500 చొప్పున బోనస్ ఇస్తున్నామని తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి చెప్పారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ సన్నాలకు బోనస్ ఇవ్వడం గొప్ప నిర్ణయమన్నారు. రుణమాఫీ, బోనస్‌ల కింద ప్రభుత్వం ఇచ్చిన డబ్బులను రైతులు పెట్టుబడి కింద ఉపయోగించుకోవాలని ఆయన సూచించారు.

మీ సేవ
సులభంగా, వేగంగా

దర్జాగా సర్టిఫికెట్ల దందా

రూ.45 సర్వీసు చార్జీకి రూ.500 నుంచి రూ.4,000 వరకు వసూళ్లు

- చాలాచోట్ల తహసీల్దార్ కార్యాలయ సిబ్బందితో మీ సేవ కేంద్రాల నిర్వాహకులు కుమ్మక్కు
- జేఈఈ మెయిన్‌కు అవసరమైన ధ్రువీకరణ పత్రాల కోసం తల్లిదండ్రుల అగచాట్లు
- సర్టిఫికెట్‌కు ఇంత అని చెబుతూ వసూళ్లు చేస్తున్నట్టుగా ఆరోపణలు
- సాధారణ రోజుల్లోనూ ఇదే పరిస్థితి అనే ఫిర్యాదులు
- డబ్బులు ఇవ్వకుంటే రోజుల తరబడి పెండింగ్‌లో దరఖాస్తులు

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: రాజధాని హైదరాబాద్ సహా రాష్ట్రవ్యాప్తంగా పలు మీ సేవ కేంద్రాల్లో సర్టిఫికెట్ల దందా కొనసాగుతోంది. సర్వీసు చార్జీల కింద రూ.45 తీసుకోవాల్సి ఉండగా సర్టిఫికెట్‌కు రూ.4,000 వరకు వసూలు చేస్తున్నారు. ఎన్‌ఐటీలు, ఐఐటీలు, జీఎఫ్‌టీఐలలో ప్రవేశాల కోసం ముందుగా నిర్వహించే జేఈఈ మెయిన్‌కు అవసరమైన సర్టిఫికెట్ల కోసం ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదివే పిల్లల తల్లిదండ్రులు మీ సేవ కేంద్రాల చుట్టూ తిరుగుతున్నారు. దీన్ని ఆసరాగా చేసుకొని కేంద్రాల నిర్వాహకులు భారీ దందాకు తెరలేపారు. తల్లిదండ్రులకు అవసరం కాబట్టి ప్రాంతాన్ని బట్టి ఒక్కో సర్టిఫికెట్‌కు రూ.500 నుంచి రూ.1,000 వరకు, కొన్నిచోట్ల రూ.4,000 వరకు కూడా వసూలు చేస్తున్నారు. తహసీల్దార్ కార్యాలయాల్లో కొంతమంది సిబ్బంది, అంటెండర్లతో కుమ్మక్కై ఈ దందా కొనసాగిస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. జేఈఈ మెయిన్ అని కాకుండా సాధారణ రోజుల్లో సైతం తహశీల్దార్ కార్యాలయాల్లో డబ్బులు తీసుకుని కుల, ఆదాయ తదితర ధ్రువపత్రాలు మంజూరు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. డబ్బులు ముట్టకపోతే దరఖాస్తులు పెండింగ్‌లో ఉంచేస్తున్నారని, కొంతకాలం తర్వాత ఏదో ఒక కారణంతో దరఖాస్తును తిరస్కరిస్తున్నారనే ఫిర్యాదులుండటం గమనార్హం.

పౌరసేవకు ఎగనామం

దళారీ వ్యవస్థను నిర్మూలించేందుకే సర్టిఫికెట్ల జారీని ప్రభుత్వం పౌరసేవల పరిధిలోకి తెచ్చింది. నామమాత్రపు రుసుంతో సర్టిఫికెట్లు జారీ చేసే విధానం ప్రారంభించింది. అయితే దీనిపై సరైన పర్యవేక్షణ లేకపోవడంతో కొందరు తహసీల్ కార్యాలయాల సిబ్బంది, మీ సేవ నిర్వాహకులు అక్రమార్జనకు పాల్పడుతున్నారు. రూ.45 సర్వీసు చార్జీ ఉండే ఓబీసీ సర్టిఫికెట్ కావాలంటే పట్టణ ప్రాంతాల్లోని పలుచోట్ల రూ.4,000 వరకు, గ్రామీణ ప్రాంతాల్లో రూ.1,000 వరకు చెల్లించాల్సిందేనని తెగేసి చెబుతున్నారు. తామే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసి, ఆ పత్రాలను తహసీల్దార్ కార్యాలయానికి పంపించి, ఆమోదించేలా చూస్తామని చెప్పి వసూళ్లు చేపడుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

70 వేల మంది తల్లిదండ్రులపై ప్రభావం

అక్టోబర్ 28వ తేదీన జేఈఈ మెయిన్ నోటిఫికేషన్ జారీ అయింది. అదేరోజు నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైంది. ఈ నెల 22వ తేదీతో గడువు ముగియనుంది. కాగా ఏదైనా రిజర్వేషన్ వర్తించాలంటే సంబంధిత సర్టిఫికెట్లు కావాల్సిందే. ఈ పరీక్షకు రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 95 వేల మంది హాజరు కానుండగా, అందులో దాదాపు 70 వేలమందికి ఈ సర్టిఫికెట్లు అవసరమని అంచనా. దీనిని అసరాగా చేసుకొని మీసేవ కేంద్రాల నిర్వాహకులు, తహసీల్ కార్యాలయాల సిబ్బంది దందాకు తెరతీశారు.

సొమ్ము దండుకున్నా దబాయింపులే

హైదరాబాద్‌లోని కూకట్‌పల్లికి చెందిన శ్రీనివాస్‌కు ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న తన కుమారుడి కోసం (జేఈఈ మెయిన్‌కు దరఖాస్తు చేసేందుకు) ఓబీసీ సర్టిఫికెట్ అవసరమైంది. దరఖాస్తు చేద్దామని స్థానిక మీ సేవా కేంద్రానికి వెళ్లారు. అక్కడి నిర్వాహకుడు.. 'మేమే దరఖాస్తు చేస్తాం.. దరఖాస్తు ఫారాన్ని మేమే తహసీల్దార్ కార్యాలయంలో ఇచ్చి ఆన్‌లైన్‌లో ఆమోదం పొందేలా చేస్తాం.. అందుకు రూ.1,000 ఖర్చు అవుతుంది' అని చెప్పాడు. రూ.45 దరఖాస్తుకు అంత చెల్లించాలా? అని శ్రీనివాస్.. బాలానగర్‌లోని మరో మీ సేవ కేంద్రానికి వెళ్లి అడగ్గా అక్కడా ఇదే సమాధానం ఎదురైంది. గత్యంతరం లేక రూ.1,000 చెల్లించి దరఖాస్తు చేశాడు. 12 రోజులు గడిచినా దరఖాస్తును కార్యాలయ సిబ్బంది కనీసం ఓపెన్ కూడా చేయలేదు. మీ సేవ కేంద్రం నిర్వాహకుడిని అడిగితే 'అవుతుందిలే.. చేస్తాం.. తహసీల్దార్ కార్యాలయంలో చేయించే వ్యక్తి బిజీగా ఉన్నాడు..' అంటూ నిర్లక్ష్యంగా జవాబిచ్చాడు. దీంతో శ్రీనివాస్ నేరుగా తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లారు. అక్కడ కిషోర్ అనే వ్యక్తిని కలిశారు. అతను 'మీరు నేరుగా ఎలా వస్తారు..' అంటూ మండిపడ్డాడు. దీంతో శ్రీనివాస్ అక్కడ ఉన్న ఇతర సిబ్బందిని సంప్రదించారు. అంతా కుమ్మక్కే కావడంతో.. 'మీ దరఖాస్తు ఫారమే లేదు. మీరివ్వలేదు..' అంటూ వాళ్లు బుకాయించారు. రెండురోజులు తిరిగి విసిగిపోయిన శ్రీనివాస్ చివరకు తహసీల్దార్‌ను కలిసి పరిస్థితి వివరించాడు. ఆన్‌లైన్ ఫారం ప్రింట్ తీసి ఫైల్ సిద్ధం చేయాలని తహసీల్దార్ కిందిస్థాయి సిబ్బందిని ఆదేశించారు. అయినా వారు పలు కొర్రీలు పెట్టారు. దీంతో శ్రీనివాస్ మళ్లీ తహసీల్దార్‌ను కలవడంతో ఎట్టకేలకు సర్టిఫికెట్ జారీ అయ్యింది.

అబద్ధాల పోటీ పెడితే.. మోదీదే మొదటి స్థానం

- మహారాష్ట్ర ఎన్నికల ప్రచార సభల్లో సీఎం రేవంత్‌రెడ్డి విమర్శలు
- కేంద్రం బీజేపీయేతర ప్రభుత్వాలను అణగదొక్కేందుకు ప్రయత్నిస్తోంది
- తెలంగాణలో రుణమాఫీ కింద రూ.18 వేల కోట్లు రైతుల ఖాతాల్లో వేశాం
- కాంగ్రెస్ అధికారంలోకి వస్తే మహారాష్ట్రలోనూ రూ.3లక్షలు రుణమాఫీ చేస్తామని హామీ



ఆదివారం మహారాష్ట్రలోని నాందేడ్‌లో జరిగిన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

నయాగామ్, భోకర్, సోలాపూర్: అబద్ధాల పోటీలు పెడితే ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ దేశంలోనే మొదటి స్థానంలో నిలుస్తారని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం బీజేపీయేతర రాష్ట్ర ప్రభుత్వాలను అణగదొక్కేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ఛత్రపతి శివాజీ, జ్యోతిబా పూలే, బీఆర్ అంబేడ్కర్ వంటి మహనీయులు, బాలాసాహెబ్ ఠాక్రే, శరద్ పవార్ వంటి యోధులు జన్మించిన మహారాష్ట్ర నేలలో ఇప్పుడు విద్రోహులు రాజ్యమేలుతున్నారని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం నయాగామ్, భోకర్, నాందేడ్‌లలో జరిగిన ప్రచార సభల్లో ప్రసంగించారు. సోలాపూర్‌లో విలేకరులతో మాట్లాడారు. నయాగామ్‌లో మీనాల్ పాటిల్ ఖత్‌గావ్‌కర్.. భోకర్‌లో తిరుపతి కదమ్ కొండేకర్.. దక్షిణ సోలాపూర్‌లో చేతన్ నరొటే, నాందేడ్ లోక్‌సభ ఉప ఎన్నికలో రవీంద్ర చౌహాన్‌లను భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

వీరుల నేలలో విద్రోహులు

ఆటో డ్రైవర్‌గా ఉన్న ఏక్‌నాథ్ శిందేను బాలాసాహెబ్ కుటుంబం మంత్రిని చేసిందని.. శరద్‌పవార్ కూడా సొంత కుమార్తెను కాదని అజిత్ పవార్‌ను ఉప ముఖ్యమంత్రి చేశారని సీఎం రేవంత్ చెప్పారు. అశోక్ చవాన్, ఆయన తండ్రి శంకర్‌రావు చవాన్‌లను కాంగ్రెస్ పార్టీ సీఎంలను చేసిందని పేర్కొన్నారు. కానీ ఈ ముగ్గురు విద్రోహులుగా మారి వీరుల నేలను అవమానాల పాలు చేశారని విమర్శించారు.

తెలంగాణలో 'సంక్షేమం'పై వాస్తవాల పరిశీలనకు సిద్ధం

తెలంగాణలో బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు రైతు ఆత్మహత్యలు అధికంగా జరిగాయని, కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే వాటికి అడ్డుకట్ట పడిందని రేవంత్ చెప్పారు. తమ ప్రభుత్వం 50రోజుల్లోనే రూ.18 వేల కోట్ల రుణమాఫీ సొమ్మును రైతుల ఖాతాల్లో వేసిందన్నారు. దేశంలోనే అత్యధికంగా రైతుల ఆత్మహత్యలు మహారాష్ట్రలో జరుగుతున్నాయని.. ఆ ఆత్మహత్యలను నిలువరించాలన్నా, రాష్ట్ర అభివృద్ధి జరగాలన్నా కాంగ్రెస్, శివసేన (యూబీటీ), ఎన్సీపీ (ఎస్పీ)ల మహా వికాస్ అఘాడీ కూటమిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కూటమి అధికారంలోకి రాగానే రూ.3 లక్షల వరకు రుణమాఫీ చేసి రైతులను ఆదుకుంటామన్నారు. తెలంగాణలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500కే సిలిండర్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నామని వివరించారు. తెలంగాణలో ఉద్యోగ నియామకాలు, రుణమాఫీ, ఇతర సంక్షేమ కార్యక్రమాలు వాస్తవమో, కాదో కేంద్ర మంత్రులనో, అధికారుల బృందాలనో పంపి తేల్చుకొమ్మని సవాల్ విసిరారు.



ఆదివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వినోద్‌కుమార్



తెలంగాణ సచివాలయం బాహుబలి మెయిన్ ఎంట్రన్స్ గేట్లను తొలగించిన దృశ్యం

ఆంధ్రప్రదేశ్

సోషల్ మీడియా యాక్టివిస్టులపై థర్డ్ డిగ్రీ

దారుణంగా హింసించిన తర్వాతే అరెస్ట్ చూపిస్తున్న వైనం

- ఎలా హింసించిందీ పై వారికి వీడియో కాల్‌లో చూపిస్తూ పైశాచికానందం
- ఇది ప్రభుత్వ పెద్దల ఉన్మాదం.. పోలీసు అధికారుల అరాచకం...
- ఇందులో ముందున్న మూడు జిల్లాల పోలీసు ఉన్నతాధికారులు
- రాష్ట్ర కార్యాలయంలో ఓ కీలక అధికారి ప్రత్యక్ష పర్యవేక్షణ
- చంద్రబాబు ప్రభుత్వ దమన నీతిపై న్యాయపోరాటానికి ప్రజలు సిద్ధం



సాక్షి, అమరావతి: సోషల్ మీడియా యాక్టివిస్టులపై చంద్రబాబు ప్రభుత్వం యథేచ్ఛగా అమానుష కాండను కొనసాగిస్తోంది. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తుండడమే వారు చేసిన నేరం. వారిపై అక్రమ కేసులు నమోదు చేయడమే కాకుండా ...వారిని అక్రమంగా నిర్బంధించి భౌతికంగా దాడులు చేస్తూ ...కసి తీరిన తరువాతే అరెస్ట్ చూపిస్తోంది. మానవ హక్కులను నిర్భీతిగా ఉల్లంఘిస్తూ ...రాజ్యాంగాన్ని అపహాస్యం చేస్తూ సాగిస్తున్న ఈ దమనకాండకు ప్రభుత్వ ముఖ్యనేతే ప్రధాన కుట్రదారు కాగా... కీలక పోలీసు అధికారులు పాత్రధారులు, పర్యవేక్షకులు. రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో ఈ రాక్షస క్రీడ కొనసాగుతోంది. అందులో ప్రధానంగా ప్రకాశం, నెల్లూరు, తిరుపతి జిల్లా పోలీసు ఉన్నతాధికారులు ఇందులో బాగా ఆరితేరిపోయారు. అందరికన్నా ముందుండాలన్న తాపత్రయం వారిలో కనిపిస్తోంది. పౌరుల భావప్రకటనా స్వేచ్ఛను దారుణంగా కాలరాస్తున్న సర్కారు దమననీతిపై న్యాయపోరాటానికి ప్రజలు సన్నద్ధమవుతున్నారు. అంతేకాదు తమ విధ్యుక్తధర్మాన్ని గాలికొదిలేసి ప్రభుత్వ పెద్దలు చెప్పినట్లల్లా తలాడిస్తూ సోషల్ మీడియా యాక్టివిస్టులపై దమనకాండను కొనసాగిస్తున్న పోలీసు అధికారులపైనా ప్రైవేటు కేసులు వేసేందుకు బాధిత కుటుంబాలు సిద్ధమవుతున్నాయి. వీరికి పలువురు మేధావులు, ప్రజాస్వామ్య పరిరక్షణ ఉద్యమకారులు, పౌరసంఘాల నేతలు మద్దతుగా నిలుస్తున్నారు. త్వరలోనే 'పచ్చ' పాత పోలీసు అధికారులందరూ న్యాయస్థానం ముందు దోషులుగా నిలబడటం తథ్యమని బాధితు కుటుంబాలు స్పష్టంచేస్తున్నాయి.

అంతా ప్రభుత్వ పెద్దల కనుసన్నల్లో...

ఈ మొత్తం వ్యవహారం ప్రభుత్వ పెద్దల కనుసన్నల్లో కొనసాగుతోంది. రాష్ట్ర పోలీసు ప్రధాన కార్యాలయంలో శాంతిభద్రతల విభాగాన్ని పర్యవేక్షించే ఉన్నతాధికారి ఈ వ్యవహారాన్ని స్వయంగా పర్యవేక్షిస్తుండటం గమనార్హం. అంటే ఈ అమానుష కాండను కొనసాగించేందుకు ప్రభుత్వ పెద్దలు రాష్ట్రస్థాయిలో పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పాటు చేశారని దీనినిబట్టి స్పష్టమవుతోంది. ప్రభుత్వ పెద్దలు టార్గెట్ చేసిన సోషల్ మీడియా యాక్టివిస్టులను వారు సంతృప్తిచెందే స్థాయిలో భౌతికంగా హింసించారా లేదా అన్నది వీడియో కాల్ ద్వారా పర్యవేక్షిస్తుండటం ప్రభుత్వ కక్షకు పరాకాష్టగా నిలుస్తోంది. ఆ రాక్షసకాండ ఇలా సాగుతోంది...

ఎన్ని కేసులు.. ఎక్కడికి తరలిస్తున్నారు?

రాష్ట్రంలో సోషల్‌మీడియా యాక్టివిస్టులపై ప్రభుత్వం ఎడాపెడా అక్రమ కేసులు బనాయిస్తోంది. ఒక్కో యాక్టివిస్టుపై ఒకటికి మించిన కేసులు నమోదు చేయడమే కాకుండా... వేర్వేరు జిల్లాల్లో కేసులు నమోదు చేస్తోంది. వారిని పోలీసులు హఠాత్తుగా అదుపులోకి తీసుకుని తమతో పట్టుకుపోతున్నారు. ఏ జిల్లా పోలీసులు అదుపులోకి తీసుకుందీ... ఏ పోలీస్ స్టేషన్‌కు తరలించారన్న కనీస సమాచారాన్ని కూడా కుటుంబ సభ్యులకు చెప్పడం లేదు. దాంతో తమ పరిధిలోని పోలీస్ స్టేషన్‌కు వెళ్లి వాకబు చేస్తే అసలు తాము ఎవర్నీ అదుపులోకి తీసుకోలేదని అక్కడి పోలీసు అధికారులు చెబుతున్నారు.

థర్డ్ డిగ్రీ ప్రయోగించడానికి కరడుగట్టిన నేరస్తులా?

అక్రమంగా అదుపులోకి తీసుకున్న సోషల్ మీడియా యాక్టివిస్టులను వివిధ పోలీస్ స్టేషన్లు తిప్పుతూ చిత్రహింసలకు గురి చేస్తున్నారు. కరడుగట్టిన నేరస్తులపై ప్రయోగించినట్లు సోషల్ మీడియా యాక్టివిస్టులపై థర్డ్ డిగ్రీ ప్రయోగిస్తూ భౌతికంగా హింసిస్తున్నారు. తాము చెప్పినట్టుగా వాంగ్మూలం ఇవ్వాలని...లేకపోతే మరిన్ని రోజులు చిత్రవధ తప్పదని హెచ్చరిస్తున్నారు.

వీడియో కాల్ ద్వారా నిర్ధారణ

సోషల్ మీడియా యాక్టివిస్టులపై థర్డ్ డిగ్రీ ప్రయోగించామని పోలీసులు మాటలతో చెబితే ఉన్నతాధికారులు సంతృప్తి చెందడం లేదు. పోలీసు అధికారులు రాష్ట్ర పోలీసు ప్రధాన కార్యాలయంలో శాంతిభద్రతల విభాగాన్ని పర్యవేక్షించే ఓ ఉన్నతాధికారికి వీడియో కాల్ చేసి మరీ చూపిస్తున్నారు. సోషల్ మీడియా యాక్టివిస్టులపై థర్డ్ డిగ్రీ తాము ఆశించినస్థాయిలో ప్రయోగించారా లేదా అన్నది ఆ ఉన్నతాధికారి వీడియో కాల్ ద్వారా పరిశీలిస్తారు. ఆయన సంతృప్తి చెందితే ఆ విషయాన్ని తన బిగ్ బాస్‌కు నివేదిస్తారు. ఆయన అనుమతి ఇచ్చిన తరువాతే... ఒకే ఇక చాలు... అరెస్ట్ చూపించండి అని ఆ ఉన్నతాధికారి జిల్లా పోలీసు ఉన్నతాధికారులకు చెబుతారు.

చిత్రహింసల తర్వాతే అరెస్ట్..

ఆ విధంగా ప్రభుత్వ పెద్దలు ఆదేశించినస్థాయిలో థర్డ్ డిగ్రీని ప్రయోగించారని నిర్ధారించుకున్న తరువాతే సోషల్ మీడియా యాక్టివిస్టుల అరెస్ట్ చూపిస్తున్నారు. ఈ ప్రక్రియ అంతా మూడు రోజుల నుంచి వారం రోజుల పాటు సాగుతోంది. కుట్రపూరిత, కక్ష పూరిత రాజకీయాలకు పోలీసు వ్యవస్థను దుర్వినియోగం చేస్తున్న తీరుపై సర్వత్రా విస్మయం వ్యక్తమవుతోంది. పోలీసు వ్యవస్థను గతంలో ఏ ప్రభుత్వం కూడా ఇంతగా దుర్వినియోగం చేయలేదని పోలీసు అధికారులే వ్యాఖ్యానిస్తున్నారు. పోలీసులను గుండాల మాదిరిగా మార్చి రాజకీయ అరాచకం సాగిస్తుండటం విభ్రాంతికరమని మండిపడుతున్నారు.

తెనాలికి చెందిన గీతాంజలి అనే గృహిణి తనకు జగనన్న కాలనీలో ఇంటి పట్టా వచ్చిందని, తన సొంతింటి కల నెరవేరిందని ఆనందంగా చెప్పడాన్ని టీడీపీ సోషల్ మీడియా జీర్ణించుకోలేకపోయింది. గీతాంజలిని సోషల్ మీడియాలో తీవ్రంగా వేధించింది. అత్యంత దారుణంగా బూతులు తిడుతూ పోస్టులు పెట్టింది. వాటిని భరించలేక, భయపడి ఆమె ఆత్మహత్య చేసుకుంది. గీతాంజలి ఇద్దరు ఆడపిల్లలు తల్లిప్రేమకు దూరమయ్యారు.

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ప్రవేశపెట్టిన ఇంగ్లిష్ మీడియా స్కూల్లో చదువుకుని ఆంగ్లంలో అద్భుతంగా మాట్లాడుతున్న బెండపూడి బాలికలపై కూడా టీడీపీ సోషల్ మీడియా బరితెగించి ట్రోల్ చేసింది. ఈ పిల్లల ప్రతిభను ఐక్య రాజ్యసమితి గుర్తించినా ఐ-టీడీపీ మాత్రం తీవ్రంగా వేధించింది. పేద పిల్లల ఆత్మవిశ్వాసం దెబ్బతీసేలా పోస్టులు పెట్టింది. వారు బయటకు వచ్చి మాట్లాడాలంటేనే భయపడే పరిస్థితి తీసుకొచ్చింది.

ఫేక్ ఫ్యాక్టరీ ఐ-టీడీపీ


సోషల్ మీడియాలో దుష్ప్రచారం కోసం పక్కాగా తయారుచేసిన టీడీపీ

- బూతులు, మార్ఫింగ్ ఫొటోలతో వేధించడంలో దిట్ట
- ఇంటి పట్టా వచ్చిందని ఆనందం పంచుకున్న గీతాంజలిని ట్రోల్ చేసి చంపేశారు!
- ప్రొఫెసర్ నాగేశ్వర్ వంటి వారిని ఇష్టానుసారం తిడుతున్నారు
- సోషల్ మీడియాలో అత్యధిక అరాచకం టీడీపీదే అంటున్న తటస్థులు
- అయినా ఐ-టీడీపీ, సీబీఎన్ ఆర్మీ వంటివాటి దుష్ప్రచారం ప్రభుత్వానికి కనిపించదా?
- కొందరిపైనే కత్తి కట్టి కేసులా...?

సాక్షి, అమరావతి: సోషల్ మీడియాలో ఐ-టీడీపీ అనే అతి పెద్ద బూతుల ఫ్యాక్టరీని టీడీపీ తయారు చేసింది. ఈ ఫ్యాక్టరీ ఫేక్ ప్రచారాన్ని క్షణాల్లో వ్యాప్తి చేస్తుంది. బాలికలు, మహిళలు, విద్యావంతులు, విశ్లేషకులు, రాజకీయ నాయకులు... అనే తేడా లేకుండా టీడీపీకి వ్యతిరేకంగా నోరు విప్పిన ప్రతి ఒక్కరినీ బండబూతులతో చెండాడుతుంది. మార్ఫింగ్ ఫొటోలతో వ్యక్తిత్వాన్ని దెబ్బతీస్తుంది. రాజకీయాలతో సంబంధం లేకపోయినా గత ప్రభుత్వ హయాంలో మంచి జరిగిందని చెప్పిన వారిని సైతం ప్రాణాలు తీసుకునేంత వరకు వెంటాడి వేధిస్తుంది. అయినా సోషల్ మీడియాలో విష ప్రచారం... అంటూ నీతులు చెబుతున్న కూటమి ప్రభుత్వానికి ఈ ఫేక్ ఫ్యాక్టరీ అరాచకాలు మాత్రం కనిపించడం లేదు. టీడీపీకి వ్యతిరేకంగా ఉన్న సోషల్ మీడియా యాక్టివిస్టులపై మాత్రమే కత్తికట్టి మూకుమ్మడి కేసులతో వేధిస్తోంది. 'నిజాయతీగా అయితే టీడీపీ సోషల్ మీడియాపై లెక్కలేనన్ని కేసులు నమోదు చేయాల్సి ఉంటుంది. తెలుగు రాష్ట్రాల్లోనే అత్యంత నీచాతినీచమైనది టీడీపీ సోషల్ మీడియా విభాగం' అని తటస్థులు, విశ్లేషకులు చెబుతున్నారు.



సోషల్ మీడియాలో టీడీపీ అరాచకదాడి సంగతేంటి?



సోషల్ మీడియాలో టీడీపీ వాళ్లు నీచాతినీచంగా పోస్టులు పెట్టడం లేదా? నేను ఇదివరకు చాలాసార్లు చెప్పాను.. వైఎస్సార్‌సీపీ వాళ్ల మీద పోస్టులు పెట్టడం కాదు... మా లాంటి వాళ్లను కూడా బూతులు తిడుతున్నారు. మొన్న రాత్రి 10.32 గంటలకు ఒక టీడీపీ అభిమాని ఫోన్ చేసి బండ బూతులు తిట్టాడు. టీడీపీ శ్రేణులు, టీడీపీ సోషల్ మీడియా విభాగం ఆధ్వర్యంలో జరుగుతున్న వికృతమైన, అరాచకమైన దాడి సంగతి ఏంటి? దానికి ఆన్సర్ ఉండాలి కదా? నా అనుభవంలో అయితే నన్ను ఏ ఇతర రాజకీయ పార్టీల వాళ్లు కూడా ఇంత బూతులు తిట్టలేదు. చంద్రబాబు పేటీఎం, నువ్వు కమ్యూనిస్టువు, కాంగ్రెసోనివి, నువ్వు బీఆర్ఎస్ వాడివి ఇట్లా రకరకాలుగా అన్నారు. కానీ ఇలా బూతులు అయితే తెలుగుదేశం పార్టీ వాళ్లు తిటినట్లు ఎవరూ తిట్టలేదు. నేను గ్యారంటీగా చెప్పగలుగుతాను. అత్యధికంగా తిట్టేది టీడీపీ వాళ్లే. తన వాళ్లను చంద్రబాబు కంట్రోల్ చేయడా?.

– ప్రొఫెసర్ నాగేశ్వర్,
రాజకీయ పరిశీలకుడు,
విశ్లేషకుడు, విద్యావేత్త, హైదరాబాద్

ఫేక్ ప్రచారం వ్యవస్థీకృతం

ఐ-టీడీపీ సోషల్ మీడియా విభాగాన్ని అత్యంత వ్యవస్థీకృతంగా తీర్చిదిద్దారు. సాక్షాత్తూ సీఎం చంద్రబాబు తనయుడు, మంత్రి లోకేశ్ తన 'ఎక్స్' ఖాతాలో తరచూ అభ్యంతరకర పదాలతో ట్వీట్లు చేస్తారు. ఆయన్ను ఆదర్శంగా తీసుకుని కొమ్మారెడ్డి పట్టాభి, ఆనం వెంకట రమణారెడ్డి వంటి నేతలతోపాటు ఐ-టీడీపీ, సీబీఎన్ ఆర్మీ తదితర విభాగాల సభ్యులు అడ్డూ అదుపూ లేకుండా తమకు నచ్చనివారిపైనా, తటస్థులపైనా బూతులతో విరుచుకుపడుతున్నారు. కొందరు టీడీపీ తరఫున మారుపేర్లతో సోషల్ మీడియాలో చేసే అసభ్య ప్రచారం కనీవినీ ఎరుగనిది. ఫేక్ ప్రచారం విషయంలో ఐ-టీడీపీకి పేటెంట్ ఇవ్వొచ్చని నిపుణులు చెబుతున్నారు. పచ్చి బూతులతో కలలో కూడా ఊహించలేని అపవాదులు, దుర్భాషలతో ప్రత్యర్థులను వెంటాడి వేటాడటంలో టీడీపీ సోషల్ మీడియాకు ఉన్న నైపుణ్యం, సామర్థ్యం మరెవరికీ ఉండదని తెలుగు రాష్ట్రాల్లో ప్రముఖ రాజకీయ విశ్లేషకుడు, విద్యావేత్త ప్రొఫెసర్ నాగేశ్వర్ పలుమార్లు అభిప్రాయపడ్డారు. గత ఎన్నికలకు ముందు టీడీపీ సోషల్ మీడియా తనపై బూతులతో విరుచుకుపడటాన్ని తప్పుపడుతూ ప్రొఫెసర్ నాగేశ్వర్ ఏకంగా చంద్రబాబుకు లేఖ రాశారు. ప్రస్తుతం ఉప ముఖ్యమంత్రిగా ఉన్న పవన్ కళ్యాణ్ గతంలో తన తల్లిని టీడీపీ సోషల్ మీడియా దూషించిందని చెప్పారు. అయినా చంద్రబాబు పట్టించుకోకపోగా టీడీపీ సోషల్ మీడియాను మరింత ప్రోత్సహించారు. అందువల్లే వైఎస్ జగన్ దంపతులతోపాటు మాజీ మంత్రులు అంబటి రాంబాబు, కొడాలి నాని, పేర్ని నాని, కడప ఎంపీ అవినాష్ వంటి అనేక మంది వైఎస్సార్‌సీపీ నేతలను నిత్యం అవమానించేలా, వారి వ్యక్తిత్వాన్ని దెబ్బతీసేలా తప్పుడు పోస్టులు, మార్ఫింగ్ ఫొటోలు సోషల్ మీడియాలో పెడుతూనే ఉన్నారు.

మంచిమాట



కాలం భగవత్స్వరూపం. ప్రాణుల్ని, జగత్తునూ నడిపించేదీ, హరించేదీ కాలమే. సృష్టి, స్థితి, వినాశం అనే ప్రధానమైన కార్యాలకు సాక్షీభూతంగా నిలిచేదీ కాలమే. అత్యంత బలవత్తరమైన కాలప్రభావాన్ని ఎవరూ అతిక్రమించలేరు. ఏ భౌతిక సాధనాలూ, ఆధ్యాత్మిక సాధనలూ కాలాన్ని బంధించలేవు. "పారే నదిలో ఈ క్షణం తాకిన నీటిని మరుక్షణం ఎలాగైతే తాకలేమో అలాగే గతించిన కాలాన్ని పట్టుకోలేం. అందుచేత కాలమహిమను ప్రతి ఒక్కరూ గుర్తించండి " అంటాడు చాణుక్యుడు. చాణుక్యుని వాక్యాలు ఎంతో అర్థవంతమైనవి.

సమయం.. సుధారసమయం..

జీవితంలో ప్రతిక్షణం వెలకట్టలేనిదే. గడిచిపోయిన క్షణం మళ్ళీ తిరిగిరాదు. అందుకే, కాలాన్ని విధిగా పాటించడం, లేదా సమయపాలనకు కట్టుపడడం అనేది ప్రతివారికీ అత్యంత ముఖ్యమైన విధి. సమయపాలనకు సంబంధించి రకరకాల నిర్వచనాలు మనకు నిత్యమూ కనబడుతూ ఉంటాయి. సమయానికి మనం అనుకున్న పనిలో, విహితమైన తీరులో, ఏకాగ్ర చిత్తంతో నిమగ్నం కావడాన్నే సమయపాలన అని చెప్పుకోవచ్చు.

ఏదైనా పనికోసం మనం సమయాన్ని కేటాయిస్తే, అది మనకు ఆ కార్య పరిపూర్ణతకు ఉపకరించి, సంతృప్తిని కలిగిస్తుంది. ఏదైనా ఉన్నతమైనలక్ష్యాన్ని సాధించడంకోసం సమయాన్ని కేటాయిస్తే, అది మనలో మేధాశక్తినీ పెంచడమే గాక, వ్యక్తిత్వాన్ని శిఖరాగ్రానికీ చేరుస్తుంది. అమేయమైన సారాన్ని నింపుకున్న పుస్తకాలను గానీ, గ్రంథాలను గానీ చదవడానికి సమయాన్ని కేటాయిస్తే, మనలో మనోవికాసం పెంపొందుతుంది. ఎప్పుడూ ఏదో ఒక పనిలోనే నిమగ్నం కాకుండా, ఒకింత నవ్వుకోవడానికి సమయాన్ని కేటాయిస్తే , అది మన జీవితాన్ని ఆహ్లాదమయం చేస్తుంది. కొంత సమయాన్ని పక్కవాడికి సహాయం చేయడానికి కేటాయిస్తే, అది మనకు ఆత్మానందాన్ని కలిగిస్తుంది. దైనందిన జీవితంలో వ్యాయామానికి సమయాన్ని కేటాయిస్తే, అది మనకు ఆరోగ్యప్రదాయినియై సంతసాన్ని కలిగిస్తుంది.

సమయం విలువ ప్రతివారూ గుర్తెరగడం అత్యంత ముఖ్యమైన విషయం. ప్రత్యేకించి, పిల్లలకు సమయానికి తగినట్లుగా పనులు అలవాటు చేయడం తల్లితండ్రుల బాధ్యత. ముఖ్యంగా ఉదయాన నిద్రలేవడం నుంచీ, రాత్రి పడుకునే వరకు, వాళ్ళు ఏ సమయానికి ఏం చేయాలో తెలియజెప్పడం తప్పనిసరిగా చేయాలి. ముందు కొంత బద్ధకించినా, కొన్ని రోజులకు సమయం ప్రకారం పనులు చేయడం వారికి అలవాటుగా మారుతుంది. జీవితానికి ఉత్తమ బాటను పరుస్తుంది.

'' క్షణము గడిచిన దాని వెన్కకు మరల్పసాధ్యమే మానవున కిలాచక్రమందు' అంటారు శ్రీ జాషువ మహాకవి. ఒక్క మాటలో చెప్పాలంటే విశ్వవిఖ్యాతి గడించిన మహనీయులందరూ ఏరంగానికి చెందిన వారైనా కాలం విలువ బాగా తెలిసిన వారే సమయాన్ని సద్వినియోగపరచుకున్నవారే . కాలం అనేది మనం ఆపితే ఆగదు . కాబట్టి ఏ సమయంలో ఏపని చెయ్యాలో ఆ సమయం లో ఆపని చేస్తే సమయం సద్వినియోగపరిచినట్లే.

> "ప్రపంచంలో అతి విలువైన వస్తువులు రెండు.. మొదటిది సహనం, రెండోది కాలం." అంటారు లియో టాల్స్టాయ్. సృష్టిలో మనకు లభించే అత్యంత విలువైన సంపద కాలమే. కానీ అత్యంత దయనీయంగా నిత్యమూ మనం వృథా చేసేదీ కాలాన్నే..!!
> "సమయం ప్రధానమైన విషయాల్లో ఒకటి కాదు. సమయమే అత్యంత ప్రశస్తమైన సంపద" అని యువత గ్రహిస్తే, వారి భవిత బంగరుబాట కావడం కష్టమైన విషయమేమీ కాదు. కాలానికి గాలం వేయడం కష్టమే. కానీ, దాని విలువను తెలుసుకుని, విహితమైన ఆలోచనకు ఆలవాలం చేసి, సద్వినియోగపరచిన ప్రతివ్యక్తీ చేయగలిగేది సుగతితో, ప్రగతితో కూడిన మహేంద్రజాలమే.


ప్రపంచంలో గొప్పవాళ్ళయిన వ్యక్తులందరూ కాలం విలువ తెలిసిన వాళ్ళే. ప్రతీ క్షణాన్నీ సద్వినియోగం చేసిన వాళ్ళే. స్వామి వివేకానంద యువతకు ఇచ్చిన సందేశం ఎంతో ప్రభాసమానంగా ఉంటుంది. '' యువతీయువకుల్లారా.. మీరంతా మేల్కొనండి. లక్ష్య సాధనకోసం శ్రమించే క్రమంలో ప్రతి క్షణాన్నీ సద్వినియోగపరచండి. మీరు మండే నిప్పు కణికలు అని గమనించండి. మిమ్మల్ని వెనుకకు నెట్టే ఒకే ఒక్క గుణం సోమరితనం. కాబట్టి కాలం విలువ ఎరిగినవారై, బద్ధకాన్ని వదలండి.'' అంటూ పలికిన సందేశం అత్యంత విలువైనది. సమయం విలువను కాల రాచే మహమ్మారి లాంటి జాడ్యం సోమరితనం. సాధారణంగా మనసు సుఖాన్ని, బుద్ధి హితాన్ని కోరుకుంటాయి . పరీక్షలొస్తున్నాయి చదవడం వెంటనే ఆరంభించమని బుద్ధి చెబుతుంది . ఏమీ ఫరవాలేదు, పరీక్షలు బాగా దగ్గరకొచ్చాక చదవొచ్చని మనస్సు చెబుతుంది. మనం మనస్సు పలికిన మాటే వింటాం. బుద్ధి చెప్పింది ఏమాత్రం వినం. అందుకే ఎంతో అనర్థం జరుగుతోంది. కాలాన్ని ఉపయోగించుకుని తగిన రీతిలోసార్థకత్వాన్ని సాధించడం కష్టమైన పని ఏమాత్రం కాదు.

జగత్ప్రసిద్ధమైన ఆపిల్ కంపెనీ సహవ్యవస్థాపకుడైన స్టీవ్ జాబ్స్ మాట్లాడుతూ, ''నీ సమయం ఎంతో విలువైనది. ఆ సమయాన్ని వినియోగించి నీ జీవితాన్ని స్వర్గమయం చేసుకో. కాలాన్ని వ్యర్థం చేసుకుని, ఇంకొకరి జీవితంలో నీవు బతకకు '' అంటారు. ఇందులో ఎంతో సందేశం ఉంది. కాలం విలువ తెలుసుకుని, ప్రగతినిసాధిస్తూ, ముందుకు సాగమని, ఇంకొకరితో తనను పోల్చుకోకుండా ధరిత్రిలో మరొక కొత్త చరిత్రను లిఖించమనే ప్రబోధమూ ఈ మాటల్లో దాగి ఉంది.

– వెంకట్ గరికపాటి
వ్యాఖ్యాన విశారద

తాత్వికత

ఎంతో చిన్నది జీవితం



ఓ గురువు అటవీప్రాంతంలోని మారుమూల ఉన్న చిన్నచిన్న గ్రామాలకు వెళ్ళి సత్సంగం చేయాలని బయలుదేరాడు. ఆయనతోపాటు శిష్య బృందం కూడా బయలుదేరింది. కొండలు, గుట్టలు, సెలయేర్లు దాటి వెళ్తా ఉన్నారు. దారిలో ఓ శిష్యుడు, గురువుని 'ఎప్పుడూ ఆనందంగా ఉండాలంటే ఎలా?'' అని అడిగాడు.

''మానవ శరీరం దేవుడిచ్చిన ఒకే ఒక అవకాశం. మరలా రమ్మంటే రాదు. అందుకని దాని విలువ తెలుసుకుని క్షణ క్షణం ఆనందంగా జీవించాలి!'' అన్నాడు.

''అదెలా?'' అని అడిగాడు శిష్యుడు.

ఇంతలో దూరంగా కొందరు మహిళలు పొయ్యిపైన నీళ్ళు కాగిస్తూ కనిపించారు గురువుకి. శిష్యుడిని అక్కడే కొద్దిసేపు ఆగమని చెప్పాడు. ఆ కట్టెలు కాలే వాసన పీల్చి కాలుతున్నదేదో చెప్పమన్నాడు.

వాసన పీల్చిన శిష్యుడు ఆశ్చర్యపోయాడు.

'తను గమనించింది వాస్తవమా కాదా' అని ఒకటికి రెండుసార్లు సరి చూసుకున్నాడు. తను చూస్తున్నది ముమ్మాటికీ నిజమేనని అర్థమయ్యింది.

''అక్కడ కాలుతున్నది చందనం కట్టెలు. అయ్యో, ఎందుకలా చేస్తున్నారు. ఎంతో విలువైన చందనం కొయ్యలను వంటచెరుకుగా వాడటమేమిటి?'' అని మనసులో అనుకున్నాడు.

'భర్తలకు తెలియకుండా వారు పొరపాటుగా అలా చేస్తున్నారేమోనని' అనుమానమేసింది. జాగ్రత్తగా గమనించిన అతడికి మరింత ఆశ్చర్యం కలిగింది. అది ఏమిటంటే ఆ మహిళలకు కొద్ది దూరంలోనే వారి భర్తలు చందనం కొయ్యలను కత్తితో నరికి పొయ్యిలో పెట్టడానికి అనువుగా కట్టెలు చీల్చుతున్నారు.

అదే విషయాన్ని శిష్యుడు బాధగా 'బంగారం లాంటి చందనాన్ని మంట పాలు చేయడం' గురించి గురువుకు చెప్పాడు.

దానికి గురువు నవ్వి ''చందనం కొయ్యల విలువ, వాటి ప్రత్యేకత వారికి తెలియదు. అందుకే వాటిని పొయ్యిలోపెట్టి తగులబెట్టేస్తున్నారు. వారి కళ్ళకు అవి మామూలు కట్టెల్లాగే అగుపిస్తున్నాయి. నీకు వాటి విలువ తెలుసు కాబట్టే ఆశ్చర్యపోతున్నావు. వారు చేస్తున్నది తప్పని చెబుతున్నావు. వారికి వాటి విలువ తెలిసేంత వరకు వారు చేస్తున్నది సరైనదేనని అనుకుంటారు. మనిషి కూడా అంతే. జీవితం విలువ తెలుసుకోక లేనిపోని పట్టింపులు, అహం, అసూయాద్వేషాలు, కోపం, ప్రతీకారం, ప్రపంచాన్ని మార్చాలనే ప్రయత్నం... ఇలాంటి వాటితో ఎంతో కాలం వృథా చేస్తున్నాడు. జీవితం విలువైనదన్న ఎరుక ఉంటే చాలు, ఆనందం మన వెంటే ఉంటుంది'' అని వివరించాడు.

జీవితం చాలా చిన్నదనీ, ప్రతిక్షణం ప్రకృతి ప్రసాదమని, అది తెలుసుకోకపోతే అసలైన ఆనందాన్ని కోల్పోతామని గ్రహించిన శిష్యబృందం ముందుకు నడిచింది.

– ఆర్.సి. కృష్ణస్వామి రాజు

ఆధ్యాత్మికథ

శత్రువులు... మిత్రులు



ఒక భక్తుడు అడవిలో కఠోర తపస్సు చేస్తున్నాడు. భగవంతుడు అతని ముందు ఓ ఆయుధంతో ప్రత్యక్షమయ్యాడు. ''భక్తా, నీ భక్తికి మెచ్చాను. నీకు ఏం వరం కావాలో కోరుకో'' అన్నాడు. దేవుడు అలా అడిగేసరికి భక్తుడు ఆగుతాడా...''దేవుడా, నా పురోగతికి అడ్డంకిగా ఉన్న శక్తులను నీ ఆయుధంతో నాశనం చేయాలి. ఇదే నా కోరిక'' అన్నాడు.

దేవుడు చిన్న నవ్వు నవ్వాడు. దానికేం చేసేస్తాను అంటూ అదృశ్యమయ్యాడు. కాసేపైంది. భగవంతుడి చేతిలో ఉన్న ఆయుధం తిన్నగా వచ్చి భక్తుడిపై దాడి చేసింది. భక్తుడు తడబడి కిందపడ్డాడు.

''భగవంతుడా, ఏమిటిది... నా పురోగతికి అడ్డంకిగా ఉన్న శక్తులనే కదా నాశనం చేయమన్నాను. కానీ నువ్వు నా మీద దాడి చేయించావు అని అడిగాడు భక్తుడు. వరమడగటం తప్పయిపోయింది'' అని బాధపడ్డాడు. కాసేపటికి దేవుడు మళ్ళీ ప్రత్యక్షమయ్యాడు. ''భక్తా, నువ్వు చెప్పినట్లే ఆయుధాన్ని విసిరాను. నా తప్పేమీ లేదు. అదేమీ గురి తప్పలేదు. సరిగ్గానే వచ్చింది'' అన్నాడు దేవుడు. ఇతరులను దెబ్బతీయాలి. నాశనం చేయాలి... అని అనుకునే నీ మనసే నీ పురోగతికి పెను అడ్డంకి. నీ మనసే నీకు బద్ధ శత్రువు. అదే నీ వృద్ధికి అడ్డుగోడగా ఉంది. అందుకే నా ఆయుధం నీ మీదకే దాడి చేసింది అని చెప్పాడు దేవుడు.

దీనిని బట్టి మనకెవరు శత్రువో అర్థమై ఉండొచ్చు.

మనకు మిత్రులెవరు....

మనకు దొరికే మిత్రులను మూడు రకాలుగా విభజించవచ్చు. తాటి చెట్టు. కొబ్బరి చెట్టు. పోక చెట్టు. తాటి చెట్టు ఉంది చూసారూ అది తానుగా ఎదుగుతుంది. తానుగానే నీరు తాగుతుంది. తానుగా పెరుగుతుంది. మనకు ఫలితాన్ని ఇస్తుంది. మనకు ఎదురుపడి మనకు సహాయం చేసే మిత్రులు ఇలాంటి వారు.

కొబ్బరి చెట్టు ఉంది చూసారూ... అది ఎప్పుడో అప్పుడు నీరు పోస్తే చాలు. పెరుగుతుంది.

ఇలాగే ఎప్పుడైనా సహాయం చేస్తే దానిని గుర్తు పెట్టుకుని మనకు సాయపడే మిత్రులు ఇలాంటి వారు.

పోక చెట్టు ఉంది చూసారూ... ఈ చెట్టుకి రోజూ నీరు పెట్టాలి. అప్పుడే పెరుగుతుంది. ఫలితాన్ని ఇస్తుంది.

ఇలా రోజూ సహాయం చేస్తేనే మనల్ని గమనించే మిత్రులు ఉంటారు కొందరు. వీరు పోక చెట్టులాగా.

కనుక మిత్రులు ఈ విధంగా ఎవరు ఎలాంటి వారో గుర్తు పెట్టుకోవచ్చు. దానికి తగినట్లు మెలగాలి. అది తప్పేమీ కాదు.

– యామిజాల జగదీశ్

సినిమా

ఐదు నిమిషాలు కూడా బోర్ కొట్టదు

– విశ్వక్ సేన్



● మీనాక్షీ చౌదరి, విశ్వక్ సేన్, శ్రద్ధా శ్రీనాథ్, రామ్ తాళ్లూరి

''నేను పది సినిమాలు చేశాను. ఆ అనుభవంతో చెబుతున్నాను. నా గత సినిమాల కన్నా చాలా భిన్నమైన సినిమా 'మెకానిక్ రాకీ'. ఐదు నిమిషాలు కూడా బోర్ కొట్టదు. 21న 'మెకానిక్ రాకీ' పెయిడ్ ప్రీమియర్స్ వేస్తున్నాం. థియేటర్స్‌కు రండి. నిర్మాత రామ్‌గారు లేకపోతే ఈ సినిమా సాధ్యమయ్యేది కాదు. ఆయన కాలర్ ఎగరేసుకునేలా చేస్తాను'' అని విశ్వక్ సేన్ అన్నారు. రవితేజ ముళ్లపూడి దర్శకత్వంలో విశ్వక్ సేన్ హీరోగా నటించిన చిత్రం 'మెకానిక్ రాకీ'. మీనాక్షీ చౌదరి, శ్రద్ధా శ్రీనాథ్ హీరోయిన్లుగా నటించారు. రామ్ తాళ్లూరి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 22న విడుదల కానుంది. ఈ సందర్భంగా వరంగల్‌లో జరిగిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో విశ్వక్ సేన్ మాట్లాడుతూ– ''మెకానిక్ రాకీ' మంచి సినిమా'' అన్నారు. ''విశ్వక్ సేన్ కష్టపడి, ఇష్టపడి చేసిన సినిమా ఇది. ఫ్యామిలీ ఆడియన్స్ అందరికీ నచ్చుతుంది'' అన్నారు రామ్ తాళ్లూరి. ఈ వేడుకలో వరంగల్ ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడి, 'మెకానిక్ రాకీ' విజయాన్ని ఆకాంక్షించారు.

మహారాష్ట్రలో తెలుసు కదా



సిద్ధు జొన్నలగడ్డ హీరోగా నటిస్తున్న చిత్రం 'తెలుసు కదా'. ఈ చిత్రంలో రాశీ ఖన్నా, శ్రీనిధి శెట్టి హీరోయిన్లు. స్టైలిస్ట్ నీరజ కోన ఈ సినిమాతో దర్శకురాలిగా పరిచయం అవుతున్నారు. కాగా ఈ సినిమా కొత్త షెడ్యూల్ చిత్రీకరణ మహారాష్ట్రలో ప్రారంభమైంది. 24 రోజుల పాటు జరగనున్న ఈ షెడ్యూల్‌లో సిద్ధు జొన్నలగడ్డ, శ్రీనిధి శెట్టి పాల్గొనగా ఓ పాట, ప్రధాన తారాగణంపై కొంత టాకీ పార్టు చిత్రీకరిస్తారు. టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్న ఈ సినిమాకు సంగీతం: తమన్.

● సిద్ధు జొన్నలగడ్డ

పుష్ప అంటేనే వైల్డ్ ఫైర్

– అల్లు అర్జున్



● నవీన్, రష్మిక, అల్లు అర్జున్, రవిశంకర్

''పాట్నాలో 'పుష్ప: ది రూల్' సినిమా ట్రైలర్ రిలీజ్ చేయడం సంతోషంగా ఉంది. తొలిసారి బిహార్ వచ్చాను. 'పుష్ప' తగ్గేదేలే... కానీ మీ ప్రేమకు తగ్గుతున్నాడు. 'పుష్ప' అంటే ఫ్లవర్ అనుకుంటున్నారా? కాదు... వైల్డ్ ఫైర్. నా హిందీ భాష కాస్త ఇబ్బందిగా ఉంటుంది. మన్నించండి. డిసెంబరు 5న ఈ సినిమాను థియేటర్స్‌లో చూడండి'' అని అల్లు అర్జున్ అన్నారు. హీరో అల్లు అర్జున్, దర్శకుడు సుకుమార్ కాంబినేషన్‌లో రూపొందిన సినిమా 'పుష్ప: ది రూల్'. ఈ చిత్రంలో రష్మికా మందన్నా హీరోయిన్‌గా నటించారు. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మించిన ఈ చిత్రం డిసెంబరు 5న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమా ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌ను బిహార్‌లోని పాట్నాలో నిర్వహించారు. ఈ వేడుకలో 'పుష్ప: ది రూల్' సినిమా తెలుగు, హిందీ ట్రైలర్స్‌ను విడుదల చేశారు. 'పుష్ప అంటే పేరు కాదు... పుష్ప అంటే బ్రాండ్, శ్రీవల్లి నా పెళ్లాం... పెళ్లాం మాట మొగుడు యింటే ఎట్టా ఉంటదో పెపంచానికి చూపిస్తా, పార్టీ ఉంది పుష్పా, పుష్ప అంటే నేషనల్ అనుకుంటి రా... ఇంటర్‌నేషనల్' అనే డైలాగ్స్ తెలుగు వెర్షన్ ట్రైలర్‌లో ఉన్నాయి. ఇక ఈ ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌కు అతిథిగా హాజరైన బిహార్ ఉపముఖ్యమంత్రి విజయ్ సేన సాహెబ్ మాట్లాడుతూ– ''పుష్ప: ది రూల్' సినిమా ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌ను బిహార్‌లోని పాట్నాలో నిర్వహించడం సంతోషంగా ఉంది. బిహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమారిగారి తరఫున ఈ యూనిట్‌కు కృతజ్ఞతలు చెబుతున్నాం. ఎవరైనా మా రాష్ట్రానికి అతిథిగా విచ్చేసినప్పుడు వారికి మా ప్రేమానురాగాలు చూపించడంలో ముందుంటాం. ఈ ఈవెంట్ ఇలా విజయవంతంగా జరగడానికి తోడ్పడుతున్న పోలీసులు, అభిమానులు, ప్రజలు... వీళ్లందరూ కళను, కళాకారులను సపోర్ట్ చేసేవారు కావడం ఆనందంగా ఉంది'' అన్నారు. ''అల్లు అర్జున్‌గారి హార్డ్‌వర్క్, సుకుమార్ గారి విజన్ వల్లే 'పుష్ప: ది రూల్' సినిమా సాధ్యమైంది. ఆంధ్రాలో మేం కొన్ని ఈవెంట్స్ చేశాం. కానీ ఇంత పెద్ద స్థాయిలో జనాన్ని చూడలేదు. చాలా సంతోషంగా ఉంది'' అని పేర్కొన్నారు నవీన్ ఎర్నేని. ''పాట్నాలోని ప్రజల నుంచి వస్తున్న స్పందన మాకు సంతోషాన్నిస్తోంది. పది సంవత్సరాలుగా ఫిల్మ్ మేకింగ్‌లో ఉన్నాం. ఈ స్థాయిలో ప్రజలు రావడం ఇదే. ఇది వెరీ వెరీ స్పెషల్ ఈవెంట్'' అని వెల్లడించారు వై. రవిశంకర్. ''పాట్నాలో ఎలా అయితే ఈ ఈవెంట్ చరిత్ర సృష్టించిందో, సినిమా కూడా అలాగే చరిత్ర సృష్టించాలని కోరుకుంటున్నాను. 'పుష్ప 2' సినిమాకు ఇదే జనాదరణ థియేటర్స్‌లో కూడా లభించాలని ఆశిస్తున్నాను'' అన్నారు 'పుష్ప: ది రూల్' సినిమా హిందీ వెర్షన్ డిస్ట్రిబ్యూటర్ అనిల్ తడాని.''పుష్ప 2' కాస్త ఆలస్యమైంది. కానీ ప్రేక్షకులందర్నీ అలరిస్తుంది'' అన్నారు రష్మికా మందన్నా.

డేట్ ఫిక్స్



● రిషబ్ శెట్టి

రిషబ్ శెట్టి నటించి, దర్శకత్వం వహించిన బ్లాక్‌బస్టర్ ఫిల్మ్ 'కాంతార' (2022). ఈ సినిమాకు ప్రీక్వెల్‌గా 'కాంతార: చాప్టర్ 1' రూపొందుతోంది. రిషబ్ శెట్టి నటిస్తూ, దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాను విజయ్ కిరగందూర్ నిర్మిస్తున్నారు. ఈ సినిమాను 2025 అక్టోబరు 2న రిలీజ్ చేయనున్నట్లు ప్రకటించారు. ''కాంతార: చాప్టర్ 1' కోసం రిషబ్ శెట్టి కేరళ పురాతన యుద్ధ కళల్లో ఒకటైన కలరి పయట్టులో కఠిన శిక్షణ తీసుకున్నారు. నటీనటుల నటన, కథను చూపించిన విధానం, అద్భుతమైన విజువల్స్‌తో ఈ చిత్రం అలరించేలా ఉంటుంది'' అని యూనిట్ పేర్కొంది.

అంత టైమ్ మాకు లేదు

● ధనుష్ తండ్రి, దర్శక-నిర్మాత కస్తూరి రాజా



నయనతార సినీ, వ్యక్తిగత జీవితంపై రూపొందించిన నయనతార: బియాండ్ ది ఫెయిరీ టేల్' డాక్యుమెంటరీ వివాదంలో ఇరుక్కున్న సంగతి తెలిసిందే. విజయ్ సేతుపతి, నయనతార జంటగా విఘ్నేష్ శివన్ దర్శకత్వంలో ధనుష్ నిర్మించిన తమిళ చిత్రం 'నానుమ్ రౌడీదాన్' (నేనూ రౌడీనే)లోని మూడు సెకన్ల వీడియోను ఈ డాక్యుమెంటరీలో ఉపయోగించారు. అయితే తన అనుమతి లేకుండా ఇలా చేయడం తగదంటూ, ధనుష్ రూ. 10 కోట్ల నష్ట పరిహారం కోరుతూ లీగల్ నోటీసు పంపించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో నయనతార సోషల్ మీడియా ద్వారా ఘాటుగా స్పందించారు. తాజాగా ధనుష్ తండ్రి, దర్శక-నిర్మాత కస్తూరి రాజాను 'ఈ విషయమై మీ అభిప్రాయం ఏంటి?' అని ఒక విలేకరి ప్రశ్నించగా – ''నయనతార వ్యవహారం గురించి నాకు కాస్త ఆలస్యంగా తెలిసింది. మేం ఎప్పుడూ ముందుకు పరిగెడుతుంటాం. తరుముకు వచ్చే వారి గురించి కానీ, వెనక మాట్లాడే వారి గురించి కానీ పట్టించుకునేంత టైమ్ మాకు లేదు. అయితే ధనుష్ అనుమతి కోసం రెండేళ్లు ఎదురు చూశానని నయనతార చేసిన ఆరోపణలో వాస్తవం లేదు. మా దృష్టంతా మేం చేసే పని మీద ఉంటుంది. ధనుష్ 'ఇడ్లీ కడై' చిత్రంతో బిజీగా ఉన్నారు'' అన్నారు.

– చెన్నై, 'సాక్షి' సినిమా ప్రతినిధి

భవిష్యత్తు చేతి రేఖల్లో ఉంటుందా?



● రూపా, ప్రియదర్శి

ప్రియదర్శి, రూపా కొడువాయూర్ జంటగా నటించిన చిత్రం 'సారంగ పాణి జాతకం'. ఇంద్రగంటి మోహనకృష్ణ దర్శకత్వంలో శివలెంక కృష్ణప్రసాద్ నిర్మిస్తున్న ఈ చిత్రం డిసెంబరు 20న విడుదల కానుంది. ఈ సందర్భంగా శివలెంక కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ– ''మనిషి భవిష్యత్తు అతని చేతి రేఖల్లో ఉంటుందా? లేదా చేసే చేతల్లో ఉంటుందా? అనే ప్రశ్నకు జవాబుగా ఓ పరిపూర్ణ హాస్యభరిత చిత్రంగా 'సారంగపాణి జాతకం' ఉంటుంది. ఈ నెల 21న టీజర్‌ను రిలీజ్ చేస్తున్నాం'' అన్నారు.

మహా సంద్రం



● నవనీత్ రైనా

నూతన తారలతో తెలుగు, హిందీ భాషల్లో శేషు రావెళ్ళ, కార్తికేయ. వి నిర్మిస్తున్న చిత్రం హైదరాబాద్‌లో ఆరంభమైంది. నవనీత్ రైనా హీరోగా నటిస్తున్న ఈ చిత్రానికి కార్తికేయ. వి దర్శకత్వం వహిస్తున్నారు. తొలి సన్నివేశానికి దర్శకుడు ఎస్. శంకర్ కెమెరా స్విచ్చాన్ చేయగా నిర్మాత దామోదర ప్రసాద్ క్లాప్ కొట్టారు. దర్శకుడు వి. సముద్ర గౌరవ దర్శకత్వం వహించారు. ''సరికొత్త కంటెంట్‌తో రాజీపడకుండా ఈ చిత్రాన్ని రూపొందించనున్నాం'' అని దర్శక-నిర్మాతలు పేర్కొన్నారు. ఈ చిత్రానికి కెమెరా: కల్యాణ్ సమి, సంగీతం: సుభాష్ ఆనంద్.

కృష్ణ విజయం



● హెచ్. మధుసూదన్

సూపర్‌స్టార్ కృష్ణ నటించిన చిత్రం 'ప్రేమ చరిత్ర-కృష్ణ విజయం'. యశ్వంత్, సుహాసిని జంటగా నటించారు. హెచ్. మధుసూదన్ దర్శకత్వం వహించి, నిర్మించారు. ఈ నెల 15న కృష్ణ ద్వితీయ వర్ధంతి సందర్భాన్ని పురస్కరించుకుని ఈ సినిమాని జనవరి 3న విడుదల చేస్తున్నట్లు ప్రకటించారు. హెచ్. మధుసూదన్ మాట్లాడుతూ– ''కృష్ణగారి చివరి చిత్రం విడుదల కాని సినిమాల జాబితాలో ఉండకూడదనే పట్టుదలతో ప్రేక్షకుల ముందుకు తీసుకువస్తున్నాం. ఈ చిత్రం కృష్ణగారి ఫ్యాన్స్‌తో పాటు అందర్నీ అమితంగా అలరిస్తుంది'' అన్నారు.

ప్రేమకథ



● ఐశ్వర్య, ధర్మ

ధర్మ, ఐశ్వర్య శర్మ జంటగా నటించిన చిత్రం 'డ్రింకర్ సాయి'. కిరణ్ తిరుమలశెట్టి దర్శకత్వంలో బసవరాజు శ్రీనివాస్, ఇస్మాయిల్ షేక్, బసవరాజు లహరీధర్ నిర్మించిన ఈ చిత్రం త్వరలో విడుదల కానుంది. ఈ సినిమా టీజర్‌ని రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా ధర్మ మాట్లాడుతూ– ''డ్రింకర్ సాయి' టీజర్ చూసి యువతను చెడగొట్టే సినిమా అనుకోకండి. ఇందులో మంచి ప్రేమ కథ ఉంది'' అన్నారు. ''మా సినిమాలో హీరో ఎక్స్‌ప్రెస్‌లా తాగుతుంటాడు. అందుకే 'డ్రింకర్ సాయి' టైటిల్ పెట్టాం'' అని కిరణ్ తిరుమలశెట్టి చెప్పారు. ''ప్రేక్షకుల మనసుల్ని కదిలించే చిత్రమిది'' అన్నారు ఇస్మాయిల్. ''అన్ని వాణిజ్య అంశాలున్న సినిమా 'డ్రింకర్ సాయి'' అని తెలిపారు బసవరాజు లహరీధర్.

సాహసం... థ్రిల్

శ్రీ ఇంద్ర, నికితా స్వామి, యుక్త పెర్వి హీరో హీరోయిన్లుగా నటించిన చిత్రం 'అనాథ'. శ్రీ ఇంద్ర హీరోగా నటించి, నిర్మించిన ఈ చిత్రానికి అన్నాసేట్ కేపీ దర్శకుడు. ఈ నెల 28న ఈ చిత్రం విడుదల కానుంది. ఈ సందర్భంగా శ్రీ ఇంద్ర మాట్లాడుతూ – ''కుటుంబ సమేతంగా చూడదగ్గ విధంగా ఈ యాక్షన్ అడ్వెంచరస్ థ్రిల్లర్ మూవీని రూపొందించాం. మ్యూజికల్‌గానూ సినిమా బాగుంటుంది'' అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: శ్రీ ఇంద్ర, కెమెరా: వీరేష్ కుమార్.



● 'అనాథ' పోస్టర్

మన జాలి రెడ్డి అంటున్నారు



● డాలీ ధనుంజయ

''బ్యాంక్, గ్యాంగ్‌స్టర్... ఈ రెండింటి చుట్టూ 'జీబ్రా' సినిమా ఉంటుంది. నేను పవర్‌ఫుల్ గ్యాంగ్‌స్టర్ పాత్ర చేశాను. బ్యాంకింగ్ సిస్టమ్, అందులోని ఫైనాన్షియల్ క్రైమ్ బ్యాక్‌డ్రాప్‌లో ఈ సినిమా సాగుతుంది'' అని కన్నడ స్టార్ డాలీ ధనంజయ అన్నారు. సత్యదేవ్, డాలీ ధనంజయ లీడ్ రోల్స్‌లో ఈశ్వర్ కార్తీక్ దర్శకత్వంలో ఎస్ఎన్ రెడ్డి, ఎస్. పద్మజ, బాల సుందరం, దినేష్ సుందరం నిర్మించిన చిత్రం 'జీబ్రా'. ఈ నెల 22న ఈ చిత్రం విడుదల కానున్న సందర్భంగా డాలీ ధనంజయ మాట్లాడుతూ – ''కామెడీ, ఫన్, యాక్షన్... ఇలా అన్ని అంశాలను మేళవించి, ఈ చిత్రకథ తయారు చేశాడు ఈశ్వర్ కార్తీక్. స్క్రీన్‌ప్లే కొత్తగా ఉంటుంది'' అన్నారు. ఇక 'పుష్ప'లో తాను చేసిన జాలి రెడ్డి పాత్ర గురించి మాట్లాడుతూ – ''ఈ పాత్ర నా కెరీర్‌లో మంచి గుర్తులా మిగిలిపోతుంది. తెలుగు ప్రేక్షకులు మన జాలి రెడ్డి అని నన్ను ఓన్ చేసుకోవడం ఆనందంగా ఉంది'' అన్నారు.



మాగ్నస్ కార్ల్‌సన్ 'డబుల్'

ప్రపంచ నంబర్‌వన్ గ్రాండ్‌మాస్టర్ మాగ్నస్ కార్ల్‌సన్ టాటా స్టీల్ చెస్ ఇండియా బ్లిట్జ్ టోర్నమెంట్‌లో విజేతగా నిలిచాడు. రెండు రోజుల వ్యవధిలో 18 రౌండ్ల పాటు (9 చొప్పున) జరిగిన ఈ కేటగిరీ పోటీల్లో అతను మరో రౌండ్ మిగిలుండగానే టైటిల్ సాధించాడు. ఈ టోర్నీలో ఇప్పటికే ర్యాపిడ్ టైటిల్ గెలుచుకున్న 33 ఏళ్ల నార్వే సూపర్‌స్టార్ బ్లిట్జ్‌లోనూ తిరుగులేదని నిరూపించుకున్నాడు. శనివారం ఎనిమిదో రౌండ్లో తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ ఇరిగేశి అర్జున్ చేతిలో కంగుతిన్న కార్ల్‌సన్ ఆదివారం జరిగిన 'రిటర్న్' ఎనిమిదో రౌండ్‌లో అర్జున్‌నే ఓడించి టైటిల్‌ను ఖాయం చేసుకోవడం విశేషం. అప్పటికే 12 పాయింట్లు ఉండటంతో టైటిల్ రేసులో అతనొక్కడే నిలిచాడు. చివరకు ఆఖరి రౌండ్ (9వ)లోనూ కార్ల్‌సన్... భారత గ్రాండ్‌మాస్టర్ విదిత్ గుజరాతిని ఓడించడంతో మొత్తం 13 పాయింట్లతో అగ్ర స్థానంలో నిలిచాడు. ఫిలిప్పినో-అమెరికన్ గ్రాండ్‌మాస్టర్ వెస్లీ సో 11.5 పాయింట్లతో రన్నరప్‌తో సంతృప్తి పడగా, తెలంగాణ స్టార్ అర్జున్ ఇరిగేశి(10.5)కి మూడో స్థానం దక్కింది. భారత ఆటగాళ్లు ఆర్. ప్రజ్ఞానంద (9.5), విదిత్ (9) వరుసగా నాలుగు, ఐదో స్థానాల్లో నిలిచారు.

అమ్మాయిలు అజేయంగా

- 3–0తో జపాన్‌పై జయభేరి
- రేపు జపాన్‌తోనే సెమీస్ పోరు
- ఆసియా చాంపియన్స్ ట్రోఫీ హాకీ

రాజ్‌గిర్ (బీహార్): మహిళల ఆసియా చాంపియన్స్ ట్రోఫీ హాకీ టోర్నమెంట్‌లో డిఫెండింగ్ చాంపియన్ భారత్ లీగ్‌లో ఎదురు లేని ప్రదర్శనతో దూసుకెళ్తోంది. ఆదివారం జరిగిన ఆఖరి లీగ్ మ్యాచ్‌లో భారత మహిళల జట్టు 3–0తో జపాన్‌పై ఘన విజయం సాధించింది. భారత్ తరఫున నవనీత్ కౌర్ (37వ నిమిషం), దీపిక కుమారి (47వ ని., 48వ ని.) గోల్స్ నమోదు చేశారు. ఆడిన మూడూ గెలిచిన భారత్ 15 పాయింట్లతో అగ్ర స్థానంలో నిలువగా... పారిస్ ఒలింపిక్స్ రన్నరప్, రజత పతక విజేత చైనా (12) రెండో స్థానంలో నిలిచింది. జపాన్‌తో జరిగిన పోరులో తొలి క్వార్టర్ నుంచే భారత స్ట్రయికర్లు తమ దాడులకు పదును పెట్టడంతో మూడు పెనాల్టీ కార్నర్ అవకాశాలు లభించాయి. 8వ నిమిషంలో దీపిక తొలి ప్రయత్నాన్ని ప్రత్యర్థి గోల్‌కీపర్ యూ కుడో చాకచక్యంగా అడ్డుకుంది. మిడ్‌ఫీల్డర్లు కెప్టెన్ సలీమా టెటె, నేహా, షర్మిలా దేవిలు రెండో క్వార్టర్‌లో చక్కని సమన్వయంతో ఫార్వర్డ్ లైన్‌కు గోల్స్ అవకాశాలు సృష్టించారు. కానీ జపాన్ రక్షణ పంక్తి అడ్డుకోగలిగింది. దీంతో దీపిక రెండో ప్రయత్నం కూడా విఫలమైంది. ఎట్టకేలకు మూడో క్వార్టర్‌లో భారత్ ఖాతా తెరిచింది. వైస్‌కెప్టెన్ నవ్‌నీత్ కౌర్ రివర్స్ షాట్ కొట్టి ఫీల్డ్ గోల్ చేయడంతో భారత్ 1–0తో ఆధిక్యంలోకి వెళ్లింది. ఆఖరి క్వార్టర్ మొదలవగానే దీపిక చెలరేగింది. ప్రత్యర్థి రక్షణ శ్రేణిని ఛేదించుకొని గోల్‌పోస్ట్ లక్ష్యంగా దాడులు చేసింది. ఈ క్రమంలో వరుస పెనాల్టీ కార్నర్లను దీపిక గోల్స్‌గా మలిచి భారత్‌ను గెలిచే స్థితిలో నిలిపింది. చివరి వరకు ఇదే ఆధిక్యాన్ని కాపాడుకున్న భారత్ ప్రత్యర్థికి మాత్రం ఒక్క గోల్ కొట్టకుండా ఎక్కడికక్కడ కట్టడి చేసింది. చాంపియన్స్ ట్రోఫీలో దీపిక దూకుడుకు ప్రత్యర్థి డిఫెండర్లు చేతులెత్తేస్తున్నారు. ఈ టోర్నీలోనే ఆమెది అసాధారణ ప్రదర్శన. నాకౌట్‌కు ముందే ఆమె పది గోల్స్ సాధించింది. ఇందులో 4 ఫీల్డ్ గోల్స్ కాగా, ఐదు పెనాల్టీ కార్నర్ గోల్స్ ఉన్నాయి. మరొకటి పెనాల్టీ స్ట్రోక్‌తో చేసింది. ఆదివారం జరిగిన ఇతర మ్యాచ్‌ల్లో మలేసియా 2–0తో థాయ్‌లాండ్‌పై, చైనా 1–0తో దక్షిణ కొరియాపై గెలుపొందాయి. భారత్ సెమీస్ ప్రత్యర్థి కూడా జపానే! మంగళవారం జరిగే సెమీఫైనల్లో భారత అమ్మాయిల జట్టు... నాలుగో స్థానంలో ఉన్న జపాన్‌తో తలపడుతుంది.



విజయానందంలో భారత మహిళల హాకీ జట్టు

భారత్ X మలేసియా

- అంతర్జాతీయ ఫ్రెండ్లీ ఫుట్‌బాల్ మ్యాచ్
- రాత్రి. గం. 7:30 నుంచి స్పోర్ట్స్ 18, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం

సాక్షి, హైదరాబాద్: ఇటీవల ఇంటర్ కాంటినెంటల్ ఫుట్ బాల్ టోర్నీకి ఆతిథ్యమిచ్చిన హైదరాబాద్ నగరం ఇప్పుడు మరో అంతర్జాతీయ ఫుట్‌బాల్ మ్యాచ్‌కు వేదిక కానుంది. గచ్చిబౌలి వేదికగా నేడు మలేసియాతో భారత పురుషుల ఫుట్‌బాల్ జట్టు స్నేహపూర్వక మ్యాచ్ ఆడనుంది. ఈ మ్యాచ్‌లో విజయం సాధించడమే ఏకైక లక్ష్యంగా బరిలోకి దిగనుంది. ఈ ఏడాది ఆరంభంలో ఏఎఫ్‌సీ ఆసియా కప్ సందర్భంగా గాయపడి తిరిగి కోలుకున్న సీనియర్ డిఫెండర్ సందేశ్ జింగాన్ 10 నెలల తర్వాత పునరాగమనం చేయనుండటంతో భారత జట్టు డిఫెన్స్ బలం మరింత పెరగనుంది. చివరగా భారత జట్టు హైదరాబాద్‌లో ఆడిన మ్యాచ్‌ల్లో మారిషస్, వియత్నాంతో 'డ్రా' చేసుకొని సిరియా చేతిలో 0–3తో పరాజయం పాలైంది. వచ్చే ఏడాది మార్చిలో జరగనున్న 2027 ఆసియా కప్ క్వాలిఫయర్స్‌కు ముందు భారత ఫుట్‌బాల్ జట్టుకు ఇదే చివరి మ్యాచ్. ఇరు జట్ల మధ్య ఇప్పటి వరకు 32 మ్యాచ్‌లు జరగగా... చెరో 12 మ్యాచ్‌ల్లో విజయాలు సాధించాయి. మరో ఎనిమిది మ్యాచ్‌లు 'డ్రా'గా ముగిశాయి. భారత ఫుట్‌బాల్ జట్టు ఇప్పటి వరకు అత్యధిక సార్లు తలపడిన జట్టు మలేసియానే కావడం విశేషం. ఫిఫా ప్రపంచ ర్యాంకింగ్స్‌లో ప్రస్తుతం భారత జట్టు 125వ స్థానంలో ఉండగా... మలేసియా 133వ ప్లేస్‌లో ఉంది. అయితే విదేశీ ఆటగాళ్లను జాతీయ జట్టుకు ప్రాతినిధ్యం వహించే అవకాశం కల్పించడంతో మలేసియా జట్టు... టీమిండియా కంటే మెరుగైన స్థితిలో కనిపిస్తోంది. భారత జట్టు తరఫున గోల్ కీపర్ గుర్‌ప్రీత్ సింగ్ సంధు, సందేశ్ జింగాన్, మెహతాబ్, విశాల్, రోషన్ సింగ్, అమరిందర్ సింగ్, సురేశ్ సింగ్ కీలకం కానున్నారు. భారత ఆటగాళ్లకు ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్‌ఎల్) అనుభవం ఈ మ్యాచ్‌లో కలిసి రానుంది. ఈ ఏడాది ఆడిన 10 మ్యాచ్‌ల్లో ఆరింట ఓడి, మరో నాలుగు మ్యాచ్‌లను 'డ్రా' చేసుకున్న భారత్... తొలి విజయం కోసం ఎదురు చూస్తోంది. ఆసక్తి గల అభిమానులు ticketgenie.in లో మ్యాచ్ టికెట్లు కొనుగోలు చేయవచ్చు.



ప్రాక్టీస్‌లో భారత జట్టు



మరిన్ని క్రీడా వార్తలు సాక్షి స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

బుమ్రా సారథ్యంలో...

తొలి టెస్టు బరిలోకి భారత్

- మ్యాచ్‌కు రోహిత్ శర్మ దూరం
- తప్పుకున్న గిల్, కోలుకున్న రాహుల్

పెర్త్: ప్రతిష్టాత్మక బోర్డర్–గావస్కర్ ట్రోఫీలో భారత జట్టు రెగ్యులర్ టాప్–3 బ్యాటర్లలో ఇద్దరు లేకుండానే బరిలోకి దిగడం ఖాయమైంది. వ్యక్తిగత కారణాలతో కెప్టెన్ రోహిత్ శర్మ, గాయంతో శుబ్‌మన్ గిల్ తొలి టెస్టుకు దూరమయ్యారు. ఈ నేపథ్యంలో కేఎల్ రాహుల్ టాపార్డర్‌లో ఆడటం ఖాయమైంది. రెండో ఓపెనర్‌గా అభిమన్యు ఈశ్వరన్‌కు అవకాశం దక్కవచ్చు. మరో వైపు పేస్ బౌలర్, వైస్ కెప్టెన్ జస్‌ప్రీత్ బుమ్రా సారథ్యంలో టీమిండియా తొలి టెస్టు ఆడనుంది. కెరీర్‌లో 40 టెస్టులు ఆడిన బుమ్రా ఒకే ఒక్క మ్యాచ్‌లో భారత జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించాడు. రోహిత్ శర్మ కోవిడ్ బారిన పడటంతో అతను ఈ బాధ్యతలు తీసుకోవాల్సి వచ్చింది. 2022లో ఇంగ్లండ్‌తో బర్మింగ్‌హామ్‌లో జరిగిన ఈ మ్యాచ్‌లో భారత్ 7 వికెట్ల తేడాతో ఓడింది. భారత్, ఆస్ట్రేలియా మధ్య ఈ నెల 22 నుంచి తొలి టెస్టు జరుగుతుంది. సోమవారం భారత్ తమ ప్రాక్టీస్‌కు విరామం ఇచ్చి మంగళవారం నుంచి మ్యాచ్ వేదిక అయిన ఆప్టస్ స్టేడియంలో సాధన చేస్తుంది.

రెండో టెస్టునుంచి అందుబాటులోకి...

సహచరులతో పాటు ఆస్ట్రేలియాకు వెళ్లకపోవడంతో రోహిత్ తొలి టెస్టు ఆడటంపై సందేహాలు ఉన్నాయి. అతను కూడా బీసీసీఐకి ముందే సమాచారం అందించాడు. అయితే శుక్రవారమే అతనికి కొడుకు పుట్టగా...మ్యాచ్‌కు మరో వారం రోజుల సమయం ఉండటంతో మళ్లీ రోహిత్ ఆడటంపై చర్చ జరిగింది. దీనికి ఫుల్‌స్టాప్ పెడుతూ కెప్టెన్ తుది నిర్ణయం తీసుకున్నాడు. మరికొంత సమయం కుటుంబంతో గడిపేందుకు ఆసక్తి చూపించిన అతను తొలి మ్యాచ్ నుంచి తప్పుకున్నాడు. డిసెంబర్ 6 నుంచి అడిలైడ్‌లో జరిగే రెండో (డే అండ్ నైట్) టెస్టుకు తాను అందుబాటులో ఉంటానని...నవంబర్ 30నుంచి ఆస్ట్రేలియన్ పీఎం ఎలెవన్‌తో జరిగే రెండు రోజుల పింక్ బాల్ వార్మప్ మ్యాచ్ కూడా ఆడతానని బోర్డుకు చెప్పినట్లు సమాచారం.

ఈశ్వరన్‌కూ అవకాశం!

శనివారం ప్రాక్టీస్ మ్యాచ్‌లో ఫీల్డింగ్ చేస్తుండగా శుబ్‌మన్ గిల్ ఎడమ చేతి బొటన వేలు విరిగింది. గాయం తీవ్రత ఎక్కువగా ఉండటంతో అతను కూడా పెర్త్ టెస్టునుంచి తప్పుకోవాల్సి వచ్చింది. మరో వైపు కేఎల్ రాహుల్ గాయంనుంచి పూర్తిగా కోలుకోవడం భారత్‌కు సానుకూలాంశం. ప్రాక్టీస్ మ్యాచ్ ఆడుతూ శుక్రవారం మోచేతికి గాయం కావడంతో రాహుల్ మైదానం వీడాడు. దాంతో అతని గాయంపై సందిగ్ధత నెలకొంది. అయితే ఎక్స్‌రే అనంతరం ఎలాంటి ప్రమాదం లేదని తేలింది. ఆదివారం మళ్లీ బ్యాటింగ్ చేసిన రాహుల్ ఎలాంటి ఇబ్బంది లేకుండా స్వేచ్ఛగా ఆడుతూ పూర్తి స్థాయిలో మూడు గంటల పాటు నెట్ సెషన్స్‌లో పాల్గొన్నాడు. తాను పూర్తి ఫిట్‌గా ఉన్నట్లు రాహుల్ స్వయంగా వెల్లడించాడు. రాహుల్ మూడో స్థానంలో ఆడితే యశస్వి జైస్వాల్‌తో పాటు రెండో ఓపెనర్‌గా అభిమన్యు ఈశ్వరన్ అరంగేట్రం చేయవచ్చు. దేశవాళీ క్రికెట్‌లో పరుగుల వరద పారించిన ఈశ్వరన్ ఆస్ట్రేలియా బయల్దేరడానికి ముందు కూడా అద్భుతమైన ఫామ్‌లో ఉన్నాడు. వరుసగా నాలుగు మ్యాచ్‌లలో నాలుగు సెంచరీలు చేశాడు. అయితే భారత్ 'ఎ' తరఫున బరిలోకి దిగి ఆస్ట్రేలియా 'ఎ'పై నాలుగు ఇన్నింగ్స్‌లలో కలిపి 36 పరుగులే చేయడంతో అతని ఆటపై సందేహాలు రేగాయి. ఇప్పుడు మారిన పరిస్థితుల నేపథ్యంలో ప్రత్యామ్నాయంగా ఓపెనర్ అవకాశం దక్కవచ్చు. మరో వైపు బీసీసీఐ ముందు జాగ్రత్తగా 'ఎ' జట్టులో సభ్యుడిగా ఉన్న మరో టాపార్డర్ బ్యాటర్ దేవదత్ పడిక్కల్‌ను ఆస్ట్రేలియాలోనే ఆగిపొమ్మని చెప్పింది. అవసరమైతే అతనూ టెస్టు సిరీస్ కోసం సిద్ధంగా ఉండేలా ఈ నిర్ణయం తీసుకుంది. పడిక్కల్ తన ఏకైక టెస్టును ఇంగ్లండ్‌పై ధర్మశాలలో ఆడాడు. పడిక్కల్‌తో పాటు మరో ముగ్గురు పేసర్లు నవదీప్ సైనీ, ఖలీల్ అహ్మద్, ముకేశ్ కుమార్ కూడా ఆస్ట్రేలియాలోనే ఆగిపోయారు.

నితీశ్ రెడ్డికి చాన్స్!

పెర్త్ టెస్టులో భారత జట్టులో మూడో పేసర్ స్థానం కోసం గట్టి పోటీ నెలకొంది. బుమ్రా, సిరాజ్‌లతో పాటు మూడో పేసర్‌గా ఇప్పటి వరకు ప్రసిధ్ కృష్ణ పేరు వినిపించింది. ప్రాక్టీస్ గేమ్‌లోనూ అతను రాణించాడు. అయితే నెట్ సెషన్స్‌లో ఢిల్లీ పేసర్ హర్షిత్ రాణా కూడా ఆకట్టుకున్నాడు. నిలకడగా 140 కిలో మీటర్ల వేగంతో బౌలింగ్ చేస్తున్న హర్షిత్ ఆస్ట్రేలియాలోని బౌన్సీ పిచ్‌లపై 'ట్రంప్ కార్డ్' కాగలడని టీమ్ మేనేజ్‌మెంట్ భావిస్తోంది. దాంతో ప్రసిధ్, హర్షిత్ మధ్య పోటీ నెలకొంది. ప్రసిధ్ ఇప్పటికే భారత్ తరఫున 2 టెస్టులు ఆడగా...హర్షిత్ ఇంకా అంతర్జాతీయ క్రికెట్‌లోకి అడుగు పెట్టలేదు. అయితే ఆంధ్ర ఆల్‌రౌండర్ నితీశ్ రెడ్డి అరంగేట్రంపై కూడా చర్చ జరుగుతోంది. ప్రాక్టీస్ గేమ్‌లో తన స్వింగ్ బౌలింగ్‌లో అతను సత్తా చాటాడు. అతని బ్యాటింగ్ కూడా అదనపు బలం కాగలదు. ఇద్దరు సీనియర్లు దూరం కావడంతో మన బ్యాటింగ్ లైనప్‌ను పటిష్టపర్చేందుకు నితీశ్ లాంటి ఆల్‌రౌండర్ అవసరం ఉంది. ఆదివారం టీమ్ ప్రాక్టీస్‌లో అతని ఆటను పర్యవేక్షించిన కోచ్ గౌతమ్ గంభీర్ సుదీర్ఘ సమయం పాటు చర్చిస్తూ తగిన సూచనలివ్వడం కనిపించింది. మరో వైపు గాయంనుంచి కోలుకొని రంజీ ట్రోఫీ మ్యాచ్ ఆడిన మొహమ్మద్ షమీ ఇప్పటికిప్పుడు ఆస్ట్రేలియా వెళ్లే అవకాశం లేదని...సిరీస్ చివర్లో జట్టుతో చేరవచ్చని బోర్డు వర్గాలు వెల్లడించాయి.



బుమ్రా



రాహుల్

భవిత

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

బీడీఎల్ హైదరాబాద్‌లో 150 అప్రెంటిస్‌లు

హైదరాబాద్ కంచన్‌బాగ్‌లోని భారత్ డైనమిక్స్ లిమిటెడ్ (బీడీఎల్).. అప్రెంటిస్ శిక్షణ కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం ఖాళీల సంఖ్య:** 150.
- » **శిక్షణ వ్యవధి:** ఒక సంవత్సరం.
- » **ట్రేడులు:** ఫిట్టర్, ఎలక్ట్రీషియన్, ఎలక్ట్రానిక్స్ మెకానిక్, మెషినిస్ట్, మెషినిస్ట్ గ్రైండర్, మెకానిక్ డీజిల్,మెకానిక్ ఆర్–ఏసీ,టర్నర్, వెల్డర్.
- » **అర్హత:** పదో తరగతి ఉత్తీర్ణులవ్వాలి. సంబంధిత ట్రేడులో ఐటీఐ ఉత్తీర్ణులై ఉండాలి.
- » **వయసు:** 11.11.2024 నాటికి 14 నుంచి 30 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.
- » **ఎంపిక విధానం:** విద్యార్హతల్లో సాధించిన మార్కులు, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- » **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**25.11.2024
- » **హార్డ్‌కాపీ దరఖాస్తులకు చివరితేది:**06.12.2024
- » **వెబ్‌సైట్:** https://bdl-india.in

ఉస్మానియా యూనివర్శిటీలో ఫ్రెంచ్/జర్మనీలో డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలు

ఉస్మానియా యూనివర్శిటీలో యూనివర్శిటీ ఆఫ్ ఆర్ట్స్ అండ్ సోషల్ సైన్సెస్, జర్మనీ విభాగం 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

- » **కోర్సు వ్యవధి:** నాలుగు నెలలు.
- » **అర్హత:** జూనియర్ డిప్లొమాకు ఇంటర్మీడియట్, సీనియర్ డిప్లొమాకు జూనియర్ డిప్లొమా ఉత్తీర్ణులై ఉండాలి.
- » **దరఖాస్తులకు చివరితేది:** 30.11.2024.
- » **వెబ్‌సైట్:** https://www.osmania.ac.in

టీవీవీపీలో 64 సివిల్ అసిస్టెంట్ సర్జన్ పోస్టులు

హైదరాబాద్‌లోని తెలంగాణ వైద్య విధాన పరిషత్(టీవీవీపీ) ఒప్పంద ప్రాతిపదికన సివిల్ అసిస్టెంట్ సర్జన్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. ఎంపికైన అభ్యర్థులు టీవీవీపీ ఆసుపత్రుల్లో విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది.

- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 64.
- » **వేతనం:** నెలకు రూ.1,00,000.
- » **విభాగాల వారీగా ఖాళీలు:** ఓబీ/జీవై–17, అనెస్థీషియా–11, పీడియాట్రిక్స్–12, రేడియాలజీ–08, జనరల్ మెడిసిన్–10, ఆర్థోపెడిక్స్–02, జనరల్ సర్జరీ–04.
- » **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిప్లొమా, పీజీ/డీఎన్‌బీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
- » **వయసు:** 46 ఏళ్లు మించకూడదు. ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీ అభ్యర్థులకు మూడేళ్లు, పీడబ్ల్యూబీడీ అభ్యర్థులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.
- » **ఎంపిక విధానం:** విద్యార్హతల్లో సాధించిన మార్కుల ఆధారంగా ఎంపికచేస్తారు.
- » **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును ప్రోగ్రామ్ ఆఫీసర్(హెచ్ఎస్–ఐ), ఫోర్త్ ఫ్లోర్, కమ్యూనిటీ హెల్త్ సెంటర్, ఖైరతాబాద్, హైదరాబాద్ చిరునామకు పంపించాలి.
- » **దరఖాస్తులకు చివరితేది:** 26.11.2024.
- » **వెబ్‌సైట్:** https://hyderabad.telangana.gov.in

ఆర్ఆర్‌సీ-నార్త్ వెస్ట్రన్ రైల్వేలో 1,791 యాక్ట్ అప్రెంటిస్‌లు

జైపూర్(రాజస్థాన్)లోని రైల్వే రిక్రూట్‌మెంట్ సెల్(ఆర్ఆర్‌సీ)–నార్త్ వెస్ట్రన్ రైల్వే ఎన్‌డబ్ల్యూఆర్ పరిధిలోని వర్క్‌షాప్/యూనిట్‌లలో యాక్ట్ అప్రెంటిస్ శిక్షణ కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం ఖాళీల సంఖ్య:** 1,791.
- » **వర్క్‌షాప్‌లు/యూనిట్లు:** డివిజనల్ రైల్వే మేనేజర్ ఆఫీస్(అజ్మీర్), డివిజనల్ రైల్వే మేనేజర్ ఆఫీస్(బికనీర్), డివిజనల్ రైల్వే మేనేజర్ ఆఫీస్(జైపూర్), డివిజనల్ రైల్వే మేనేజర్ ఆఫీస్(జోధ్‌పూర్), బీటీసీ క్యారేజ్(అజ్మీర్), బీటీసీ లోకో(అజ్మీర్), క్యారేజ్ వర్క్స్‌షాప్(బికనీర్), క్యారేజ్ వర్క్స్ షాప్(జోధ్‌పూర్).
- » **అర్హత:** కనీసం 50 శాతం మార్కులతో పదో తరగతితో పాటు సంబంధిత ట్రేడ్‌లో ఐటీఐ ఉత్తీర్ణులై ఉండాలి.
- » **ట్రేడులు:** కార్పెంటర్, పెయింటర్, మేసన్, పైప్ ఫిట్టర్, ఫిట్టర్, డీజిల్ మెకానిక్, వెల్డర్, మెకానికల్,ఎలక్ట్రీషియన్, మెషినిస్ట్, మెకానిక్ మెషిన్ టూల్ మెయింటెనెన్స్ తదితరాలు.
- » **వయసు:** 10.12.2024 నాటికి 15 నుంచి 24 ఏళ్ల మధ్య ఉండాలి.
- » **ఎంపిక విధానం:** మెట్రిక్యులేషన్, ఐటీఐ మార్కులు, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- » **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 10.12.2024
- » **వెబ్‌సైట్:** https://rrcjaipur.in

విద్యా రుణానికి హామీ

- » ఉన్నత విద్య రుణాలకు సర్కారు గ్యారెంటీ
- » రుణ మొత్తంలో 75 శాతానికి హామీ
- » 860 ఉన్నత విద్య సంస్థల్లో చదివే వారికి అవకాశం

పీఎం విద్యాలక్ష్మి.. గత కొన్నేళ్లుగా విద్యా రుణాలు పొందేందుకు అమలవుతున్న పథకం! ఒకే పోర్టల్ ద్వారా పలు బ్యాంకులకు ఎడ్యుకేషన్ లోన్ కోసం దరఖాస్తు చేసుకునే వీలు కల్పిస్తుంది!! కేంద్ర ప్రభుత్వం..తాజాగా పీఎం విద్యాలక్ష్మి స్కీమ్‌లో పలు కీలక మార్పులు చేసింది. ఎన్ఐఆర్ఎఫ్‌లో ర్యాంకులు పొందిన ఇన్‌స్టిట్యూట్స్‌తో పాటు ఇతర అత్యున్నత విద్యా సంస్థలలో ప్రవేశం పొందిన వారికి విద్యారుణ మొత్తంలో 75 శాతం గ్యారెంటీ ఇవ్వనున్నట్లు ప్రకటించింది. ఈ నేపథ్యంలో.. పీఎం-విద్యాలక్ష్మి స్కీమ్ నూతన విధి విధానాలు, దరఖాస్తు ప్రక్రియ తదితర వివరాలు..

పీఎం విద్యాలక్ష్మి స్కీమ్

కేంద్ర ప్రభుత్వం పీఎం–విద్యాలక్ష్మి స్కీమ్‌కు తాజాగా ఆమోదం తెలిపింది. ఈ స్కీమ్‌తో ఉన్నత విద్య కోర్సుల్లో చేరే విద్యార్థులకు విద్యా రుణాలు సులభంగా అందుబాటులోకి రానున్నాయి. దీని వల్ల ప్రధానంగా మధ్య తరగతి, దిగువ మధ్య తరగత వర్గాలు ప్రయోజనం పొందనున్నాయి. ఈ వర్గాలకు చెందిన విద్యార్థులు ఉన్నత విద్యకు దూరం కాకూడదనే ఉద్దేశంతో ఈ పథకానికి రూపకల్పన చేశారు.

ఉన్నత చదువులు

- పీఎం–విద్యాలక్ష్మి స్కీమ్ ద్వారా దేశ వ్యాప్తంగా 860 విద్యా సంస్థల్లో ఉన్నత కోర్సుల్లో(బ్యాచిలర్, పీజీ, ప్రొఫెషనల్ ప్రోగ్రామ్స్ తదితర) ప్రవేశం ఖరారు చేసుకున్న వారికి, చదువుతున్న వారికి ప్రయోజనం చేకూరనుంది.
- నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్(ఎన్ఐఆర్ఎఫ్) ర్యాంకుల్లో ఓవరాల్ కేటగిరీలో టాప్–100లో నిలిచిన ఇన్‌స్టిట్యూట్స్, అదే విధంగా ఆయా విభాగాల్లో టాప్–100 కేటగిరీలో నిలిచిన విద్యాసంస్థల్లో చదివే విద్యార్థులకు ఈ స్కీమ్‌ను వర్తింపజేస్తారు.అదే విధంగా.. ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్స్‌లో 101–200శ్రేణిలో ఉన్న రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలోని ఇన్‌స్టిట్యూట్‌ల విద్యార్థులు కూడా ఈ స్కీమ్ పరిధిలోకి వస్తా రు. దేశంలో అత్యున్నతమైన ఇన్‌స్టిట్యూట్స్‌గా పేరొందిన విద్యాసంస్థల్లో చేరిన విద్యార్థులు సైతం ఈ స్కీమ్ ద్వారా ప్రయోజనం పొందొచ్చు.

75 శాతం ప్రభుత్వ గ్యారెంటీ

- పీఎం–విద్యాలక్ష్మీ స్కీమ్ ద్వారా రూ.7.5 లక్షల వరకు రుణ మొత్తంలో, 75 శాతం మొత్తానికి కేంద్ర ప్రభుత్వమే గ్యారెంటీగా ఉంటుంది. అదే విధంగా కుటుంబ వార్షికాదాయం రూ.8 లక్షల లోపు ఉండి.. ప్రభుత్వం నుంచి స్కాలర్‌షిప్స్ తదితర ఇతర ఆర్థిక ప్రోత్సాహకాలు పొందని విద్యార్థుల లోన్ రీపేమెంట్ మారటోరియం సమయంలో మూడు శాతం వడ్డీని ప్రభుత్వమే మంజూరు చేస్తుంది. దీనిని ఏటా లక్ష మంది విద్యార్థులకు అందిస్తారు. అయితే ఈ విధానంలో ప్రభుత్వ ఇన్‌స్టిట్యూట్స్‌లో టెక్నికల్, ప్రొఫెషనల్ కోర్సులు చదివిన వారికి ప్రాధాన్యం ఇవ్వనున్నారు.
- కుటుంబ వార్షిక ఆదాయం రూ.4.5 లక్షలోపు ఉన్న టెక్నికల్, ప్రొఫెషనల్ కోర్సుల విద్యార్థుల లోన్ రీపేమెంట్‌లో మొత్తం వడ్డీని ప్రభుత్వమే మంజూరు చేస్తుంది. ఇలా గరిష్ఠంగా రూ.పది లక్షల రుణం వరకు ఈ సదుపాయాన్ని కల్పిస్తారు.

22 లక్షల మందికి ప్రయోజనం

పీఎం విద్యాలక్ష్మి స్కీమ్ ద్వారా ఏటా 22 లక్షల మందికి ప్రయోజనం చేకూర్చాలని నిర్ణయించారు. ప్రస్తుతం ఈ స్కీమ్‌ను 2024–25, 2030–31 వరకు కొనసాగించనున్నారు. ఇందుకోసం మొత్తం రూ.3,600 కోట్లను కేటాయించారు.

ఆన్‌లైన్‌లోనే లోన్ ప్రక్రియ

పీఎం–విద్యాలక్ష్మి స్కీమ్ ద్వారా రుణాలు పొందేందుకు దరఖాస్తు ప్రక్రియ మొత్తాన్ని ఆన్‌లైన్‌లోనే అందుబాటులోకి తెచ్చేలా చర్యలు తీసుకుంటున్నారు.ఇందుకోసం ప్రత్యేకంగా ఒక వెబ్ పోర్టల్‌ను రూపొందించనున్నారు. విద్యార్థులు ఈ వెబ్ పోర్టల్‌లో లాగిన్ అయి.. ఆయా బ్యాంకుల విద్యా రుణ విధానాలు చూసి.. తమకు నచ్చిన బ్యాంకులకు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించనున్నారు.

15 రోజుల్లోపు నిర్ణయం

పీఎం విద్యాలక్ష్మి స్కీమ్ ద్వారా నిర్దేశిత వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారికి.. ఆ ప్రక్రియ మొత్తాన్ని పదిహేను రోజుల్లోపు పూర్తి చేయాలని నిర్ణయించారు. ఆన్‌లైన్‌లో లోన్ కోసమే కాకుండా.. వడ్డీ రాయితీ కోసం కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ వడ్డీ రాయితీ మొత్తాన్ని ఈ–వోచర్స్ రూపంలో కేంద్ర ప్రభుత్వం ఆయా బ్యాంకులకు అందిస్తుంది.

ఏడాది మారటోరియం

ప్రస్తుతం ఐబీఏ మోడల్ ఎడ్యుకేషన్ లోన్ మార్గదర్శకాల ప్రకారం–విద్యా రుణం తిరిగి చెల్లింపునకు ఏడాది మారటోరియం వ్యవధి సదుపాయాన్ని కల్పిస్తున్నారు. విద్యార్థులు తమ కోర్సు పూర్తయిన సంవత్సరం తర్వాత లేదా ఉద్యోగం పొందిన అనంతరం.. ఈ రెండింటిలో ఏది ముందుగా సాధ్యమైతే అప్పటి నుంచి రుణం మొత్తాన్ని వాయిదాల రూపంలో తిరిగి చెల్లించాల్సి ఉంటుంది.

విద్యాలక్ష్మి స్కీమ్‌కు కొనసాగింపు

కేంద్ర ప్రభుత్వం తాజాగా ఆమోదించిన పీఎం–విద్యాలక్ష్మి స్కీమ్‌ను.. ఇప్పటికే అమలులో ఉన్న విద్యాలక్ష్మి స్కీమ్‌కు కొనసాగింపు అనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. వాస్తవానికి విద్యా రుణాలకు దరఖాస్తు, మంజూరులో విద్యార్థులకు ఎదురవుతున్న సమస్యలకు పరిష్కారంగా కేంద్ర ప్రభుత్వం విద్యాలక్ష్మి పేరుతో ప్రత్యేక పోర్టల్‌ను అందుబాటులోకి తెచ్చింది. అభ్యర్థులు ఈ పోర్టల్‌లో లాగిన్ అయి.. కామన్ ఎడ్యుకేషనల్ లోన్ అప్లికేషన్ ఫామ్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. గరిష్ఠంగా మూడు బ్యాంకులకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఇలా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న దరఖాస్తులను.. ప్రాథమ్యంగా పేర్కొన్న బ్యాంకులకు పంపడం జరుగుతుంది. సదరు బ్యాంకులు దరఖాస్తును పరిశీలించి సంతృప్తి చెందితే తదుపరి దశలో ఏ బ్రాంచ్‌లో సంప్రదించాలి, ఏ ఏ పత్రాలు తీసుకెళ్లాలి అనే వివరాలను విద్యార్థులకు పంపుతారు. అంటే విద్యాలక్ష్మి పోర్టల్ విద్యా రుణాల విషయంలో విద్యార్థులకు, బ్యాంకులకు అనుసంధానకర్తగా నిలుస్తోంది.

గుర్తింపు తప్పనిసరి

- ప్రస్తుతం అమలవుతున్న విద్యాలక్ష్మి స్కీమ్ ప్రకారం–ఏఐసీటీఈ, యూజీసీ, ఎంహెచ్ఆర్డీ, ఆల్ ఇండియా అసోసియేషన్ ఆఫ్ యూనివర్సిటీస్ గుర్తింపు ఉన్న కళాశాలు, కోర్సులనే విద్యా రుణ మంజూరులో పరిగణనలోకి తీసుకుంటాయి.
- ఉన్నత విద్యకు రుణాల మంజూరులో బ్యాంకులు అనుసరిస్తున్న మరో ప్రధానమైన నిబంధన.. విద్యా రుణానికి దరఖాస్తు చేసుకునే విద్యార్థులు తమ కోర్సుకు సంబంధించి నిర్వహించిన ఎంట్రన్స్‌లలో ఉత్తీర్ణత సాధిస్తేనే దరఖాస్తుకు అర్హత కల్పిస్తున్నాయి.
- దేశంలోని ఇన్‌స్టిట్యూట్‌లలో ప్రవేశం పొందిన విద్యార్థులకు గరిష్ఠంగా రూ.పది లక్షలు మంజూరు చేస్తున్నాయి. విదేశీ ఇన్‌స్టిట్యూట్‌లలో ప్రవేశం పొందిన వారికి గరిష్ఠంగా రూ.20 లక్షలు మంజూరు చేస్తునాయి.
- రుణాలను మూడు శ్లాబ్స్‌గా వర్గీకరించారు. శ్లాబ్–1 మేరకు రూ.4 లక్షల రుణ మొత్తంగా నిర్ణయించారు. ఈ శ్లాబ్‌లో విద్యార్థులు ఎలాంటి హామీ ఇవ్వక్కర్లేదు. శ్లాబ్–2 మేరకు రూ.4 లక్షల నుంచి రూ.7.5 లక్షల వరకు రుణ మొత్తాన్ని కేటాయిస్తున్నారు. ఇందుకోసం తల్లిదండ్రుల హామీ, థర్డ్ పార్టీ గ్యారెంటీ పత్రం ఇవ్వాల్సి ఉంటుంది. శ్లాబ్–3 విధానంలో రూ.7.5 లక్షలకు పైగా రుణ మొత్తం ఉంటోంది. దీనికి దరఖాస్తు చేయాలనుకుంటే.. ఈ మొత్తానికి సరిపడే కొల్లేటరల్ సెక్యూరిటీ (స్థిరాస్థి పత్రాలను) ఇవ్వాల్సి ఉంటుంది.



మార్జిన్ మనీ నిబంధన

విద్యార్థులు తాము దరఖాస్తు చేసుకున్న రుణ మొత్తంలో కొంత మొత్తాన్ని మార్జిన్ మనీగా సమకూర్చుకోవాల్సి ఉంటుంది. ఈ మేరకు రూ.4 లక్షల వరకు ఎలాంటి మార్జిన్ మనీ అవసరం ఉండదు. కాని రూ.4 లక్షలు దాటిన రుణ దరఖాస్తుల విషయంలో స్వదేశంలో చదివే విద్యార్థులు అయిదు శాతం, విదేశీ విద్య 15 శాతం మార్జిన్ మనీని సమకూర్చుకోవాల్సి ఉంటుంది. ఈ మార్జిన్ మనీ నిబంధన నుంచి కొత్తగా అమల్లోకి తీసుకొచ్చిన పీఎం విద్యాలక్ష్మి స్కీమ్ వెసులుబాటు కల్పిస్తుందనే వాదన వినిపిస్తోంది.

లభించే వ్యయాలు

దేశంలో అందుబాటులో ఉన్న విద్యా రుణాలు, అవి అందించే వ్యయాలను పరిగణనలోకి తీసుకుంటే.. ట్యూషన్ ఫీజు; హాస్టల్ ఫీజు; ఎగ్జామినేషన్/లైబ్రరీ / లేబొరేటరీ ఫీజు; విదేశీ విద్యకు ప్రయాణ ఖర్చులు; పుస్తకాలు, యూనిఫామ్, ఇతర అకడమిక్ సంబంధిత పరికరాల కొనుగోలుకు అయ్యే వ్యయం; కంప్యూటర్ కొనుగోలు వ్యయం; కోర్సు పరంగా అవసరమైన స్టడీ టూర్స్, ప్రాజెక్ట్ వర్క్స్ తదితరాలకు అయ్యే వ్యయం; ఇన్‌స్టిట్యూట్‌లు వసూలు చేసే కాషన్ డిపాజిట్, బిల్డింగ్ ఫండ్, రిఫండబుల్ డిపాజిట్‌లకు రుణం మంజూరు చేస్తారు. పీఎం విద్యాలక్ష్మి స్కీమ్‌లో సైతం ఇవే వ్యయాలకు రుణం లభించనుంది.

పీఎం విద్యాలక్ష్మి స్కీమ్.. ముఖ్యాంశాలు

- 2024–25, 2030–31 కాలానికి స్కీమ్ అమలు.
- విద్యా రుణాలకు 75 శాతం గ్యారెంటీ ఇవ్వనున్న కేంద్ర ప్రభుత్వం.
- 22 లక్షల మందికి ప్రయోజనం;రూ.3,600 కోట్ల కేటాయింపు.
- దేశ వ్యాప్తంగా 860 అగ్రశ్రేణి విద్యా సంస్థల్లో విద్యార్థులకు అందనున్న ప్రయోజనం.
- ఆన్‌లైన్‌లో రుణ దరఖాస్తు అవకాశం.
- రూ.8 లక్షల లోపు వార్షికాదాయం ఉంటే మూడు శాతం, రూ.4.5 లక్షలలోపు వార్షికాదాయం ఉంటే మొత్తం వడ్డీ రాయితీ భరించనున్న ప్రభుత్వం.

సాక్షి ప్రాఫిట్ ప్లస్
సోమవారం
18-11-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు (గురువారం ముగింపు)		
సెన్సెక్స్ ▽	111	77,580
నిఫ్టీ ▽	26	23,533


విదేశీ సూచీలు (శుక్రవారం రాత్రి 11.30 గంటలకు)			
నాస్‌డాక్	18,686	▽	421
డోజోన్స్	43,445	▽	306
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,064	▽	8
డాక్స్	19,211	▽	53
షాంఘై	3,331	▽	49
నికాయ్	38,643	△	107

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటి	84.00	85.02
£	బ్రిటన్ పౌండ్	ఒకటి	106.33	109.16
€	యూరో	ఒకటి	88.48	91.08
¥	జపాన్ ఎన్ (100)	ఒకటి	53.93	55.30
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఒకటి	54.15	56.34
S$	సింగపూర్ డాలర్	ఒకటి	60.74	66.12
SAR	సౌదీ రియాల్	ఒకటి	21.61	23.15
UAE D	యూఏఈ దిర్హామ్	ఒకటి	22.09	23.85
¥	చైనా యువాన్	ఒకటి	10.80	12.63

పిల్లల బీమా.. ఇవ్వదు ధీమా..!



తల్లిదండ్రులకు అత్యంత ముఖ్యమైన ఆర్థిక లక్ష్యాల్లో పిల్లల విద్య ఒకటి. విద్యా వ్యయాలు ఏటేటా 10 శాతానికి మించి పెరుగుతున్నాయి. సాధారణ ద్రవ్యోల్బణం 5.5 శాతంతో పోల్చితే రెట్టింపు స్థాయి ద్రవ్యోల్బణం విద్యారంగంలో చూడొచ్చు. దీని కారణంగా నేడు ఒక కోర్స్‌కు రూ. 25 లక్షలు ఖర్చవుతుంటే.. 13 ఏళ్ల తర్వాత (ఉన్నత విద్యకు వచ్చే సరికి) రూ.1.09 కోట్లు వెచ్చించాల్సి వస్తుంది. ముందస్తు ప్రణాళికతోనే ఈ వ్యయాలను అధిగమించడం సులభమవుతుంది. పాఠశాల ప్రవేశం నాటి నుంచే పిల్లల విద్య కోసం పెట్టుబడులు ప్రారంభించాలి. భవిష్యత్‌లో ఎంత అవసరమో, ఆ మేరకు సమకూర్చుకునే విధంగా ప్రతి నెలా పొదుపు, మదుపు చేస్తూ వెళ్లాలి. ఇందుకు ఎంపిక చేసుకునే పెట్టుబడి సాధనాలు కీలకంగా మారతాయి. ఇక్కడ తప్పటడుగులు వేస్తే పిల్లల ఉన్నత విద్య కోసం రేపు అప్పు చేయాల్సి రావచ్చు. కేవలం చైల్డ్ ఇన్సూరెన్స్ పాలసీలతో విద్యా వ్యయాలను తట్టుకోవడం కష్టమే. ఈ దిశగా అవగాహన కల్పించే కథనమిది...

–సాక్షి, బిజినెస్ డెస్క్



బీమా, పెట్టుబడులు కలిసిన సాధనం ఇది..

- ఆర్థికంగా ఈ రెండూ వేర్వేరు అంశాలు
- రెండింటినీ కలపడం సరైన నిర్ణయం కాదు
- విడివిడిగా, అవసరం మేరకు ఎంపిక ఉండాలి
- రాబడులు, రక్షణలో రాజీ పడాల్సి రావచ్చు..

తల్లిదండ్రుల్లో ఎంత మంది తమ పిల్లల భవిష్యత్ విద్యకు సన్నద్ధంగా ఉన్నారు? ఇదే తెలుసుకుందామని హెచ్‌ఎస్‌బీసీ సంస్థ ఓ సర్వే చేసింది. 'క్వాలిటీ ఆఫ్ లైఫ్ రిపోర్ట్ 2024' పేరుతో నివేదిక విడుదల చేసింది. 53 శాతం తల్లిదండ్రులు తమ పిల్లల విద్య కోసం పెట్టుబడులు చేస్తున్నట్టు చెప్పారు. అవసరమైతే తమ పిల్లలే విద్యా రుణం తీసుకుంటారని 40 శాతం మంది తల్లిదండ్రులు చెప్పారు. కొందరు ఆస్తులు అమ్మి చదివిస్తామని చెప్పగా, స్కాలర్‌షిప్ మార్గాలు చూస్తామని కొంతమంది తమ అభిప్రాయాలు పంచుకున్నారు. కానీ, పిల్లల పేరిట పెట్టుబడులు చేస్తున్న వారిలో ఎంత మంది మెరుగైన సాధనాలను ఎంపిక చేసుకున్నారన్నది ఈ సర్వే తేలలేదు. మొత్తానికి సగం మందికి ఆర్థిక ప్రణాళిక లేదని స్పష్టమవుతోంది. తల్లిదండ్రులకు ఏదైనా జరగరానిది జరిగితే... పిల్లల విద్యకు ఆర్థిక తోడ్పాటు అందించే చైల్డ్ ఇన్సూరెన్స్ ప్లాన్లకు మార్కెట్లో క్రేజ్ ఉంది. బీమా ఏజెంట్లు వీటిని ఎక్కువగా ప్రమోట్ చేస్తుంటారు. నిజానికి వీటిలో చార్జీలు ఎక్కువ. దాంతో రాబడులు కొంత తక్కువ. పిల్లల పేరిట మార్కెటింగ్ చేసే ఉత్పత్తుల వలలో పడకుండా ఉంటేనే మంచిది. ముఖ్యంగా బీమా, పెట్టుబడులను కలపడం మంచి నిర్ణయం అనిపించుకోదు. ఈ రెండింటినీ వేర్వేరుగానే చూడాలి.



చైల్డ్ ప్లాన్లలో ఏముంది?

పిల్లల పేరిట రెండు రకాల ఇన్సూరెన్స్ ప్లాన్లు ఉన్నాయి. యూనిట్ లింక్డ్ చిల్డ్రన్ ఇన్సూరెన్స్ ప్లాన్లు (యులిప్‌లు) ఇందులో ఒక రకం. చెల్లించిన ప్రీమియంలో బీమా రిస్క్, నిర్వహణ, ఇతరత్రా వ్యయాలు పోను మిగిలిన మొత్తాన్ని మార్కెట్ లింక్డ్ (ఈక్విటీలు, ఈక్విటీ ఆధారిత) సాధనాల్లో ఇన్వెస్ట్ చేస్తాయి. పాలసీదారుల ఎంపిక మేరకు డెట్‌లోనూ పెట్టుబడులు పెడతాయి. వచ్చిన రాబడులను పాలసీదారులకు అందిస్తాయి. ఎండోమెంట్ చిల్డ్రన్ ఇన్సూరెన్స్ రెండో రకం. ఇందులోనూ బీమా రిస్క్, ఇతర వ్యయాలు పోను మిగిలిన ప్రీమియాన్ని డెట్ సాధనాల్లో ఇన్వెస్ట్ చేస్తాయి. పాలసీదారులకు హామీ మేరకు రాబడులు అందిస్తాయి. కానీ, వీటిలో రాబడులు 5–6 శాతం మించవు. ఈక్విటీ ఆధారిత యులిప్ ప్లాన్లలో రాబడులు కాస్త అధికంగా ఉంటాయి. కాకపోతే గ్యారంటీడ్ కావు. మార్కెట్ పనితీరుపైనే రాబడులు ఆధారపడి ఉంటాయి. ఈ రెండు రకాల ప్లాన్లలోనూ, పాలసీ కాల వ్యవధి ముగియక ముందే పాలసీదారు (తల్లి లేదా తండ్రి) మరణించినా లేక కాల వ్యవధి ముగిసేవరకు జీవించి ఉన్నా ప్రయోజనం లభిస్తుంది. పాలసీ కాల వ్యవధి మధ్యలో పాలసీదారు మరణించినట్టయితే, అప్పుడు బీమా సంస్థే మిగిలి ఉన్న కాలానికి పెట్టుబడులను కొనసాగించి, యథాప్రకారం పాలసీ ప్రయోజనాలను అందిస్తుంది. దాంతో పిల్లల ఉన్నత విద్యకు ఆ నిధిని ఉపయోగించుకోవచ్చు. ''దురదృష్టవశాత్తూ తల్లి లేదా తండ్రి మరణించినట్టయితే పరిహారం చెల్లించే ఈ పథకాలు పిల్లలకు ఉపయోగపడతాయి. ప్రీమియం వేవర్ ముఖ్యమైన సదుపాయం. పాలసీదారు మరణించినట్టయితే ఆ తర్వాత భవిష్యత్ ప్రీమియంలు చెల్లించక్కర్లేదు. పాలసీ యాక్టివ్‌గా కొనసాగుతుంది. పిల్లల విద్యా లక్ష్యాలకు కావాల్సినంత మేర సమకూరుతుంది'' అని ఫ్యూచర్ జనరాలి లైఫ్ ఇన్సూరెన్స్ యాక్చువరీ ఆదిత్య మాల్ వివరించారు. పాలసీదారు మరణించినప్పటికీ గడువు తీరిన తర్వాత సమ్ అష్యూర్డ్, ఇతర ప్రయోజనాలు యథావిధిగా అందుతాయని సెబీ రిజిస్టర్డ్ ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజర్ మధుపం కృష్ణ సైతం తెలిపారు. సమ్ అష్యూర్డ్ (బీమా) వెంటనే చెల్లించి, మిగిలిన ప్రయోజనాలను పాలసీ గడువు ముగిసిన తర్వాత చెల్లించేవి ఉన్నాయి.

లాకిన్ పిరియడ్...



ఎండోమెంట్, యులిప్ ప్లాన్లు లాకిన్ పీరియడ్‌తో వస్తాయి. సాధారణంగా ఐదేళ్ల లాకిన్ ఉంటుంది. అంటే మొదటి ఐదేళ్లు ఉపసంహరణకు అనుమతి ఉండదు. ఈ కాలంలో పాలసీని సరెండర్ చేసినా వచ్చేదేమీ ఉండదు. లాకిన్ పీరియడ్ తర్వాత పాక్షికంగా ఉపసహరించుకోవచ్చు. నిర్బంధంగా పెట్టుబడిని కొనసాగించే లక్ష్యంతోనే ఈ ప్లాన్లలో లాకిన్ ఉంటుంది. వీటిలో ఏజెంట్లకు కమీషన్ మెరుగ్గా ఉంటుంది. ఎంత అధిక ప్రీమియానికి పాలసీలో చేర్పిస్తే ఏజెంట్‌కు అంత అధికంగా కమిషన్ ముడుతుంది. ''టర్మ్ ప్లాన్లు, మ్యూచువల్ ఫండ్స్ గురించి సరైన అవగాహన లేకపోవడమే పెద్ద సమస్య. టర్మ్ ప్లాన్ల ప్రీమియం తక్కువగా ఉంటుంది. కనుక వీటిని ఏజెంట్లు విక్రయించేందుకు పెద్దగా ఆసక్తి చూపించరు''అని కృష్ణ వివరించారు. ఆర్థిక ప్రణాళికలో చేసే తప్పుల్లో బీమా, పెట్టుబడి కలపడం ఒకటని ఆనంద్‌రాఠి వెల్త్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చిరాగ్ ముని తెలిపారు. ''ఇన్సూరెన్స్, పెట్టుబడి పూర్తి భిన్నమైన ఆర్థిక ఉత్పత్తులు. ఇన్వెస్టర్లు వీటిని కలపకూడదు. ఊహించని నష్టం నుంచి రక్షణ కల్పించడమే బీమా ఉద్దేశం. పెట్టుబడి సాధనం ఉద్దేశం సంపద సమకూర్చుకోవడం'' అని వివరించారు. ''సంప్రదాయ ఎండోమెంట్ ప్లాన్లలో రాబడులు 4–5 శాతం మేర ఉంటాయి. విద్యా ద్రవ్యోల్బణాన్ని పరిగణనలోకి తీసుకుని చూస్తే సంప్రదాయ బీమా ప్లాన్లలో పెట్టుబడితో మిగిలేదేమీ ఉండదు. చైల్డ్ యులిప్ ప్లాన్లలో 9–11 శాతం మేర రాబడులు వస్తాయి. కాకపోతే ఆర్థిక సైకిల్, మార్కెట్ సైకిల్‌పైనే ఈ రాబడులు ఆధారపడి ఉంటాయి'' అని కృష్ణ తెలిపారు. కనుక సంప్రదాయ ఎండోమెంట్ ఆధారిత చైల్డ్ ప్లాన్లు పిల్లల భవిష్యత్‌కు భరోసా ఇవ్వమని స్పష్టమవుతోంది. ఇక యులిప్ ప్లాన్ల కంటే ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్ మెరుగైన ఎంపిక అవుతుంది. వీటిల్లో లిక్విడిటీ మెరుగ్గా ఉంటుంది. చార్జీలు చాలా తక్కువ. యులిప్ ప్లాన్లలో చార్జీల విషయమై పారదర్శకత తక్కువ. ప్రీమియం అలోకేషన్ చార్జీ, అడ్మినిస్ట్రేటివ్ చార్జీ, మోర్టాలిటీ చార్జీ, సరెండర్ చార్జీ, ఫండ్ మేనేజ్‌మెంట్ చార్జీ ఇన్నేసి చార్జీలు యులిప్‌లలో ఉంటాయి. మ్యూచువల్ ఫండ్స్ పెట్టుబడుల్లోనూ పారదర్శకత ఎక్కువ.

మెరుగైన ప్రత్యామ్నాయాలు..

చైల్డ్ ఇన్సూరెన్స్ ప్లాన్లు మెరుగైన ప్రయోజనాన్ని ఇవ్వనప్పుడు వీటికి ప్రత్యామ్నాయాలను పరిశీలించొచ్చు. ఊహించనది జరిగితే వారసుల విద్య ఆగిపోకూడదు. కుటుంబ జీవనం ఇబ్బందుల పాలు కాకూడదు. అందుకని జీవిత బీమాతో పాటు మ్యూచువల్ ఫండ్స్ పెట్టుబడులను ఎంపిక చేసుకోవడం మంచి మార్గం అవుతుంది. ''టర్మ్ ఇన్సూరెన్స్ ప్లాన్ తక్కువ ప్రీమియానికే అధిక కవరేజీని ఇస్తుంది. ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేయడం వల్ల చైల్డ్ ప్లాన్ల కంటే మెరుగైన రాబడులు వస్తాయి. చైల్డ్ ఇన్సూరెన్స్ ప్లాన్లలో కవరేజీ తగినంత ఉండదు. అప్పుడే కుటుంబ జీవనంలోకి అడుగుపెట్టిన వారికి, తాజాగా రుణం తీసుకున్న వారికి మరింత కవరేజీ అవసరం ఏర్పడుతుంది'' అని కృష్ణ తెలిపారు. అదే మ్యూచువల్ ఫండ్స్ అయితే తమ రిస్క్, రాబడుల ఆకాంక్షలకు సరిపోలే పథకాలను ఎంపిక చేసుకోవచ్చని ఫింజ్ స్కాలర్జ్ వెల్త్ మేనేజర్ ప్రిన్సిపల్ అడ్వైజర్ రేణు మహేశ్వరి సూచించారు. 30 ఏళ్ల ఆరోగ్యవంతుడైన వ్యక్తికి రూ.కోటి టర్మ్ ఇన్సూరెన్స్ రూ.10–15 వేల ప్రీమియంకే వస్తుంది. కనుక చైల్డ్ ప్లాన్ల కోసం ఏటా భారీ మొత్తంలో ప్రీమియం చెల్లించడానికి బదులు.. టర్మ్ ప్లాన్ తీసుకుని, మిగిలిన మొత్తాన్ని ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేసు కోవాలి.

విభిన్న ఫండ్స్...

టర్మ్‌ప్లాన్‌లోనూ మరణం లేదా అంగవైకల్యం పాలైనప్పుడు చెల్లింపులు చేసే ఆప్షన్ ఎంపిక చేసుకోవాలి. సమ్ అష్యూర్డ్‌లో 50 శాతం మేర తక్షణమే చెల్లించి, మిగిలినది ప్రతి నెలా 10 ఏళ్ల పాటు చెల్లింపుల సదుపాయాలతో టర్మ్ ప్లాన్లు అందుబాటులో ఉన్నాయి. చారిత్రకంగా చూస్తే ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్ రాబడులు ఏటా 12 శాతం, అంతకంటే ఎక్కువే ఉన్నాయి. పదేళ్ల కాలంలో అయితే సగటు వార్షిక రాబడి 20 శాతంగా ఉంది. ఈక్విటీల్లోనూ ఇండెక్స్ ఫండ్స్ (సెన్సెక్స్, నిఫ్టీ, స్మాల్‌క్యాప్, మిడ్‌క్యాప్)ను ఎంపిక చేసుకోవాలి. ఇందులో చార్జీలు చాలా తక్కువ. సూచీల మాదిరే రాబడులు వీటిల్లో వస్తాయి. మరీ ముఖ్యంగా 7 ఏళ్లకు మించిన కాలానికి ఇన్వెస్ట్ చేస్తుంటే లార్జ్, మిడ్, స్మాల్‌క్యాప్స్ పెట్టుబడులు పెట్టే ఫ్లెక్సీక్యాప్‌ను ఎంపిక చేసుకోవచ్చు. అలాగే, డైనమిక్ అస్సెట్ అలోకేషన్ ఫండ్స్, రిస్క్ తక్కువ కోరుకునే వారు మల్టీ అస్సెట్ ఫండ్స్, రిస్క్ ఇంకా తక్కువగా ఉండాలని కోరుకునే వారు ఈక్విటీ సేవింగ్స్ ఫండ్స్‌ను ఎంపిక చేసుకోవచ్చని నిపుణుల సూచన.





పన్ను ప్రయోజనం

చైల్డ్ యులిప్ ప్లాన్లలో రాబడులపై పన్ను భారం లేకపోవడాన్ని సానుకూల అంశంగా చెప్పుకోవాలి. దీనికి బదులు టర్మ్‌ప్లాన్ విడిగా తీసుకుని, ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేయడం వల్ల.. ఈక్విటీ లాభాలపై స్వల్పకాల, దీర్ఘకాల మూలధన లాభాల పన్ను వర్తిస్తుంది. ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్ పెట్టుబడులను కదపకుండా, ఒక పథకం నుంచి మరో పథకానికి మార్చకుండా.. స్థిరంగా ఒకే పథకంలో కొనసాగించడం వల్ల అనవసర పన్ను భారాన్ని తప్పించుకోవచ్చు. అయినా సరే ఈక్విటీ పెట్టుబడిని ఉపసంహరించుకున్నప్పుడు అది ఏడాది మించిన కాలం అయితే మొదటి రూ.లక్షకు మించిన లాభంపై 12.5 శాతం పన్ను చెల్లించాలి. ఏడాదిలోపు పెట్టుబడులపై వచ్చే లాభం నుంచి 20 శాతం మేర పన్ను కింద చెల్లించాలి. నిపుణుల పెట్టుబడి ప్రణాళికను అనుసరించినట్టయితే అప్పుడు మెరుగైన జీవిత బీమా రక్షణ, ఈక్విటీలపై అద్భుత రాబడులు అందుకోవడానికి అవకాశాలుంటాయి. పన్ను చెల్లింపులు పోను నికర రాబడులు చైల్డ్ ప్లాన్లతో పోల్చితే.. అధికంగానే ఉంటాయని గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఒకవేళ పన్ను ప్రయోజనం కోసమని యులిప్ పాలసీకే మొగ్గు చూపేట్టు అయితే విడిగా టర్మ్‌ప్లాన్ తీసుకోవడం మర్చిపోవద్దు.

ఎందులో ఎంత రాబడి..

	చైల్డ్ యులిప్	చైల్డ్ ఎండోమెంట్	టర్మ్ ఇన్సూరెన్స్ ప్లస్ మ్యూచువల్ ఫండ్
సమ్ అష్యూర్డ్	రూ.15 లక్షలు	రూ.15 లక్షలు	రూ. కోటి
ప్రీమియం (ఏటా)	రూ. లక్ష	రూ. లక్ష	టర్మ్ ప్లాన్ రూ.10 వేలు (మిగిలిన రూ.90 వేలు ఫండ్స్‌లో)
కాలవ్యవధి	15 ఏళ్లు	15ఏళ్లు	15ఏళ్లు
అంచనా రాబడి (%లో)	7	6	ఫండ్స్ నుంచి 10
తుది రాబడి అంచనా	రూ.25–27 లక్షలు	రూ.22–24 లక్షలు	30–35 లక్షలు

నోట్: టర్మ్ ఇన్సూరెన్స్‌కు రూ.10వేల ప్రీమియం పోను ఏటా రూ.90వేల చొప్పున 15 ఏళ్లు ఈక్విటీ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేయడం వల్ల 10% రాబడుల అంచనా ఆధారంగా వచ్చే మొత్తం. ఈక్విటీల్లో 12 % వరకు రాబడి ఆశించొచ్చు.

టాటా కన్జూమర్ | బ్రోకరేజ్: ఎలారా సెక్యూరిటీస్ | కొనొచ్చు



ప్రస్తుత ధర: రూ. 930 టార్గెట్: రూ. 1,150

ఎందుకంటే: సమీప కాలంలో డిమాండ్ మందగమనం కారణంగా ఎఫ్‌ఎంసీజీ దిగ్గజం టాటా కన్జూమర్ అమ్మకాలు బలహీనపడే అవకాశముంది. అయితే టీ విభాగంలో సగటు విక్రయ ధరలు(ఏఎస్‌పీ) పుంజుకోవడంతోపాటు నొరిష్‌కో బిజినెస్ పురోగతి కీలకంగా నిలవనున్నాయి. కంపెనీ అమ్మకాలు, మార్జిన్లు బలపడేందుకు ఇవి దోహదపడే వీలుంది. ఓవైపు పోటీ పెరుగుతుండటం, మరోపక్క పట్టణ మార్కెట్లలో అమ్మకాలు నెమ్మదించడం వంటి అంశాలు సమీప కాలంలో సవాళ్లు విసిరే అవకాశముంది. కంపెనీకున్న విస్తార ప్రొడక్టు పోర్ట్‌ఫోలియోసహా పంపిణీ నెట్‌వర్క్‌ను విస్తరించడం ద్వారా కలిగే లబ్ధి కంపెనీకి దీర్ఘకాలంలో దన్నునివ్వనున్నాయి. వెరసి అమ్మకాలు, మార్జిన్లు మెరుగుపడేందుకు వీలుంది. ఈ ఆర్థిక సంవత్సరం(2024–25) రెండో త్రైమాసికం(జులై–సెప్టెంబర్)లో నికర అమ్మకాలు 13 శాతం పుంజుకుని రూ. 4,210 కోట్లను తాకాయి. ఇతర సంస్థల కొనుగోళ్లు తదితరాలను పరిగణించకముందు(సర్దుబాటు) 5 శాతం ఆర్గానిక్(సొంత) వృద్ధిని అందుకుంది. దేశీయంగా పానీయాల విభాగంలో 4 శాతం ఆర్గానిక్ కార్యకలాపాల క్షీణత నమోదైనప్పటికీ నికరంగా 3 శాతం వార్షిక వృద్ధిని సాధించింది. ఇందుకు డిమాండ్ నీరసించడం, టీ బిజినెస్‌లో పోటీ కారణంగా అమ్మకాల పరిమాణం 4 శాతం వెనకడుగు వేయడం ప్రభావం చూపాయి. అంతేకాకుండా నొరిష్‌కో బిజినెస్ 11 శాతం క్షీణించింది. ముడి టీ ధరలు వార్షికంగా 30 శాతం ఎగశాయి. అయితే పోటీ కారణంగా ధరల పెరుగుదలను పూర్తిస్థాయిలో వినియోగదారులకు బదిలీ చేసే వీలు చిక్కలేదు. వివిధ బ్రాండ్లపై ధరల పెంపును దశలవారీగా చేపట్టింది.

సాక్షి స్టాక్స్

రేమండ్ లైఫ్‌స్టైల్ | బ్రోకరేజ్: మోతీలాల్ ఓస్వాల్ | కొనొచ్చు



ప్రస్తుత ధర: రూ. 2,117 టార్గెట్: రూ. 3,200

ఎందుకంటే: టెక్స్‌టైల్స్ దిగ్గజం రేమండ్ లిమిటెడ్ నుంచి విడివడి ప్రత్యేక కంపెనీగా రేమండ్ లైఫ్‌స్టైల్ ఆవిర్భవించింది. పురుషుల దుస్తుల విభాగంలో పటిష్ట అమ్మకాలు సాధిస్తోంది. నూలు దుస్తుల(వర్స్టెడ్ సూటింగ్) విభాగంలో 65 శాతం మార్కెట్ వాటాను కలిగి ఉంది. బ్రాండెడ్ టెక్స్‌టైల్స్(బీ2బీ, బీ2సీ)సహా పలు సుప్రసిద్ధ దుస్తుల బ్రాండ్లు కంపెనీ సొంతం. ఈ జాబితాలో పార్క్ ఎవెన్యూ, కలర్‌ప్లస్, ఎత్నిక్స్(రేమండ్) తదితరాలున్నాయి. తద్వారా ఫార్మల్, క్యాజువల్, ఎత్నిక్ వేర్‌లో కార్యకలాపాలు విస్తరించింది. పటిష్ట బ్రాండ్లతోపాటు.. విస్తారిత పంపిణీ నెట్‌వర్క్ పురుషుల వివాహ దుస్తుల విభాగంలో 5 శాతం మార్కెట్ వాటాను కలిగి ఉంది. కంపెనీ ఇకపై బ్రాండెడ్ దుస్తుల విభాగంలో వేగవంత వృద్ధిని సాధించే అవకాశముంది. ఇందుకు కారణాలను పరిశీలిస్తే.. ప్రత్యేక బ్రాండ్ ఔట్‌లెట్లు(ఈబీవోలు)ను రెట్టింపునకు పెంచే లక్ష్యం ద్వారా రిటైల్ విభాగంలో విస్తరిస్తోంది. బీ2బీ గార్మెంటింగ్ విభాగంలో తలెత్తిన బంగ్లాదేశ్+1, చైనా+1(ఈ దేశాలపై ఆధారపడటాన్ని తగ్గించుకునే బాటలో ఇతర దేశాలలో పెట్టుబడులు) పరిస్థితులు(ట్రెండ్)ను అందిపుచ్చుకోవడంతోపాటు ఇన్నర్‌వేర్, స్లీప్‌వేర్ తదితర విభాగాలలోకి ప్రవేశించడం వంటివి ప్రస్తావించవచ్చు. అంతేకాకుండా పోర్ట్‌ఫోలియోను క్యాజువలైజేషన్, ప్రీమియమైజేషన్‌గా అభివృద్ధి చేయడంలో ప్రత్యేక దృష్టి, సామర్థ్యాల విస్తరణ ద్వారా సోర్సింగ్‌ను మెరుపరచుకోవడం వంటివి చేపట్టనుంది. దీంతో నిర్వహణ ఆదాయాలను మరింత పెంచుకునేందుకు వీలు చిక్కనుంది. రేమండ్ నుంచి విడివడిన తదుపరి బిజినెస్ దాదాపు రెట్టింపునకు చేరడం కంపెనీకి ఆకర్షణను తీసుకువస్తోంది.

గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు వివిధ బ్రోకరేజ్ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే

మ్యూచువల్ ఫండ్ ఎంపిక ఎలా?




ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రిసెర్చ్



ఒక మ్యూచువల్ ఫండ్‌ను దీర్ఘకాలానికి ఎంపిక చేసుకునే సమయంలో గత పనితీరుపై ఆధారపకుండా.. చూడాల్సిన ఇతర అంశాలు ఏవి?

– వినుత్ రాయ్

కేవలం గత పనితీరుపైనే ఆధారపడడం తప్పుడోవలో పయనించడమే అవుతుంది. ఏదైనా ఒక మ్యూచువల్ ఫండ్ 100 శాతం రాబడులు ఇచ్చిందంటే, అంతకంటే ముందుగానే ఆ పథకంలో ఇన్వెస్ట్ చేసిన వారికి అది విలువ సమకూర్చినట్టు అవుతుంది. కొత్తగా అదే పథకంలో ఇన్వెస్ట్ చేసే వారికి గత పనితీరు కేవలం ఒక సూచికే అవుతుంది. అంతేకానీ భవిష్యత్ రాబడులకు హామీ కాదు. ఒక మ్యూచువల్ ఫండ్ గత పనితీరు అన్నది మార్కెట్ల ఎత్తు, పల్లాల్లో ఎలా పనిచేసిందో తెలుసుకునేందుకు ఉపకరిస్తుంది. కొన్ని ఫండ్స్ నష్టాల నుంచి కోలుకోవడానికి చాలా సమయం పట్టొచ్చు. కొన్ని వేగంగా కోలుకుంటాయి. దీనికి కారణం అంతర్గతంగా అవి పెట్టుబడులకు ఎంపిక చేసుకున్న కంపెనీలే. కనుక ఒక ఫండ్‌ను ఎంపిక చేసుకునే ముందు.. పోటీ పథకాలతో పోల్చి చూస్తే పనితీరు ఎలా ఉందన్నది విశ్లేషించాలి. అదే విభాగం సగటు పనితీరు, ఆ విభాగంలోని పోటీ పథకాలతో పోల్చితే మధ్య, దీర్ఘ కాలంలో రాబడులు ఎలా ఉన్నాయన్నది పరిశీలించాలి. స్వల్పకాల రాబడులు అంత ఉపయోకరం కాదు. నిర్ణీత కాలంలో పథకంలో రాబడులు స్థిరంగా ఉన్నాయా? అని కూడా చూడాలి. బుల్ మార్కెట్లలో నిదానంగా ర్యాలీ చేసి, మార్కెట్ కరెక్షన్లలో తక్కువ నష్టాలకు పరిమితం చేసే విధంగా పథకం సామర్థ్యాలు ఉండాలి. అలాంటప్పుడు ఆ పథకం రాబడుల పరంగా నిరాశ మిగల్చదు. ఫండ్ మేనేజర్ ట్రాక్ రికార్డు (పనితీరు) కూడా పరిశీలించాలి. పథకం పనితీరు ఫండ్ మేనేజర్ ప్రతిభ వల్లే అయితే, సదరు ఫండ్ మేనేజర్ రాజీనామా చేసి వెళ్లిపోతే అది ప్రతికూలంగా మారొచ్చు. అంతేకాదు ఇన్వెస్టర్ వ్యవహార శైలి కూడా దీర్ఘకాల రాబడులను ప్రభావితం చేస్తుంది. మార్కెట్ల పతనాల్లో ఆందోళన చెందకుండా, పెట్టుబడుల విధానానికి కట్టుబడి ఉండాలి. మార్కెట్ ఉత్థాన పతనాల్లోనూ క్రమం తప్పకుండా ఇన్వెస్ట్ చేయాలి. ఇలా చేస్తే మంచి ఫలితాలు వస్తాయి.



గృహ రుణం, కారు రుణం, క్రెడిట్ కార్డు రుణాలున్నాయి. వీటి కోసం ప్రతి నెలా రూ.40,000 వరకు చెల్లించాల్సి వస్తోంది. ఈ రుణాలను తీర్చివేసే మార్గాన్ని చూపగలరు?

– ప్రేమ్ నాయక్

రుణాలు భవిష్యత్ ఆదాయాన్ని హరించివేస్తాయి. కనుక వీలైనంత వెంటనే వాటిని వదిలించుకోవాలి. ముఖ్యంగా వీటిల్లో ఆర్థిక భారంగా మారిన రుణాన్ని మొదట తీర్చివేయాలి. ముందుగా క్రెడిట్ కార్డు రుణంతో మొదలు పెట్టండి. అధిక వడ్డీ రేటుతో ఖరీదైన రుణం ఇది. అవసరమైతే మీ పెట్టుబడుల్లో కొన్నింటిని ఉపసంహరించుకుని క్రెడిట్‌కార్డు రుణం తీర్చివేయాలి. లేదంటే పార్ట్ టైమ్ ఉద్యోగం చేసి అయినా దీన్నుంచి బయటపడే మార్గాన్ని చూడండి. క్రెడిట్ కార్డ్ రుణం చెల్లించిన అనంతరం కారు రుణాన్ని తీర్చివేయడంపై దృష్టి పెట్టండి. ఎందుకంటే వాహనాల విలువ స్వల్పకాలంలోనే తగ్గిపోతుంది. కనుక వీలైనంత ముందుగా ఈ రుణాన్ని కూడా తీర్చివేయాలి. గృహ రుణాన్ని దీర్ఘకాలం పాటు కొనసాగించుకోవచ్చు. ఎందుకంటే దీర్ఘకాలంలో విలువ పెరిగే ఆస్తి ఇది. పైగా గృహ రుణాలపై అన్నింటికంటే తక్కువ వడ్డీ రేటుతోపాటు పన్ను ప్రయోజనాలు లభిస్తాయి.

క్లుప్తంగా...

అనుమానాస్పద కాల్స్‌తో జాగ్రత్త

- తెలంగాణ పోలీసు శాఖ హెచ్చరిక

సాక్షి, హైదరాబాద్: స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడులు పెడితే అధిక లాభాలు వస్తాయి.. బ్యాంకు కేవైసీ అప్‌డేట్ చేసుకోండి.. మీకు లక్కీడ్రా తగిలింది.. ఇంట్లోనే కూర్చొని వర్క్‌ఫ్రం హోంతో వేలల్లో సంపాదించండి.. అంటూ సైబర్ నేరగాళ్లు ఊదరగొట్టే ఫోన్‌కాల్స్ చేయడంతో పాటు ఎస్ఎంఎస్‌ల్లోని అనుమానాస్పద లింక్‌లు పంపుతున్నారు.. ఇలాంటి ఫోన్‌కాల్స్‌కు స్పందించవద్దని, అనుమానాస్పద ఎస్ఎంఎస్‌లలోని లింకులపై క్లిక్ చేయవద్దని పోలీసులు సూచిస్తున్నారు. అనుమానాస్పద ఫోన్ నంబర్లు, వెబ్ లింక్‌లపై సమాచారంపై cybercrime.gov.inలో తక్షణమే ఫిర్యాదు చేయాలని వారు కోరుతున్నారు. ఇలా చేయడం వల్ల సైబర్ నేరగాళ్ల నంబర్లు, అనుమానాస్పద వెబ్‌లింక్‌లను బ్లాక్ చేసేందుకు వీలవుతుందని వారు సూచిస్తున్నారు.



నిజాం కాలేజీలో పరీక్ష రాసేందుకు వెళుతున్న అభ్యర్థులు

గ్రూప్‌-3 పరీక్షకు సగం మంది దూరం

- ఉదయం 51.1 శాతం, మధ్యాహ్నం సెషన్‌కు 50.7 శాతం హాజరు
- నేటి ఉదయం మరో సెషన్‌తో ముగియనున్న పరీక్షలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో గ్రూప్‌-3 ఉద్యోగాల భర్తీకి సంబంధించి ఆదివారం అర్హత పరీక్షలు ప్రారంభమయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా 1,401 కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లలో పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. మొత్తం 1,388 గ్రూప్‌-3 ఉద్యోగాలకు 5,36,400 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో ఆదివారం ఉదయం జరిగిన పేపర్‌-1 పరీక్షకు 2,73,847 మంది అభ్యర్థులు హాజరు కాగా.. 51.1 శాతం నమోదైంది. మధ్యాహ్నం జరిగిన పేపర్‌-2 పరీక్షను 2,72,173 మంది రాయగా, 50.7 శాతం హాజరు నమోదైంది. ఈ గణాంకాలు ప్రాథమిక సమాచారం మాత్రమేనని, స్పష్టమైన గణాంకాలు ఒకట్రెండు రోజుల్లో తెలుస్తాయని టీజీపీఎస్సీ తెలిపింది. పరీక్షలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల్లో ఏకంగా సగం మంది గైర్హాజరు కావడం గమనార్హం. సోమవారం ఉదయం పేపర్‌-3తో పరీక్షలు ముగియనున్నాయి. కాగా, ఈ పరీక్షకు అభ్యర్థుల సంఖ్య మరింత తగ్గే అవకాశం ఉందని చెపుతున్నారు.

కాలం చెల్లిన మందుల విక్రయం

- రూ.1.25 లక్షల విలువైన మందులు స్వాధీనం

సాక్షి, హైదరాబాద్: కాలం చెల్లిన మందులు విక్రయిస్తున్న ఓ మందుల దుకాణంపై డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ అధికారులు చర్యలు తీసుకున్నారు. సికింద్రాబాద్‌లో సీతాఫల్‌మండిలోని గాయత్రి మెడికల్ అండ్ జనరల్ స్టోర్స్‌లో జరిపిన సోదాల్లో కాలం చెల్లిన మందుల నిల్వలను గుర్తించినట్టు డీసీఏ డీజీ కమలాసన్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కాలం చెల్లిన మందులతోపాటు అనధికారికంగా అబార్షన్ కిట్లను సైతం గుర్తించినట్టు తెలిపారు. మొత్తం 45 రకాల మందులను స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులపై డ్రగ్స్ అండ్ కాస్మోటిక్స్ యాక్ట్, 1940 కింద చర్యలు తీసుకోనున్నట్టు వెల్లడించారు. సోదాల్లో డీసీఏ సికింద్రాబాద్ అసిస్టెంట్ డైరెక్టర్ డి.సరిత, డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు గోవింద్ సింగ్, సురేంద్రనాథ్, పి.రేణుక పాల్గొన్నారు.



మన గుండె లబ్.. డబ్..
రోజుకు ఎన్నిసార్లు?

మన గుండె మీద మనకెంతో విశ్వాసం. అందుకే గుండెపై చేయి వేసుకుని హాయిగా బతికేస్తామని భరోసాతో చెప్పుకొంటూ ఉంటాం. ఎందుకంటే మన పుట్టుకకంటే ముందే మొదలుపెట్టి.. మన తుది శ్వాస దాకా.. గుండె నిరంతరం లబ్ డబ్ అని కొట్టుకుంటూనే ఉంటుంది. నిర్విరామంగా పనిచేస్తూ మనం ప్రాణాలతో ఉండేలా చేస్తుంది. మరి అలాంటి గుండె రోజుకు ఎన్నిసార్లు కొట్టుకుంటుందో తెలుసా?

మూడ్‌ను, పరిస్థితిని బట్టి మారినా..

నిజానికి మన మూడ్‌ను, బయటి పరిస్థితులను బట్టి గుండె కొట్టుకునే వేగంలో మార్పులు వస్తాయి. అందుకే అమెరికాలోని రట్గర్స్ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు అన్ని అంశాలను పరిశీలించి.. ఒక సగటు లెక్కను వేశారు. సగటున నిమిషానికి 70 సార్లు కొట్టుకోవడాన్ని ప్రామాణికంగా తీసుకున్నారు.

ఒక రోజులో గుండె లబ్ డబ్‌లు
1,00,800 సార్లు

అదే ఒక ఏడాదిలో...
3,67,92,000 సార్లు

మొత్తంగా జీవితంలో...
275,94,00,000 సార్లు

(జీవితకాలం 75 ఏళ్లుగా పరిగణిస్తే..)

ఇలా అన్ని కోట్ల సార్లు కొట్టుకుంటూ.. మనను ప్రాణాలతో ఉంచుతున్న గుండెను కాపాడుకోవడానికి కాసిన్ని జాగ్రత్తలు తీసుకోవాలి కదా అనేది నిపుణులు చెబుతున్న మాట!

ఎన్ని ఎలక్ట్రిక్ వాహనాలు కొన్నా రాయితీ

- రిజిస్ట్రేషన్ చార్జీలు, పన్నుల చెల్లింపు ఉండదు
- ఎలక్ట్రిక్ వాహన విధానాన్ని సవరించిన రాష్ట్ర ప్రభుత్వం.. నేటి నుంచి అమల్లోకి
- గతంలో అన్ని కేటగిరీలు కలిపి తొలి 2,25,500 వాహనాలకే వర్తింపు
- ఆ తర్వాతి వాహనాలకు అందని రాయితీ
- దీంతో వాహనాల సంఖ్యపై సీలింగ్ ఎత్తివేత



సాక్షి, హైదరాబాద్: ఇక నుంచి కొనుగోలు చేసే ప్రతీ ఎలక్ట్రిక్ వాహనానికి రాయితీ వర్తించనుంది. రిజిస్ట్రేషన్ చార్జీలు, లైఫ్ ట్యాక్స్ సహా అన్ని రకాల పన్నులు చెల్లించాల్సిన పని ఉండదు. ఈ మేరకు ఎలక్ట్రిక్ వాహన పాలసీని మారుస్తూ రాష్ట్ర ప్రభుత్వం కొత్త విధానాన్ని ప్రకటించింది. 2021లో బీఆర్ఎస్ ప్రభుత్వం తొలిసారి రాష్ట్రంలో ఎలక్ట్రిక్ వాహన విధానాన్ని అమలులోకి తెచ్చింది. తక్కువ వాహనాలే ఉంటాయన్న ఉద్దేశంతో.. కొనుగోలు చేసే తొలి 5 వేల కార్లకు, ద్విచక్ర వాహనాల్లో తొలి 2 లక్షల వాహనాలకు.. ఇలా అన్ని కేటగిరీలు కలిపి దాదాపు 2.25 లక్షల వాహనాలకు ఆ రాయితీలను పరిమితం చేశారు. వాటిల్లో దాదాపు 1.60 లక్షల వాహనాలు భర్తీ అయ్యాయి. కార్లలో 5 వేల పరిమితి దాటి పోయింది. కొత్తగా కార్లు కొనేవారికి రాయితీలు అందే పరిస్థితి లేకుండా పోయింది. దీంతో ఆ విధానాన్ని సమూలంగా మార్చాలని నిర్ణయించిన కాంగ్రెస్ ప్రభుత్వం, వాహనాల సంఖ్యతో ప్రమేయం లేకుండా.. ఎన్ని వాహనాలు కొన్నా, రాయితీ వర్తించేలా కొత్త విధానాన్ని ప్రకటిస్తూ జీఓ నెం.41 జారీ చేసింది.

అపరిమిత రాయితీ..

గతంలో ఉన్న రాయితీ విధానాన్ని యథావిధిగా కొనసాగిస్తూనే, రాయితీ పొందే వాహనాల సంఖ్యపై సీలింగ్ ఎత్తేసింది. ఇక నుంచి ఎంతమంది, ఎన్ని వాహనాలు కొన్నా పూర్తి రాయితీ వర్తించేలా పాలసీలో మార్పులు చేసింది. అయితే బస్సుల వరకు వచ్చే సరికి కొన్ని పరిమితులు విధించింది. ఆర్టీసీ బస్సులు, ఉద్యోగులను ఉచితంగా తరలించేందుకు వినియోగించే ప్రైవేట్ కంపెనీల బస్సులకు మాత్రం పూర్తి రాయితీలు వర్తిస్తాయి. పర్మిట్‌లతో నడిచే టూరిస్టు, ట్రావెల్స్ బస్సులు, విద్యార్థులను తరలించే విద్యా సంస్థల బస్సులకు ఈ రాయితీలు వర్తించవని స్పష్టం చేసింది.

2026 డిసెంబరు 31 వరకు వర్తింపు

గత ప్రభుత్వం వాహనాల సంఖ్యపై సీలింగ్ విధిస్తే, ప్రస్తుత ప్రభుత్వం కాలపరిమితిని ఉత్తర్వుల్లో పేర్కొంది. కొత్త విధానం ఈ సంవత్సరం నవంబరు 18 నుంచి 2026 డిసెంబరు 31 వరకు వర్తిస్తుందని స్పష్టం చేసింది. గడువు తీరిన తర్వాత మరోసారి సమీక్షించి నిర్ణయం తీసుకోనున్నట్టు వెల్లడించింది.

అప్పుడు రూ.473 కోట్లు.. ఇప్పుడు ఎంతో?

బీఆర్ఎస్ ప్రభుత్వం ఎలక్ట్రిక్ వాహన విధానాన్ని అందుబాటులోకి తెచ్చే నాటికి రాష్ట్రంలో కేవలం పది వేల ఎలక్ట్రిక్ వాహనాలే ఉన్నాయి. ఇప్పటి వరకు 1.61 లక్షల కొత్త వాహనాలు రోడ్డెక్కాయి. కొత్తగా కొన్న వాహనాలకు (సీలింగ్ లోపు ఉన్న వాహనాలు) వర్తించిన రాయితీ మొత్తం రూ.473 కోట్లు. ఇప్పుడు ఎలక్ట్రిక్ వాహనాల కొనుగోలు భారీగా పెరిగింది. అన్ని కేటగిరీ వాహనాలు కలిపి నిత్యం 15 వరకు అమ్ముడవుతున్నాయి. వీటిల్లో ఐదారు కార్లు ఉంటున్నాయి. ఈ సంఖ్య క్రమంగా పెరుగుతోంది. దీంతో రాయితీ రూపంలో వాహనదారులకు కలిగే లబ్ధి విలువ భారీగానే ఉండనుంది. ఈ లెక్కన గతంతో పోలిస్తే రాయితీల మొత్తం మూడురెట్లు పెరుగుతుందని అంచనా. ప్రతి ఎలక్ట్రిక్ వాహనం వినియోగంతో సంవత్సరానికి రూ.లక్ష వరకు ఆదా అవుతుందని ప్రభుత్వం చెబుతోంది (కేటగిరీ ఆధారంగా కాస్త అటూ ఇటుగా).

ఆ వాహనదారుల సంగతేంటి..?

గత ప్రభుత్వ విధానం ప్రకారం కొన్ని కేటగిరీల వాహనాలకు సంబంధించి సంఖ్యాపరంగా ఉన్న పరిమితి దాటిపోయింది. ఆ తర్వాత కొన్న వాహనాలకు రాయితీ రావటం లేదు. అన్నింటికి రాయితీ వర్తించేలా కొత్త విధానాన్ని ప్రభుత్వం ప్రకటించినందున, తమను వాటిల్లో భాగంగా పరిగణించాలంటూ యజమానులు కోరుతూ రవాణాశాఖ కార్యాలయాలకు ఫోన్లు చేస్తున్నారు. కానీ, కొత్త విధానం సోమవారం నుంచి అమలులోకి వస్తున్నందున, రాయితీ ఇవ్వలేమంటూ అధికారులు చెబుతున్నారు. దీంతో వారు ప్రభుత్వాన్ని అభ్యర్థించి, రాయితీ తెచ్చుకునే ప్రయత్నం మొదలుపెట్టారు.

ఎలక్ట్రిక్ వాహనాలు కొనేలా చైతన్యం తెస్తాం: మంత్రి పొన్నం ప్రభాకర్



ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం పెరగాలని, ఈ దిశలో ప్రజల్లో చైతన్యం తెచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మంత్రి పొన్నం ప్రభాకర్ చెప్పారు. ఎలక్ట్రిక్ వాహన విధానంలో చేసిన మార్పులను ఆయన ఆదివారం సచివాలయంలో వెల్లడించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, గత ప్రభుత్వం ఎలక్ట్రిక్ వాహనాల సంఖ్యపై సీలింగ్ విధించటంతో కొత్తగా ఆ వాహనాలు కొనేవారికి రాయితీలు రావటం లేదని, అందుకే తాము వాటి సంఖ్యపై ఉన్న పరిమితిని తొలగించామన్నారు. అయితే, ఎలక్ట్రిక్ వాహనాలను తయారు చేసే సంస్థలు సామాజిక బాధ్యతగా భావించి, ప్రైవేట్‌గా చార్జింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరారు. విద్యా సంస్థల బస్సులకు రాయితీ వర్తింపు విషయంలో చర్చించి నిర్ణయం తీసుకోవాల్సి ఉందన్నారు.

టీ-శాట్‌లో టెట్ పాఠాలు

50 రోజులు 200 ఎపిసోడ్స్ ప్రసారం

- ఉదయం నిపుణలో.. సాయంత్రం విద్యా ఛానల్‌లో
- టీ-శాట్ సీఈవో వేణుగోపాల్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: టెట్‌-2024 పరీక్ష సన్నద్ధమవుతున్న అభ్యర్థుల కోసం స్పెషల్ డిజిటల్ కంటెంట్ అందించేందుకు ప్రత్యేక ప్రసారాలు ప్రారంభించినట్లు టీ-శాట్ సీఈవో బోదనపల్లి వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. టీజీపీఎస్సీ నిర్వహించే పోటీ పరీక్షలతో పాటు ఇతర పోటీ పరీక్షలకు కంటెంట్ అందిస్తున్న విధంగానే టెట్ కంటెంట్ అందిస్తున్నట్లు ఆదివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. వచ్చే ఏడాది జనవరి 5వ తేదీ నుంచి 20వ తేదీ వరకు టెట్ పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ పరీక్షకు ప్రిపేరయ్యే అభ్యర్థుల కోసం 50 రోజుల పాటు 200 ఎపిసోడ్స్ ప్రసారం చేయనున్నట్లు వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. టీ-శాట్ నిపుణ ఛానల్‌లో ఉదయం 6 గంటల నుంచి 8 గంటల వరకు, విద్య ఛానల్‌లో సాయంత్రం 5 గంటల నుంచి 7 గంటలవరకు రోజూ 4 గంటలపాటు ప్రత్యేక ప్రసారాలుంటాయన్నారు. జనరల్ సైన్స్, కెమిస్ట్రీ, బయాలజీ, ఈవీఎస్, మ్యాథ్స్‌తో పాటు ఇతర సబ్జెక్టులకు సంబంధించిన డిజిటల్ పాఠాలు ప్రసారమవుతాయని వివరించారు. టెట్ పేపర్‌-1, 2కు హాజరయ్యే అభ్యర్థులు టీ-శాట్ ప్రసారాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. టెట్ పాఠాలు టీ-శాట్ యాప్, యూట్యూబ్‌లో కూడా అందుబాటులో ఉంటాయన్నారు.

పారదర్శకంగా కొలువుల భర్తీ



వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ

- మధ్యవర్తుల మాటలు నమ్మి నిరుద్యోగులు మోసపోవద్దు
- ఆరోగ్య శాఖలో ఇప్పటికే 7వేల పోస్టుల భర్తీ
- మెడికల్ కాలేజీల్లో ర్యాగింగ్‌పై మంత్రి ఆగ్రహం
- ఖమ్మం ఘటనపై విచారణకు ఆదేశం

సాక్షి, హైదరాబాద్/ఖమ్మం వైద్యవిభాగం: ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగాల భర్తీ ప్రక్రియను రాష్ట్ర ప్రభుత్వం అత్యంత పారదర్శకంగా చేపడుతోందని మంత్రి దామోదర రాజనర్సింహ స్పష్టం చేశారు. ఆరోగ్య శాఖలో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ మధ్యవర్తులు చెప్పే మాటలను నిరుద్యోగులు నమ్మవద్దని సూచించారు. అలాంటి వ్యక్తులను గుర్తించి తక్షణమే పోలీసులకు ఫిర్యాదు చేయాలని చెప్పారు. ఆదివారం ఆయన వైద్య, ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. తమ ప్రభుత్వం వైద్య, ఆరోగ్య శాఖలో 7 వేలకు పైబడి ఉద్యోగాలను భర్తీ చేసిందన్నారు. మరిన్ని ఖాళీలకు కూడా అతి త్వరలో నోటిఫికేషన్లు జారీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. కాగా, మెడికల్ కాలేజీల్లో ర్యాగింగ్ ఘటనలపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఖమ్మం ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ఫస్ట్ ఇయర్ విద్యార్థికి గుండు కొట్టించిన ఘటనపై మంత్రి మండిపడ్డారు. ఈ ఘటనపై పూర్తిస్థాయిలో విచారణ చేయాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ర్యాగింగ్ వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని, అన్ని కాలేజీల్లో ర్యాగింగ్ నిరోధక చట్టంపై విస్తృత కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. జూనియర్లతో సీనియర్ విద్యార్థులు స్నేహపూర్వకంగా ఉండాలని, ర్యాగింగ్ పేరిట వారిని భయాందోళనకు గురి చేయొద్దని హితవు పలికారు.

పోలీస్ కమిషన్ సీరియస్..

ఖమ్మం ప్రభుత్వ వైద్య కళాశాలలో విద్యార్థికి గుండుకొట్టించిన ఘటనను ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ తీవ్రంగా పరిగణించారు. ఈ ఘటనపై ఫిర్యాదు చేయాలని కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.రాజేశ్వరరావుకు సూచించారు. పూర్తి వివరాలు అందజేయాలని కోరారు. ఈ ఘటనపై డీఎంఈ నుంచి కూడా ప్రిన్సిపాల్‌కు స్పష్టమైన ఆదేశాలు జారీ అయ్యాయి. పూర్తిస్థాయి విచారణ చేపట్టి తక్షణమే నివేదిక అందజేయాలని పై అధికారులు ఆదేశించినట్లు ప్రిన్సిపాల్ రాజేశ్వరరావు తెలిపారు.

అఫిడవిట్ ఇచ్చింది 'కిమ్స్' కృష్ణయ్య మొదటి భార్యే!

- రెండో భార్య కుమారుడిని తన కుమారుడు అంటూ ప్రమాణపత్రం
- దర్యాప్తులో గుర్తించిన హైదరాబాద్ సీసీఎస్ పోలీసులు
- కీలక ఆధారాలు కోరుతూ ఆర్‌పీఓ కార్యాలయానికి లేఖ
- అవి అందితే ఈ కేసులో పాస్‌పోర్టు యాక్ట్ సైతం జోడింపు
- కేసు 'బదిలీ అంశం'పై నేడు కోర్టు తీర్పు వెలువడే అవకాశం

సాక్షి, హైదరాబాద్: తెలుగుదేశం పార్టీ కీలక నేత, ఏపీలోని నెల్లూరు జిల్లా ఆత్మకూరు మాజీ ఎమ్మెల్యే బొల్లినేని కృష్ణయ్య, ఇతరులపై హైదరాబాద్ సీసీఎస్‌లో నమోదైన క్రిమినల్ కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. రెండో భార్య సంతానాన్ని మొదటి భార్య, బంధువుల సంతానంగా చూపిస్తూ బర్త్ సర్టిఫికెట్లు, పాస్‌పోర్టులు పొందారనేది ఈ కేసులో ప్రధాన ఆరోపణ. ఈ వ్యవహారంలో కృష్ణయ్య మొదటి భార్య బొల్లినేని సుజాత కూడా ప్రధాన పాత్ర పోషించినట్టు పోలీసులు గుర్తించారు. మరికొంత సమాచారం కోరుతూ రీజనల్ పాస్‌పోర్టు కార్యాలయానికి లేఖ రాశారు.



కృష్ణయ్య



సుజాత

తల్లి దగ్గరి నుంచి పిల్లలను తీసుకెళ్లిపోయి..

విశాఖపట్నానికి చెందిన కృష్ణవేణి నాంపల్లిలోని మెడ్విన్ ఆస్పత్రిలో పనిచేస్తుండగా కిమ్స్ హాస్పిటల్ డైరెక్టర్‌గా ఉన్న బొల్లినేని కృష్ణయ్యతో పరిచయమైంది. తన భార్య సుజాతతో సరైన సంబంధాలు లేవని, ఆమెకు పిల్లలు పుట్టే అవకాశం లేదంటూ కృష్ణవేణిని నమ్మించిన కృష్ణయ్య... ఆమెను రెండో వివాహం చేసుకున్నారు. వీరికి 2004లో కుమారుడు అర్జున్, 2006లో కుమార్తె వైష్ణవి జన్మించారు. అయితే కృష్ణయ్య వివిధ కారణాలు చెప్పి పిల్లలను తనతో తీసుకెళ్లిపోయారు. వీరిలో కుమారుడిని తనకు, మొదటి భార్య సుజాతకు జన్మించినట్టుగా బర్త్ సర్టిఫికెట్ తీసుకున్నారు. ఇందుకోసం 2007 జనవరి 29న జీహెచ్ఎంసీ సర్కిల్‌-18 కార్యాలయంలో రిజిస్టర్ చేయించారు. సుజాత కూడా హైదరాబాద్ ఆర్డీఓ వద్ద ఓ అఫిడవిట్ దాఖలు చేశారు. మరోవైపు ఆయన కుమార్తెను వంకాయలపాటి హేమమాలినీ ప్రసాద్, వెంకటేశ్వర ప్రసాద్‌లకు అప్పగించారు. వారే ఆమె తల్లిదండ్రులుగా పేర్కొంటూ బర్త్ సర్టిఫికెట్ పొందారు. తన పిల్లలను వేరేవారి పిల్లలుగా నమోదు చేయించిన విషయం తెలిసిన కృష్ణవేణి ఇటీవల పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. దీనిపై దర్యాప్తు చేపట్టిన అధికారులు ఇప్పటికే జీహెచ్ఎంసీ నుంచి కీలక పత్రాలు పొందారు. వాటి ఆధారంగా అర్జున్, వైష్ణవిల పాస్‌పోర్టు దరఖాస్తు సమయంలో దాఖలు చేసిన పత్రాల వివరాలను కోరుతూ రీజనల్ పాస్‌పోర్టు కార్యాలయానికి లేఖ రాశారు. అవి అందిన తర్వాత పాస్‌పోర్టు యాక్ట్‌లోని సెక్షన్లనూ ఈ కేసులో జోడించాలని సీసీఎస్ పోలీసులు నిర్ణయించారు.

కేసు బదిలీపై నేడు తీర్పు!

ఈ నేరంపై కృష్ణయ్య రెండో భార్య బొల్లినేని కృష్ణవేణి తొలుత సైబరాబాద్ కమిషనరేట్‌లోని రాయదుర్గం ఠాణాలో ఫిర్యాదు చేశారు. అయితే నేరం మొత్తం హైదరాబాద్ నగరంలో జరిగినట్టు తేలడంతో.. కేసును సెంట్రల్ క్రైమ్ స్టేషన్‌కు (సీసీఎస్) బదిలీ చేశారు. దీన్ని సవాల్ చేస్తూ, దర్యాప్తును రాయదుర్గం ఠాణాకే బదిలీ చేయాలంటూ నిందితులు హైకోర్టులో పిటిషన్ వేశారు. దీనిపై సోమవారం తీర్పు వెలువడే అవకాశం ఉంది.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.

సాక్షి ప్లస్
సోమవారం। 18-11-2024

సైబర్ చోర్ టెకీస్



సైబర్ నేరగాళ్లలో ఉన్నత విద్యావంతులే అధికం

- 45 శాతం మంది విద్యార్హత బీటెక్, ఎంబీఏ, ఎంసీఏ • నేరస్తుల్లో 30 ఏళ్ల లోపువారే 49 శాతం మంది
- వ్యాపారాల్లో ఉంటూ నేరాలు చేస్తున్నవారు 34 శాతం • మూడు శాతం మంది ప్రభుత్వ ఉద్యోగులు
- తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో గణాంకాల్లో వెల్లడి • ఆరు నెలల్లో 165 మందిని అరెస్టు చేసిన టీజీసీఎస్బీ

సాక్షి, హైదరాబాద్: 'చదువుకోకపోతే దొంగ అవుతావా?'అని చిన్నప్పుడు స్కూలుకు వెళ్లకపోతే తల్లిదండ్రులు తిట్టడం అందరికీ అనుభవమే. కానీ, మంచి చదువు చదివినవారు కూడా కొందరు ఈజీ మనీకి అలవాటుపడి నేరాల బాట పడుతున్నారు. తమకున్న కంప్యూటర్ పరిజ్ఞానాన్ని వాడి సైబర్ నేరాలకు తెగబడుతున్నారు. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీజీసీఎస్బీ) నివేదిక ప్రకారం సైబర్ నేరాలు చేస్తున్నవాళ్లలో 45 శాతం మంది బీటెక్, ఎంసీఏ, ఎంబీఏ వంటి ఉన్నత సాంకేతిక విద్య పట్టభద్రులే ఉన్నారు. వారిలోనూ 49 శాతం మంది వయస్సు 21 నుంచి 30 ఏళ్ల మధ్యనే ఉన్నది. సైబర్ నేరాలకు పాల్పడుతున్నవాళ్లలో మూడు శాతం మంది ప్రభుత్వ ఉద్యోగులు కూడా ఉండటం గమనార్హం.

ఉక్కుపాదం మోపుతున్న టీజీసీఎస్బీ

సైబర్ నేరాల కట్టడి కోసం తెలంగాణ పోలీసులు టీజీసీఎస్బీని ఏర్పాటు చేశారు. ఈ నేరాల తీవ్రత దృష్ట్యా కేసుల దర్యాప్తులో అడ్డంకులను అధిగమించడంతోపాటు పక్కాగా దర్యాప్తు చేపట్టేందుకు నేరుగా టీజీసీఎస్బీ డైరెక్టర్ పర్యవేక్షణ కింద ఈ ఏడాది ఏప్రిల్‌లో మొత్తం ఏడు సైబర్ క్రైం పోలీస్ స్టేషన్లను (సీసీపీఎస్) ఏర్పాటు చేశారు. ఈ పోలీస్ స్టేషన్ల పరిధిలో గత ఆరు నెలల్లో 76 సైబర్ నేరాల్లో దేశవ్యాప్తంగా 165 మంది సైబర్ నేరగాళ్లను అరెస్టు చేశారు. పట్టుబడిన నిందితులకు తెలంగాణవ్యాప్తంగా 795 సైబర్‌నేరాలతో, దేశవ్యాప్తంగా 3,357 సైబర్ నేరాలతో సంబంధం ఉన్నట్టు అధికారులు తెలిపారు. న్యూ ఢిల్లీ, గుజరాత్, ఒడిశా, అస్సాం, రాజస్తాన్, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, హర్యానా, జార్ఖండ్, కర్నాటక, మహారాష్ట్ర, పశ్చిమబెంగాల్ రాష్ట్రాల నుంచి వీరిని అరెస్టు చేశారు. కొన్ని రాష్ట్రాల్లో సైబర్ నేరగాళ్లను అరెస్టు చేసేందుకు వెళ్లిన పోలీస్‌లపై స్థానికులు దాడులకు పాల్పడ్డారు. కొన్ని కేసుల్లో స్థానిక పోలీసుల సహకారం సైతం ఉండటంలేదని టీజీసీఎస్బీ పోలీసులు తెలిపారు.

ఏ తరహా నేరాలు ఎక్కువ?

సైబర్ నేరాల్లో పార్ట్‌టైం జాబ్స్, బిజినెస్ ఇన్వెస్ట్‌మెంట్ (స్టాక్ ట్రేడింగ్), డిజిటల్ అరెస్టులు, లోన్ యాప్, హ్యాకింగ్, అడ్వర్టైజ్‌మెంట్, మ్యాట్రిమోనియల్ మోసాలు ఎక్కువ ఉంటున్నాయి. పట్టుబడుతున్న వారిలో సైబర్ మోసాలకు పాల్పడే వారితోపాటు మ్యూల్ బ్యాంక్ ఖాతాదారులు, బ్యాంకు ఖాతాలు ఇచ్చే ఏజెంట్లు, అకౌంట్ ఆపరేటర్లు, సిమ్‌కార్డులు సరఫరా చేసేవాళ్లు, బ్యాంకు అధికారులు, ట్రావెల్ ఏజెంట్లు, హ్యాకర్లు సైతం ఉన్నారు.

సైబర్‌సేఫ్ తెలంగాణే మా లక్ష్యం



సైబర్ నేరగాళ్ల విషయంలో అత్యంత కఠిన వైఖరితో ఉన్నాం. సైబర్‌సేఫ్ తెలంగాణే మా లక్ష్యం. ప్రజలు సైతం సైబర్ నేరగాళ్ల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలి. అనుమానాస్పద లింక్‌లపై క్లిక్ చేయవద్దు. మీరు సైబర్ నేరానికి గురైతే వెంటనే 1930 టోల్‌ఫ్రీ నంబర్ లేదా 87126 72222 వాట్సాప్ నంబర్‌లో లేదా www.cybercrime.gov.in లోనూ ఫిర్యాదు చేయవచ్చు.

– శిఖాగోయల్, డైరెక్టర్, టీజీసీఎస్బీ

పట్టుబడిన సైబర్ నేరగాళ్లు వయస్సులవారీగా..

వయసు	నేరస్తుల శాతం		
20 ఏళ్లలోపు	5	31- 40	28
21- 30	49	41- 50	10
		50 ఏళ్ల పైబడినవారు	8

పట్టుబడిన నేరగాళ్ల విద్యార్హతలు

విద్యార్హత	నేరస్తుల శాతం
బీటెక్, ఎంబీఏ, ఎంసీఏ గ్రాడ్యుయేట్లు, పోస్ట్ గ్రాడ్యుయేట్లు	45
ఇంటర్మీడియెట్	20
ఎస్సెస్సీ అంతకంటే తక్కువ నిరక్షరాస్యులు కలిపి	35

వృత్తుల పరంగా సైబర్ నేరగాళ్లు..

రంగం	నేరగాళ్ల శాతం
హోటల్, రెస్టారెంట్, రియల్‌ఎస్టేట్	34
డిజిటల్ కంటెంట్ క్రియేటర్స్, క్యాబ్ డ్రైవర్లు, జిమ్ ట్రైనర్లు, ఈవెంట్ మేనేజర్లు, ఆర్‌ఎంపీ డాక్టర్లు, డెలివరీ సర్వీసెస్, గార్మెంట్ షాపులు	21
పెట్రోల్ బంక్‌లు, టోల్ ప్లాజా ఉద్యోగులు	14
నిరుద్యోగులు	14
విద్యార్థులు	9
రైతులు, కూలీలు	5
ఇరిగేషన్, ఎలక్ట్రిసిటీ వంటి ప్రభుత్వ శాఖల్లో పనిచేసే ఉద్యోగులు	3

'ఎనుమాముల'కు పాలకవర్గమేది?

ఆసియాలో పెద్దమార్కెట్లలో ఒకటిగా గుర్తింపు

- నెలలుగా పాలకవర్గం లేని వైనం
- వరుసగా పత్తి, మిర్చి రైతుల ఆందోళనతో అటెన్షన్
- చైర్మన్ నియామకంతో సమస్యల పరిష్కారానికి చాన్స్
- మిగతా జిల్లాల్లో పూర్తవుతున్న మార్కెట్ కమిటీల నియామకం



ఎనుమాముల వ్యవసాయ మార్కెట్

సాక్షి, వరంగల్: ఆసియాలోనే అతి పెద్ద మార్కెట్‌గా గుర్తింపు పొందిన ఎనుమాములలోని వరంగల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గ నియామకంపై నెలలు గడుస్తున్నా స్పష్టత రావడం లేదు. ఉమ్మడి వరంగల్‌తోపాటు రాష్ట్రవ్యాప్తంగా ఇతర జిల్లాల్లో మార్కెట్ కమిటీ పాలకవర్గాలు ప్రకటిస్తున్నా.. ఎనుమాముల మార్కెట్ కమిటీ పీఠం ఎవరికనేది ఇంకా సందిగ్ధంగానే ఉంది. వర్ధన్నపేట, వరంగల్ తూర్పు, పరకాల ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీ తరఫున గెలుపొందడంతో ఎన్నికల్లో పనిచేసిన సెకండ్ క్యాడర్ నాయకులు మార్కెట్ చైర్మన్ పదవి కోసం ఆశతో ఉన్నారు. ఇక్కడి ముఖ్యనేతల మధ్య ఏకాభిప్రాయం కుదరకపోవడంతోనే పాలకవర్గ నియామకం ఆలస్యమవుతోందన్న చర్చ హస్తం పార్టీలోనే జోరుగా సాగుతోంది. మరోవైపు మార్కెట్‌లో మద్దతు ధర లభించడం లేదంటూ అన్నదాతలు ఆందోళన చేస్తున్న ఘటనలు పెరుగుతున్నాయి. మార్కెట్ పాలకవర్గం ఉంటే రైతుల సమస్య విషయంలో త్వరగా నిర్ణయం తీసుకుని పరిష్కరించే వీలుంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. అయితే మార్కెట్ కమిటీ పాలకవర్గం పదవీ కాలం 2023 జూలై నెలలో ముగిసింది. రిజర్వేషన్ ప్రకారం చైర్మన్ పదవి ఎస్సీ మహిళకు రిజర్వు అయింది. ఈ అంశంపై అప్పటి ఎమ్మెల్యేల మధ్య సమన్వయం లేకపోవడంతో కమిటీ నియామకంలో జాప్యం జరిగింది. అంతలోనే ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో కొత్త చైర్మన్ నియామకం ఆగిపోయింది. తొమ్మిదిన్నరేళ్ల అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ఎన్నికల్లో ఓడిపోవడం, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో సమీకరణాలు మారి చైర్మన్ పదవికి ఆశావహులు పదుల సంఖ్యలో పోటీ పడుతున్నారు.

ఎస్సీలకే చైర్మన్ పదవి

రాష్ట్రంలో 197 వ్యవసాయ మార్కెట్ కమిటీలు ఉన్నాయి. అందులో పదవీ కాలం ముగిసిన వాటిని మినహాయించి మిగిలిన కమిటీలన్నింటినీ ప్రభుత్వం రద్దు చేసింది. ఇప్పటివరకు రాష్ట్ర వ్యాప్తంగా బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మార్కెట్ కమిటీలకు రిజర్వేషన్లను డ్రా పద్ధతిలో తీసి అమలు చేశారు. అందులో భాగంగా వరంగల్ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి ఓసీ, బీసీ, మహిళ, ఎస్సీ మహిళకు రిజర్వు అయింది. దీంతో మొదట రెండుసార్లు కొంపెల్లి ధర్మరాజు, ఉద్యమకారుల కోటాలో చింతం సదానందం, చాంబర్ మాజీ అధ్యక్షుడు దిడ్డి కుమారస్వామి సతీమణి భాగ్యలక్ష్మి చైర్‌పర్సన్‌గా నియమితులు కావడంతో ఓసీ, బీసీ కోటాలు పూర్తయ్యాయి. ఎస్సీ కేటగిరీతోపాటు మహిళా రిజర్వేషన్ అమలు చేయాల్సి ఉండటంతో చైర్మన్ పదవి పెండింగ్‌లో పడింది. ఇప్పుడు అధికార పార్టీ మారడంతో పాలకవర్గం నియామకం కాలేదు. అయితే రాష్ట్రంలో కొలువైన కాంగ్రెస్ ప్రభుత్వం గత ప్రభుత్వంలో నిర్ణయించిన విధంగా రిజర్వేషన్ అమలు చేయకుండా.. మళ్లీ రిజర్వేషన్లను కొత్తగా చేపడతారన్న ప్రచారం కావడంతో ఇతర సామాజిక వర్గానికి చెందిన వారు పోటీపడుతున్నట్లు సమాచారం. రిజర్వేషన్లు మారితే చట్టపరమైన చిక్కులతోపాటు, తమకు దక్కాల్సిన రిజర్వేషన్లను మార్చారన్న అపఖ్యాతి పార్టీకి వస్తుందని భావించిన కాంగ్రెస్.. అమలులో ఉన్న రిజర్వేషన్ల ప్రకారమే రాష్ట్ర వ్యాప్తంగా చైర్మన్ పదవులను కట్టబెట్టింది. గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు సేవలు అందించిన నాయకులు తమ గాడ్‌ఫాదర్‌లతో కలిసి చైర్మన్ పదవి కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. ఎస్సీలకు అవకాశం కల్పిస్తే వర్ధన్నపేట నియోజకవర్గం నుంచి టికెట్ ఆశించిన సీనియర్ నాయకుడి సతీమణికి చైర్మన్ పదవి ఇవ్వాలని రాష్ట్ర నాయకులు భావించగా ఆ నాయకుడు విముఖత వ్యక్తం చేసినట్లు తెలిసింది. అదే నియోజకవర్గం నుంచి ఇతరులు ఉన్నా.. వారు వేరే పార్టీల నుంచి రావడం అడ్డంకిగా మారింది. వరంగల్ తూర్పు నుంచి కొండా దంపతులకు సన్నిహితుడిగా పేరున్న చిలువేరు శ్రీనివాస్, పార్టీలో సీనియర్ నాయకుడు జన్ను రవితోపాటు ఇతరులు తమకు అవకాశం కల్పించాలని కాంగ్రెస్ పెద్దలను అభ్యర్థించినట్లు సమాచారం.

సంప్రదాయ విద్యుత్ ఉత్పత్తిపై సింగరేణి ఫోకస్

విదేశాల్లో పర్యటించిన డిప్యూటీ సీఎం, సీఎండీ

- ప్రయోగాత్మకంగా మేడిపల్లి ఓసీపీలో ఉత్పత్తి
- పంప్డ్ సోలార్ ప్లాంట్ ద్వారా విద్యుత్ ఉత్పత్తిపై దృష్టి
- త్వరలో విండ్ పవర్ ఉత్పత్తిపైనా ప్రణాళికలు

పంప్డ్ సోలార్ ప్లాంట్ (పీఎస్‌పీ- జల విద్యుత్ ఉత్పత్తి వివరాలు)

విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం	500 మెగావాట్లు
నిర్మాణ అంచనా వ్యయం	రూ.2,961 కోట్లు
నిల్వ ఉండాల్సిన నీరు	0.5 టీఎంసీలు
రిజర్వాయర్ ఎత్తు	157 మీటర్లు



జపాన్ పర్యటనలో సింగరేణి అధికారులతో డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క (ఫైల్)

సాక్షి, పెద్దపల్లి: సంప్రదాయ విద్యుత్ ఉత్పత్తిపై సింగరేణి బొగ్గు గనుల సంస్థ దృష్టి సారించింది. ఇప్పటికే సంస్థ రికార్డు స్థాయిలో సోలార్ విద్యుత్ ఉత్పత్తి చేస్తోంది. ఇకనుంచి జల విద్యుత్ (హైడ్రో పవర్) ఉత్పత్తికీ ప్రణాళిక పూర్తిచేసింది. త్వరలో విండ్‌పవర్ (పవన విద్యుత్) ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. దీని సాధ్యాసాధ్యాలపై అధ్యయనం చేయాలని ఓ ప్రైవేట్ కంపెనీకి కాంట్రాక్టు ఇచ్చింది. కోలిండియాలోనే నంబర్-1 సంస్థగా పేరున్న సింగరేణి.. వరుస లాభాలు సాధిస్తోంది. మహారత్న కంపెనీలకు దీటుగా బొగ్గు ఉత్పత్తి చేస్తోంది. తాజాగా తన పరిధి విస్తరిస్తూ థర్మల్, సోలార్ విద్యుదుత్పత్తి చేస్తోంది. ఇప్పుడు మరో అడుగుముందుకు వేసి సోలార్-హైడ్రో పవర్ ఉత్పత్తిపై దృష్టి సారించింది. కాంగ్రెస్ ప్రభుత్వం గ్రీన్ ఎనర్జీకి అత్యధిక ప్రాధాన్యం ఇస్తుండటంతో ఫ్లోటింగ్ సోలార్ పవర్ ప్లాంట్‌తోపాటు, పంప్డ్ హైడ్రో పవర్ టెక్నాలజీ సాయంతో విద్యుత్ ఉత్పత్తి చేసేందుకు అడుగులు వేస్తోంది.

మూసివేసిన మేడిపల్లి ఓసీపీలో..

బొగ్గును తవ్వి మూసి వేసిన ఓపెన్‌కాస్ట్ గనుల నుంచే విద్యుత్‌ను ఉత్పత్తి చేసేలా సింగరేణి ప్రణాళిక సిద్ధం చేస్తోంది. తొలిదశలో రామగుండంలో మూతపడిన మేడిపల్లి ఓసీపీలో జల విద్యుత్ ప్లాంట్ నిర్మాణానికి నిర్ణయించింది. టాటా కన్సల్టెంట్ ఇంజినీరు సంస్థ సర్వే చేసి ఇది విద్యుత్ ఉత్పత్తికి అనువైనదేనని గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. అలాగే ఎత్తయిన మట్టికుప్పలపైనా విండ్‌పవర్ ప్లాంట్లు స్థాపించేలా ప్రణాళిక రచిస్తోంది.

సోలార్ టు హైడ్రోపవర్..

పగలు సౌర విద్యుత్ ద్వారా ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టుల్లోని నిల్వనీటిని భారీ మోటార్ల ద్వారా ఎత్తయిన మట్టికుప్పలపై నిర్మించిన రిజర్వాయర్లలోకి తరలిస్తారు. రాత్రి అదేనీటిని కిందకు వదులుతారు. ఈక్రమంలో టర్బైన్లు ఏర్పాటు చేసి విద్యుత్ ఉత్పత్తి చేస్తారు. ఇలాంటి పంప్డ్ స్టోరేజీ హైడ్రో పవర్ టెక్నాలజీ విధానంలో అమెరికా, యూరప్ దేశాల్లో విద్యుత్ కేంద్రాలు పనిచేస్తున్నాయి. ఇటీవల డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, మేడిపల్లి ఓసీపీ వద్ద స్థాపించే పంప్డ్ స్టోరేజీ ప్లాంట్‌ను ప్రతిపాదిత స్థలాన్ని పరిశీలించారు. తాజాగా జపాన్ పర్యటనలో అక్కడి ప్లాంట్లను సింగరేణి అధికారులతో కలిసి పరిశీలించారు.

థర్మల్, సోలార్, ఫ్లోటింగ్ పద్ధతుల్లో..

సింగరేణి బొగ్గు గనుల సంస్థ ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్, వరంగల్, ఖమ్మం జిల్లాల్లోని 11 ఏరియాల్లో విస్తరించి ఉంది. సంస్థలో 24 భూగర్భ, 19 ఓపెన్‌కాస్ట్ బొగ్గు గనులు ఉన్నాయి. కొన్నేళ్లుగా థర్మల్ విధానంలో 1,200 మెగావాట్లు, సోలార్ పద్ధతిన 240.5 మెగావాట్లు, ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్ ద్వారా 5 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేస్తోంది. తాజాగా వీటిని విస్తరించడమే కాకుండా.. వాయుకాలుష్య నివారణలో భాగంగా నెట్‌జీరో సంస్థగా అవతరించేలా ముందుకు సాగుతోంది.

దేశమంత రహదారి!

- దేశంలో అతిపెద్ద రహదారిగా ఎన్‌హెచ్ 44 రికార్డు
- కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు సాగుతున్న హైవే
- 3,745 కి.మీ.. 13 రాష్ట్రాలు.. 30 నగరాల అనుసంధానం
- నేషనల్ హైవే డెవలప్‌మెంట్ కారిడార్‌గా గుర్తింపు

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి: ఏ కాలంలో అయినా ఒక దేశం ఆర్థికంగా అభివృద్ధి చెందాలంటే రహదారులే జీవనాడులుగా ఉపయోగపడుతాయి. రహదారులు ఎంత పక్కాగా, విస్తృతంగా ఉంటే అభివృద్ధి అంత వేగంగా పరుగులు పెడుతుంది. ఆ వాస్తవాన్ని గుర్తించిన మనదేశ పాలకులు స్వాతంత్య్రం వచ్చినప్పటి నుంచే రహదారుల నిర్మాణం, విస్తరణపై ప్రత్యేక దృష్టిపెట్టారు. నేడు దేశంలో లక్షల కిలోమీటర్ల జాతీయ, రాష్ట్ర, గ్రామీణ రహదారులు ఉన్నాయి. వాటిని నిత్యం అభివృద్ధి చేస్తూనే ఉన్నారు. మనదేశంలో అతిపెద్ద జాతీయ రహదారిగా ఎన్‌హెచ్ 44 గుర్తింపు పొందింది.

ఈ చివర నుంచి ఆ చివరకు..

ఉత్తర, దక్షిణ భారత దేశాలను అనుసంధానం చేసే దేశంలోనే అత్యంత పొడవైన జాతీయ రహదారి ఎన్‌హెచ్-44. ఇది 13 రాష్ట్రాల మీదుగా సాగుతూ 30కిపైగా ప్రధాన నగరాలను కలుపుతూ వెళ్తుంది. ఈ రహదారి పొడవు 3,745 కిలోమీటర్లు. ఉత్తరాన కశ్మీర్‌లోని శ్రీనగర్‌లో ప్రారంభమై హిమాచల్‌ప్రదేశ్, పంజాబ్, హర్యానా, ఢిల్లీ, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటకలోని బెంగుళూరు నగరం మీదుగా తమిళనాడులోని కన్యాకుమారి వరకు కొనసాగుతుంది. అంటే ఉత్తర భారతం, దక్షిణ భారతం మధ్య రవాణాకు ఇది ఆయుపట్టులాంటిది. ఈ రహదారిపై నిరంతరం లక్షలాది వాహనాలు తిరుగుతూనే ఉంటాయి. ప్రధానంగా సరకు రవాణా లారీలు, ట్రక్కులు, వ్యాన్లు వివిధ రాష్ట్రాలకు సరకులను మోసుకెళుతుంటాయి.

నాటి ఎన్‌హెచ్-7.. నేటి ఎన్‌హెచ్-44

ఈ రహదారి మొదట్లో 7వ నంబర్ జాతీయ రహదారిగా ఉండేది. అయితే నార్త్-సౌత్ కారిడార్‌గా దీనిని గుర్తించి నేషనల్ హైవే డెవలప్‌మెంట్ ప్రోగ్రాం (ఎన్‌హెచ్‌డీపీ) కింద అభివృద్ధి చేసే క్రమంలో ఎన్‌హెచ్-1ఎ, ఎన్‌హెచ్-1, ఎన్‌హెచ్-2, ఎన్‌హెచ్-3, ఎన్‌హెచ్-75, ఎన్‌హెచ్-26, ఎన్‌హెచ్-7 రహదారులన్నింటినీ కలిపి ఎన్‌హెచ్-44 గా మార్చారు. దేశంలోని అన్ని ప్రాంతాలతో కనెక్టివిటీ ఉండటంతో సరకుల రవాణా ఎక్కువగా ఈ రహదారి మీదుగా సాగుతోంది. రాత్రింబవళ్లు భారీ ట్రక్కులు, లారీలు, వాహనాలు తిరుగుతూనే ఉంటాయి.


రాష్ట్రాల అనుసంధానం

44వ నంబర్ జాతీయ రహదారి పొడవు 3,745 కిలోమీటర్లు. జమ్మూకశ్మీర్‌లో 304 కిలోమీటర్లు, హిమాచల్ ప్రదేశ్‌లో 11, పంజాబ్‌లో 279, హర్యానాలో 257, ఢిల్లీలో 15, ఉత్తర ప్రదేశ్‌లో 287, రాజస్థాన్‌లో 28, మధ్య ప్రదేశ్‌లో 547, మహారాష్ట్రలో 260, తెలంగాణలో 533, ఆంధ్రప్రదేశ్‌లో 260, కర్ణాటకలో 135, తమిళనాడులో 630 కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది.

అక్రమ రవాణాకూ రాచమార్గమే..

ఎన్‌హెచ్-44 మీదుగా సరకుల అక్రమ రవాణా కూడా ఎక్కువగానే సాగుతుంటుంది. అప్పుడప్పుడు హైవే మీద ట్రక్కులు, ఇతర వాహనాల్లో తరలిస్తున్న మత్తు పదార్థాలు, ఇతర సామగ్రి పట్టుబడుతున్న విషయం తెలిసిందే. ముఖ్యంగా గంజాయి, ఇతర మత్తు పదార్థాలు ఎక్కువగా ఈ రహదారి మీదుగా దేశంలోని వివిధ ప్రాంతాలకు రవాణా అవుతున్నాయి.

44 వ నంబరు జాతీయ రహదారి రూట్ మ్యాప్



కామారెడ్డి మీదుగా వెళుతున్న 44వ నంబరు జాతీయ రహదారి

క్లుప్తంగా...

నేడు టీటీడీ పాలకమండలి సమావేశం



తిరుమల: తిరుమలలో టీటీడీ ధర్మకర్తల మండలి సమావేశం చైర్మన్ బీ.ఆర్.నాయుడు అధ్యక్షతన సోమవారం ఉదయం అన్నమయ్య భవనంలో జరగనుంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఐదు నెలల తర్వాత మండలి ఏర్పాటుతో సమావేశానికి ప్రాధాన్యం సంతరించుకుంది. ధర్మకర్తల మండలి సమావేశంలో ప్రధానంగా 80 అంశాలతో కూడిన ఎజెండాపై మండలి సభ్యులు సమావేశంలో చర్చించనున్నారు. వైకుంఠ క్యూ కాంప్లెక్స్ ఒకటిని అందుబాటులో తేవనున్నారు. కొండపైన అన్యమత ప్రచారంను పూర్తి నామ రూపం లేకుండా కఠిన చర్యలు తీసుకోనున్నారు. స్వామివారి నైవేద్యాలు, లడ్డూ ప్రసాదాలు,అన్న వితరణ కేంద్రంలో వినియోగించే ఆహార ఉత్పత్తులను నాణ్యతను పెంచేందుకు కొత్తగా టెండరును ఇవ్వనున్నారు. ఇంజనీరింగ్ పనులకు గతంలో నిధుల కేటాయింపులకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వ విజిలెన్స్ విచారణలో ఉండటంతో వీటిపైన పరిశీలన చేయనున్నారు.

కూటమి నేతల కబ్జా

స్మశాన ప్రహరీ గోడ రాత్రికి రాత్రి కూల్చివేత



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ, తహసీల్దార్ తదితరులు

పుల్లంపేట: రాష్ట్రంలోకూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక వారు ఆడిందే ఆట పాడిందే పాటగా ఉంది. ఈ నేపథ్యంలో అన్నమయ్య జిల్లా పుల్లంపేట మండల వ్యాప్తంగా యథేచ్ఛగా భూఆక్రమణలు తదితర అక్రమాలు పరిపాటిగా మారాయి. ఈ క్రమంలోనే శ్మశానవాటికి పక్కనే ప్రభుత్వ భూమి ఉండటంతో అడ్డదారిలో నకిలీ పత్రాలు సృష్టించుకొని భూ కబ్జా చేయాలని ప్రయత్నిస్తున్నారు. తమ కబ్జాలకు అడ్డుగా ఉన్నందున చివరికి శ్మశానవాటికకు ఏర్పాటు చేసిన ప్రహరిగోడను సైతం శనివారం రాత్రికి రాత్రి జేసీబీతో చదును చేసేశారు. గతంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ముద్దా బాబుల్ రెడ్డి సహకారంతో రూ.5లక్షలు నిధులు వెచ్చించి ఈ ప్రహరీగోడను ఏర్పాటు చేశారు. సంఘటనా స్థలాన్ని ఆదివారం పుల్లంపేట సర్పంచ్ ఆకేపాటి శ్రీనివాసులు రెడ్డి, తహసీల్దార్ అరవింద కిషోర్, పుల్లంపేట ఎస్ఐ మోహన్ కుమార్ గౌడ్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. సర్పంచ్ ఆకేపాటి శ్రీనివాసులు రెడ్డి స్మశాన ప్రహరిగోడను చదువను వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని పుల్లంపేట ఎస్ఐకు వినతిపత్రం అందజేశారు.

నేటి నుంచి దళితవాడల్లో శ్రీవారి ధర్మప్రచారం



ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల శ్రీవారి ధర్మప్రచార రథం సోమవారం నుంచి దళితవాడల్లో పర్యటించనుందని ఆలయ ఈఓ ఎన్ వీఎస్ఎన్ మూర్తి తెలిపారు. ద్వారకాతిరుమలతో పాటు జంగారెడ్డిగూడెం మండలంలోని 8 గ్రామాల్లోని ఎస్సీ, ఎస్టీ, బీసీ కాలనీల్లో ధర్మప్రచారాన్ని నిర్వహించనున్నట్టు చెప్పారు. ఉదయం 8 గంటలకు ఆలయ జంటగోపురాల వద్ద ధర్మప్రచార రథయాత్ర ప్రారంభమవుతుందని తెలిపారు.

రత్నగిరిపై భక్తజనవాహిని



అన్నవరం: కాకినాడ జిల్లా అన్నవరం పుణ్య క్షేత్రానికి ఆదివారం భక్తజనవాహిని పోటెత్తింది. రత్నగిరిపై వెలసిన సత్యదేవుని దర్శనానికి వేలాదిగా భక్తులు తరలి రావడంతో ఆలయ ప్రాంగణంలో తీవ్ర రద్దీ ఏర్పడింది. దీంతో పశ్చిమ రాజగోపురం వద్దనే భక్తులను కంపార్ట్ మెంట్లలో నిలిపివేసి, బృందాల వారీగా స్వామివారి దర్శనానికి అనుమతించారు. సుమారు 80 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించినట్లు అధికారులు అంచనా వేశారు. సత్యదేవుని ఆలయం, ఆలయ ప్రాంగణం, వ్రత, విశ్రాంతి మండపాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. స్వామివారి ఆలయాన్ని తెల్లవారుజాము రెండు గంటలకు తెరచి పూజలు చేశారు. అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించారు. అర్ధరాత్రి ఒంటిగంట నుంచి వ్రతాలు నిర్వహించారు. అప్పటి నుంచి సాయంత్రం 4 గంటల వరకూ దేవస్థానంలో భక్తుల రద్దీ నెలకొంది.

వల్లూరు నుంచి అప్పనపల్లికి పాదయాత్ర

మామిడికుదురు: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం అప్పనపల్లి బాలబాలాజీ స్వామి వారిని ఆదివారం 7,500 మంది భక్తులు దర్శించుకున్నారు. 4,400 మంది స్వామి వారి అన్న ప్రసాదం స్వీకరించారు. స్వామి వారికి వివిధ సేవల ద్వారా రూ.4,35,067 ఆదాయం లభించిందని ఈఓ ఎం.సత్యనారాయణరాజు తెలిపారు.

లంకమల... జీవ వైవిధ్యంతో కళకళ

లంకమల అభయారణ్యం జీవ వైవిధ్యానికి ప్రతీకగా నిలుస్తోంది. ఏపుగా పెరిగిన ఎర్రచందనం చెట్లు ప్రత్యేకత చాటుకోగా.. వివిధ రకాల పక్షులు, జంతువులు.. పలు రకాలైన వృక్షాలు, మొక్కలు, రంగురంగుల పుష్పాలు.. ముఖ్యంగా ఔషధ గుణాలు కలిగిన వన మూలికలు ఈ అభయారణ్యంలో ఉన్నాయి. ఇక వానాకాలంలో లంకమల్లేశ్వరుని కోనలో జలపాత హొయలు పర్యాటకులను పరవశింపజేస్తుంది.

- ప్రత్యేకత చాటుకుంటున్న లంకమల అభయారణ్యం
- అరుదైన పక్షుల కిలకిలారావాల సందడి



లంకమలలో చిరుత పులి



లంకమల అభయారణ్యం

సిద్దవటం : అన్నమయ్య జిల్లాలోని లంకమల అభయారణ్యం ఎంతో ప్రత్యేకమైనది.. సుమారు 46,442.8 హెక్టార్లలో విస్తరించి జీవ వైవిధ్యాన్ని చాటుతోంది. సుమారు 300 పైగా పక్షుజాతులు, వన్య మృగాలకు ఆవాసంగా ఉంది. ఇక పక్షుల జాతుల్లో చాలా అరుదైన పక్షి జాతి నీలి నల్లంచి ఇక్కడి ప్రత్యేకతగా చెప్పక తప్పదు. 1986వ సంవత్సరంలో ప్రపంచ వ్యాప్తంగా పేరుగాంచిన కలివి కోడి కూడా లంకమల అభయారణ్యంలో అప్పట్లో కనిపించడం కూడా విశేషంగా చెప్పుకోవచ్చు. కలివి కోడిని పోలిన పక్షిగా రాతికాలేడు, ఎర్రచిలుక కూడా ఈ అరణ్యంలో ఉన్నాయి.

లంకమల అభయారణ్యంలో అరుదైన పక్షుల్లో బంగారు రొమ్ము ఆకుపిట్ట, ఎర్రగొంతు ఈకపట్ల పిట్ట, నీల ఈక పట్ల పిట్ట, తోక నల్లంచి, పెద్ద ఆకురాయి, గిజిగాడు పిట్ట, చారల గొంతు వడ్రంగి పిట్ట, వర్ణడేగా, అడవి రామదాసు, బుడమాలి గద్ద, జాలిడేగా, నీటి కాకి, తెరభిముక్కు కొంగ, నల్ల గద్ద, తోకపిగిలి పిట్ట, నల్ల తల వంగ పండు, ఎర్రగువ్వ, కుందేలు సాలువ, పచ్చగువ్వ తదితర పక్షి జాతులు లంకమల అభయారణ్యంలో కిలకిలా రావాలతో సందడి చేస్తున్నాయి.

లంకమలలో పెరిగిన వన్యప్రాణులు

లంకమల అభయారణ్యంలో వన్యప్రాణుల సంతతి క్రమంగా పెరుగుతోందని అధికారులు అంటున్నారు. సహజసిద్ధంగా ఉండే పచ్చిక మైదానాల్లో తిరుగుతూ అవి ఆకలిని తీర్చుకుంటున్నాయి. అడవుల్లో ఎక్కువగా వన్యప్రాణులు తిరిగే ప్రదేశాల్లో అటవీ అధికారులు కెమెరాలను కూడా అమర్చారు. పలు కెమెరాల్లో అడవి జంతువులు కణితిలు, అడవి కుక్కలు, ఎలుగు బంట్లు, పొడదుప్పిల చిత్రాలు నిక్షిప్తంగా ఉన్నాయి.

ఒకప్పుడు తక్కువగా ఉండే చిరుత పులుల సంఖ్య ఇప్పుడు పెరిగినట్లు అధికారులు గుర్తించారు. అటవీ ప్రాంతాల్లో నీరు లభించక జింకలు, దుప్పులు, ఎలుగు బంట్లు, చిరుత పులులు సమీప గ్రామాల్లోకి వచ్చి దాహం తీర్చుకునేందుకు వచ్చేవి. అడవి జంతువుల సంచారంలో గ్రామీణ ప్రజలు భయభ్రాంతులకు గురయ్యేవారు. వన్య ప్రాణుల దాహార్తిని తీర్చేందుకు అటవీ అధికారులు అడవిలోనే పలు ప్రాంతాలలో సాసర్ ఫీట్‌లు, నీటి ట్యాంకులను ఏర్పాటు చేశారు.

అరుదైన వన మూలికలు

లంకమల అభయారణ్యంలో పక్షులు, వన్య మృగాలతో పాటు, వన మూలికలకు ప్రసిద్ధి గాంచింది. నన్నారి షరబత్‌కు ఉపయోగించే సుగంధి వేర్లు, సార పప్పు, ఉసిరి, నేరేడు, ఏనుగు కుందేలు చెట్టు, అతి పత్తి చెట్టు, మగలింగచెట్టు, ఇప్ప చెట్టు ఇలా ఔషధ గుణాలు కలిగిన మొక్కలు ఇక్కడి అడవిలో ఎన్నో రకాలు ఉన్నాయి. అంతే గాకుండా పాలగడ్డలు, మగసిరి గడ్డలు, పాము కాటు విరుగుడుకు వాడే తెల్లీశ్వరి, నల్లీశ్వరి, నాగముష్టి, విషనాభి చెట్టు, ప్రపంచంలో అత్యంత విలువైన ఎర్రచందనం , భూచక్రగడ్డ తోపాటు జిగురు వంటివి లంకమల అభయారణ్యంలో లభించడం విశేషంగా చెప్పుకోవచ్చు.

కపర్థీశ్వరుని కోన, శ్రీ నిత్యపూజ స్వామి కోన, శ్రీ లంకమలేశ్వర స్వామి ఆలయం, కొండ గోపాలస్వామి ఆలయాలతోపాటు నీటి గుండాలు, గలగలా పారే సెలయేర్లు వంటివి కూడా ఈ అరణ్యంలో ఉన్నాయి.



లంకమలలో ఏపుగా పెరిగిన ఎర్రచందనం చెట్లు




సాసర్ ఫీట్‌లో నీరు తాగుతున్న కణితలు



గిజిగాడు పిట్ట



విషనాభి ఔషధ మొక్క, కొండ పసుపు మొక్క



లంకమల్లేశ్వరుని కోనలో జలపాతం (ఫైల్)



సాసర్ ఫీట్ నీటిని తాగుతున్న అడవి కుక్కలు

చైన్ స్నానించ్ ముఠా అరెస్ట్

- 401 గ్రాముల బంగారు ఆభరణాలు, నాలుగు బైక్‌లు స్వాధీనం
- రెండు కేసుల్లో ఎనిమిది మంది అరెస్ట్



చైన్‌స్నాచింగ్ ముఠాలను అరెస్ట్ చూపుతున్న ఎస్పీ మణికంట చందోలు

పలమనేరు: చిత్తూరు జిల్లాలోని రోడ్లపై ఒంటరిగా వెళుతున్న మహిళల మెడలోని బంగారు ఆభరణాలను చోరీ చేసే రెండు చైన్ స్నాచింగ్ ముఠాలను పోలీసులు పట్టుకున్నారు. వీరి నుంచి 401 గ్రాముల బంగారు ఆభరణాలు, నాలుగు బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రూ.32.24 లక్షలుగా ఉంటుందని తెలిపారు. ఇందుకు కారకులైన ఎనిమిది మంది నిందితులను అరెస్ట్ చేసి ఆదివారం రిమాండ్‌కు తరలించారు. ఇందుకు సంబంధించిన వివరాలకు పలమనేరు డీఎస్పీ కార్యాలయం వద్ద జిల్లా ఎస్పీ మణికంట చందోలు వివరించారు.

చైన్‌స్నాచింగ్‌లో ఆరితేరిన ముఠా ఇది

గతకొన్ని నెలలుగా చౌడేపల్లి, గంగవరం, ముదివేడు, రామసముద్రం, పలమనేరు, రాళ్లబూదుగూరు, బైరెడ్డిపల్లిల్లో మహిళల మెడలోని బంగారు ఆభరణాలను గుర్తు తెలియని వ్యక్తులు బైక్‌లపై వచ్చి లాక్కొని వెళ్లారు. దీనిపై ఆయా స్టేషన్లలో కేసులు నమోదు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన చౌడేపల్లి సీఐ రాంభూపాల్, ఐడీపార్టీ కలిసి రాబడిన సమాచారం మేరకు ఇందుకు కారణమైన నిందితులు అన్నమయ్య జిల్లా ఏటిగడ్డపల్లికి చెందిన ముద్దం చంద్రశేఖర్(32), రాసూరి హరికృష్ణ(24), మదనపల్లికి చెందిన దాసరి నాగరాజు అలియాస్ నాగ(38), మదనపల్లి బుగ్గకాలువకు చెందిన ఎల్ భాస్కర్(37), బీకొత్తకోటకు చెందిన కార్పెంటర్ బావాజాన్(35), చౌడేపల్లికి చెందిన గుంతలపేట లక్ష్మీపతి అలియాస్ చంటి(30), మదనపల్లిలోని బసినికొండకు చెందిన పవన్‌కుమార్(27)లను అరెస్ట్‌చేశారు. వీరినుంచి చోరీలకు సంబంధించి 332 గ్రాముల బంగారు ఆభరణాలు, చోరీలకు వినియోగించిన మూడు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రూ25.74లక్షలుగా ఉంటుందని ఎస్పీ తెలిపారు.

ఆన్‌లైన్ యాప్‌లో అప్పులు చేసి దొంగగా మారిన మరో వ్యక్తి

పుంగనూరుకు చెందిన బుక్యప్రసాద్ నాయక్ అక్కడి ఆర్టీసీ డిపోలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగిగా పని చేసేవాడు. ఆన్‌లైన్ అప్పులను ఎక్కువగా చేసి వాటిని కట్టలేక ఇలా చైన్ స్నాచింగ్‌లకు అలవాటు పట్టాడు. ఇతను మూడు కేసులకు సంబంధించి 69 గ్రాముల బంగారు ఆభరణాలను చోరీ చేశాడు. నిందితున్ని అరెస్ట్ చేసి అతని నుంచి చోరీ కాబడిన బంగారు నగలతో పాటు బైక్‌ను విలువ రూ.6.5 లక్షలను స్వాధీనం చేసుకున్నారు. నిందితున్ని అరెస్ట్ చూపి రిమాండ్‌కు తరలించారు. మొత్తం మీదు ఈ రెండు కేసులకు సంబంధించి రూ.32.24లక్షలు విలువైన 401 గ్రాముల బంగారు ఆభరణాలు, నాలుగు బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు.

కేసుల ఛేదించినందుకు రివార్డులు

ఈ కేసుల ఛేదనలో మంచి ప్రతిభ చూపిన సీఐలు రాంభూపాల్, శ్రీనివాసులు, ఐడీపార్టీ ఏఎస్ఐ శ్రీనివాసులు, అల్లాఉద్దీన్, శశి, బాలాజీ, రెడ్డెప్ప, వెంకటరమణ, ఎల్లప్పలను ఎస్పీ రివార్డులు అందజేశారు.

చోరీ ఆభరణాల అప్పగింత

కేసులు లేకుండా చోరీలకు గురికాబడిన బైరెడ్డిపల్లి మండలం రామసముద్రం గ్రామానికి చెందిన అలివేళమ్మకు ఎస్పీ బంగారు గొలుసును అందజేశారు. తాను చిల్లర దుకాణంలో ఉండగా ఇద్దరు వ్యక్తులు బైక్‌పై వచ్చి నీళ్ల బాటిల్ అడిగారని దాన్ని ఇచ్చేలోపు మెడలోని చైన్‌ను తెంపుకెళ్ళారని తెలిపింది. ఈమెతో పాటు మరికొందరికి ఆయన బంగారు ఆభరణాలను అప్పగించారు. కార్యక్రమంలో పలమనేరు డీఎస్పీ డేగల ప్రభాకర్, పలమనేరు సీఐ నరసింహరాజు, గంగవరం సీఐలు మురళీమోహన్,ప్రసాద్, పుంగనూరు సీఐ శ్రీనివాసులు, చౌడేపల్లి సీఐ రాంభూపాల్, ఎస్ఐ స్వర్ణతేజ పాల్గొన్నారు

వాల్తేరులో వణుకు

- లంచాలకు అలవాటుపడిన డీఆర్ఎం?
- ప్రతి టెండర్‌కు పచ్చనోటు ఇవ్వాల్సిందే
- రెండేళ్ల నుంచి డీఆర్ఎంపై నిఘా పెట్టిన సీబీఐ
- ఆది నుంచీ లంచాల ఆరోపణలే..
- సరైన సమయం కోసం ఎదురు చూసిన వైనం
- సీబీఐ విసిరిన వలలో చిక్కుకున్న సౌరభ్‌కుమార్
- ఉలిక్కిపడిన డీఆర్ఎం వ్యవహారాల్ని చూసే ఉద్యోగులు



వాల్తేరు రైల్వే డివిజన్ కార్యాలయం

సాక్షి, విశాఖపట్నం : 'ఈయన మంచి డీఆర్ఎం.. మాకు టెండరు కావాలని అడిగితే.. ఎంతిచ్చినా తీసుకొని ఆ పనులు మాకే వచ్చేటట్లు చూసేవాళ్లు. అలాంటి మంచివ్యక్తిని సీబీఐ పట్టుకోవడమేంటి సార్..?''.. రైల్వే సంబంధిత పనులు చేపట్టే ఓ కాంట్రాక్టర్ చెప్పిన మాటలివీ.. సదరు కాంట్రాక్టర్.. తనకు రావాల్సిన పనులు ఆగిపోతాయేమోనన్న ఆందోళనతో చెప్పినా.. వాల్తేరు డీఆర్ఎం వ్యవహారమేంటనేది ఈ వ్యాఖ్యలే స్పష్టం చేస్తున్నాయి.

వాల్తేరు డివిజనల్ రైల్వే మేనేజర్ సౌరభ్‌కుమార్ ప్రసాద్.. ముంబైలో శనివారం ఉదయం లంచం తీసుకుంటూ సీబీఐకి పట్టుబడిన విషయం తెలిసిందే. డీఆర్ఎంపై దర్యాప్తు బృందం దాడితో వాల్తేరు డివిజన్ రైల్వే అధికారులు, ఉద్యోగులు ఉలిక్కి పడుతున్నారు. డీఆర్ఎం వ్యవహారాలు చక్కబెట్టే ఉద్యోగులు తమ పరిస్థితేంటనే ఆందోళనలో ఉన్నారు.

రెండేళ్ల నుంచీ సీబీఐ నిఘా...!

వాస్తవానికి.. సీబీఐతో డీఆర్ఎం సౌరభ్‌కు కొత్త పరిచయం కాదని తెలుస్తోంది. గతంలో వాల్తేరు డీఆర్ఎంగా రాకమునుపు సెంట్రల్ రైల్వే జోన్‌లో ప్రిన్సిపల్ చీఫ్ మెకానికల్ ఇంజినీర్ (పీసీఎంఈ)గా విధులు నిర్వర్తించే వారు. ఈయనకు ముందు పీసీఎంఈగా వ్యవహరించిన అధికారి.. రూ.లక్ష లంచం తీసుకుంటూ సీబీఐకి చిక్కారు. అనంతరం నిర్వహించిన సోదాల్లో రూ.23 లక్షలు, రూ.40 లక్షల విలువైన ఆభరణాలు, రూ.13 కోట్ల విలువైన ఆస్తులు, సింగపూర్, యూఎస్ బ్యాంకుల్లో రూ.1.63 కోట్ల డిపాజిట్లు ఉన్నట్లుగా సీబీఐ అధికారులు గుర్తించారు. ఆయన స్థానంలో పీసీఎంఈగా విధుల్లోకి వెళ్లిన సౌరభ్‌పై అప్పటి నుంచి కేంద్ర దర్యాప్తు బృందం నిఘా పెట్టింది. పలుమార్లు చిక్కినట్లే చిక్కి తప్పించుకున్నట్లు సమాచారం.

వైజాగ్ నుంచి ఫాలో చేస్తూ..

టెండర్ పాస్ చేసేందుకు లంచం అడుగుతున్నారంటూ ఓ కాంట్రాక్టర్ సీబీఐని ఆశ్రయించారు. దీంతో విశాఖ నుంచి దర్యాప్తు బృందం అధికారులు డీఆర్ఎం కదలికలపై నిఘాపెట్టారు. ముంబై వెళ్తున్నట్లు సమాచారం తెలుసుకొని అక్కడ బృందాల్ని అలెర్ట్ చేసినట్లు తెలుస్తోంది. అక్కడ కాంట్రాక్టర్ నుంచి లంచం తీసుకోవడం.. మెర్సిడెస్ కారులో ఇంటికి వెళ్లిన వెంటనే సీబీఐ అధికారులు డీఆర్ఎంను అదుపులోకి తీసుకోవడం చకచకా జరిగిపోయాయి. రెండేళ్ల నుంచి నిఘా కొనసాగించిన సీబీఐ అధికారులకు ఎట్టకేలకు శనివారం చిక్కారని సమాచారం. సీబీఐ అధికారులు అధికారికంగా ప్రకటించాల్సి ఉంది.

ఎంతిచ్చినా ఓకే.??

లంచం వ్యవహారంలో సౌరభ్ చిక్కడంతో.. ఆయన చేసిన అవినీతి వ్యవహారాలు ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయి. కాంట్రాక్టర్లతో నిరంతరం.. డీఆర్ఎం కార్యాలయం బిజీ బిజీగా ఉండేదని తెలుస్తోంది. సివిల్, మెకానికల్ విభాగాలకు సంబంధించి టెండర్ల ద్వారా వచ్చిన డబ్బుల వసూళ్లకు డీఆర్ఎం కార్యాలయంలోని ఇద్దరు ఉద్యోగుల్ని ప్రత్యేకంగా నియమించినట్లు సమాచారం. టెండర్లు ఎవరికి రావాలంటే.. పని విలువ బట్టి వసూళ్లు రాబట్టేవారని వాల్తేరు డివిజన్ వర్గాలు చెబుతున్నాయి. రూ.50 వేల నుంచి వసూళ్ల పర్వం మొదలయ్యేదని కొందరు కాంట్రాక్టర్లు వాపోతున్నారు. డబ్బులిచ్చిన వారికే పనులకు సంబంధించిన టెండర్లు దక్కేవనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. డీఆర్ఎం అండ్ కో బ్యాచ్‌పై పలుమార్లు ఉన్నతాధికారులకు కాంట్రాక్టర్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని తెలుస్తోంది.

విశాఖ రైల్వే పరువు తీసేశారు.!

వాల్తేరు డివిజన్ చరిత్రలో సీబీఐ దాడుల్లో ఒక ఉద్యోగి, లేదా అధికారి పట్టుబడటం ఇదే మొదటిసారని ఉద్యోగులు చెబుతున్నారు. గతంలో డీఆర్ఎంలుగా వ్యవహరించిన అనూప్‌కుమార్ సత్పతి, చేతన్‌కుమార్ శ్రీవాత్సవ్.. డివిజన్ అభివృద్ధి కోసం నిరంతరం శ్రమించారని.. అనేక సంస్కరణలు తీసుకొచ్చారని అంటున్నారు. ఎక్కడా అవినీతికి తావులేకుండా.. ప్రతి అంశంలోనూ పారదర్శకంగా వ్యవహరిస్తూ.. తప్పు చేసిన ఉద్యోగులను బదిలీలు, సస్పెన్షన్లు చేసేవారని చెబుతున్నారు. సదరు సౌరభ్ వచ్చిన తర్వాత.. ఫిర్యాదులిస్తున్నా పట్టించుకోకుండా వాళ్లతో మిలాఖత్ అయిపోయేవారని కొందరు ఆరోపిస్తున్నారు. మొత్తంగా సీబీఐ వ్యవహారంతో విశాఖ రైల్వే డివిజన్‌పై మచ్చ పడిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆ ఇద్దరిలో టెన్షన్

డీఆర్ఎంపై సీబీఐ దాడులతో.. డివిజన్‌లో ఉద్యోగుల్లో భయాందోళనలు మొదలయ్యాయి. డీఆర్ఎం వ్యవహారాలు చక్కబెట్టిన ఇద్దరు ఉద్యోగులు.. సెలవుపై వెళ్లిపోయేందుకు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. అయితే.. సెలవులో వెళ్తే.. సీబీఐ దృష్టిలో పడతారంటూ సహచరులు చెప్పడంతో ఏం చెయ్యాలో పాలుపోక ఎప్పుడు తమని సీబీఐ విచారణకు పిలుస్తారోనంటూ బిక్కుబిక్కుమంటున్నారు.

ఆధ్యాత్మిక సమాచారం

శ్రీవారి దర్శనానికి 10 గంటలు

తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూ కాంప్లెక్స్‌లో 17 కంపార్ట్‌మెంట్లు నిండాయి. శనివారం అర్ధరాత్రి వరకు 73,179 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 25,602 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. శ్రీవారికి కానుకల రూపంలో హుండీ ద్వారా రూ.4.03 కోట్ల ఆదాయం వచ్చింది. టైం స్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేని వారికి 10 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనమవుతోంది. ఈ క్రమంలో సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికే క్యూలోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది.

ఘనంగా సువర్చలా హనుమద్ కళ్యాణం



జంగారెడ్డిగూడెం రూరల్: ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం మండలం గుర్వాయిగూడెం మద్ది ఆంజనేయస్వామి దర్శనార్థం వేకువజాము నుంచి అధిక సంఖ్యలో భక్తులు విచ్చేశారు. ఆదివారం కార్తీక మాసోత్సవాల్లో భాగంగా ఆలయ మండపంపై ప్రత్యేక పూలతో అలంకరించిన వేదికపై శ్రీస్వామి అమ్మవార్లను ఆశీనులను చేసి, అర్చక స్వాములు శ్రీ సువర్చలా హనుమద్ కల్యాణ క్రతువు నిర్వహించారు. ఈ కల్యాణ క్రతువులో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయం వద్ద రాజానగరం, బాల రాజరాజేశ్వరి నాట్యమండలిచే కూచిపూడి నృత్య ప్రదర్శన ఏర్పాటు చేశారు. భక్తుల హనుమద్ నామస్మరణతో ఆలయం మార్మోగింది.

నేడు లక్ష దీపోత్సవం



శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ సమీపంలోని భరద్వాజ తీర్థంలో కార్తీక మాసం సందర్భంగా సోమవారం లక్ష దీపోత్సవం నిర్వహించనున్నట్లు ఈఓ బాపిరెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ సాయంత్రం 6.30 గంటలకు ప్రారంభమయ్యే దీపోత్సవానికి భక్తులు తరలిరావాలని కోరారు.

కిక్కిరిసిన కాణిపాకం



కాణిపాకం: శ్రీవరసిద్ధి వినాయక స్వామి దేవస్థానం ఆదివారం భక్తజనంతో కిటకిటలాడింది. ఆదివారం సెలవు కావడంతో ఉదయం నుంచి స్వామివారి దర్శనార్థం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. మంచి ముహూర్తాలు ఉండడంతో భక్తుల తాకిడి గణనీయంగా పెరిగింది. దీంతో ఆలయంలోని క్యూలన్నీ భక్తులతో నిండిపోయాయి. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఆలయ అధికారులు తగు చర్యలు తీసుకొని భక్తులకు దర్శనాలు ఏర్పాటు చేశారు. గర్భిణులకు, దివ్యాంగులకు, చంటి పిల్లల తల్లి దండ్రులకు ప్రత్యేక క్యూల ద్వారా దర్శనాలు ఏర్పాటు చేశారు.

బంగారు తిరుచ్చిపై శ్రీకృష్ణుడు



చంద్రగిరి: శ్రీనివాసమంగాపురంలోని శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామివారికి అనుబంధంగా వెలసిన శ్రీకృష్ణ స్వామివారు, అమ్మవార్లతో కలసి ఆదివారం సాయంత్రం బంగారు తిరుచ్చిపై ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. స్వామివారి జన్మనక్షత్రం రోహిణి సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలతో పాటు ఉదయం సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్యకైంకర్యాలను నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్లను సర్వాంగ సుందరంగా అలంకరించారు. తదుపరి సాయంత్రం శ్రీరుక్మిణీ సత్యభామ సమేత శ్రీకృష్ణ స్వామి వారు బంగారు తిరుచ్చిపై ఆశీనులై నాలుగు మాడవీధులలో ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు.

డిసెంబర్ 1న అంతర్రాష్ట్ర అథ్లెటిక్స్


నాయుడుపేటటౌన్ : పట్టణంలో డిసెంబర్ 1వ తేదీన అంతర్రాష్ట్ర అథ్లెటిక్స్ నిర్వహించనున్నట్లు ఎస్ఎస్ఎఫ్ నిర్వాహకుడు మోమిడి లక్ష్మయ్య తెలిపారు.ఆదివారం స్థానిక ఆయుర్వేద వైద్యశాల వద్ద అథ్లెటిక్స్ పోస్టర్ ఆవిష్కరించారు. లక్ష్మయ్య మాట్లాడుతూ జాతీయ ఎయిడ్స్ నివారణ దినోత్సవం సందర్భంగా 7వ అథ్లెటిక్ పోటీలు జరిపిస్తున్నట్లు వెల్లడించారు. 6 నుంచి 16 ఏళ్ల బాలబాలికలకు ఆరు విభాగాల్లో పోటీలు ఉంటాయని వివరించారు. విజేతలకు నగదు బహుమతులు, సర్టిఫికెట్ అందించనున్నట్లు చెప్పారు. వివరాలకు 94405 51278 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ మునునూరు అనిల్‌కుమార్ పాల్గొన్నారు.





ఎనిమిదో వింత

పక్షి మ్యూజియం



పక్షి మ్యూజియం అంటే... రకరకాల పక్షుల రూపాలు, వాటి రెక్కలు, గుడ్లు, పొదిగిన పిల్లల రూపాలను ఒక చోట పొందు పరిచిన మ్యూజియం కాదు. పక్షి ఆకారంలో ఉన్న మ్యూజియం. జటాయు పక్షి ఆకారంలో ఉన్న ఈ మ్యూజియం పరిమాణం కూడా జటాయువులాగ భారీగానే ఉంటుంది. రెండు వందల అడుగుల పొడవు, నూట యాభై అడుగుల వెడల్పు, డెబ్బై అడుగుల ఎత్తులో నిర్మించిన ఈ మ్యూజియం గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో నమోదైంది. ఈ మ్యూజియం కేరళ రాష్ట్రం, కొల్లం జిల్లా, చాదయమంగళం పట్టణంలో ఉంది. ఈ మ్యూజియాన్ని జటాయు ఎర్త్ సెంటర్ అంటారు. ఈ మ్యూజియం ఉన్న కొండ ప్రదేశాన్ని జటాయు నేచర్ పార్క్ అంటారు.






జటాయు పుర

జటాయు నేచర్ పార్క్... కేరళ, కొల్లం జిల్లా, చాదయమంగళం పట్టణంలోని జటాయుపురాలో ఉంది. రామాయణంలో సీతాపహరణం ఘట్టంలో కీలక పాత్ర జటాయువుది. ఆ ఘటన జరిగిన ప్రదేశం ఇదేనని చెబుతారు కేరళవాళ్లు. నేచర్ పార్కులో 65 ఎకరాల విస్తీర్ణంలో డిజిటల్ మ్యూజియమ్ ఉంది. లైట్ అండ్ సౌండ్ షోలో రామాయణంలోని జటాయువు ఘట్టాన్ని ప్రదర్శిస్తారు. పక్షి ఆకారంలోని ఈ నిర్మాణం లోపల జటాయువు కథను తెలిపే ఘట్టాలను చూడవచ్చు. ప్రపంచంలో 'లార్జెస్ట్ ఫంక్షనల్ స్టాచ్యూ ఆఫ్ ఎ బర్డ్' కేటగిరీలో ఈ పార్కు గిన్నిస్ రికార్డులో నమోదైంది. ఈ పార్కుకు చేరడానికి ఇంటర్నేషనల్ స్టాండర్డ్స్ రోప్‌వే ఉంది. ఈ కొండ మీదకు ట్రెకింగ్, రాక్ క్లైంబింగ్, బైక్ రైడింగ్‌తోపాటు ఆర్చరీ వంటి యాక్టివిటీస్ ఉన్నాయి. పిల్లలు, యువత, సీనియర్ సిటిజెన్ అందరికీ ఈ టూర్ అందమైన జ్ఞాపకంగా మిగులుతుంది.

రామాయణం గొప్పదనం ఇదే

వెయ్యి అడుగుల ఎత్తులో జటాయువు పక్షిని నిర్మించడం, పక్షి ఆకారం లోపల మ్యూజియాన్ని ఏర్పాటు చేయడం ప్రపంచంలో ఎనిమిదో వింత అని చెప్పవచ్చు. శిల్పకారుడు రాజీవ్ ఆంచల్ నిర్మించాడు. సీతాపహరణం సమయంలో రావణాసురుడిని అడ్డగించిన జటాయువును రావణాసురుడు సంహరించాడని రామాయణం చెబుతుంది. ఈ ఘట్టానికి వేదిక ఈ జటాయుపుర అని కేరళవాళ్లు చెప్పుకుంటారు. తెలుగు వాళ్లుగా మనం అనంతపురంలోని లేపాక్షిని జటాయువు మరణించిన ప్రదేశంగా చెప్పుకుంటాం. రామాయణం గొప్పదనం అది. దేశం అంతటా ప్రతి ఒక్కరూ కథను స్వాగతిస్తూ ఐడింటిఫై అవుతారు.


జటాయుపుర... కేరళ రాజధాని త్రివేండ్రం నగరానికి యాభై కిలోమీటర్ల దూరంలో ఉంది. పునలూర్ రైల్వేస్టేషన్ నుంచి పాతిక కిలోమీటర్లే. ఇక్కడి నుంచి ట్యాక్సీ తీసుకోవచ్చు. సొంతంగా వాహనాన్ని నడుపుకునే ఆసక్తి ఉంటే కొంత కాషన్ డిపాజిట్, వ్యక్తిగత వివరాలు తీసుకుని కారు అద్దెకిస్తారు.



ఎలిఫెంటా కేవ్స్

ఏనుగు కోసం వెతకొద్దు!

ఎలిఫెంటా కేవ్స్ వరల్డ్ హెరిటేజ్ సైట్. ముంబయి టూర్‌లో తప్పకుండా చూడాల్సిన ప్రదేశం. సముద్రం మధ్యలో ఓ దీవి. అందులో ఓ కొండ. ఆ కొండలో తొలిచిన గుహలివి. అయితే ఈ కొండ మీద కానీ, గుహల్లోనూ ఎంత వెదికినా ఏనుగు మాత్రం కనిపించదు. బ్రిటిష్ వారు ముచ్చటపడి తమ దేశం తీసుకెళ్లాలనుకున్నారట. పెకలించే ప్రయత్నంలో డ్యామేజ్ అవడంతో ఏనుగును వదిలేసి కోహినూర్ వజ్రం, నెమలి సింహాసనంతో సరిపెట్టుకున్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత మనవాళ్లు డ్యామేజ్ అయిన ఏనుగు విగ్రహానికి మరమత్తులు చేసి నగరంలోని శివాజీ మ్యూజియంలో ఉంచారు. ఏనుగు లేదని ఈ గుహలను చూడడం మానుకోకూడదు. ఈ గుహలు మన వారసత్వానికి ప్రతీకలు. ఈ గుహలను చేరడానికి అరేబియా సముద్రంలో సాగే ప్రయాణం అద్భుతంగా ఉంటుంది.



నీరెండలో కడలి విహారం

ఎలిఫెంటా కేవ్స్‌కి ముంబయిలో గేట్ వే ఆఫ్ ఇండియా దగ్గర నుంచి ఫెర్రీలో వెళ్లాలి. ఫెర్రీలు ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకే తీసుకెళ్తాయి. ఈ సీజన్‌లో మిట్ట మధ్యాహ్నం కూడా సూర్యుడు గోరువెచ్చగానే ఉంటాడు. ఫెర్రీ బోట్ పై అంతస్థులో ప్రయాణిస్తూ ముంబయి తీరంలో అరేబియా తీరాన్ని వీక్షించడం ఆహ్లాదకరం మాత్రమే కాదు ఓ ఎడ్యుకేషన్ కూడా. హార్బర్‌కు వచ్చిన షిప్పులు పోర్టులో బెర్త్ క్లియరెన్స్ కోసం ఎదురు చూస్తూ లంగరు వేసుకుని ఉంటాయి. వాటిలో క్రూ డెక్ మీదకు వచ్చి సముద్రాన్ని చూస్తూ కాలక్షేపం చేస్తుంటారు. బకెట్‌కి తాడు కట్టి బావిలో నీటిని తోడినట్లు సముద్రపు నీటిని తోడుకుని షిప్ లోపలికి వెళ్తుంటారు. ఇంటర్నేషనల్ కార్గోలను అంత దగ్గరగా చూడడం కుదరని పని. ఎలిఫెంటా కేవ్స్ టూర్‌లో ఇది బోనస్. షిప్పులు తీరానికి రెండు కిలోమీటర్ల వరకు ఆగి ఉంటాయి. వాటిని చూస్తూ ప్రయాణించడం వల్ల కేవ్స్‌కు పదికిలోమీటర్లు ప్రయాణించిన విషయం అర్థం కాదు.



కడలి గర్భం నుంచి తీరాన్ని చూడవచ్చు

కొండ దగ్గర ఫెర్రీ దిగిన తర్వాత దాదాపు కిలోమీటరు దూరం నడవాలి. గుహలను చేరడానికి టాయ్‌ట్రైన్ ఉంది. కానీ ఎప్పుడో ఒక ట్రిప్పు తిరుగుతుంది. ట్రైన్ కోసం ఎదురు చూడాలా నడవాలా అనేది డిసైడ్ చేసుకోవాలి. సముద్రం లోపల పది కిలోమీటర్ల దూరం నుంచి తీరాన్ని చూడడం బాగుంటుంది. సముద్రపు అలలు, మరోవైపు కొండలను చూస్తూ సాగే ఆ నడక కూడా ఆహ్లాదకరంగానే ఉంటుంది. ఇంతటి వైవిధ్యతను ఆస్వాదిస్తూ గుహల్లోకి అడుగుపెట్టిన తర్వాత అది మరో ప్రపంచం.



శిల్పాలు మాట్లాడతాయి!

ఈ గుహలు క్రీస్తు పూర్వం రెండవ శతాబ్దం నాటివి. శిల్పాల్లో బౌద్ధం, శైవం ప్రభావం కనిపిస్తుంది. ఒక్కో శిల్పం ఒక్కో కావ్యంతో సమానం. మనం చూస్తున్న శిల్పంలో దాగిన కావ్యకథ గైడ్ వివరించే వరకు అర్థం కాదు. విధ్వంసకారులు ఏ శిల్పాన్నీ వదల్లేదు. ప్రతి శిల్పానికి ఎక్కడో ఓ చోట గాయం తప్పనిసరి. హీనయాన బౌద్ధులు ఈ కొండలను తొలిచి ఆవాసాలుగా మలుచుకున్నారు. బౌద్ధ శిల్పాలను చెక్కారు. శివపురాణం ఆధారంగా చెక్కిన ఘట్టాలు కూడా ఎక్కువగా కనిపిస్తాయి. బౌద్ధం సన్నగిల్లిన తర్వాత ఈ ప్రదేశం హిందువుల ఆధీనంలోకి వచ్చింది. శైవం పతాకస్థాయికి చేరిన కాలంలో కాలచూరులు, రాష్ట్రకూటులు ఈ శిల్పాలను చెక్కించారు. క్రీస్తుశకం ఆరవ శతాబ్దంలో సమాజం స్త్రీ పురుష సమానత్వం గురించి ఆలోచించింది. సమాజాన్ని చైతన్యవంతం చేయడానికి శైవాన్ని మాధ్యమం చేసుకుంది. అలా రూపొందిన శిల్పమే అర్ధనారీశ్వరుడి శిల్పం.

పిఎస్: ఎలిఫెంటా కేవ్స్ సందర్శనకు సోమవారం సెలవు.

– వాకా మంజులారెడ్డి,
సాక్షి ఫీచర్స్ ప్రతినిధి



ట్రావెల్ టిప్స్

- డిసెంబర్‌లో మహారాష్ట్ర, కేరళ రెండు రాష్ట్రాల్లోనూ చలి తీవ్రంగానే ఉంటుంది. హెవీ ఉలెన్స్, క్యాప్ తప్పనిసరి. జటాయుపుర, ఎలిఫెంటా కేవ్స్ రెండు ప్రదేశాలకూ ఎక్కువ నడవాల్సి ఉంటుంది. కాబట్టి మంచి షూస్ ఉండాలి.
- డార్క్ చాక్‌లెట్, నట్స్‌తో కూడిన బార్స్, నువ్వుల చిక్కీలు దగ్గరుంచుకోవాలి. దాహం వేయకపోయినప్పటికీ దేహం డీ హైడ్రేట్ కాకుండా ఉండడానికి అప్పుడప్పుడు కొద్ది పరిమాణంలో నీటిని తాగాలి. కేరళ కొబ్బరి నీటిని రుచి చూడకుండా వెనక్కి రాకూడదు. అలాగే అరటి పండ్లను కూడా.
- మంచు కారణంగా ఎదురయ్యే జలుబు, దగ్గులకు మందులు దగ్గరుంచుకోవాలి.
- కేరళలో చేపలతో వండిన వంటకాలను తప్పకుండా రుచి చూడాలి.
- ముంబయిలో మంచి క్వాలిటీ కలిగిన వేరుశనగపప్పుతో బెల్లం పాకంతో పెద్ద చిక్కీలు దొరుకుతాయి.
- ఎలిఫెంటా కేవ్స్‌కు వెళ్లే ముందు సముద్రం వ్యూతో ఫొటో తీసుకోండి. అలాగే ఫెర్రీ బోట్ కేవ్స్ దగ్గరకు వెళ్లేటప్పుడు కేవ్స్ బ్యాక్‌డ్రాప్‌లో ఓ ఫొటో తీసుకోవడం కూడా మర్చిపోకూడదు.

హౌజ్ ఆర్ట్

నా ఇల్లు.. నా భారతీయత

– తాప్సీ పన్ను, నటి



'నా ఇల్లంతా భారతీయత కనిపించాలి. ఆ కళతో నేను అనుభూతి చెందాలి' అంటోంది నటి తాప్సీపన్ను. ముంబైలోని తాప్సీ పన్ను ఇల్లు ప్రాచీన పంజాబీ కళతో ఆకట్టుకుంటుంది. ఇందుకు సోదరి షగున్ తన కలకు సహాయం చేసిందని మరీ మరీ చెబుతుంది తాప్సీ.

ఇంటి లోపలి అలంకరణలో ఎర్ర ఇటుక గోడలు, జూట్ చార్పైస్, గోడకు అమర్చిన ఝరోఖాలు ఉన్నాయి. ఇది పంజాబ్ ఇంటీరియర్‌లలో ఒక అద్భుతమైన ప్రాచీన ఇంటిని గుర్తు చేస్తుంది. 'నా సోదరి వెడ్డింగ్ ప్లానర్, ప్రొఫెషనల్ కూడా. దీంతో ప్రత్యేకమైన డిజైనర్ అవసరం లేకపోయింది. ఆమె మా ఇంటిని చాలా అర్థవంతంగా మార్చడానికి సహాయం చేసింది. మేం దేశంలోని పంజాబ్, రాజస్థాన్, కచ్ వంటి ప్రాంతాలకు వెళ్లినప్పుడల్లా కొన్ని వస్తువులు సేకరించి, తీసుకొచ్చాం. అలా తీసుకొచ్చిన వాటితోనే మా ఇంటి అలంకరణ చేశాం.

ప్రాచీన కళ

'నేనెప్పుడూ విలాసవంతమైన ఇల్లు కావాలనుకోలేదు. భారతీయత కనిపించాలని, అనుభూతి చెందాలని కోరుకుంటాను. అందుకు ఇది ఫ్యాన్సీదా, ఖరీదైనదా అనుకోను. ఇల్లు మన ఆత్మీయులందరినీ స్వాగతించేలా ఉండాలి.

దేశీ - విదేశీ

మా ఇల్లు అపార్ట్‌మెంట్‌లోని డ్యూప్లెక్స్ స్టైల్. ఒక అంతస్తు మొత్తం దేశీ అనుభూతిని పంచుతుంది. నా అభిరుచికి ఈ అంతస్తు అద్దం పడుతుంది. మరొక అంతస్తు నా వ్యక్తిగత స్థలం. అక్కడ, నా మానసిక స్థితిని బట్టి, మార్చుకోవడానికి అనువైనది ఉండేలా చూసుకుంటాను. నా స్నేహితులు దేశీ ఫ్లోర్‌పైనే సందడి చేస్తారు. ఇక నా గదిని చూసి మాత్రం పింటరెస్ట్ హౌస్ అని పిలుస్తారు, ఎందుకంటే ఇంట్లోని ప్రతి మూలన ఏదో ఒక ఫొటో ఫ్రేమ్ ఉంటుంది. నాకెందుకో ఏ మూలన ఖాళీగా అనిపించినా, అక్కడ ఫొటో ఫ్రేమ్ ఉంటే బాగుంటుంది అనిపిస్తుంది. ఎందుకంటే నా ఫొటో ఆల్బమ్‌లో అన్ని మంచి జ్ఞాపకాలు ఉన్నాయి. వాటిని ఫొటో ఫ్రేమ్స్‌లో పెట్టి, నచ్చిన చోటల్లా పెట్టేస్తుంటాను. మా నాన్నకు ఇంటీరియర్స్‌లో చాలా మంచి అభిరుచిని ఉంది. అందుకు ఉపయుక్తంగా, వైద్యపరంగా ఉండటానికి ఇష్టపడతాడు.

మాస్టర్ బెడ్‌రూమ్ క్లాసిక్ వైట్‌తో ఉంటుంది. నలుగురు పడుకునేంత పెద్ద బెడ్, వుడెన్ ఫ్రేమ్స్, కార్వింగ్‌తో చేయించాం. వానిటీ ఏరియాలో పెద్ద డ్రెస్సింగ్ మిర్రర్ ఏర్పాటు చేయించాం. మిర్రర్ చుట్టూ ఎల్లో లైట్స్ డిజైన్ చేయించాం. మంచి రంగున్న కర్టెయిన్స్, బెడ్ కు ముందు కిటికీ, ఫ్లోరింగ్ కూడా ఉడ్‌తో తయారుచేసిందే. బాల్కనీ ఏరియాలో వుడెన్ ఫ్లోరింగ్, ముదురు గోధుమ రంగు కుషన్స్, ప్రింటెడ్ ఫ్యాబ్రిక్స్ ఉంటాయి. కొన్ని మొక్కలతో బాల్కనీ ఏరియాను డిజైన్ చేసుకున్నాం. యోగా చేసుకోవడానికి వీలుగా ప్లేస్ ఉంటుంది. కుండీలలో మొక్కలు, కలర్‌ఫుల్ ఫ్రేమ్స్, బుద్ధ విగ్రహం, వాల్ హ్యాంగింగ్స్... అన్నీ కలిసి ఓ మినీ ఫారెస్ట్‌ని తలపించేలా డిజైన్ చేయించాం. ఇంటిని డిజైన్ చేయించం అంటే మనలోని కళకు అద్దం పట్టినట్టే" అంటోంది తాప్సీ.





మూగ జీవాల సంక్షేమానికి

వీధుల్లో కుడ్య చిత్రాలు

ఆర్ట్



'ది కైండ్ అవర్' ఫౌండేషన్ ద్వారా రెండు వందల యాభైకి పైగా వీధి కుక్కలను కాపాడుతోంది లక్నో వాసి మౌలి మెహ్రోత్రా. కళ ద్వారా జంతువుల పట్ల ప్రేమను ప్రజలకు తెలియజేస్తుంది. వీధుల్లో సృజనాత్మక కుడ్యచిత్రాల ఏర్పాటు, కమ్యూనిటీ ఔట్రీచ్‌లు, వర్క్‌షాప్‌ల ద్వారా పిల్లలకు బాధ్యతను బోధిస్తోంది.

'జంతు హక్కుల' గురించి చెబుతున్నప్పుడు చాలామందిలో 'ఇది అవసరమా?' అన్నారు. కానీ, ఎవ్వరి మాటలను పట్టించుకోను అంటోంది మౌలి. నలుగురు తిరిగే వీధుల్లో మూగ జంతువులకు సంబంధించిన చిత్రాలను ఉంచుతుంది. తనలాగే ఆలోచించే శ్రేయోభిలాషుల బృందం నుంచి ఆలోచింపజేసే పెయింటింగ్ తెప్పించి, వీధుల్లో ఏర్పాటు చేస్తుంది.

కళ– వృత్తి సమతుల్యత

23 ఏళ్ల వయస్సులో మౌళి తన చుట్టూ ఉన్న కుక్కలకు ఆహారం ఇవ్వడం, రక్షించడం, సంరక్షణ చేయడం ప్రారంభించింది. 'నేను దాదాపు 200 కుక్కల బాధ్యత తీసుకున్నాను. ఒక ఏడాది పాటు ప్రతిరోజూ వాటి సంరక్షణ చూశాను. కానీ ఒంటరిగా చేయలేమని గ్రహించాను. నేను ప్రయాణాలు చేయవలసి వస్తే... ఈ పని ఎలా కొనసాగుతుంది? నేను చనిపోతే ఏమి జరుగుతుందో... అని కూడా ఆలోచించడం మొదలుపెట్టాను. జంతు సంక్షేమం పట్ల తనలో పెరుగుతున్న నిబద్ధతతో కళలలో వృత్తిని సమతుల్యం చేసుకోవడంలో అన్నీ సవాళ్లే. అందుకే, ఈ అభిరుచిని ఒక సంస్థగా మార్చాలనుకున్నాను. అప్పుడే ప్రతి జంతువుకు మరింత ప్రేమను పంచవచ్చు అనుకున్నాను' అని ఆమె వివరిస్తుంది.

లోతైన అవగాహన

మౌళి చేసే ప్రయాణంలో సంస్థను ఎలా నమోదు చేసుకోవాలో తెలియకపోయినప్పటికీ, చుట్టూ ఉన్న వ్యక్తుల నుండి సహాయం కోరింది. 'నేను దీన్ని రిజిస్టర్ చేసుకోవడానికి వెళ్ళినప్పుడు సొసైటీగానా, ట్రస్ట్‌గానా లేదా సెక్షన్ 8గా జాబితా చేయాలనుకుంటున్నారా అని అధికారులు అడిగారు. నాకు అవేవీ తెలియవు. కానీ, మెల్లగా అర్థం చేసుకున్నాను. నల్సార్ యూనివర్శిటీ నుంచి లా లో మాస్టర్స్ చదువుతున్నప్పుడు జంతు సంరక్షణ పట్ల అంకితభావం మరింత పెరిగింది. దీంతో వీటిలో శిక్షణ తీసుకున్నా. ఇది నాకు సబ్జెక్ట్‌లో చాలా లోతైన అవగాహనను ఇచ్చింది. ఈ విషయాలపై పూర్తిగా భిన్నమైన ఆలోచనలతో ఉన్న నేను ఎవరితోనైనా కూర్చున్నప్పుడు చేస్తున్న పని గురించి తప్పు పట్టాలని చూస్తుంటారు. కానీ, వారితో చర్చలు చేయను' అని వివరిస్తుంది.

పంచుకునే వ్యక్తులతో కలిసి..

బాలీవుడ్ నిర్మాత అమన్ విపేరాతో సహా మౌళి నిబద్ధత చాలా మందికి నచ్చింది. 'ఎప్పటినుండో ఒక షోలో పాల్గొనాలని, జంతు సంక్షేమం కోసం పని చేయాలని ఉందని అడిగాను. అలా మేమిద్దరం కళాకారులం కాబట్టి, ఇతర జీవులు, జంతువుల గురించి పిల్లలకు నేర్పించడంలో కళ నిజంగా సహాయపడుతుందని, మనలాగే వాటికీ భావోద్వేగాలు, బాధలు ఎలా అనుభవిస్తాయో వాస్తవాన్ని గ్రహించాం. ఇప్పుడు పాఠ్యాంశాలు, స్టడీ మెటీరియల్స్, జంతు సంక్షేమం గురించి పిల్లలకు బోధించడానికి పంచుకునే కథలను రూపొందించడానికి కలిసి పని చేస్తున్నాం' అని వివరించారు. టీమ్‌లోని మరొక సభ్యురాలు మేఘన మాట్లాడుతూ– 'ఎవరో ఒక కుక్కపిల్లని నా ఇంటి బయట వదిలేశారు. ఏమి చేయాలో గుర్తించే ప్రయత్నంలో నేను మౌళి గురించి తెలుసుకున్నాను. నాకు ఆ సంస్థ పనులు చాలా బాగా నచ్చాయి. నేను కూడా వారితో కలిసి పనిచేయడం ప్రారంభించాను' అని చెబుతుంది.

గోడల నుంచి మనసుల వరకు

కైండ్ అవర్ ఫౌండేషన్ పనుల్లో కళను చేర్చడానికి ఒక ప్రత్యేకమైన మార్గాన్ని కనుగొంది మౌళి. అదే వీధి కళ. మౌళి చెబుతున్నట్టుగా వారు నివసించే వ్యక్తులకు విషయం చేరే శక్తివంతమైన వ్యక్తీకరణ ఇది. 'వారు కుక్కను ఎందుకు చిత్రీకరిస్తున్నారు?' అని వీధిలో ఎవరైనా అడుగుతారు. 'అతను ఈ వీధిలో నివసిస్తున్నాడు కాబట్టి అని మేం చెబుతాం' అని వివరిస్తుంది మౌళి. మౌళి చిత్రించిన కుక్కల వీధి కుడ్యచిత్రాలు లక్నో చుట్టూ, బయట గణనీయమైన ప్రభావాన్ని చూపాయి. లక్నోలోని పాత పాడుబడిన ప్రభుత్వ భవనంపై కుక్కను చిత్రించడం ఆమె అత్యంత ముఖ్యమైన ప్రాజెక్ట్‌లలో ఒకటి. దీనికి మంచి స్పందన లభించింది. చాలా మంది ప్రజలు పెయింటింగ్‌ను గమనించడం ప్రారంభించారు. రిషికేశ్‌లోని బ్యాక్‌ప్యాకర్స్ హాస్టల్‌లో మరొక కుడ్యచిత్రం ఏర్పాటు చేసింది. 'నాలుగేళ్ల క్రితం ఆ చిత్రం ఏర్పాటు చేశాం. ఇప్పటికీ ఆ పెయింటింగ్‌ను ప్రజలు ఇష్టపడతారు' అని చెప్పే మౌళి కుడ్యచిత్రాలతో పాటు, ఫౌండేషన్ వర్క్‌షాప్‌ల ద్వారా విద్యార్థులతో కలిసి పనుల్లో నిమగ్నమై ఉంటుంది. "ఒక పాఠశాలలో మేం పిల్లలతో కలిసి గోడకు పెయింట్ చేశాం. వారు ఆ పనిలో పాల్గొనడం చాలా సంతోషంగా ఉంది. పెయింటింగ్‌లో ఉన్న జంతువుల గురించి మేం వారికి నేర్పించాం. వాటిని ఎలా చూసుకోవాలో చెబితే చాలా బాగా అర్థం చేసుకున్నారు 'అంటూ నాటి విషయాలను గుర్తుచేసుకుంటుంది. వీధి జంతువుల పట్ల బాధ్యతను ప్రోత్సహించడానికి ఫౌండేషన్ స్థానిక సంఘాలతో కలిసి పనిచేస్తుంది. వారు స్థానిక పశువైద్యులతో కలిసి ఆహారం, రెస్క్యూ సేవలు, సంరక్షణనూ అందిస్తున్నారు.

కల్చర్

జానపద నృత్యంతో నిరసన



న్యూజిలాండ్‌లో స్థానిక ప్రజల భాష మావోరి. 1987లో న్యూజిలాండ్ అధికార భాషలలో ఒకటిగా మావోరి భాష గుర్తింపు పొందింది. హాకా అని పిలిచే మావోరికి చెందిన ఒక సాంస్కృతిక జానపద నృత్యం ఉంది. ఇది కేవలం ఒక నృత్య రూపకం మాత్రమే కాదు. మావోరీ ప్రజల వారసత్వం. వారి పూర్వీకులతో ఉన్న అనుబంధం. గతానికి, వర్తమానానికి మధ్య శాశ్వతమైన వంతెనగా ఇప్పటికీ హాకా నిలుస్తుంది.

మావోరీ సంస్కృతి, గుర్తింపు, భావోద్వేగాలన్నింటినీ హాకా ఇముడ్చుకొని ఉంది. ఐక్యత, ధిక్కరణల అసాధారణ ప్రదర్శనతో కనువిందు చేస్తుంది. న్యూజిలాండ్ పార్లమెంట్‌లో ఇటీవల స్వదేశీ హక్కులకు భంగం కలిగించే వివాదాస్పద బిల్లుకు నిరసనగా అక్కడి ఎంపీలు హాకా కళను ప్రదర్శించారు. దీంతో ఈ కళ సోషల్‌మీడియా ద్వారా ప్రపంచం ముందుకువచ్చింది. హాకా చరిత్ర, దాని లోతైన సాంస్కృతిక ప్రాముఖ్యత, మావోరీ ప్రజల శతాబ్దాల నాటి పోరాటాలు అసామాన్యమైనవిగా తెలిశాయి.

న్యాయం కోసం ప్రాచీన కాలం నుంచి నేటి ఆధునిక కాలపు పోరాటాల వరకు 'ది కల్చర్ ప్రాజెక్ట్'గా హాకా నృత్యం ప్రపంచం దృష్టిని ఆకర్షించింది.



విజయం గురించి నేను కలలో కూడా ఊహించలేదు
దానికోసం పనిచేశాను

- ఎస్టీ లాడర్ సౌందర్య ఉత్పత్తుల అమెరికా వ్యాపార వేత్త

సాక్షి ప్లస్
సోమవారం I 18-11-2024

బిజినెస్ రీల్

మిక్ ఎలక్ట్రానిక్స్ లాభం ప్లస్

క్యూ2లో రూ. 2.12 కోట్లు



హైదరాబాద్: లెడ్ వీడియో డిస్‌ప్లేల డిజైన్, డెవలప్‌మెంట్, తయారీ కంపెనీ మిక్ ఎలక్ట్రానిక్స్ ఈ ఆర్థిక సంవత్సరం(2024–25) రెండో త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు సాధించింది. జులై–సెప్టెంబర్(క్యూ2)లో త్రైమాసికవారీగా నికర లాభం 8 శాతంపైగా మెరుగుపడి రూ. 2.12 కోట్లను తాకింది. ఏప్రిల్–జూన్(క్యూ1)లో 1.96 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం మరింత అధికంగా 156 శాతం జంప్‌చేసి రూ. 27.45 కోట్లను అధిగమించింది. ఈ ఏడాది క్యూ1లో 10.7 కోట్ల ఆదాయం నమోదైంది. నిర్వహణ లాభం(ఇబిటా) 38 శాతం ఎగసి రూ. 2.86 కోట్లకు చేరింది. ఇబిటా మార్జిన్లు 2.79 శాతం నుంచి 13.97 శాతానికి దూసుకెళ్లాయి. స్మార్ట్ మీటర్లు, డిజిటల్ మీటర్లు తదితరాల తయారీ, డీల్స్ కోసం ఎంఐసీకే డిజిటల్ ఇండియా పేరుతో అనుబంధ సంస్థను ఏర్పాటు చేసినట్లు కంపెనీ పేర్కొంది.


ఐస్ మేక్ రిఫ్రిజిరేషన్ ఆదాయం రూ. 103 కోట్లు

ముంబై: కూలింగ్ సొల్యూషన్స్ అందించే లిస్టెడ్ సంస్థ ఐస్ మేక్ రిఫ్రిజిరేషన్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో రూ. 103 కోట్ల ఆదాయంపై సుమారు రూ. 5 కోట్ల లాభం ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం క్యూ2లో ఆదాయం రూ. 77 కోట్లు కాగా లాభం రూ. 4.5 కోట్లుగా నమోదైంది. మార్కెట్లో సవాళ్లు నెలకొన్నప్పటికీ మెరుగైన పనితీరు సాధించగలిగినట్లు సంస్థ వెల్లడించింది.

● ఎన్‌ఎఫ్‌వో

శ్రీరామ్ ఏఎంసీ మల్టీ సెక్టార్ రొటేషన్ ఫండ్

శ్రీరామ్ గ్రూప్‌లో భాగమైన శ్రీరామ్ అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ కొత్తగా మల్టీ సెక్టార్ రొటేషన్ ఫండ్‌ను ఆవిష్కరించింది. ఇది నవంబర్ 18న ప్రారంభమై డిసెంబర్ 2న ముగుస్తుంది. కనీసం రూ. 500 నుంచి ఇన్వెస్ట్ చేయొచ్చు. ట్రెండింగ్ రంగాల్లో పెట్టుబడులను రొటేషన్ చేయడం ద్వారా పన్నులపరమైన ప్రయోజనాలతో మెరుగైన రాబడులను అందించడం ఈ ఫండ్ లక్ష్యం. నిర్దిష్ట ప్రమాణాలను బట్టి పనితీరు అంతగా లేని రంగాల్లో పెట్టుబడులను తగ్గిస్తూ రాణిస్తున్న రంగాల్లో ఇన్వెస్ట్‌మెంట్ అవకాశాలను అందిపుచ్చుకునేందుకు ఇది ప్రయత్నిస్తుంది. కనీసం 3–6 ట్రెండింగ్ రంగాల్లో పెట్టుబడులు పెడుతుంది. దీనికి నిఫ్టీ 500 సూచీ ప్రామాణికంగా ఉంటుంది.



కోడిగుడ్లు (హోల్‌సేల్–నెక్ / 100కు రూ.లలో)

18-11-2024

విశాఖ	550-00
చిత్తూరు	593-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	565-00
విజయవాడ	575-00
రిటైల్ ధర (డజను)	78.00
హైదరాబాద్	545-00
వరంగల్	547-00
రిటైల్ ధర	6.05

అంతర్జాతీయ పరిణామాలే కీలకం

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2024-25) రెండో త్రైమాసిక(జులై-సెప్టెంబర్) ఫలితాల సీజన్ ముగింపు దశకు చేరడంతో ఇకపై దేశీ స్టాక్ మార్కెట్లకు అంతర్జాతీయ పరిణామాలే దిక్సూచిగా నిలవనున్నట్లు విశ్లేషకులు పేర్కొంటున్నారు. దేశీయంగా ప్రభావిత అంశాలు కొరవడటం దీనికి కారణమని తెలియజేశారు. వివరాలు చూద్దాం.

- మార్కెట్ల నడకపై నిపుణుల అంచనా
- బుధవారం (20న) మార్కెట్లకు సెలవు
- ఈ వారం ట్రేడింగ్ 4 రోజులకే పరిమితం

న్యూఢిల్లీ: దేశీ కార్పొరేట్ క్యూ2 ఫలితాలు దాదాపు ముగియనున్నాయి. దీంతో ఇకపై ఇన్వెస్టర్లు విదేశీ మార్కెట్లు, పెట్టుబడులు, గణాంకాలవైపు దృష్టి సారించనున్నట్లు స్టాక్ నిపుణులు అభిప్రాయపడ్డారు. బుధవారం(20న) మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ జరగనున్న నేపథ్యంలో బీఎస్ఈ, ఎన్ఎస్ఈలకు సెలవు ప్రకటించారు. దీంతో ఈ వారం దేశీ స్టాక్ మార్కెట్లు నాలుగు రోజులే పని చేయనున్నాయి. కొద్ది రోజులుగా మార్కెట్లు నేల చూపులతో కదులుతున్న నేపథ్యంలో కొంతమేర షార్ట్‌కవరింగ్‌కు వీలున్నట్లు నిపుణులు అంచనా వేశారు. ఫలితంగా మార్కెట్లు ఆటుపోట్ల మధ్య కదలవచ్చని తెలియజేశారు. 288మంది సభ్యుల మహారాష్ట్ర లెజిస్లేటివ్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు ఈ నెల 23న వెలువడనున్నాయి. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీసహా పలు పార్టీలు ఎన్నికలలో పోటీ పడుతుండటంతో ఫలితాలకు ప్రాధాన్యత ఏర్పడింది.

యూఎస్ ఎఫెక్ట్

కొత్త ప్రెసిడెంట్‌గా డొనాల్డ్ ట్రంప్ ఎన్నికైన నేపథ్యంలో ప్రపంచ ప్రధాన కరెన్సీలతో మారకంలో డాలరు ఇండెక్స్ బలపడుతోంది. గత వారాంతాన ఒక దశలో 106.66ను తాకింది. దీంతో దేశీ కరెన్సీ బలహీనపడుతూ వస్తోంది. గురువారం (14న) రూపాయి సరికొత్త కనిష్టం 84.41 వద్ద ముగిసింది. దీనికితోడు యూఎస్ ట్రెజరీ బాండ్ల ఈల్డ్స్ సైతం మెరుగుపడుతున్నాయి. గత వారం చివర్లో 4.5 శాతానికి చేరాయి. మరోవైపు చైనా సహాయక ప్యాకేజీలకు తెరతీస్తోంది. రియల్టీ రంగానికి వెసులుబాటు కల్పించింది. 5.3 ట్రిలియన్ డాలర్ల విలువైన మార్టిగేజ్ రుణ వ్యయాలుసహా.. డౌన్ పేమెంట్‌ను తగ్గించడం వంటి చర్యలు చేపట్టింది. ఈ అంశాల నేపథ్యంలో ఇటీవల కొద్ది రోజులుగా దేశీ స్టాక్స్ నుంచి విదేశీ పెట్టుబడులు భారీ స్థాయిలో తరలివెళుతున్నాయి. ఈ వారం జపాన్ ద్రవ్యోల్బణ గణాంకాలు విడుదల కానున్నాయి. యూఎస్ నిరుద్యోగిత, తయారీ, సర్వీసుల రంగ గణాంకాలు సైతం వెల్లడికానున్నాయి.

వర్ధమాన మార్కెట్లకు దెబ్బ

యూఎస్ బాండ్ల ఈల్డ్స్, డాలరు బలపడటంతో వర్ధమాన మార్కెట్లపై ప్రభావం పడుతున్నట్లు స్వస్తికా ఇన్వెస్ట్‌మార్ట్ సీనియర్ టెక్నికల్ అనలిస్ట్ ప్రవేశ్ గౌర్ పేర్కొన్నారు. క్యూ2 ఫలితాల సీజన్ ముగియడంతో ఇకపై మార్కెట్లు విదేశీ ఇన్వెస్టర్ల తీరు ఆధారంగా కదలవచ్చని రెలిగేర్ బ్రోకింగ్ రీసెర్చ్ ఎస్‌వీపీ అజిత్ మిశ్రా అభిప్రాయపడ్డారు. ట్రేడర్లు ప్రపంచ మార్కెట్ల ట్రెండ్‌ను అనుసరించే వీలున్నట్లు తెలియజేశారు. విదేశీ అంశాల నేపథ్యంలో ఈ వారం దేశీ మార్కెట్లు హెచ్చుతగ్గుల మధ్య కదిలే వీలున్నట్లు మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ వెల్త్‌మేనేజ్‌మెంట్, రీసెర్చ్ హెడ్ సిద్ధార్థ ఖేమ్కా అంచనా వేశారు.

విదేశీ పెట్టుబడులపై ఇన్వెస్టర్ల దృష్టి



10 శాతం దిద్దుబాటు..

గత వారం దేశీ స్టాక్ మార్కెట్లు విదేశీ ఇన్వెస్టర్ల అమ్మకాలతో డీలా పడ్డాయి. సెన్సెక్స్ 1,906 పాయింట్లు కోల్పోయి 77,580 వద్ద ముగిసింది. వెరసి రికార్డ్ గరిష్టం(86,000స్థాయి) నుంచి 8,395 పాయింట్లు(10 శాతం) పడిపోయింది. ఇక గత వారం నిఫ్టీ సైతం 616 పాయింట్లు క్షీణించి 23,533 వద్ద స్థిరపడింది. ఈ బాటలో చరిత్రాత్మక గరిష్టం(26,277) నుంచి 2,745 పాయింట్లు పతనమైంది.

అమ్మకాల బాటలోనే...



దేశీ స్టాక్స్‌లో విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్ల(ఎఫ్‌పీఐలు) అమ్మకాలు కొనసాగుతున్నాయి. ఈ నెలలో ఇప్పటివరకూ నికరంగా రూ. 22,420 కోట్ల విలువైన స్టాక్స్ విక్రయించారు. యూఎస్ డాలర్‌తో పాటు ట్రెజరీ ఈల్డ్స్ బలిమి, చైనా ప్యాకేజీలు, దేశీ మార్కెట్ల గరిష్ట విలువల కారణంగా అమ్మకాలవైపు మొగ్గు చూపుతున్నారు. దీంతో గత నెల(అక్టోబర్)లో కొత్త రికార్డ్ నెలకొల్పుతూ రూ. 94,017 కోట్ల పెట్టుబడులను వెనక్కి తీసుకున్న విషయం విదితమే. ఇంతక్రితం 2020 మార్చిలో మాత్రమే ఈ స్థాయిలో రూ. 61,973 కోట్ల విలువైన స్టాక్స్ విక్రయించారు. అయితే ఈ ఏడాది సెప్టెంబర్‌లో 9 నెలల్లోనే అత్యధికంగా రూ. 57,724 కోట్లు ఇన్వెస్ట్ చేయడం గమనార్హం!

రిలయన్స్ గ్రూప్ భారీ ప్రణాళికలు..

- 2030 వృద్ధి వ్యూహంలో భాగంగా గ్రూప్ కార్పొరేట్ సెంటర్ ఏర్పాటు
- రూ. 17,600 కోట్ల సమీకరణపై దృష్టి



న్యూఢిల్లీ: అనిల్ అంబానీకి చెందిన రిలయన్స్ గ్రూప్ .. 2030 నాటికి భారీ లక్ష్యాల సాధన దిశగా వృద్ధి ప్రణాళికలు రూపొందించుకుంటోంది. ఇందులో భాగంగా రిలయన్స్ గ్రూప్ కార్పొరేట్ సెంటర్‌ని (ఆర్‌జీసీసీ) ఏర్పాటు చేసింది. కొత్త అవకాశాలను, సాంకేతిక పురోగతులను అందిపుచ్చుకోవడంలో గ్రూప్ కంపెనీలకు మార్గదర్శకత్వం వహించేందుకు ఇది వ్యూహాత్మక హబ్‌గా ఉపయోగపడనుంది. సతీష్ సేథ్, పునీత్ గార్గ్, కె. రాజగోపాల్.. ఆర్‌జీసీసీ కీలక టీమ్ సభ్యులుగా ఉంటారు. గార్గ్ ప్రస్తుతం రిలయన్స్ ఇన్‌ఫ్రాకు సీఈవోగా వ్యవహరిస్తుండగా, రాజగోపాల్ గత ఆరేళ్లుగా రిలయన్స్ పవర్‌కు సారథ్యం వహిస్తున్నారు. గ్రూప్ కంపెనీలకు చెందిన ఇతర సీనియర్స్ కూడా ఈ టీమ్‌లో భాగమవుతారు. కంపెనీలను సుస్థిర అభివృద్ధి సాధన దిశగా ముందుకు తీసుకెళ్లడంలో ఆర్‌జీసీసీ కీలక పాత్ర పోషించగలదని రిలయన్స్ గ్రూప్ అధికార ప్రతినిధి తెలిపారు. విస్తరణ ప్రణాళికల కోసం రూ. 17,600 కోట్ల నిధులను సమీకరిస్తున్నట్లు గ్రూప్ ఒక ప్రకటనలో తెలిపింది.

ఆర్‌కామ్ ఖాతాలు 'ఫ్రాడ్'గా వర్గీకరణ..
రిలయన్స్ కమ్యూనికేషన్ (ఆర్‌కామ్), దాని అనుబంధ సంస్థ రిలయన్స్ టెలికాం అకౌంట్లను కెనరా బ్యాంక్ 'ఫ్రాడ్' ఖాతాలుగా వర్గీకరించింది. ఈ మేరకు బ్యాంకు నుంచి లేఖ అందినట్లుగా ఆర్‌కామ్ ఎక్స్ఛేంజీలకు తెలిపింది.

విదేశీ విద్యా రుణాలు..

కీలకమైన 7 అంశాలు..



రాజేశ్ నారాయణ్ కచావే
చీఫ్ బిజినెస్ ఆఫీసర్ (స్టూడెంట్ లెండింగ్ ఇంటర్నేషనల్ బిజినెస్) అవాన్స్ ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్.

ఇటీవలి కాలంలో విదేశీ విద్యను కోరుకునే విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. దీంతో విద్యా రుణాలకు కూడా డిమాండ్ నెలకొంది. వ్యక్తిగత అవసరాలకు అనుగుణమైన విద్యా రుణాలను అందించే నాన్–బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీలు ఈ ప్రక్రియలో కీలకంగా మారాయి. ఈ నేపథ్యంలో విద్యా రుణాల కోసం దరఖాస్తు చేసుకోవడానికి ముందు పరిగణనలోకి తీసుకోవాల్సిన 7 కీలకాంశాలపై అవగాహన కల్పించేందుకే ఈ కథనం.



→ **మొత్తం ఖర్చులపై అవగాహన ఉండాలి:** విద్యార్థులు విదేశీ ప్రయాణాన్ని ప్లాన్ చేసుకున్నప్పుడు ట్యూషన్‌తో పాటు వసతి, జీవన వ్యయాలు, ప్రయాణ ఖర్చులు, బీమా, ఇతరత్రా అనుకోకుండా తలెత్తే ఖర్చులన్నింటినీ పరిగణనలోకి తీసుకోవాలి. తద్వారా ఎంత రుణం కోసం దరఖాస్తు చేసుకోవాలనేది తెలుస్తుంది. అవసరానికి మించి తీసుకోవడం శ్రేయస్కరం కాదు. ఈ లెక్కలు వేసుకోవడానికి ఎడ్యుకేషన్ లోన్ ఈఎంఐ కాల్‌క్యులేటర్, కాలేజ్ కోర్స్ ఎక్స్‌పెన్సెస్ కాల్‌క్యులేటర్ వంటి టూల్స్ ఉపయోగపడతాయి.

→ **సమగ్ర పరిశోధన అవసరం:** ఈ దశ పూర్తయ్యాక, అందుబాటులో ఉన్న వివిధ రుణాల ఆప్షన్లు, అర్హతలు, వడ్డీ రేట్లు, మంజూరు విధానాలు, తిరిగి చెల్లింపులకు సంబంధించిన నిబంధనలు, సహ–రుణగ్రహీత అవసరాలు, హామీలు, ప్రాసెసింగ్ ఫీజులపై పరిశోధన చేయాలి.

→ **ఖర్చులన్నింటికీ సరిపోయేలా ఉండాలి:** కొత్త తరం ఎన్‌బీఎఫ్‌సీలు సమగ్ర విద్యా రుణాలను అందిస్తున్నాయి. అంటే ట్యూషన్ ఫీజులు, ప్రయాణ ఖర్చులు, వసతి ఖర్చులు, లెర్నింగ్ డివైజెస్ కొనుగోలు, జీవన వ్యయాలు మొదలైన అన్నింటికీ ఉపయోగపడే విధంగా లోన్స్ ఇస్తున్నాయి. దీనివల్ల ఆర్థిక విషయాల గురించి ఆందోళన చెందాల్సిన అవసరం లేకుండా చదువు, కెరియర్‌పై దృష్టి పెట్టేందుకు వీలవుతుంది.

→ **డాక్యుమెంటేషన్ ప్రధానం:** విద్యార్థులు అవసరమైన అన్ని డాక్యుమెంట్ల చెక్‌లిస్ట్ తయారు చేసుకోవాలి. వాటన్నింటినీ సరిగ్గా సమర్పిస్తే సకాలంలో రుణాన్ని మంజూరు చేసే అవకాశాలు మెరుగుపడతాయి.

→ **వేల్యుయేషన్‌పై అవగాహన ఉండాలి:** రుణ ప్రొఫైల్స్‌ను మదింపు చేసేందుకు విద్యార్థి–కేంద్రీకృత విధానాన్ని కొత్త తరం ఎన్‌బీఎఫ్‌సీలు అమలు చేస్తున్నాయి. సహ–రుణగ్రహీత ఆర్థిక నేపథ్యంపైనే ఆధారపడకుండా విద్యార్థి అకడమిక్ పనితీరు, ప్రవేశ పరీక్ష స్కోర్లు, ఎంచుకున్న కోర్సు .. యూనివర్సిటీ, భవిష్యత్తు ఉపాధి అవకాశాలు తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుంటాయి.

→ **వీలైనంత ముందుగా దరఖాస్తు చేసుకోవాలి:** ముందస్తు అప్రూవల్ ప్రక్రియను పూర్తి చేయడానికి, పత్రాలు తనిఖీ చేయడానికి, రుణాన్ని ఖరారు చేయడానికి ఆర్థిక సంస్థకు కొంత సమయం అవసరవుతుంది. సంస్థను బట్టి అప్రూవల్ ప్రక్రియ వివిధ రకాలుగా ఉంటుంది కాబట్టి వీలైనంత ముందుగా దరఖాస్తు చేసుకుంటే నిర్దీత సమయానికి రుణం మంజూరయ్యేలా చూసుకోవడానికి వీలవుతుంది.

→ **స్మార్ట్ రీపేమెంట్ వ్యూహం ప్లాన్ చేసుకోవాలి:** లోన్ తీసుకున్న తర్వాత నుంచి వడ్డీని కొంత కొంతగా కట్టుకుంటూ వెళ్లడం మంచిది. ఎందుకంటే గ్రేస్ పీరియడ్ ఉన్నప్పటికీ ఆ వ్యవధిలో వడ్డీ పడకుండా ఉండదు. ముందు నుంచి చెల్లించడం ప్రారంభిస్తే విద్యార్థులు ఆర్థికంగా మెరుగైన అలవాట్లను పెంపొందించుకోవడానికి ఉపయోగకరంగా ఉంటుంది.

డెట్ ఫండ్స్‌లోకి రూ.1.57 లక్షల కోట్లు

- సగానికి పైగా లిక్విడ్ ఫండ్స్‌లోకే
- ఆ తర్వాత ఓవర్‌నైట్ ఫండ్స్‌కు డిమాండ్

న్యూఢిల్లీ: డెట్ మ్యూచువల్ ఫండ్స్‌కు అక్టోబర్‌లో డిమాండ్ ఏర్పడింది. ఏకంగా రూ.1.57 లక్షల కోట్లను డెట్ ఫండ్స్ ఆకర్షించాయి. సెప్టెంబర్ నెలలో ఇదే విభాగం నుంచి రూ.1.14 లక్షల కోట్లు బయటకు వెళ్లిపోగా, మరుసటి నెలలోనే పరిస్థితుల్లో పూర్తి మార్పు కనిపించింది. ముఖ్యంగా డెట్‌లో మొత్తం 16 కేటగిరీలకు గాను 14 విభాగాల్లోకి నికరంగా పెట్టుబడులు వచ్చాయి. దీంతో డెట్ ఫండ్స్ నిర్వహణలోని మొత్తం ఆస్తులు (ఏయూఎం) 11 శాతం వృద్ధితో అక్టోబర్ చివరికి రూ.16.64 లక్షల కోట్లకు పెరిగాయి. సెప్టెంబర్ చివరికి ఇవి రూ.14.97 లక్షల కోట్లుగా ఉన్నట్టు మ్యూచువల్ ఫండ్స్ సంస్థల అసోసియేషన్ (యాంఫి) గణాంకాలు వెల్లడిస్తున్నాయి.

స్వల్పకాల ఫండ్స్‌కు ఆదరణ

→ లిక్విడ్ ఫండ్స్ అత్యధికంగా 83,863 కోట్లను రాబట్టాయి. అక్టోబర్ నెలలో మొత్తం డెట్ పెట్టుబడుల్లో సగం లిక్విడ్ ఫండ్స్‌లోకే వచ్చాయి.

→ ఓవర్‌నైట్ ఫండ్స్ రూ.25,784 కోట్లు, మనీ మార్కెట్ ఫండ్స్ రూ.25,303 కోట్ల చొప్పున ఆకర్షించాయి.

→ అల్ట్రా షార్ట్ డ్యురేషన్ (12 నెలల్లోపు) ఫండ్స్‌లోకి రూ.7,054 కోట్లు వచ్చాయి.

→ లో డ్యురేషన్ ఫండ్స్ రూ.5,600 కోట్లు, కార్పొరేట్ బాండ్ ఫండ్స్ రూ.4,644 కోట్లు, షార్ట్ డ్యురేషన్ ఫండ్స్ రూ.1,362 కోట్ల చొప్పున ఆకర్షించాయి. ప్రధానంగా తక్కువ కాలానికి ఉద్దేశించిన డెట్ ఫండ్స్‌కు ఆదరణ లభించింది.

→ నాలుగు నెలల విరామం తర్వాత బ్యాంకింగ్ అండ్ పీఎస్‌యూ ఫండ్స్‌లోకి అత్యధికంగా రూ.936 కోట్ల పెట్టుబడులు వచ్చాయి.

→ గిల్ట్ ఫండ్స్ రూ.1,375 కోట్లు, లాంగ్ డ్యురేషన్ బాండ్ ఫండ్స్ రూ.1,177 కోట్ల చొప్పున ఆకర్షించాయి.



ట్యాక్స్ ప్లానింగ్.. సరిగమపదని..




కె.సీహెచ్. ఎ.వి.ఎస్.ఎన్ మూర్తి
కె.వి.ఎన్ లావణ్య
ట్యాక్సేషన్ నిపుణులు

'హమ్మయ్య' అని ఊపిరి పీల్చుకోండి. 'ఎగవేత' భూతం 'కబంధ' హస్తాల నుంచి బైటపడ్డాం. ఇప్పుడు ట్యాక్స్ ప్లానింగ్ మీద దృష్టి సారించి, ప్లానింగ్ రాగాల్లో స,రి,గ,మ,ప,ద,ని తెలుసుకుందాం.

గత దశాబ్దంగా మనం వింటున్న పదం.. జనాలు నలుగురు మెచ్చిన పదం 'మేనేజ్‌మెంట్'.. కేవలం కంపెనీలు, కార్పొరేట్లు, వ్యాపారం, వాణిజ్య రంగాల్లోనే కాకుండా అన్ని రంగాల్లో 'మేనేజ్‌మెంట్' కంపల్సరీ. సంస్థలతో బాటు వ్యక్తులకు, మనందరికీ వర్తించేది 'మేనేజ్‌మెంట్'. ట్యాక్స్‌ని మేనేజ్ చేయాలి. ట్యాక్స్ మేనేజ్‌మెంట్‌లో ముఖ్యమైన ప్రాథమిక అంశం, కీలకాంశం 'ట్యాక్స్ ప్లానింగ్'. ఇది క్రియాశీలక చర్య .. చర్చ!

చట్టరీత్యా, రాచమార్గంలో పన్నుభారాన్ని తగ్గించే మార్గం. అవసరం అయినంత, అర్హత ఉన్నంత .. అన్ని ప్రయోజనాలు, తగ్గింపులు, మినహాయింపులు పొంది, ఆదాయాన్ని తగ్గించుకోవడం లేదా పెద్ద శ్లాబు నుంచి తక్కువ/చిన్న శ్లాబుకి తెచ్చుకోవడం, 30 శాతం నుంచి 20 శాతానికి, 20 శాతం నుంచి 10 శాతానికి, ఇంకా 10 శాతం నుంచి సున్నా శాతానికి తగ్గించుకోవడం.

→ ట్యాక్స్ ప్లానింగ్ మూడు రకాలుగా ఉంటుంది. స్వల్పకాలికం.. అంటే ఆ సంవత్సరానికి పన్ను తగ్గించుకోవడం. దీర్ఘకాలికం.. అంటే భవిష్యత్‌లో పన్నుని తగ్గించుకోవడం. మూడోది, విరాళాల ద్వారా తగ్గించుకోవడం.

→ **పన్ను తగ్గించుకోవడం:** స్వల్పకాలికంగా గానీ దీర్ఘకాలికంగా గానీ పన్నులను తగ్గించుకోవడం.

→ **పోస్ట్‌పోన్ చేసుకోవడం:** ఈ విధంగా ఎప్పుడు చేసుకోవచ్చంటే.. బడ్జెట్‌కు ముందు.. ముఖ్యంగా క్యాపిటల్ గెయిన్స్ విషయంలో మార్చి 31 లోపల లేదా ఏప్రిల్ 1 తర్వాత.. స్థిరాస్తుల క్రయ విక్రయాలు ఇలా పోస్ట్‌పోన్ చేసుకోవచ్చు.

→ **పన్ను భారాన్ని విభజించుట:** ఒకే మనిషి మీద ఎక్కువ ట్యాక్స్ పడే పరిస్థితుల్లో ఆదాయాన్ని చట్టప్రకారం అగ్రిమెంట్ల ద్వారా ఆదాయాన్ని విభజించడం. ఉదాహరణకు ఆలుమగలు వారి పేరు మీద ఫిక్స్‌డ్ డిపాజిట్లను మార్చి వడ్డీ సర్దుబాటు చేసుకోవచ్చు.

→ **తప్పించుకోవడం:** సుప్రీంకోర్టు జడ్జిమెంటు ప్రకారం తప్పించుకోవడాన్ని చట్టరీత్యా కూడా చేయొచ్చు. చట్టంలోని లొసుగుల్లోని అంశాలకు లోబడి పన్ను తప్పించుకోవచ్చు. ఉదాహరణకు భార్యా, భర్త ఇద్దరికీ పన్నుభారం వర్తిస్తుంది. వారికి ముగ్గురు పిల్లలు. ముగ్గురికీ స్కూల్ ఫీజులు కడుతున్నారు. అలాంటప్పుడు ఇద్దరి స్కూల్ ఫీజును ఒకరి కేసులో, మిగతా పిల్లల ఫీజును మరొక కేసులో క్లెయిం చేయొచ్చు.

→ ఒకరకంగా కాకుండా మరో విధంగా కట్టడాన్ని ఇంగ్లీషులో disguise taxation అని అంటారు. మారువేషం కాదు. మరో వేషంలాంటిది. అంటే, చేసే వ్యాపారం భాగస్వామ్యం లేదా కంపెనీలాగా చేస్తే 30 శాతం పన్ను పడుతుంది. అలా కాకుండా సొంత వ్యాపారంగా చేస్తే శ్లాబుల వారీగా 10 శాతం, 20 శాతం, 30 శాతం చొప్పున కట్టొచ్చు. బేసిక్ లిమిట్ కూడా వర్తిస్తుంది.

→ **సంపూర్తిగా ఆలోచించాలి:** పాటల ట్యూనింగ్‌లాగే ట్యాక్స్ ప్లానింగ్ కూడా ఉంటుంది. గీత రచనను బట్టి స్వర రచన. ఏదైనా ఏడు స్వరాల్లో ఇమడాలి. పూర్తి సమాచారం ఉండాలి. చట్టాన్ని అతిక్రమించకూడదు. పన్ను భారం తగ్గాలి, చట్టప్రకారం జరగాలి.

పన్నుకు సంబంధించిన సందేహాలు ఏవైనా ఉంటే పాఠకులు business@sakshi.comకు ఈ-మెయిల్ పంపించగలరు.

రిస్క్ తక్కువ.. రాబడులు స్థిరం

యూటీఐ ఫ్లెక్సీక్యాప్ ఫండ్

రిస్క్ పెద్దగా భరించలేని వారు, అదే సమయంలో ఈక్విటీ ఫండ్స్‌లోనే ఇన్వెస్ట్ చేయాలని భావించే వారు యూటీఐ ఫ్లెక్సీక్యాప్ ఫండ్‌ను పరిశీలించొచ్చు. దీర్ఘకాలంలో రాబడుల చరిత్ర స్థిరంగా ఉంది. గతంలో యూటీఐ ఈక్విటీ ఫండ్‌గా కొనసాగిన ఈ పథకం, 2017 అక్టోబర్‌లో సెబీ తీసుకొచ్చిన పునర్వ్యవస్థీకరణ నిబంధనల అనంతరం ఫ్లెక్సీక్యాప్‌గా మారింది. ఫ్లెక్సీక్యాప్ ఫండ్స్ స్మాల్‌క్యాప్, మిడ్‌క్యాప్, లార్జ్‌క్యాప్ విభాగాల్లో స్వేచ్ఛగా ఇన్వెస్ట్ చేయగలవు. మెరుగైన అవకాశాలున్న చోట ఎక్కువ పెట్టుబడులు పెట్టేందుకు నిబంధనల పరంగా వెసులుబాటు ఉంటుంది. రిస్క్–రాబడుల సమతుల్యానికి ఈ ఫండ్స్ అనుకూలంగా ఉంటాయి.



దీర్ఘకాలంలో మెరుగైన రాబడులు

ఈ పథకం 2008, 2011, 2020 కరెక్షన్ సమయాల్లో నష్టాలను పరిమితం చేయడాన్ని గమనించొచ్చు. ఐదేళ్లు, ఏడేళ్లు, పదేళ్ల కాలంలో చూస్తే సగటున మెరుగైన రాబడులు ఉన్నాయి. ఈ పథకం రాబడులకు ఎస్అండ్‌పీ నిఫ్టీ 500 సూచీ ప్రామాణికం. ఏడాది కాలంలో ఈ పథకం 24 శాతం మేర రాబడులు అందించింది. ఐదేళ్ల కాలంలో సగటున వార్షికంగా 16.47 శాతం రాబడులు ఇచ్చింది. ఏడేళ్ల కాలంలో ఏటా 14 శాతం, పదేళ్ల కాలంలో ఏటా 12.50 శాతం చొప్పున పెట్టుబడులపై ప్రతిఫలాన్ని అందించింది. పోటీ పథకాలతో పోల్చితే రాబడులు కొంత తక్కువగా కనిపించినప్పటికీ.. కరెక్షన్ సమయాల్లో నష్టాలను పరిమితం చేయడంలో ఈ పథకం మెరుగైన పనితీరు చూపిస్తోంది. రాబడుల చరిత్ర గొప్పగా లేకున్నా, దీర్ఘకాలానికి మెరుగ్గా ఉంది. స్థిరంగా తక్కువ ఆటుపోట్లతో ఉన్నందున రిస్క్ తక్కువ కోరుకునే వారికి మంచి ఎంపిక అవుతుంది. ముఖ్యంగా సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ (సిప్) రూపంలో ఇన్వెస్ట్ చేసుకుంటే మరింత మెరుగైన రాబడులు అందుకోవచ్చు.



పెట్టుబడుల విధానం/ పోర్ట్‌ఫోలియో

ఈ పథకం నిర్వహణలో ప్రస్తుతానికి రూ.27,706 కోట్ల పెట్టుబడులు (నిర్వహణ ఆస్తులు/ఏయూఎం) ఉన్నాయి. దీర్ఘకాల చరిత్ర ఉండడంతో పెద్ద పథకాల్లో ఒకటి కావడం గమనార్హం. నిర్వహణ ఆస్తుల్లో 96 శాతం మేర ఈక్విటీల్లో ఇన్వెస్ట్ చేయగా, 0.52 శాతం మేర డెట్ సాధనాల్లో పెట్టుబడులు పెట్టింది. 3.45 శాతం మేర నగదు నిల్వలు కలిగి ఉంది. ప్రస్తుత మార్కెట్ దిద్దుబాటులో ఆకర్షణీయ అవకాశాలకు వీలుగా నగదు నిల్వలు కలిగి ఉన్నట్టు అర్థమవుతోంది. ఈక్విటీ పెట్టుబడులు గమనించగా, 70 శాతం వరకు లార్జ్‌క్యాప్‌లో ఉంటే, మిడ్‌క్యాప్‌లో 28 శాతం, స్మాల్‌క్యాప్‌లో 2 శాతం వరకు పెట్టుబడులు పెట్టింది. టాప్–10 స్టాక్స్‌లోనే 42 శాతం మేర పెట్టుబడులు ఉన్నాయి. పెట్టుబడులను గమనించినట్టయితే.. బ్యాంకింగ్ అండ్ ఫైనాన్షియల్ రంగానికి ఎక్కువ వెయిటేజీ ఇస్తూ, 22 శాతం పెట్టుబడులను ఈ రంగాలకు చెందిన కంపెనీల్లోనే ఇన్వెస్ట్ చేసింది. ఆ తర్వాత టెక్నాలజీ కంపెనీలకు 22 శాతం, కన్జ్యూమర్ డిస్క్రిషనరీ రంగానికి 18 శాతం, హెల్త్‌కేర్ కంపెనీలకు 12 శాతం చొప్పున పెట్టుబడులు కేటాయించింది.

టాప్ ఈక్విటీ హోల్డింగ్స్

కంపెనీ	పెట్టుబడులు శాతం
ఐసీఐసీఐ బ్యాంక్	5.85
హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్	5.79
బజాజ్ ఫైనాన్స్	4.91
ఎల్ఐటీ మైండ్‌ట్రీ	4.46
అవెన్యూ సూపర్‌మార్ట్స్	3.79
ఇన్ఫోసిస్	3.62
జొమాటో	3.60
ఇన్ఫోఎడ్జ్	3.53
కోటక్ బ్యాంక్	3.35
ట్రెంట్	3.08

అశ్విన్‌తో ఢీకి రెడీ!

పట్టు బిగించకుండా చూస్తాను

ఆసీస్ బ్యాటర్ స్టీవ్ స్మిత్ వ్యాఖ్య



మెల్‌బోర్న్: భారత వెటరన్ స్పిన్నర్ అశ్విన్ బౌలింగ్‌లో జాగ్రత్తగా ఆడాల్సి ఉంటుందని, ఈసారి అతడు మ్యాచ్‌పై పట్టు బిగించకుండా చేస్తానని ఆ్రస్టేలియన్ స్టార్ బ్యాటర్ స్టీవ్ స్మిత్ అన్నాడు. కంగారూ గడ్డపై అశ్విన్‌కు మంచి రికార్డు లేదు. స్వదేశంలో 21.57 సగటు నమోదు చేస్తే ఆసీస్‌లో అది 42.15 మాత్రమే. అయితే గత రెండు బోర్డర్–గావస్కర్ సిరీస్‌లలో ఫామ్‌లో ఉన్న స్మిత్‌ను అదే పనిగా అవుట్ చేసి పైచేయి సాధించాడు. ఈ రెండు సిరీస్‌లలో అశ్విన్ అతన్ని క్రీజులో పాతుకుపోనీయకుండా ఐదుసార్లు పెవిలియన్ చేర్చాడు. దీనిపై ఆసీస్ పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో స్మిత్ మాట్లాడుతూ 'ఈసారి అలా జరగకుండా చూసుకోవాలి. అయితే అశ్విన్ మాత్రం ఉత్తమ స్పిన్నర్. తప్పకుండా తన ప్రణాళికలు తనకు ఉంటాయి. గతంలో అతని ఎత్తుగడలకు బలయ్యాను. నాపై అతనే ఆధిపత్యం కనబరిచాడు. ఇప్పుడలా జరగకుండా చూసుకోవాలంటే ఆరంభంలోనే అతను పట్టు బిగించకుండా దీటుగా ఎదుర్కోవాలి' అని అన్నాడు. గత కొన్నేళ్లుగా తమ ఇద్దరి మధ్య ఆసక్తికర సమరమే జరుగుతోందన్నాడు. ఒకరు పైచేయి సాధిస్తే, మరొకరు డీలా పడటం జరుగుతుందని... ఐదు టెస్టుల్లో పది ఇన్నింగ్స్‌ల్లో ఇప్పుడు ఎవరూ ఆధిపత్యం కనబరుస్తారో చూడాలని స్మిత్ తెలిపాడు. అతన్ని బ్యాట్‌తో పాటు మానసికంగానూ దెబ్బ కొట్టాలంటే ఆరంభంలోనే మంచి షాట్లతో ఎదురుదాడికి దిగాలని చెప్పాడు. 35 ఏళ్ల స్మిత్ టెస్టుల్లో 10 వేల పరుగుల మైలురాయికి 315 పరుగుల దూరంలో ఉన్నాడు. త్వరలో జరిగే ఐదు టెస్టుల బోర్డర్–గావస్కర్ ట్రోఫీలో అతను తనకెంతో ఇష్టమైన, అచ్చొచ్చిన నాలుగో స్థానంలో బ్యాటింగ్ చేయనున్నాడు. ఇటీవలి కాలంలో స్మిత్ తరచూ ఓపెనర్‌గా బరిలోకి దిగి పూర్తిగా విఫలమయ్యాడు.

కోహ్లిపై ఒత్తిడి పెంచండి!

ఆసీస్ బౌలర్లకు మెక్‌గ్రాత్ సూచన





మెల్‌బోర్న్: ఆస్ట్రేలియా గడ్డపై విరాట్ కోహ్లి ఆధిపత్యం గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. అక్కడ ఆడిన 13 టెస్టుల్లో ఏకంగా 54.08 సగటుతో 1352 పరుగులు చేసిన కోహ్లి ఖాతాలో 6 సెంచరీలు ఉన్నాయి. కెప్టెన్‌గా 2018–19లో తొలిసారి భారత జట్టుకు ఆ్రస్టేలియా గడ్డపై సిరీస్ అందించిన ఘనత అతని సొంతం. అందుకే ఇటీవల కోహ్లి గొప్ప ఫామ్‌లో లేకపోయినా...ఆసీస్ దృష్టిలో అతనే ప్రధాన బ్యాటర్. కోహ్లిని నిలువరిస్తే భారత్‌ను అడ్డుకున్నట్లే అని అక్కడి మాజీ ఆటగాళ్లకూ తెలుసు. అందుకే కోహ్లిపై ఒత్తిడి పెంచాలని, అతడి భావోద్వేగాలతో ఆడుకోవాలని దిగ్గజ పేసర్ గ్లెన్ మెక్‌గ్రాత్ తమ బౌలర్లకు చెబుతున్నాడు. ఇటీవల స్వదేశంలో న్యూజిలాండ్ చేతిలో చిత్తయిన విషయం వారి మనసుల్లో ఇంకా ఉంటుందని...దానిని కొనసాగించాలని అతను అన్నాడు. 'ఒక జట్టు సొంతగడ్డపై 0–3తో ఓడి వస్తుందంటే కచ్చితంగా మనమే పైచేయి సాధించేందుకు అవకాశం ఉంటుంది. కాబట్టి భారత్‌పై ఒత్తిడి కొనసాగించాలి. వారు సిద్ధంగా ఉన్నారో లేదో తెలుస్తుంది. ముఖ్యంగా విరాట్ కోహ్లిపై కూడా ఇదే పద్ధతిని అనుసరించాలి' అని మెక్‌గ్రాత్ చెప్పాడు. అయితే కొన్ని సార్లు ఇలా రెచ్చగొడితే కోహ్లి మరింత దూకుడుగా చెలరేగిపోయే ప్రమాదం కూడా ఉంటుందని ఆసీస్ మాజీ పేసర్ చిన్న హెచ్చరిక కూడా జారీ చేశాడు. 'కోహ్లిని లక్ష్యంగా చేసుకొని ఆ్రస్టేలియా బౌలర్లు పదేపదే తలపడితే అతనూ సిద్ధమైపోతాడు. అది అతడి అత్యుత్తమ ఆటను కూడా బయటకు తీయవచ్చు. సిరీస్ ఆరంభంలోనే తక్కువ స్కోర్లకు కట్టడి చేయగలిగితే కోహ్లి కూడా కోలుకోవడం కష్టమవుతుంది. నా దృష్టిలో కోహ్లితో భావోద్వేగాలపాలు ఎక్కువ. బాగా ఆడటం మొదలు పెడితే అస్సలు ఆగిపోడు. ఒకవేళ విఫలమైతే మాత్రం అదే కొనసాగుతుంది' అని మెక్‌గ్రాత్ అభిప్రాయ పడ్డాడు.



సురేఖ పసిడి గురి

న్యూఢిల్లీ: భారత స్టార్ కాంపౌండ్ ఆర్చర్ వెన్నం జ్యోతి సురేఖ వరల్డ్ ఇండోర్ ఆర్చరీ సిరీస్ టోర్నమెంట్‌లో స్వర్ణం సాధించింది. లగ్జంబర్గ్ వేదికగా ఆదివారం జరిగిన టోర్నీ ఫైనల్లో జ్యోతి సురేఖ 147–145 పాయింట్ల తేడాతో ప్రీల్స్ సారా (బెల్జియం)పై విజయం సాధించింది. అంతకుముందు సెమీఫైనల్లో జ్యోతి సురేఖ షూట్ ఆఫ్‌లో సత్తాచాటి ఫైనల్‌కు అర్హత సాధించింది. ఐదో సీడ్‌గా బరిలోకి దిగిన జ్యోతి సురేఖ క్వాలిఫయింగ్ రౌండ్‌లో 593 పాయిట్లు సాధించింది. పురుషుల విభాగంలో అభిషేక్ వర్మ రజత పతకం సాధించాడు. క్వాలిఫయింగ్ రౌండ్‌లో 600 పాయింట్లకు గానూ 600 సాధించి అంతర్జాతీయ సర్క్యూట్‌లో ఈ ఘనత సాధించిన తొలి భారత ఆర్చర్‌గా రికార్డుల్లోకి ఎక్కిన అభిషేక్... త్రుటిలో స్వర్ణం చేజార్చుకున్నాడు. టాప్ సీడ్‌గా బరిలోకి దిగిన అభిషేక్ ఫైనల్లో షూట్‌ఆఫ్‌లో ఓడి రజతం కైవసం చేసుకున్నాడు. తుదిపోరులో నెదర్లాండ్స్ ఆర్చర్ మైక్ స్లోక్సెర్‌తో సమంగా అభిషేక్ 150 పాయింట్లు సాధించగా... విజేతను నిర్ణయించేందుకు నిర్వహించిన పోటీల్లోనూ ఇరువురు ఆర్చర్లు పర్ఫెక్ట్ 10 సాధించారు. అయితే నెదర్లాండ్స్ ఆర్చర్ బాణం సెంటర్ పాయింట్‌కు మరింత చేరువగా ఉండటంతో అతడిని విజేతగా ప్రకటించారు.

చాంపియన్ రుత్విక–రోహన్

ఇండియా ఇంటర్నేషనల్ చాలెంజ్ బ్యాడ్మింటన్ టోర్నీ టైటిల్ కైవసం

రాయ్‌పూర్: సీఎం ట్రోఫీ ఇండియా ఇంటర్నేషనల్ చాలెంజ్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో తెలంగాణ అమ్మాయి గద్దె రుత్విక శివాని టైటిల్ గెలిచింది. ఛత్తీస్‌గఢ్ రాయ్‌పూర్ వేదికగా జరిగిన ఈ టోర్నీలో రుత్విక శివాని–రోహన్ కపూర్ జంట అదరగొట్టింది. ఐదు విభాగాల్లోనూ (మహిళల సింగిల్స్, డబుల్స్, పురుషుల సింగిల్స్, డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్) భారత క్రీడాకారులకే విన్నర్స్, రన్నరప్ ట్రోఫీలో దక్కడం విశేషం. గత వారం హైదరాబాద్ వేదికగా జరిగిన ఎస్‌ఎండీసీ తెలంగాణ ఇంటర్నేషనల్ చాలెంజ్ టోర్నీలోనూ ఐదు విభాగాల్లో భారత ఆటగాళ్లకే విన్నర్స్, రన్నరప్ ట్రోఫీలు లభించాయి. తెలంగాణ ఇంటర్నేషనల్ చాలెంజ్ టోర్నీ మిక్స్‌డ్ డబుల్స్ చాంపియన్స్‌గా నిలిచిన రుత్విక శివాని–రోహన్ కపూర్ జంట... తాజా టోర్నీ ఫైనల్లో ఆదివారం 21–16, 19–21, 21–12తో టాప్ సీడ్ అమృత ప్రముథేశ్–అశిత్ సూర్య ద్వయంపై విజయం సాధించింది. మహిళల సింగిల్స్ టైటిల్ రక్షిత శ్రీ సంతోష్ రామ్‌రాజ్ కైవసం చేసుకుంది. తుదిపోరులో రక్షిత 17–21, 21–12, 21–12తో క్వాలిఫయర్ తన్వి పత్రిపై గెలుపొందింది. తొలి గేమ్ కోల్పోయిన రక్షిత ఆ తర్వాత చక్కటి ఆటతీరుతో విజృంభించి వరుసగా రెండు గేమ్‌లు గెలిచి విజేతగా నిలిచింది. గత వారం హైదరాబాద్‌లో జరిగిన టోర్నీలో రన్నరప్‌గా నిలిచిన రక్షిత ఈ సారి టైటిల్ చేజిక్కించుకుంటే... 13 ఏళ్ల తన్వి పత్రి ఆడిన తొలి సీనియర్ ఇంటర్నేషనల్ టోర్నమెంట్‌లో రన్నరప్ టైటిల్ గెలుచుకోవడం విశేషం. పురుషుల సింగిల్స్ విభాగంలో రెండో సీడ్ మిథున్ మంజునాథ్ టైటిల్ హస్తగతం చేసుకున్నాడు. ఫైనల్లో మిథున్ 13–5తో ఆధిక్యంలో ఉన్న సమయంలో రాహుల్ భరద్వాజ్ గాయంతో తప్పుకున్నాడు. పురుషుల డబుల్స్ ఫైనల్లో హరిహరణ్ అంసాకరుణన్–రూబన్ కుమార్ జంట 21–15–21–16తో డింకూ సింగ్–అమాన్ మొహమ్మద్ ద్వయంపై గెలుపొందింది. మహిళల డబుల్స్ ఫైనల్లో ఆరతి సారా సునీల్–వర్షిణి విశ్వనాథ్ శ్రీ జోడీ 21–18, 21–19తో కావ్య గుప్తా–రాధిక శర్మ జంటపై గెలుపొందింది.



ముంబై సారథిగా శ్రేయస్

ముస్తాక్ అలీ ట్రోఫీకి జట్టు ఎంపిక

ముంబై: దేశవాళీ టి20 టోర్నమెంట్ సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో ముంబై జట్టుకు శ్రేయస్ అయ్యర్ సారథ్యం వహించనున్నాడు. ఈ నెల 23 నుంచి డిసెంబర్ 15 వరకు జరగనున్న ఈ ట్రోఫీ కోసం ముంబై క్రికెట్ సంఘం ఆదివారం 17 మందితో కూడిన జట్టును ప్రకటించింది. రంజీ ట్రోఫీలో ముంబై జట్టుకు సారథ్యం వహించిన అజింక్యా రహానేతో పాటు... ఫిట్‌నెస్ లేమితో పాటు క్రమశిక్షణ రాహిత్యానికి పాల్పడి రంజీ జట్టులో చోటు కోల్పోయిన ఓపెనర్ పృథ్వీ షా కూడా ముస్తాక్ అలీ ట్రోఫీ జట్టులో చోటు దక్కించుకున్నారు. భారత టెస్టు జట్టులో సుస్థిర స్థానం సాధించాలనుకుంటున్న శ్రేయస్ అయ్యర్ ప్రస్తుత రంజీ ట్రోఫీలో చక్కటి ప్రదర్శన కనబరుస్తున్నాడు. తాజా సీజన్‌లో అయ్యర్ 90.40 సగటుతో 452 పరుగులు సాధించాడు. అందులో ఒక డబుల్ సెంచరీ, మరో సెంచరీ ఉంది. ఇక ఇటీవల ఆ్రస్టేలియా–'ఎ' జట్టుతో అనధికారిక టెస్టులో భారత 'ఎ' జట్టుకు ప్రాతినిధ్యం వహించిన తనుశ్ కోటియాన్, పేస్ ఆల్‌రౌండర్ శార్దుల్ ఠాకూర్, సిద్ధేశ్ లాడ్, యువ ఓపెనర్ అంగ్‌క్రిష్ రఘువంశీ ముంబై జట్టులో చోటు దక్కించుకున్నారు.



ముంబై జట్టు: శ్రేయస్ అయ్యర్ (కెప్టెన్), పృథ్వీ షా, అంగ్‌క్రిష్ రఘువంశీ, జయ్ బిస్తా, అజింక్యా రహానే, సిద్ధేశ్ లాడ్, సూర్యాన్ష్ షెడ్గె, సాయిరాజ్ పాటిల్, హార్దిక్ తమోర్, ఆకాశ్ ఆనంద్, షమ్స్ ములానీ, హిమాన్షు సింగ్, తనుశ్ కోటియాన్, శార్దుల్ ఠాకూర్, మోహిత్ అవస్థి, రోస్టన్ డియాస్, జునేద్ ఖాన్.

లూయిస్, హోప్ మెరుపులు

ఇంగ్లండ్‌తో నాలుగో టి20లో 5 వికెట్లతో వెస్టిండీస్ విజయం

సెయింట్ లూసియా: సొంతగడ్డపై పేలవ ప్రదర్శనతో ఇంగ్లండ్ చేతిలో ఇప్పటికే టి20 సిరీస్ కోల్పోయిన వెస్టిండీస్ జట్టు నాలుగో మ్యాచ్‌లో విజయం సాధించింది. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా జరిగిన ఈ పోరులో విండీస్ 5 వికెట్ల తేడాతో ఇంగ్లండ్‌ను చిత్తుచేసింది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్ 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 218 పరుగులు చేసింది. జాకబ్ బెథెల్ (32 బంతుల్లో 62 నాటౌట్; 4 ఫోర్లు, 5 సిక్సర్లు), ఫిల్ సాల్ట్ (35 బంతుల్లో 55; 5 ఫోర్లు, 4 సిక్సర్లు) అర్ధ శతకాలతో మెరవగా... కెప్టెన్ జోస్ బట్లర్ (38; 2 ఫోర్లు, 3 సిక్సర్లు), విల్ జాక్స్ (25; ఒక ఫోర్, 2 సిక్సర్లు), సామ్ కరన్ (24; 2 సిక్సర్లు) రాణించారు. విండీస్ బౌలర్లలో గుడాకెశ్ మోతి రెండు వికెట్లు పడగొట్టాడు. అనంతరం లక్ష్య ఛేదనకు దిగిన కరీబియన్ జట్టు... 19 ఓవర్లలో 5 వికెట్లకు 221 పరుగులు చేసి గెలిచింది. ఓపెనర్లు ఎవిన్ లూయిస్ (31 బంతుల్లో 68; 4 ఫోర్లు, 7 సిక్సర్లు), 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' షై హోప్ (24 బంతుల్లో 54; 7 ఫోర్లు, 3 సిక్సర్లు) హాఫ్ సెంచరీలతో విజృంభించారు. ఈ ఇద్దరు తొలి వికెట్‌కు 9 ఓవర్లలోనే 136 పరుగులు జోడించడంతో విండీస్‌కు శుభారంభం దక్కింది. అయితే పదో ఓవర్ తొలి రెండు బంతులకు లూయిస్, హోప్ ఔట్ కాగా... మూడో బంతికి వికెట్ కీపర్ నికోలస్ పూరన్ (0) కూడా వెనుదిరిగాడు. ఇందులో హోప్ రనౌట్‌గా వెనుదిరిగాడు. దీంతో కాస్త ఆందోళన నెలకొన్నా... కెప్టెన్ రావ్‌మన్ పావెల్ (38; 2 ఫోర్లు, 3 సిక్సర్లు), రూథర్‌ఫోర్డ్ (29 నాటౌట్; 3 సిక్సర్లు) ఆఖర్లో మెరుపులు మెరిపించడంతో విండీస్ విజయ తీరాలకు చేరింది. ఇంగ్లండ్ బౌలర్లలో రేహాన్ అహ్మద్ మూడు వికెట్లు పడగొట్టాడు. ఈ మ్యాచ్‌లో ఇరు జట్లు చెరో 16 సిక్సర్లు బాదడంతో మొత్తంగా మ్యాచ్‌లో 32 సిక్సర్లు నమోదయ్యాయి.



సిరీస్ శ్రీలంక సొంతం

రెండో వన్డేలో 3 వికెట్లతో కివీస్‌పై గెలుపు

పల్లెకెలె: న్యూజిలాండ్‌తో మూడు వన్డేల సిరీస్‌ను ఆతిథ్య శ్రీలంక మరో మ్యాచ్ మిగిలుండగానే 2–0తో వశం చేసుకుంది. ఆదివారం జరిగిన రెండో వన్డేలో లంక జట్టు 3 వికెట్ల తేడాతో కివీస్‌పై గెలిచింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన న్యూజిలాండ్ 45.1 ఓవర్లలో 209 పరుగులకే ఆలౌటైంది. మార్క్ చాప్‌మన్ (81 బంతుల్లో 76; 7 ఫోర్లు, 3 సిక్స్‌లు), మిచెల్ హే (62 బంతుల్లో 49; 4 ఫోర్లు) రాణించారు. వీరిద్దరు ఐదో వికెట్‌కు 75 పరుగులు జోడించారు. మిగతావారిలో విల్ యంగ్ (26) ఒక్కడే ఇరవై పైచిలుకు స్కోరు చేయగా, రాబిన్సన్ (4), హెన్రీ నికోల్స్ (8) నిరాశపరిచారు. గ్లెన్ ఫిలిప్స్ (15) ఎంతో సేపు నిలువలేదు. ఆతిథ్య బౌలర్లలో వాండర్సే, తీక్షణ చెరో 3 వికెట్లు తీయగా, అసిత ఫెర్నాండో 2 వికెట్లు పడగొట్టాడు. అనంతరం సులువైన లక్ష్యాన్ని ఛేదించేందుకు శ్రీలంక కష్టపడింది. చివరకు 46 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 210 పరుగులు చేసి గెలిచింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' కుశాల్ మెండిస్ (102 బంతుల్లో 74 నాటౌట్; 6 ఫోర్లు) అర్ధ సెంచరీ చేయగా... మిగతావారిలో ఓపెనర్ నిసాంక (28; 4 ఫోర్లు), అవిష్క ఫెర్నాండో (5), కమిందు (0), కెప్టెన్ అసలంక (13), సమరవిక్రమ (8) విఫలమవడంతో లంక 163 పరుగులకే 7 వికెట్లు కోల్పోయింది. 83 బంతుల్లో 47 పరుగులు చేయాల్సివుండగా... కుశాల్, మహీశ్ తీక్షణ (44 బంతుల్లో 27 నాటౌట్; 2 ఫోర్లు, 1 సిక్స్) అబేధ్యమైన ఎనిమిదో వికెట్‌కు అవసరమైన 47 పరుగులు జోడించి జట్టును గెలిపించారు. బ్రాస్‌వెల్ 4, సాంట్నర్, ఫిలిప్స్, స్మిత్ తలా ఒక వికెట్ తీశారు. మంగళవారం ఇదే వేదికపై ఆఖరి వన్డే జరుగనుంది.



కుశాల్ మెండిస్

హరియాణా పాంచ్ పటాకా

తమిళ్ తలైవాస్‌పై ఘనవిజయం

నోయిడా: ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్) 11వ సీజన్‌లో హరియాణా స్టీలర్స్ జట్టు జోరు కొనసాగుతోంది. ఎదురైన ప్రత్యర్థినల్లా చిత్తు చేసుకుంటూ ముందుకు సాగుతున్న హరియాణా స్టీలర్స్ లీగ్‌లో వరుసగా ఐదో మ్యాచ్‌లో విజయం సాధించింది. శనివారం జరిగిన పోరులో సంపూర్ణ ఆధిపత్యం కనబర్చిన హరియాణా స్టీలర్స్ 36–29 పాయింట్ల తేడాతో తమిళ్ తలైవాస్‌పై విజయం సాధించింది. స్టీలర్స్ తరఫున స్టార్ రైడర్ వినయ్ 10 పాయింట్లతో సత్తా చాటగా... డిఫెన్స్‌లో మొహమ్మద్ రెజా (8 పాయింట్లు) ఆకట్టుకున్నాడు. తమిళ్ తలైవాస్ తరఫున మొయిన్ 7 పాయింట్లతో పోరాడాడు. ఓవరాల్‌గా ఈ మ్యాచ్‌లో హరియాణా జట్టు 21 రెయిడ్ పాయింట్లు సాధించి ఆధిపత్యం చెలాయించగా... 12 రెయిడ్ పాయింట్లకే పరిమితమై తమిళ్ తలైవాస్ పరాజయం పాలైంది. ఆడిన పది మ్యాచ్‌ల్లో 8 విజయాలు, 2 పరాజయాలు సాధించిన హరియాణా స్టీలర్స్ 41 పాయింట్లు ఖాతాలో వేసుకొని పట్టికలో అగ్రస్థానాన్ని మరింత బలోపేతం చేసుకుంది. మరోవైపు 11 మ్యాచ్‌లాడి 4 విజయాలు, 6 పరాజయాలు ఒక 'టై'తో 28 పాయింట్లు సాధించిన తమిళ్ తలైవాస్ జట్టు పట్టికలో ఏడో స్థానంలో కొనసాగుతోంది.

పుణేరి పల్టన్‌పై జైపూర్ పింక్ పాంథర్స్ గెలుపు

మరో మ్యాచ్‌లో మాజీ చాంపియన్ జైపూర్ పింక్ పాంథర్స్ 30–28 పరుగుల తేడాతో పుణేరి పల్టన్‌పై గెలుపొందింది. జైపూర్ జట్టు తరఫున అర్జున్ దేశ్వాల్ 8 పాయింట్లు, అంకుశ్ 6 పాయింట్లతో రాణించారు. పుణేరి పల్టన్ తరఫున ఆకాశ్ షిండే 7 పాయింట్లతో పోరాడినా ఫలితం లేకపోయింది. మ్యాచ్ ఆరంభం నుంచి ఇరు జట్లు నువ్వా నేనా అన్నట్లు తలపడటంతో ఆధిక్యం చేతులు మారుతూ సాగిన పోరులో జైపూర్ జట్టు కీలక సమయంలో ఆధిక్యం చేజిక్కించుకుంది. ఓవరాల్‌గా మ్యాచ్‌లో ఇరు జట్లు చెరో 12 రెయిడ్ పాయింట్లు సాధించగా... ట్యాకెలింగ్‌లో జైపూర్ 14 పాయింట్లు, పుణేరి పల్టన్ 10 పాయింట్లు సాధించాయి. తాజా సీజన్‌లో 9 మ్యాచ్‌లాడిన జైపూర్ పింక్ పాంథర్స్ 5 విజయాలు, 3 పరాజయాలు, ఒక 'టై'తో 30 పాయింట్లు ఖాతాలో వేసుకొని పట్టికలో ఆరో స్థానంలో నిలిచింది. మరోవైపు 9 మ్యాచ్‌లాడిన పుణేరి పల్టన్ 5 విజయాలు, 2 ఓటములు, 2 'టై'లతో 33 పాయింట్లు సాధించి పట్టికలో మూడో స్థానంలో ఉంది. లీగ్‌లో భాగంగా సోమవారం జరగనున్న మ్యాచ్‌ల్లో తెలుగు టైటాన్స్‌తో హరియాణా స్టీలర్స్ (రాత్రి 8 గంటలకు), బెంగళూరు బుల్స్‌తో యూ ముంబా (రాత్రి 9 గంటలకు) తలపడతాయి.



కోచ్‌గా గిలెస్పీ కొనసాగుతాడు!

కరాచీ: పాకిస్తాన్ టెస్టు టీమ్ పదవినుంచి జాసన్ గిలెస్పీని తొలగిస్తున్నట్లుగా వచ్చిన వార్తలను పాక్ క్రికెట్ బోర్డు (పీసీబీ) తీవ్రంగా ఖండించింది. ఆ వార్తల్లో ఎలాంటి వాస్తవం లేదని, పూర్తిగా అర్థరహితమని స్పష్టం చేసింది. 'గిలెస్పీని తొలగిస్తున్నట్లు వచ్చిన వార్తలు అన్నీ అబద్ధం. గతంలోనే ప్రకటించిన విధంగా స్వదేశంలో దక్షిణాఫ్రికాతో జరిగే రెండు టెస్టు సిరీస్‌ల వరకు కూడా గిలెస్పీని కోచ్‌గా కొనసాగుతాడు' అని పీసీబీ పేర్కొంది. ప్రస్తుతం ఆ్రస్టేలియా గడ్డపై వన్డే, టి20 సిరీస్‌లు ఆడిన పాక్ జట్టుకు గిలెస్పీ తాత్కాలిక కోచ్‌గా కూడా వ్యవహరించాడు. అయితే ఈ రెండు ఫార్మాట్లలతో పాటు టెస్టుల్లో కూడా అతని స్థానంలో పాక్ మాజీ పేసర్, ప్రస్తుత సెలక్షన్ కమిటీ కన్వీనర్ ఆకిబ్ జావేద్‌ను కోచ్‌గా ఎంపిక చేస్తున్నట్లు వార్తలు వచ్చాయి. గిలెస్పీ కోచ్‌గా ఉన్న సమయంలో బంగ్లాదేశ్ చేతిలో 0–2తో ఓడిన పాక్...ఆ తర్వాత ఇంగ్లండ్‌పై 2–1తో విజయం సాధించింది. ఆసీస్ సిరీస్ తర్వాత పాక్ జట్టు నేరుగా జింబాబ్వేకు వెళుతుంది.

గాజాపై ఇజ్రాయెల్ భీకర దాడులు

వేర్వేరు ప్రాంతాల్లో 12 మంది మృతి



ఇజ్రాయెల్ దాడులతో లెబనాన్‌లో ధ్వంసమైన భవనాల నుంచి భారీగా వెలువడుతున్న పొగ

టెల్ అవీవ్: హమాస్ మిలిటెంట్ల భరతం పట్టడమే లక్ష్యంగా ఇజ్రాయెల్ సైన్యం గాజా స్ట్రిప్‌పై మరోసారి విరుచుకుపడింది. శనివారం అర్ధరాత్రి తర్వాత భీకర దాడులు చేసింది. పెద్ద సంఖ్యలో డ్రోన్లు, క్షిపణులు ప్రయోగించింది. ఈ దాడుల్లో కనీసం 12 మంది మరణించినట్లు పాలస్తీనా అధికార వర్గాలు ఆదివారం వెల్లడించాయి. సెంట్రల్ గాజాలో వేర్వేరు ప్రాంతాల్లో ఈ దాడులు జరిగినట్లు సమాచారం. 12 మృతదేహాలు అల్–అక్సా యుద్ధవీరుల ఆసుపత్రికి చేరుకున్నట్లు అధికారులు ధ్రువీకరించారు. ఇజ్రాయెల్–హమాస్ మధ్య గత ఏడాది అక్టోబర్ 7న యుద్ధం ప్రారంభమైన సంగతి తెలిసిందే. ఇజ్రాయెల్ దాడుల్లో ఇప్పటిదాకా 43,800 మందికిపైగా పాలస్తీనా పౌరులు ప్రాణాలు కోల్పోయారు. వీరిలో సగానికంటే ఎక్కువ మంది మహిళలు, చిన్నారులే ఉన్నారు. గాజా జనాభా 20.3 లక్షలు కాగా, వీరిలో 90 శాతం మంది తమ ఆవాసాలకు దూరమయ్యారు. రక్షణ శిబిరాల్లో తలదాచుకుంటున్నారు. 100 మందికిపైగా ఇజ్రాయెల్ బందీలు ఇంకా హమాస్ చెరలోనే ఉన్నారు. వీరిలో మూడొంతుల మంది ఇప్పటికే మరణించినట్లు ప్రచారం జరుగుతోంది.

హెజ్బొల్లా అధికార ప్రతినిధి మొహమ్మద్ అఫీఫ్ మృతి

లెబనాన్‌లో తిష్టవేసిన హెజ్బొల్లా మిలిటెంట్ గ్రూప్‌పై ఇజ్రాయెల్ సైన్యం దాడులు ఉధృతం చేస్తోంది. రాజధాని బీరూట్ దక్షిణ శివారు ప్రాంతంపై ఆదివారం తెల్లవారుజామున భీకర దాడులకు దిగింది. ఇజ్రాయెల్ యుద్ధ విమానాలు చక్కర్లు కొడుతున్న దృశ్యాలు కనిపించాయి. అంతకంటే ముందే ఈ ప్రాంతాన్ని విడిచివెళ్లిపోవాలంటూ స్థానికులను ఇజ్రాయెల్ సైన్యం హెచ్చరించింది. అయితే, దాడుల్లో ఎంత మంది మృతిచెందారన్నది తెలియరాలేదు. సెంట్రల్ బీరూట్‌లో అరబ్ సోషలిస్టు బాత్ పార్టీ భవనంపైనా ఇజ్రాయెల్ దాడికి పాల్పడింది. ఇటీవలి కాలంలో సెంట్రల్ బీరూట్‌లో దాడి జరగడం ఇదే తొలిసారి. ఈ ప్రాంతంలో నలుగురు మరణించారని, మరో నలుగురు గాయపడ్డారని స్థానిక మీడియా వెల్లడించింది. సెంట్రల్ బీరూట్‌లో ఇజ్రాయెల్ దాడుల్లో తమ ప్రధాన అధికార ప్రతినిధి మొహ మ్మద్ అఫీఫ్ మృతిచెందినట్లు హెజ్బొల్లా గ్రూప్ వెల్లడించింది. ఇదిలా ఉండగా, లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడుల్లో ఇప్పటివరకు 3,400 మందికిపై మరణించినట్లు లెబనాన్ ఆరోగ్య శాఖ ప్రకటించింది. ఇక ఇజ్రాయెల్‌పై హెజ్బొల్లా దాడుల్లో కనీసం 76 మంది మృతిచెందారు. వీరిలో 31 మంది ఇజ్రాయెల్ సైనికులు ఉన్నారు. ఇజ్రాయెల్–లెబనాన్ మధ్య కాల్పు ల విరమణ కోసం అమెరికా ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. అమెరికా తీసుకొచ్చిన కాల్పుల విరమణ ప్రతిపాదనను పరిశీలిస్తున్నామని లెబనాన్ పేర్కొంది. అయినప్పటికీ ఇజ్రాయెల్, హెజ్బొల్లా మధ్య దాడులు, ప్రతి దాడులు మాత్రం ఆగడం లేదు.

ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూ ఇంటిపై బాంబు దాడి

ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహు ఇంటిపై బాంబు దాడి జరగడం సంచలనాత్మకంగా మారింది. ఇజ్రాయెల్ తీర ప్రాంత నగరమైన సుజేరియాలో నెతన్యాహూ ప్రైవేట్ నివాసంపై శనివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు బాంబుల్లాంటివి విసిరారు. రెండు బాంబులు విసిరినట్లు సమాచారం. ఆ సమయంలో నెతన్యాహు, ఆయన కుటుంబ సభ్యులు ఇంట్లో లేకపోవడంతో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారు. నెతన్యాహు ఇంటిపై దాడికి సంబంధించి ముగ్గురు అనుమానితులను ఇజ్రాయెల్ పోలీసులు అరెస్టు చేశారు. గత నెలలో కూడా నెతన్యాహు ఇంటిపై హెజ్బొల్లా మిలిటెంట్ గ్రూప్ డ్రోన్ దాడికి పాల్పడిన సంగతి తెలిసిందే. ఆ సమయంలోనూ నెతన్యాహు ఇంట్లో లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది.

ట్రంప్ ఆటవిడుపు



అమెరికా కాబోయే అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన బిజీ రొటీన్‌కు కాస్త విరామమిచ్చారు. మస్క్, తులసీ గబార్డ్ తదితరులతో కలిసి న్యూయార్క్‌లో యూఎఫ్‌సీ హెవీవెయిట్ చాంపియన్‌షిప్ మ్యాచ్‌లు వీక్షిస్తూ సరదాగా గడిపారు. అనంతరం విజేతను అభినందించారు.

బుల్లి వాచీకి భారీ ధర



వందేళ్ల క్రితం 1,500 మందికి పైగా ప్రయాణికుల దుర్మరణానికి దారి తీసిన టైటానిక్ నౌక విషాదం అందరికీ తెలిసిందే. ఆ విపత్తు బారి నుంచి 700 మందిని కాపాడినందుకు ఆర్ఎంఎస్ కర్పతియా నౌక కెప్టెన్ ఆర్థర్ రోస్ట్రన్‌కు బహూకరించిన పాకెట్ వాచీ ఇది. ఈ బుల్లి బంగారు వాచీ తాజాగా వేలంలో 20 లక్షల డాలర్లు పలికింది!

నా జన్మభూమి...



అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం నుంచి భూమిని వీక్షిస్తున్న నాసా వ్యోమగామి సునీతా విలియమ్స్. సుదీర్ఘకాలం పాటు ఐఎస్ఎస్‌లో ఉండాల్సి రావడంతో సునీత ఆరోగ్యం క్షీణిస్తోందన్న వార్తల నేపథ్యంలో ఆమె బాగానే ఉన్నారంటూ నాసా తాజాగా ఈ ఫొటోను పోస్ట్ చేసింది.

ఉద్రిక్తంగానే మణిపూర్

- సీఎం ఇంటిపై దాడికి యత్నం
- పరిస్థితిని సమీక్షించిన అమిత్ షా

మంత్రి, ఎమ్మెల్యేల ఇళ్లకు నిప్పు



మణిపూర్ హింసకు నిరసనగా ఆదివారం ఢిల్లీలో మెయితీ తెగకు చెందిన వారి ఆందోళనలు

ఇంఫాల్: మణిపూర్‌లో ఉద్రిక్తత రాజ్యమేలుతోంది. గత వారం అపహరణకు గురైన మైతేయ్ తెగకు చెందిన ఆరుగురి మృతితో మొదలైన హింసాకాండ ఆదివారం కూడా కొనసాగింది. కర్ఫ్యూ ఉత్తర్వులను కూడా లెక్కచేయకుండా అల్లరి మూకలు రాష్ట్రవ్యాప్తంగా దాడులు, హింసాత్మక ఘటనలకు తెగబడ్డాయి. శనివారం ముగ్గురు మంత్రులు, ఆరుగురు ఎమ్మెల్యేల నివాసాలపై దాడి జరగడం తెలిసిందే. ఆదివారం కూడా మంత్రి గోవిందాస్ కొంతౌజంతో పాటు మరో ముగ్గురు బీజేపీ ఎమ్మెల్యేల ఇళ్లకు ఆందోళనకారులు నిప్పు పెట్టారు. తూర్పు ఇంఫాల్‌లోని సీఎం ఎన్.బీరేన్‌సింగ్ పూర్వీకుల ఇంటిపై కూడా దాడికి ప్రయత్నించారు. ఆయన ఇంటికి దారితీసే రోడ్డుపై టైర్లు కాల్చి పడవేసి నిరసన తెలిపారు. ఇంఫాల్‌తో పాటు రాష్ట్రవ్యాప్తంగా రోడ్లపై పలు వస్తువులను తెచ్చి పడేసి నిప్పు పెట్టడం కన్పించింది. అల్లర్ల వ్యాప్తిని నిరోధించేందుకు రాష్ట్రంలో ఇప్పటికే ఇంటర్నెట్ సేవలు తదితరాలను నిలిపేయడం తెలిసిందే. మహారాష్ట్రలో ఎన్నికల ప్రచారంలో ఉన్న కేంద్ర హోం మంత్రి అమిత్ షా మణిపూర్ ఉద్రిక్తతల నేపథ్యంలో సభలను రద్దు చేసుకుని హుటాహుటిన ఢిల్లీ చేరుకున్నారు. మణిపూర్ పరిస్థితిపై ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఆదివారం మహారాష్ట్రలో ఆయన ఐదు ఎన్నికల ర్యాలీల్లో ప్రసంగించాల్సి ఉంది. మణిపూర్‌లో పరిస్థితిని ప్రత్యక్షంగా పర్యవేక్షించేందుకు కేంద్ర భద్రతాధికారుల బృందాన్ని పంపాలని అమిత్ షా నిర్ణయించారు. అక్కడి పరిస్థితిపై నివేదిక అందజేయాల్సిందిగా వారిని ఆదేశించారు. ''శాంతిభద్రతల పరిరక్షణలో ఏమాత్రం రాజీపడొద్దు. అదే సమయంలో పౌరులకు ఎలాంటి ఇబ్బందులూ కలగకుండా జాగ్రత్తలు తీసుకోండి'' అని సూచించారు. 2023 మే నుంచి ఇప్పటిదాకా రాష్ట్రంలో 200 మందికి పైగా హింసాకాండకు బలయ్యారు.

మణిపూర్‌ను ఉద్దేశపూర్వకంగానే తగలబెడుతున్న బీజేపీ: ఖర్గే

అధికార బీజేపీ ఉద్దేశపూర్వకంగానే మణిపూర్‌లో మంటలు రాజేస్తోందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మండిపడ్డారు. ఇందుకు ఆ పార్టీని, ప్రధాని నరేంద్ర మోదీని రాష్ట్ర ప్రజలు ఎన్నటికీ క్షమించబోరన్నారు. ఏడాదిన్నరగా రాష్ట్రాన్ని కేంద్ర ప్రభుత్వం నిప్పుల కుంపటిగా మార్చిందని ఆవేదన వెలిబుచ్చారు. అక్కడ తాజా హింసాకాండ పట్ల కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్‌గాంధీ కూడా ఆవేదన వెలిబుచ్చారు. మోదీ ఇప్పటికైనా మణిపూర్‌లో పర్యటించాలని కోరారు. రాష్ట్రాల్లో ఎన్నికల ప్రచారానికి, విదేశీ పర్యటనలకు ఉన్న సమయంలో మణిపూర్ విషయంలో లేదా అని ప్రశ్నించారు. ఏడాదిన్నరగా మణిపూర్‌లో ప్రధాని ఒక్కసారి కూడా పర్యటించకపోవడాన్ని కాంగ్రెస్ తీవ్రంగా ప్రశ్నిస్తుండటం తెలిసిందే. గత లోక్‌సభ ఎన్నికల సమయంలో కూడా మణిపూర్లో ఈ విషయాన్ని ఆ పార్టీ విస్తృతంగా ప్రచారం చేసింది.

బీజేపీ సర్కారుకు మద్దతు ఉపసంహరించిన ఎన్‌పీపీ

మణిపూర్‌లో హింసాకాండకు నిరసనగా బీజేపీ సారథ్యంలోని రాష్ట్ర ప్రభుత్వానికి మద్దతు ఉపసంహరిస్తున్నట్టు నేషనల్ పీపుల్స్ పార్టీ (ఎన్‌పీపీ) ఆదివారం ప్రకటించింది. శాంతిభద్రతల పరిరక్షణలో బీరేన్ సర్కారు పూర్తిగా విఫలమైందని ఆరోపించింది. 60 మంది సభ్యులున్న అసెంబ్లీలో బీజేపీ 32 మంది ఎమ్మెల్యేలున్నారు. సొంతంగానే మెజారిటీ ఉన్న నేపథ్యంలో ఎన్‌పీపీ నిర్ణయంతో ప్రభుత్వ మనుగడకు ఇబ్బందేమీ లేదు. ఐదుగురు ఎమ్మెల్యేలున్న నాగా పీపుల్స్ ఫ్రంట్ (ఎన్‌పీఎఫ్), ఆరుగురు సభ్యుల జేడీ(యూ) కూడా బీజేపీకి మద్దతిస్తున్నాయి. కుకీ పీపుల్స్ పార్టీ కూడా ఇటీవలే బీజేపీ సర్కారుకు మద్దతు ఉపసంహరించింది.

ఆత్మవిశ్వాసంతో నూతన పయనం



ఆదివారం అబూజాలో మరాఠా సమాజ సభ్యులతో ప్రధాని మోదీ

- 2047 నాటికి వికసిత్ భారత నిర్మాణమే లక్ష్యం
- నైజీరియాలో భారతీయులతో మోదీ

అబూజా: ''భారత్ రెట్టింపు ఆత్మవిశ్వాసంతో నూతన ప్రయాణం ఆరంభించింది. 2047 నాటికి 'వికసిత్ భారత్' నిర్మాణమే దేశ ప్రజల లక్ష్యం'' అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పునరుద్ఘాటించారు. ఈ లక్ష్య సాధన దిశగా తమ ప్రభుత్వం ఎన్నో చర్యలు చేపట్టిందని తెలిపారు. నైజీరియా పర్యటనకు వచ్చిన మోదీకి ఆదివారం ఘన స్వాగతం లభించింది. రాజధాని అబూజాలో భారతీయులతో ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. అభివృద్ధి, శాంతి, సౌభాగ్యం, ప్రజాస్వామ్యంతో భారత్ నేడు యావత్ ప్రపంచానికి ఆశారేఖగా మారిందని చెప్పారు. ''నేను ప్రధానిగా నైజీరియాలో పర్యటిస్తుండడం ఇదే తొలిసారి. కానీ నేను ఒంటరిగా రాలేదు. భారత నేల పరిమళాన్ని, 140 కోట్ల మంది భారతీయుల శుభాభినందనలను వెంట తీసుకొచ్చా'' అని చెప్పారు.

నవీన ఆవిష్కరణలకు శ్రీకారం

''కంఫర్ట్ జోన్ నుంచి ఇండియా బయటకు వచ్చింది. నవీన ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టింది. నూతన మార్గాలను సృష్టిస్తోంది'' అని మోదీ పేర్కొన్నారు. ఇండియాలో ప్రస్తుతం 1.5 లక్షల రిజిస్టర్డ్ స్టార్టప్ కంపెనీలున్నాయని ఆయన చెప్పారు. గత పదేళ్లలో 100కు పైగా యూనికార్న్ కంపెనీలు ఏర్పాటయ్యాయని వివరించారు. ఒక యూనికార్న్ సంస్థ విలువ రూ.10 వేల కోట్ల దాకా ఉంటుందన్నారు. ఇలాంటివి 100కుపైగా ఏర్పాటు కావడం భారత్‌లో స్టార్టప్ సంస్కృతి విజయానికి ఉదాహరణ అని వెల్లడించారు. కంఫర్ట్ జోన్ నుంచి బయటకు రావడం వల్లే ఇదంతా సాధ్యమైందని స్పష్టంచేశారు. ''గత పదేళ్లలో దేశ జీడీపీకి అదనంగా ఏకంగా 2 లక్షల కోట్ల డాలర్లు జోడించాం. దేశ ఆర్థిక వ్యవస్థ రెట్టింపైంది. ప్రపంచంలోనే ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ అవతరించింది. 5 లక్షల కోట్ల డాలర్లతో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారడానికి ఇక ఎంతో దూరం లేదు'' అన్నారు. అంతరిక్ష రంగంలో భారత ప్రగతిని ప్రపంచ దేశాలు ప్రశంసిస్తున్నాయని మోదీ తెలిపారు. ''గగన్‌యాన్ ప్రాజెక్టు ద్వారా భారతీయులను చందమామపైకి పంపించాలని సంకల్పించాం. అంతరిక్షంలో సొంత స్పేస్ స్టేషన్ నిర్మించుకోబోతున్నాం'' అని పేర్కొన్నారు. గత పదేళ్లలో దేశంలో ఏకంగా 25 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడ్డారని వివరించారు.



రష్యా దాడులతో కీవ్‌లో ధ్వంసమైన భవనాల నుంచి వెలువడుతున్న పొగ

ఉక్రెయిన్‌పై రష్యా దాడులు

- రాజధాని కీవ్ సహా పలు ప్రాంతాలపై 120 క్షిపణులు, 90 డ్రోన్ల ప్రయోగం
- ఉక్రెయిన్ పవర్ గ్రిడ్ ధ్వంసం!

కీవ్: ఉక్రెయిన్‌పై రష్యా సైన్యం భీకర స్థాయిలో విరుచుకుపడింది. గత కొన్ని నెలల్లో ఎన్నడూ లేని రీతిలో భారీ సంఖ్యలో క్షిపణులు, డ్రోన్లు ప్రయోగించింది. ఉక్రెయిన్ ఇంధన మౌలిక సదుపాయాలను నాశనం చేయడమే లక్ష్యంగా ఆదివారం దాడులు నిర్వహించింది. ఈ దాడుల్లో ఉక్రెయిన్ పవర్ గ్రిడ్ ధ్వంసమైనట్లు తెలుస్తోంది. చాలామంది పౌరులు మృతిచెందినట్లు సమాచారం. రష్యా సైన్యం 120 క్షిపణులు, 90 డ్రోన్లు ప్రయోగించిందని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ చెప్పారు. ఇరాన్‌లో తయారైన షాహిద్ డ్రోన్లు, క్రూయిజ్, బాలిస్టిక్, ఎయిర్‌క్రాఫ్ట్ లాంచ్‌డ్ బాలిస్టిక్ మిస్సైల్స్ ఉన్నాయని తెలిపారు. ఉక్రెయిన్‌వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో వీటిని రష్యా సైన్యం ప్రయోగించిందని, 140 డ్రోన్లు, క్షిపణులను తమ సైన్యం కూల్చివేసిందని స్పష్టంచేసింది. విద్యుత్ ఉత్పత్తికి సంబంధించి కొన్ని మౌలిక సదుపాయాలకు నష్టం జరిగిన మాట నిజమేనని అంగీకరించారు. డ్రోన్ల దాడిలో ఇద్దరు మరణించారని, ఆరుగురు గాయపడ్డారని, వీరిలో ఇద్దరు చిన్నారులు ఉన్నారని వెల్లడించారు. డ్రోన్లు, క్షిపణులతో ఏకకాలంలో భారీ దాడులు జరగడం మూడు నెలల్లో ఇదే తొలిసారి అని కీవ్ సిటీ మిలటరీ ప్రతినిధి సెర్హీ పాప్కో చెప్పారు. కీవ్ హిస్టోరిక్ సెంటర్‌లోని ఐదంతస్తుల భవనం పైకప్పునకు మంటలు అంటుకున్నాయని, ఈ ఘటనలో ఒకరు గాయపడ్డారని చెప్పారు. ఆదివారం ఉక్రెయిన్ రాజధాని కీవ్ సహా పలు ప్రాంతాల్లో భారీ పేలుళ్ల శబ్దాలు వినిపించాయని స్థానిక మీడియా తెలియజేసింది. రష్యా దాడుల్లో.. ప్రైవేట్ విద్యుత్ సంస్థ డీటీఈఎక్ నిర్వహిస్తున్న థర్మల్ విద్యుత్ కేంద్రం తీవ్రంగా దెబ్బతిన్నదని ఆ కంపెనీ వర్గాలు పేర్కొన్నాయి.

ఢిల్లీలో స్కూళ్లన్నీ బంద్

- పెరిగిన కాలుష్య తీవ్రత
- అమల్లోకి స్టేజ్ 4 ఆంక్షలు

న్యూఢిల్లీ: దేశ రాజధానిలో వాయు నాణ్యత నానాటికీ క్షీణిస్తూ గుబులు రేపుతోంది. ఢిల్లీలో వాయు నాణ్యత సూచీ ఆదివారం రాత్రి ఏకంగా 457కు పడిపోయింది. దాంతో కాలుష్య నియంత్రణ దృష్ట్యా ఇప్పటికే అమల్లో ఉన్న ఆంక్షలను మరింత కఠినతరం చేశారు. సోమవారం నుంచి గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్–4 కేటగిరీ ఆంక్షలు అమల్లోకి వస్తాయని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. తదుపరి ఆదేశాల దాకా ఇవి కొనసాగుతాయని పేర్కొంది. నిత్యావసరాలు, అత్యవసర సేవలను మినహాయించి మిగతా అన్ని రకాల ట్రక్కులకూ ఎన్‌సీఆర్ పరిధిలోకి ప్రవేశాన్ని నిషేధించారు. ఐదో తరగతి వరకు మాత్రమే ఉన్న ఆన్‌లైన్ క్లాసులను 6 నుంచి 11వ తరగతి దాకా వర్తింపజేయనున్నట్టు సీఎం ఆతిషి ప్రకటించారు. తదుపరి ఉత్తర్వుల వరకు ఆన్‌లైన్ క్లాసులు కొనసాగుతాయని వివరించారు. కార్యాలయాలన్నీ సగం సామర్థ్యంతోనే నడపాలని ప్రైవేటు సంస్థలకు ప్రభుత్వం సూచించింది. మిగతా వారికి వర్క్ ఫ్రం ఆప్షన్ ఇవ్వాలని పేర్కొంది. దీన్ని కేంద్ర ప్రభుత్వోద్యోగులకు కూడా వర్తింపజేయాలని కోరింది. వీటితో పాటు ఢిల్లీలో కొంతకాలం పాటు వాహనాలకు సరి–బేసి విధానాన్ని మళ్లీ అమలు చేయాలని కూడా భావిస్తున్నారు. పొగ మంచు కారణంగా ఢిల్లీలో పదుల కొద్దీ విమాన సేవలు ప్రభావితమయ్యాయి. చాలా విమానాలు రద్దయ్యాయి.

నిజం ఎప్పటికైనా బయటికొస్తుంది

'సబర్మతి రిపోర్టు'పై ప్రధాని మోదీ

న్యూఢిల్లీ: ''తప్పుడు ప్రచారం కొంతకాలమే రాజ్యమేలుతుంది. నిజం ఎప్పటికైనా బయటకు వస్తుంది. వాస్తవాలను ప్రజలు కచ్చితంగా తెలుసుకుంటారు'' అని ప్రధాని నరేంద్ర మోదీ ఆదివారం ఎక్స్‌లో పోస్టు చేశారు. 2002లో మోదీ గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు జరిగిన గోధ్రా రైలు దహనానికి సంబంధించి 'సబర్మతి రిపోర్టు' అనే సినిమాను ప్రస్తావిస్తూ ఓ వ్యక్తి ఎక్స్‌లో పోస్టు చేశాడు. ఇటీవలి చరిత్రలో అత్యంత సిగ్గుచేటైన సంఘటన గురించి నిజం బయటకు వచ్చిందని పేర్కొన్నాడు. సబర్మతి రైలు దహనం ఘటనను కొన్ని దుష్ట శక్తులు రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకున్నాయని ఆరోపించాడు. ఈ పోస్టుపై మోదీ ప్రతిస్పందించారు. 'మీరు సరిగ్గా చెప్పారు. నిజం ఎప్పటికైనా బయటకు వస్తుంది'' అని స్పష్టంచేశారు.



అంతరిక్షంలో చేపలు పెంచారు!

చైనా వ్యోమగాముల ఘనత

చైనా వ్యోమగాములు అరుదైన ఘనతను సొంతం చేసుకున్నారు. అంతరిక్షంలో ఏకంగా చేపలను పెంచి చూపించారు. నవంబర్ 4న ముగిసిన షెన్‌ఝౌ–18 స్పేస్ మిషన్‌లో భాగంగా వాళ్లు ఈ ఘనత సాధించారు. చైనా అంతరిక్ష కేంద్రం ఇందుకు వేదికైంది. ఈ ప్రయోగం కోసం శరవేగంగా పెరిగే జీబ్రా చేపలను ఎంచుకున్నారు. వాటిని పెంచేందుకు అంతరిక్ష కేంద్రం లోపల అన్ని వసతులతో కూడిన క్లోజ్డ్ ఎకో సిస్టంను ఏర్పాటు చేశారు. చేపలు అందులోనే పెరిగి పెద్దవై పునరుత్పత్తి కూడా జరిపాయి. 43 రోజుల జీవనచక్రాన్ని విజయవంతంగా పూర్తి చేసుకున్నాయి. తద్వారా అంతరిక్ష ప్రయోగాల్లో ఇది సరికొత్త రికార్డుగా నిలిచింది. అంతరిక్షంలో అత్యంత సవాళ్లతో కూడిన వాతావరణంలో జలచరాలు ఏ మేరకు మనుగడ సాగించగలవన్న దానిపై ఈ ప్రయోగం ద్వారా చాలా స్పష్టత వచ్చిందని సైంటిస్టులు అంటున్నారు. అంతేగాక అంతరిక్ష రంగంలో కొంతకాలంగా చైనా సాధిస్తున్న పైచేయికి ఇది తాజా నిదర్శనమని కూడా చెబుతున్నారు.

జీబ్రా చేపలకు జన్యుపరంగా మానవులతో చాలా దగ్గరి పోలికలుంటాయి. అంతరిక్షంలో వీటితో చేపట్టిన ప్రయోగం విజయవంతం కావడాన్ని కీలక మైలురాయిగా చెబుతున్నారు. భూమికి ఆవల శాశ్వత మానవ ఆవాసాల ఏర్పాటుకు చేస్తున్న ప్రయత్నాలు ఇకపై మరింతగా ఊపందుకుంటాయని భావిస్తున్నారు. ''దీర్ఘకాలిక అంతరిక్ష మిషన్లు విజయవంతం కావాలంటే ఏం చేయాలన్న దానిపై ఈ ప్రయోగం మరింత స్పష్టతనిచ్చింది. అంతరిక్షంలో స్వయంపోషక జీవ వ్యవస్థల అభివృద్ధికి బాటలు పరిచింది'' అని చైనా పేర్కొంది.

– సాక్షి, నేషనల్ డెస్క్



ఆదివారం చివరి పూజల అనంతరం బద్రీనాథ్ ఆలయం ముందు ఫొటోలకు పోజిస్తున్న పోలీసులు. శీతాకాలం నేపథ్యంలో ఆలయం ఆర్నెల్లపాటు మూసి ఉండనుంది.

అమెరికాలో కొత్త రకం ఎంఫాక్స్ కేసు

న్యూయార్క్: ప్రాణాంతకమైన ఎంఫాక్స్ కేసులు ప్రపంచవ్యాప్తంగా పలు దేశాల్లో నమోదవుతున్నాయి. ఈ మహమ్మారి క్రమంగా విస్తరిస్తోంది. తొలుత తూర్పు కాంగోలో బయటపడిన కొత్తరకం ఎంఫాక్స్ కేసు తొలిసారిగా అమెరికాలోనూ నమోదైనట్లు ఆరోగ్య శాఖ అధికారులు చెప్పారు. ఆఫ్రికా నుంచి వచ్చిన ఓ వ్యక్తిలో ఈ వైరస్ ఆనవాళ్లు గుర్తించినట్లు తెలిపారు. అతడిని ఐసోలేషన్‌కు తరలించి, చికిత్స అందిస్తున్నామని, వైరస్ ఇతరులకు సోకే అవకాశం లేదని పేర్కొన్నారు.

ప్రచారంలో తారల తళుకులు





బీజేపీ అభ్యర్థులకు మద్దతుగా ఆదివారం నాగ్‌పూర్‌లో ప్రచారం చేస్తున్న బాలీవుడ్ తారలు కంగనా రనౌత్, భాగ్యశ్రీ

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
ఇండియన్ హిస్టరీ

సింధు, వైదిక నాగరికతలు

సింధు, వైదిక నాగరికతల మౌలిక లక్షణాలను తులనాత్మకంగా పరిశీలించండి?

క్రీపూ.2500 నుంచి 1750 మధ్య వాయవ్య భారతదేశంలో సింధు, దాని ఉపనదుల పరివాహక ప్రాంతాల్లో విలసిల్లిన నాగరికతనే సింధు నాగరికత అంటారు. క్రీపూ.1500 నుంచి 600 సంవత్సరాల మధ్య సప్త సింధు, గంగా-యమునా మైదాన ప్రాంతాల్లో వెలసిన నాగరికత వైదిక నాగరికత. ఈ నాగరికతలు ఒక దాని తర్వాత ఒకటి వెలసినప్పటికీ వీటి మధ్య పలు అంశాల్లో అనేక వ్యత్యాసాలు, పోలికలు ఉన్నాయి.



వ్యత్యాసాలు

దాదాపు 250 దాకా అత్యంత ప్రణాళికాబద్ధంగా నిర్మించిన పట్టణాలు, కోటలు, కాల్చిన ఇటుకలతో రూపొందించిన నిర్మాణాలు, భూగర్భ మురుగు నీటి కాలువల వ్యవస్థ వంటి పలు అంశాలతో కూడిన సింధు నాగరికత ప్రధానంగా పట్టణ నాగరికత. కానీ వైదిక నాగరికత చివరి దశలో మాత్రమే ప్రాథమిక స్థాయిలో పట్టణాలు ప్రారంభమయ్యాయి.

- సింధు నాగరికత రాజకీయ వ్యవస్థకు సంబంధించిన నిర్దిష్ట సమాచారం ఏదీ లభించడం లేదు. కానీ వేద కాలంలో తెగ ఆధారిత రాజకీయ వ్యవస్థలు ఉండి, చివరి దశలో ప్రాదేశిక రాజ్యాలు కూడా ఏర్పడినట్లు తెలుస్తుంది.
- సింధు సమాజంలో కుల వ్యవస్థ కనిపించదు. వర్గ బేధాలు మాత్రమే ఉన్నాయి. సమాజంలో స్త్రీలకు ఉన్నత స్థానం ఉన్నట్లుగా అసంఖ్యాకంగా లభించిన మాతృ మూర్తి విగ్రహాల వల్ల తెలుస్తుంది. వీరిది మాతృస్వామిక వ్యవస్థ అని కొందరి అభిప్రాయం. కానీ వైదిక సమాజంలో పటిష్టమైన చాతుర్వర్ణ వ్యవస్థ ఉంది. శూద్రులతోపాటు స్త్రీలకు సామాజిక గౌరవం లేదు. మలి వేద కాలంలో అనేక దురాచారాలు వచ్చి చేరాయి. ఆర్యులది పితృస్వామిక వ్యవస్థ.
- సింధు ప్రజలది స్థిర జీవనం. ప్రధాన వృత్తి వ్యవసాయం. గోధుమ, బార్లీ ప్రధాన పంటలు. కాగా వరికి అంత ప్రాధాన్యత కనిపించదు. వీరు పలు రకాల చేతి వృత్తుల పరిశ్రమలను స్థాపించుకున్నారు. ప్రామాణికమైన తూనికలు, కొలతలను వినియోగించేవారు. దేశీయ వ్యాపారంతోపాటు విదేశీ వ్యాపారాన్ని కొనసాగించారు. వైదిక ప్రజలు సంచార జీవితాన్ని గడిపేవారు. వీరి ప్రధాన వృత్తి పశుపోషణ. కేవలం మలి వేద కాలంలోనే వీరు వ్యవసాయాన్ని ముఖ్య వృత్తిగా స్వీకరించారు. ప్రధాన పంట వరి. సింధు ప్రజలకు లేని ఇనుము లోహ పరిజ్ఞానం వీరికి ఉంది. వీరు విదేశీ వ్యాపారాన్ని నిర్వహించలేదు. వీరి ఆర్థిక వ్యవస్థలో గోవులతోపాటు గుర్రాలకు ముఖ్యస్థానం ఉంది. సింధు ప్రజల విషయంలో గుర్రానికి సంబంధించిన వివరాలు సంతృప్తికరంగా నిర్ధారణ కాలేదు. ఒకవేళ వీరికి గుర్రం తెలిసినా.. దాని వినియోగం పరిమితమే.
- సింధు ప్రజల మతానికి సంబంధించిన సరైన సమాచారం లేకున్నా.. పురావస్తు ఆధారాల ద్వారా వీరు అమ్మతల్లిని ప్రధాన దేవతగా పూజించినట్లు తెలుస్తుంది. ఈ కాలంలో ఒకే ఒక పురుష దేవుడు పశుపతి మహాదేవ. ఆర్యుల దేవతల్లో స్త్రీల కంటే పురుష దేవుళ్ల ఆధిక్యం ఎక్కువ. ఇంద్ర, వరుణ, అగ్ని, త్రిమూర్తులు మొదలైన 33 మంది దేవుళ్లను వీరు పూజించేవారు.
- సింధు ప్రజల పూజా విధానానికి భిన్నంగా.. యజ్ఞ యాగాలు, క్రతువులకు ఆర్యులు ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చారు. లిపి విషయంలోనూ రెండు నాగరికతల మధ్య భేదాలు కనిపిస్తాయి. సింధు ప్రజలు చిత్ర లిపిని అభివృద్ధి చేసుకున్నారు. వైదిక ఆర్యులకు లిపి లేదు. కానీ వీరికి మౌఖిక సాహిత్యం ఉంది.

పోలికలు

- సింధు ప్రజల మాతృదేవతను వైదిక మతంలోని దుర్గగా గుర్తించారు. సింధు కాలంలోని పశుపతి మహాదేవుడినే ఆర్యులు రుద్రుడిగా పూజించారు.
- జంతువులను, వృక్షాలను ఆరాధించే సంప్రదాయం రెండు నాగరికతల్లో కనిపిస్తుంది.
- భూత ప్రేత పిశాచాలు, దుష్ట శక్తులు, మంత్ర తంత్రాల పట్ల నమ్మకం రెండింటిలోనూ ఉంది.
- ప్రాతిపదికలు వేరైనా రెండు సమాజాల్లోనూ సామాజిక వివక్షతలు కనిపిస్తాయి.
- వైద్య విధానాల్లోనూ రెండు నాగరికతల్లో సారూప్యం ఉంది.
- కుమ్మరి చక్రాన్ని రెండు నాగరికతల్లోని ప్రజలు వినియోగించారు.
- స్త్రీల అలంకార ప్రియత్వం, రవాణా సాధనాలు మొదలైన అంశాల్లోనూ రెండింటికి సారూప్యం ఉంది.
- పైన పేర్కొనట్లు సింధు, వేద నాగరికతల మధ్య పలు అంశాల్లో వ్యత్యాసాలు, పోలికలు ఉన్నాయి. అయినప్పటికీ ఈ రెండు నాగరికతల్లోని పలు అంశాలు నేటి సంస్కృతిలో భాగంగా ఇప్పటికీ అవిచ్ఛిన్నంగా కొనసాగుతుండటంతో ఈ నాగరికతలను భారతీయ సంస్కృతికి మూల నాగరికతలుగా భావించవచ్చు.

జైన, బౌద్ధ మతాలు

జైన, బౌద్ధ మతాల ఆవిర్భావానికి, వ్యాప్తికి దోహదపడిన అంశాలను పరిశీలించండి?

మలి వేదకాలం చివర్లో నెలకొన్న పరిస్థితులే క్రీపూ.6వ శతాబ్దంలో భారతదేశంలో అనేక మత ఉద్యమాలు ప్రారంభం కావడానికి కారణమయ్యాయి. ఈ ఉద్యమాల్లో ముఖ్యమైనవి జైన, బౌద్ధ మతాలు.



కారణాలు

ఈ కాలంలో సమాజంలో వర్ణ వ్యవస్థ బలపడింది. ఈ వ్యవస్థలో మిగిలిన మూడు వర్ణాలపై బ్రాహ్మణులు ఆధిక్యత కలిగి ఉన్నారు. కానీ విశాలమైన భూ భాగాల్లో రాజ్యాలను స్థాపించి రాజ్యాధికారంతోపాటు రాజకీయంగా ఉన్నత దశలో ఉన్న క్షత్రియులు సామాజికంగా ఉన్నత దశను కోరుకున్నారు. జైన, బౌద్ధ మత స్థాపకులు ఇద్దరూ క్షత్రియులే. ఈ కాలంలో వైశ్యుల ఆర్థిక స్థితి మెరుగుపడింది. కానీ సామాజికంగా వారి స్థాయిలో మార్పు లేనందువల్ల వారిలో కూడా సామాజిక అశాంతి కలిగింది. శూద్రులు, స్త్రీలు తమకు మోక్షం ఇవ్వని వైదిక మతం పట్ల అసంతృప్తికి లోనయ్యారు. ఇదే సమయంలో అందరికీ సామాజిక సమానత్వం, మోక్షాన్ని ప్రసాదించే జైన, బౌద్ధ మతాల పట్ల వీరంతా ఆదరణ చూపారు. పైగా వీటి మోక్ష మార్గం వ్యయ రహితం, సులువైనదీ.

క్రీ.పూ.6వ శతాబ్దంలో ఇనుప లోహ పరిజ్ఞానం వల్ల గంగానదీ మైదాన ప్రాంతం సాగులోకి వచ్చింది. దీంతో వ్యవసాయాభివృద్ధికి గొప్ప అవకాశం ఏర్పడింది. వ్యవసాయాన్ని విస్తరించడంలో పశువుల పాత్ర ఎంతో కీలకమైంది. అయితే వైదిక యజ్ఞయాగాది క్రతువుల పేరిట విలువైన పశు సంపదకు తీవ్ర నష్టం కలగడంతో వ్యవసాయ వర్గాల నుంచి వైదిక క్రతువుల పట్ల తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. భారతదేశంలో క్రీ.పూ.6వ శతాబ్ద కాలాన్ని రెండో నగరీకరణగా భావిస్తారు. వ్యవసాయాభివృద్ధితో మిగులు ఏర్పడటం, తొలిసారిగా నాణేలు వాడకంలోకి రావడం మొదలైన కారణాల వల్ల వ్యాపార వాణిజ్యాలకు గొప్ప ప్రోత్సాహం లభించింది. వైదిక గ్రంథాలు వడ్డీ వ్యాపారాన్ని, సముద్రయానాన్ని నిషేధించడంతో వ్యాపారాభివృద్ధికి ఆటంకం కలిగింది. ఇదే సమయంలో జైన, బౌద్ధాలు ఇటువంటి నిషేధాలు విధించకపోగా తమ అహింసా సిద్ధాంతం ద్వారా వ్యాపార వాణిజ్యాలు అభివృద్ధి చెందడానికి తగిన శాంతియుత వాతావరణం కల్పించాయి. దీంతో వ్యాపార వర్గాల నుంచి వైదిక మతం కంటే ఈ కొత్త మతాల పట్ల అధిక మద్దతు లభించింది. జైన, బౌద్ధ మతాలు రెండూ గణతంత్ర రాజ్యాల్లో ప్రారంభించినవే. రాజరికాల్లోని బ్రాహ్మణాధిక్యత, ఇతర వివక్షతలకు ఇక్కడ స్థానం లేకపోవడమే కాకుండా ప్రజాస్వామిక విలువలకు ఇవి ప్రతీకలుగా నిలిచాయి. దీంతో ఈ కొత్త మతాల ప్రాభవానికి తగిన వేదిక లభించింది. ఈ మతాలను అధికంగా ఆదరించింది కూడా ఈ రాజ్యాల్లోని ప్రజలే. జైన, బౌద్ధ మతాలు వైదిక మతంలా బ్రాహ్మణులు, ఇతర ఉన్నత వర్గాల వారికి పరిమితమైన సంస్కృత భాషకు బదులు ప్రాకృతం, పాళి వంటి సామాన్య ప్రజానీకానికి దగ్గరగా ఉన్న సులువైన భాషల ద్వారా తమ ప్రచారాన్ని నిర్వహించాయి. దీంతో అవి వైదికం కంటే సులువుగా ప్రజలను చేరి వారి ఆదరణను పొందాయి.

మొఘలుల పాలన

భారతీయ కళలు, వాస్తు శిల్పానికి మొఘలుల సేవలను ఉదాహరణల సహితంగా వివరించండి?

సుస్థిరతతో కూడిన మొఘల్ పాలన సుదీర్ఘ కాలం కొనసాగడంతోపాటు, మొఘల్ రాజులకు కళల పట్ల ఉన్న శ్రద్ధ, ఆసక్తి, ఆదరణలు వంటి కారణాలతో.. వీరి కాలంలో వాస్తు శిల్ప కళ, చిత్ర కళ, భాష, సంగీత సాహిత్యాలన్నింటిలో విశేష ప్రగతి కనిపిస్తుంది.



వాస్తు శిల్పకళ

సుల్తానత్ కాలంలో మొదలైన ఇండో పర్షియన్ శైలి ఈ కాలంలో అత్యున్నత దశకు చేరడంతోపాటు జాతీయ లక్షణాలను సంతరించుకుంది. వీరి నిర్మాణాల్లో మసీదులు, రాజ ప్రాసాదాలు, కోటలు ముఖ్యమైనవి. తెల్లని రాజస్థాన్ పాలరాయిని ఉపయోగించడం, డబుల్ డోమ్, పీత్రాదురా అలంకరణలు, పారే నీటితో ఉండే ఉద్యానవనాలు వీరి వాస్తు కళల్లోని కొన్ని ముఖ్య లక్షణాలు..

- బాబర్ కాలంలో పానిపట్, సంబల్‌పూర్, అయోధ్య, కాబూల్‌లలో మసీదులు నిర్మించారు.
- అక్బర్... ఫతేపూర్ సిక్రీ అనే నూతన రాజధాని నిర్మించి అందులో అనేక కట్టడాలు నిర్మించాడు. ఈ నగరంలోని జామా మసీద్ ప్రవేశ ద్వారమే బులంద్ దర్వాజా. ఆగ్రాలోని కోటతోపాటు ఫతేపూర్ సిక్రీలోని పంచ మహల్, బీర్‌బల్ మహల్, సలీం చిష్టీ సమాధి అక్బర్ కట్టడాల్లో ముఖ్యమైనవి. జహంగీర్ కాలంలో పూర్తి పాలరాయి నిర్మాణాలు ప్రారంభమయ్యాయి. నూర్జహాన్ నిర్మించిన ఇత్‌మద్ ఉద్దౌలా సమాధే దీనికి నాంది అని చెప్పొచ్చు. పీత్రాదురా అలంకరణ ఈ నిర్మాణంతోనే ప్రారంభమై తాజ్‌మహల్‌తో తారస్థాయికి చేరింది. ఇతని కాలంలోని మరో ముఖ్య నిర్మాణం సికింద్రా(ఉత్తరప్రదేశ్)లోని అక్బర్ సమాధి.
- షాజహాన్ కాలాన్ని వాస్తు కళకు స్వర్ణయుగంగా చెప్పొచ్చు. ఢిల్లీలోని ఎర్రకోట, అందులోని దివానీ ఆమ్, దివానీ ఖాస్ భవనాలు, ఆగ్రాలోని మోతీ మసీద్, ఢిల్లీలోని జామా మసీద్ షాజహాన్ కాలంలోని ముఖ్య నిర్మాణాలు. ఇతని కాలంలోని నిర్మాణాలన్నింటిలోకి మకుటాయమానంగా ఆగ్రాలోని తాజ్‌మహల్ నిలిచింది. తన భార్య ముంతాజ్ జ్ఞాపకార్థం నిర్మించిన సమాధి ఇది.
- ఔరంగజేబ్ కాలంలోని ముఖ్యమైన నిర్మాణం ఔరంగాబాద్ వద్ద నిర్మించిన ఆయన భార్య రాబియాద్దౌరాన్ సమాధి. దీన్ని పేదవాడి తాజ్ మహల్ అంటారు.

చిత్రకళ

- ఇస్లాం మతం చిత్ర కళను అంగీకరించకపోయినా లౌకిక పాలకులైన మొఘలులు దీన్ని గొప్పగా ఆదరించారు. ముఖ్యంగా అక్బర్, జహంగీర్‌ల కాలంలో ఇది తారస్థాయికి చేరింది. వీరి చిత్రకళల్లో ఆధ్యాత్మికత కంటే భౌతికతకు ప్రాధాన్యం ఎక్కువగా ఉండేది.
- హుమయూన్ కాలం నుంచీ మొఘల్ చిత్రకళ ప్రారంభమైంది. ఇతని ఆస్థానంలో ప్రముఖ పర్షియన్ చిత్రకారుడు మీర్ సయ్యద్ అలీ, అబ్దుస్ సమద్‌లు ఉండేవారు.
- అక్బర్ ఆస్థానంలోని చిత్రకారులతో ఒక కార్ఖానా ఏర్పడింది. వీరి ఆధ్వర్యంలోనే హంజనామా అనే చిత్ర కళా గ్రంథం రూపొందింది. ఇతని ఆస్థాన చిత్రకారుల్లో ముఖ్యులు ఫరూఖ్ బేగ్, సయ్యద్ అలీ తబ్రేజీ, దశావంత్, బసవన్, ముకుంద్.
- జహంగీర్ కాలాన్ని మొఘల్ చిత్రకళకు పరాకాష్ఠగా పేర్కొనొచ్చు. పర్షియన్, భారతీయ శైలుల విలీనం ఇక్కడ కనిపిస్తుంది. ఒకే చిత్రాన్ని పలువురు చిత్రించే సంప్రదాయం ఈ కాలంలోనే ప్రారంభమైంది. ఇతని కాలంలోని ముఖ్యమైన చిత్రకారులు ఉస్తాద్ మన్సూర్, బిషన్‌దాస్.
- షాజహాన్... చిత్రకళ కంటే వాస్తు కళపై అధిక శ్రద్ధ చూపాడు. అయినప్పటికీ ఈ సంప్రదాయాన్ని కొనసాగించాడు. చిత్రకళలో ఖరీదైన రంగుల వినియోగం మొదలుపెట్టాడు. ఇతని ఆస్థానంలో మహ్మద్ హుస్సేన్, అనుపచిత్రలు ప్రముఖ చిత్రకారులు.
- ఔరంగజేబ్ మతాభిమానం కారణంగా ఇస్లాంకు వ్యతిరేకమైన చిత్రకళను ప్రోత్సహించలేదు.

భాషా సాహిత్యాలు

మొఘలుల రాజ భాష పర్షియన్. అనేక సంస్కృత గ్రంథాలు ఈ భాషలోకి అనువాదమయ్యాయి. ఉదా: అక్బర్ కాలంలో మహాభారతాన్ని 'రజ్‌నామా'గా అనువదించారు. ప్రిన్స్ దారాషుకోవ్ కూడా ఉపనిషత్తులను 'మజీమ-ఉల్-బహ్రెయిన్'గా అనువదించాడు. అనువాదాలతోపాటు స్వీయ చరిత్రలు, చారిత్రక రచనలు కూడా చోటుచేసుకున్నాయి. తుజ్‌కీ బాబరీ, తుజ్‌కీ జహంగీరీ ముఖ్యమైన స్వీయ రచనలు. చారిత్రక గ్రంథాల్లో అబుల్ ఫజల్ అక్బర్‌నామా, అబుల్ ఫైజీ ఇనీ అక్బరీ, అబ్దుల్ హమీద్ లాహోరీ పాదుషానామా, ఖాఫీ ఖాన్ ముంతక్వాబ్-ఉల్ లుబాబ్ ముఖ్యమైనవి. ఈ కాలంలో హిందీతో పాటు ఇతర ప్రాంతీయ భాషా సాహిత్యాలు కూడా వర్ధిల్లాయి.

సంగీతం

మొఘల్ చక్రవర్తులు సంగీతాన్ని కూడా ఆదరించారు. అక్బర్ స్వయంగా నక్కారాను వాయించడంలో నిష్ణాతుడు. ఇతని ఆస్థానంలో ఉన్న తాన్‌సేన్‌ను 'గత వేయి సంవత్సరాల్లో ఇటువంటి సంగీతకారుడు లేడు' అని అబుల్ ఫజల్ కీర్తించాడు. తాన్‌సేన్ మియాంకీ థాడీ, దర్బారీ కనడ వంటి పలు కొత్త రాగాలను సృష్టించాడు. జహంగీర్ స్వయంగా అనేక గీతాలు రాసి తన సంగీతాభిమానాన్ని చాటుకొన్నాడు. షాజహాన్‌కు ధ్రుపద్ రాగాలాపనలో స్వయంగా ప్రవేశముంది. ఔరంగజేబ్ కూడా వీణా వాద్యంలో దిట్ట. ఇతడు సంగీతాన్ని నిషేధించినా అత్యధిక సంగీత గ్రంథాలు ఇతని కాలంలో రచనలకు నోచుకోవడం విశేషం. ఈ విధంగా మొఘల్ చక్రవర్తుల స్వీయ ప్రవేశం, ఆదరణతోపాటు ప్రాంతీయ రాజుల ఆదరణతో హిందుస్థానీ సంగీతం ఎంతో అభివృద్ధి చెందింది.


విద్య, ఉద్యోగ సమాచారం

ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ, మెదక్‌లో 86 పోస్టులు

ఆర్మ్‌డ్ వెహికల్స్ నిగమ్ లిమిటెడ్(ఏవీఎన్ఎల్)కు చెందిన ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ మెదక్(ఓఎఫ్ఎమ్‌కె) ఫిక్స్‌డ్ టర్మ్ ఒప్పంద ప్రాతిపదికన వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 86.
- **పోస్టుల వివరాలు:** జూనియర్ మేనేజర్-50, డిప్లొమా టెక్నీషియన్-21, అసిస్టెంట్-11, జూనియర్ అసిస్టెంట్-04.
- **విభాగాలు:** మెకానికల్, ప్రొడక్షన్, క్వాలిటీ, ఇంటిగ్రేటెడ్ మెటీరియల్ మేనేజ్‌మెంట్, ఎలక్ట్రికల్, మెటలర్జీ, టూల్ డిజైన్, డిజైన్, క్వాలిటీ అండ్ ఇన్‌స్పెక్షన్, హెచ్‌ఆర్, స్టోర్స్ తదితరాలు.
- **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిప్లొమా, డిగ్రీ(బీఏ/బీఎస్సీ/బీకామ్)బీఈ/బీటెక్, పీజీ(ఎంఏ/ఎంఎస్సీ/ఎంకామ్/ఎంబీఏ) ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
- **వేతనం:** నెలకు జూనియర్ మేనేజర్ పోస్టులకు రూ.30,000, డిప్లొమా టెక్నీషియన్ పోస్టులకు రూ.23,000, అసిస్టెంట్ పోస్టులకు రూ.23,000, జూనియర్ అసిస్టెంట్ పోస్టులకు రూ.21,000.
- **వయసు:** 30 ఏళ్లు మించకూడదు. ఓబీసీలకు మూడేళ్లు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఐదేళ్లు, పీడబ్ల్యూబీడీ అభ్యర్థులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.
- **ఎంపిక విధానం:** విద్యార్హతలు, పని అనుభవం, స్క్రీనింగ్ టెస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తులకు చివరితేది:** నోటిఫికేషన్ వెలువడిన 21 రోజుల్లో దరఖాస్తు చేసుకోవాలి.
- **నోటిఫికేషన్ వెలువడిన తేది:** 11.11.2024.
- **వెబ్‌సైట్:** https://avnl.co.in

ప్రపంచంలో తొలిసారి కనుగొన్న వ్యాక్సిన్?



టెట్/డీఎస్సీ - ప్రత్యేకం
జనరల్ సైన్స్-బయాలజీ

1. మైక్రోబయాలజీ (సూక్ష్మజీవ శాస్త్రం) అంటే?
   - కంటికి కనిపించని సూక్ష్మజీవులైన బ్యాక్టీరియా, వైరస్, శైవలాలు, శిలీంధ్రాలు, ప్రోటోజోవన్ల గురించి అధ్యయనం చేసే శాస్త్రం.
2. మైక్రోబయాలజీ పితామహుడు ఎవరు?
   - లూయీ పాశ్చర్
3. లూయీ పాశ్చర్ ఆవిష్కరణలు ఏవి?
   - పాశ్చరైజేషన్ విధానాన్ని కనుగొన్నాడు.
   - వ్యాధులు, సూక్ష్మజీవ జనితాలు (జెర్మ్ థియరీ ఆఫ్ డిసీజ్) సిద్ధాంతాన్ని ప్రతిపాదించాడు. (జెర్మ్ థియరీని రాబర్ట్ కోచ్ ప్రయోగ పూర్వకంగా నిరూపించాడు)
   - రేబిస్ వ్యాక్సిన్‌ను(కుక్క కాటుకు)కనుగొన్నాడు.
   - ఆంత్రాక్స్, కలరా వ్యాధులకు వ్యాక్సిన్‌ను కనుగొన్నాడు.
4. పాశ్చరైజేషన్ అంటే?
   - సేకరించిన పాలను 70°C వరకు వేడిచేసి, 15-30 సెకన్ల పాటు ఉంచి, వెంటనే చల్లార్చి (10°C) ప్యాకెట్లలో నిల్వచేసే పద్ధతిని పాశ్చరైజేషన్ అంటారు.
5. సూక్ష్మజీవ శాస్త్ర ప్రాముఖ్యత ఏమిటి?
   - చనిపోయిన మొక్కలు, జంతువుల దేహాలను సూక్ష్మజీవులు కుళ్లింపజేసి, పోషక పదార్థాలను ఏర్పరచి నేలను సారవంతం చేస్తాయి. ఆ పోషక పదార్థాలను మొక్కలు వినియోగించుకుంటాయి.
   - ఆక్సిజన్, కార్బన్, నత్రజని, సల్ఫర్ వంటి మూలకాలు పునఃచక్రీయం చెందడంలో సూక్ష్మజీవులు ప్రముఖ పాత్ర పోషిస్తాయి.
   - సూక్ష్మజీవులు మొక్కల్లో, మానవుల్లో అనేక వ్యాధులను కలగజేస్తాయి. మరోవైపు సూక్ష్మజీవ నాశక ఔషధాలు (యాంటీబయాటిక్స్), టీకా (వ్యాక్సిన్)ల ఉత్పత్తిలోనూ తోడ్పడుతున్నాయి.
6. ఎక్సో మైక్రోబయాలజీ (వ్యోమ సూక్ష్మ జీవ శాస్త్రం) అంటే?
   - ఇటీవల కాలంలో సూక్ష్మజీవులను ఉపయోగించి రోదసీలో జీవాన్వేషణ జరుపుతున్నారు. దీన్నే వ్యోమ సూక్ష్మజీవ శాస్త్రం అంటారు.
7. సూక్ష్మజీవ నాశిని పెన్సిలిన్‌ను ఆవిష్కరించిన వారు ఎవరు?
   - అలెగ్జాండర్ ఫ్లెమింగ్ (బ్రిటన్) పెన్సీలియం నోటెటమ్ అనే శిలీంధ్రం నుంచి పెన్సిలిన్ అనే సూక్ష్మజీవ నాశక ఔషధాన్ని 1929లో కనుగొన్నాడు.
   - 1945లో అలెగ్జాండర్ ఫ్లెమింగ్, హోవర్డ్ ఫ్లోరీ, ఎర్నెస్ట్ బోరిస్ చైన్ (పెన్సిలిన్ ఔషధ గుణాన్ని వివరించారు)లు సంయుక్తంగా నోబెల్ బహుమతి పొందారు.
8. యాంటీబయాటిక్స్ (సూక్ష్మజీవ నాశకాలు) అంటే ఏమిటి?
   - రోగకారక సూక్ష్మజీవులను (బ్యాక్టీరియా, వైరస్, శిలీంధ్రాలు) నిర్మూలించే మందులను యాంటీబయాటిక్స్ అంటారు.
9. మొట్టమొదటి యాంటీబయాటిక్ పేరు?
   - పెన్సిలిన్. దీన్ని వండర్ డ్రగ్, సర్వరోగ నివారిణి అని కూడా అంటారు.
10. యాంటీబయాటిక్ పితామహుడు అని ఎవరిని పిలుస్తారు?
   - అలెగ్జాండర్ ఫ్లెమింగ్
11. ఆరియో మైసిన్ సృష్టికర్త ఎవరు?
   - డా.ఎల్లాప్రగడ సుబ్బారావు(పశ్చిమ గోదావరి జిల్లా)
   - ఆరియోమైసిన్‌ను టెట్రాసైక్లిన్ అని కూడా పిలుస్తారు.
   - టైఫాయిడ్, ప్లేగు, క్షయ వంటి అనేక బ్యాక్టీరియా వ్యాధులను టెట్రాసైక్లిన్ నయం చేస్తుంది.
   - యల్లాప్రగడను విజర్డ్ ఆఫ్ వండర్ డ్రగ్స్ అని పిలుస్తారు.
12. టీకాలు (వ్యాక్సిన్లు) అంటే ఏమిటి?
   - చంపివేసిన (లేదా) బలహీనపర్చిన సూక్ష్మ జీవులుగల మందులనే టీకాలు/వ్యాక్సిన్లు అంటారు.
   - చంపివేసిన (లేదా) నిర్వీర్యం చేసిన సూక్ష్మ జీవులను శరీరంలోకి ప్రవేశపెట్టిన వృుడు శరీరం ప్రతిరక్షకాలను తయారుచేసి, నిల్వ ఉంచుకొని రక్షణ కల్పిస్తుంది.
13. ప్రపంచంలో తొలిసారి కనుగొన్న వ్యాక్సిన్?
   - స్మాల్‌పాక్స్ (మశూచి వ్యాధికి- 1796)
   - ఎడ్వర్డ్ జెన్నర్ దీన్ని కనుగొన్నాడు.
   - ఇతణ్ని వ్యాక్సిన్ పితామహుడు, అసంక్రామ్యతా (ఇమ్యూనిటీ) పితామహుడు అని పిలుస్తారు.
14. వ్యాక్సినేషన్ అంటే ఏమిటి?
   - చంపిన (లేదా) బలహీనపర్చిన వ్యాధి కారక సూక్ష్మజీవులను మానవ శరీరంలోకి ప్రవేశపెట్టడాన్ని వ్యాక్సినేషన్ అంటారు.
15. వ్యాక్సిన్ పదానికి మూలం?
   - వ్యాక్సిన్ పదం 'వాకా' అనే లాటిన్ పదం నుంచి వచ్చింది. వాకా అంటే ఆవు అని అర్థం.
16. పోలియో (శిశు పక్షవాతం) వ్యాధికి అందుబాటులో ఉన్న టీకాలు?
   - **పోలియో టీకా:** జోనాస్‌సాక్ (1952)
   - **పోలియో** చుక్కల మందు (Oral Polio Vaccine - OPV) ఆల్బర్ట్ సాబిన్ (1957)
17. ప్రపంచ వ్యాప్తంగా నిర్మూలించిన వైరస్ కారక వ్యాధి?
   - మశూచి (స్మాల్‌పాక్స్)

గతంలో అడిగిన ప్రశ్నలు

1. పోలియో వ్యాక్సిన్‌ను కనుగొన్నది ఎవరు?
   1) బాంటింగ్ 2) కేథరిన్ ఫ్రాంక్
   3) జోనాస్ సాక్ 4) ఫ్లెమింగ్
2. సూక్ష్మజీవ నాశిని పెన్సిలిన్‌ను కింది వాటిలో దేన్నుంచి ఉత్పత్తి చేస్తారు?
   1) బ్యాక్టీరియా
   2) ఫంగస్/బూజు
   3) వైరస్ 4) శైవలం
3. ప్రపంచంలో మొదటి యాంటీబయాటిక్?
   1) స్ట్రెప్టోమైసిన్ 2) క్రోసిన్
   3) పెన్సిలిన్ 4) క్వినైన్
4. భారతదేశంలో తొలిసారిగా, జన్యుపరంగా తయారు చేసిన వ్యాక్సిన్?
   1) B.C.G 2) O.P.V
   3) H.B.V 4) F.M.D
5. ఇమ్యునైజేషన్ ప్రక్రియలో సజీవ (లేదా) నిర్జీవ సూక్ష్మజీవులను ఉపయోగించి వ్యాధులు రాకుండా నివారించే పద్ధతులను ఏమంటారు?
   1) యాంటీటాక్సిన్ 2) వ్యాక్సిన్
   3) టాక్సాయిడ్ 4) ఎనీమియా
6. శాస్త్రీయ పద్ధతిలో పాలల్లోని సూక్ష్మజీవులను నశింపజేసే పద్ధతి?
   1) స్టెరిలైజేషన్ 2) పాశ్చరైజేషన్
   3) కిణ్వనం 4) ప్యూరిఫికేషన్

సమాధానాలు

1) 3; 2) 2; 3) 3; 4) 3; 5) 2; 6) 2

మద్యపానం.. హానికరం

పంచదార

మనం రోజూ ఉపయోగించే చక్కెర, బెల్లంను 'చెరకు రసం' నుంచి తయారు చేస్తారు. గడ్డి జాతికి చెందిన చెరకు (గెడల)లో భారాత్మకంగా 11-15 శాతం చక్కెర ఉంటుంది. ఇది రసాయనికంగా 'కార్బోహైడ్రేట్' కుటుంబానికి చెందిన డైశాకరైడ్ 'సుక్రోజ్'. ఈ సుక్రోజ్ అనేది 'గ్లూకోజ్', 'ఫ్రక్టోజ్'ల మిశ్రమం. దీన్నే 'టేబుల్ షుగర్'గా వ్యవహరిస్తారు. డయాబెటిస్ వ్యాధిగ్రస్థులు తీపి కోసం రసాయనికంగా 'సుక్రోజ్' అనే చక్కెరకు బదులు కృత్రిమ తీపికారిణి 'శాకరిన్' లాంటి పదార్థాలను ఉపయోగిస్తారు. వీటికి సంబంధించిన అంశాల గురించి క్లుప్తంగా తెలుసుకుందాం.

- పంటచేను నుంచి చెరకు గెడలను కోసిన తర్వాత 24 గంటల లోపు చక్కెర ఫ్యాక్టరీలకు తరలిస్తారు. ఆలస్యం అయ్యేకొద్దీ చక్కెర శాతం తగ్గుతుంది. అందుకే సాధారణంగా చక్కెర పరిశ్రమలను చెరకు అధికంగా పండించే ప్రాంతాలకు సమీపంలో నెలకొల్పుతారు.
- చెరకు గెడలను చిన్న చిన్న ముక్కలుగా చేసి, క్రషర్‌లో వేసి చెరకు రసాన్ని తీస్తారు. రసం తీసిన తర్వాత మిగిలిన పిప్పిని 'బగాసే' అంటారు.
- బగాసేను గట్టి కాగితం తయారీకి, 'కాప్టివ్ పవర్' ఉత్పత్తిలో ఇంధనంగా వాడతారు. బెల్లం తయారీలో చెరకు రసాన్ని గాఢత చెందించడానికి కూడా 'బగాసే'ను ఉపయోగిస్తారు.
- ఆమ్లత్వం ఉన్న చెరకు రసానికి 'కాల్షియం హైడ్రాక్సైడ్' (తడి సున్నం)ను కలిపి తటస్థీకరిస్తారు. ఈ ప్రక్రియనే 'డెఫకేషన్' అంటారు.
- ఎక్కువైన సున్నాన్ని తొలగించడానికి 'కార్బన్ డై ఆక్సైడ్' (CO_2)ను కలిపి 'కార్బొనేషన్' చేస్తారు. దీంతో సున్నం 'కాల్షియం కార్బొనేట్ ($CaCO_3$)'గా అవక్షేపం చెందుతుంది.
- తర్వాత 'సల్ఫర్ డై ఆక్సైడ్' వాయువును పంపి మిగిలి ఉన్న సున్నాన్ని తొలగిస్తారు. ఈ ప్రక్రియను 'సల్ఫిటేషన్' అంటారు.
- పై మూడు ప్రక్రియల వల్ల ఏర్పడ్డ అవక్షేపాలను ప్రెస్‌మడ్ రూపంలో ఎరువుగా ఉపయోగిస్తారు.
- సల్ఫర్ డై ఆక్సైడ్ విరంజనకారిగా కూడా పని చేస్తుంది. ఇది చెరకు రసం రంగును తొలగిస్తుంది.
- రసాన్ని గాఢత పరిచి చక్కెర స్ఫటికాలను ద్రవం నుంచి వేరు చేస్తారు.
- చక్కెర తయారు చేసిన తర్వాత మిగిలే చిక్కని ద్రవాన్ని 'మొలాసిస్' అంటారు. ఇది చక్కెర పరిశ్రమలో ముఖ్యమైన ఉప ఉత్పన్నం (బై ప్రొడక్ట్).
- మొలాసిస్ నుంచి కిణ్వ ప్రక్రియ ద్వారా ఆల్కహాల్‌ను రూపొందిస్తారు. మొలాసిస్‌ను వేరు చేయకుండా చెరకు రసాన్ని కిణ్వ ప్రక్రియలో గాఢత పరిచి 'బెల్లం' తయారు చేస్తారు.

కిణ్వ ప్రక్రియ:

ఈస్ట్, బ్యాక్టీరియా మొదలైన సూక్ష్మజీవులతో ఉత్పత్తైన ఎంజైమ్‌లు పెద్ద అణువులను చిన్న అణువులుగా విడగొడతాయి. దీన్నే 'కిణ్వ ప్రక్రియ' అంటారు. స్టార్చ్ లేదా మొలాసిస్ లేదా ద్రాక్ష రసం నుంచి ఆల్కహాల్ తయారు చేయడంలో; బ్రెడ్, ఇడ్లీ, సోయా సాస్, కాడ్ లివర్ ఆయిల్, వెనిగర్ లాంటి అనేక రకాల పదార్థాల తయారీలో కిణ్వ ప్రక్రియ ఇమిడి ఉంటుంది. ఇందులో 'కార్బన్ డై ఆక్సైడ్' విడుదలవుతుంది. బ్రెడ్, ఇడ్లీ పిండి ఈ ప్రక్రియ వల్లే పొంగుతాయి.

నిత్య జీవితంలో పంచదార, బెల్లంను ఏదో రూపంలో వినియోగిస్తూనే ఉంటాం. చక్కెర పరిశ్రమకు అనుబంధంగా 'ఆల్కహాల్' పరిశ్రమ ఉంది. ఆల్కహాల్‌ను ప్రధానంగా పరిశ్రమల్లో, వాహనాల్లో ఉపయోగిస్తారు. మత్తు పానీయాలైన సారాయి, గుడుంబా, బీర్, విస్కీ, బ్రాందీ, వైన్ తదితరాల తయారీ లోనూ ఆల్కహాల్‌ను విరివిగా వినియోగిస్తున్నారు. కల్తీ కల్లు తయారీలో వివిధ రసాయనాలు వాడుతున్నారు. ధనార్జనే లక్ష్యంగా ఇందులో మోతాదుకు మించి హానికర రసాయనాలను వాడటం వల్ల అనేక కుటుంబాలు ఛిద్రమవుతున్నాయి.



గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

రసాయన శాస్త్రం

ఇథైల్ ఆల్కహాల్ తయారీ

సాధారణంగా ఆల్కహాల్‌గా వ్యవహరించే సమ్మేళనమే 'ఇథైల్ ఆల్కహాల్ (ఇథనోల్)'. చక్కెర పరిశ్రమలో ఉప ఉత్పన్నమైన మొలాసిస్‌పై ఈస్ట్ కిణ్వ ప్రక్రియ ద్వారా ఇథనోల్‌ను తయారు చేస్తారు.

- ఈస్ట్‌లోని 'జైమేజ్' అనే ఎంజైమ్ మొదట చక్కెర (సుక్రోజ్)ను గ్లూకోజ్, ఫ్రక్టోజ్‌లుగా విడగొడుతుంది.
- గ్లూకోజ్, ఫ్రక్టోజ్‌లను ఈస్ట్‌లో ఉండే మరో ఎంజైమ్ అయిన 'జైమేజ్' కిణ్వ ప్రక్రియ ద్వారా 'ఇథనోల్'గా మారుస్తుంది. ఇందులో ఉప ఉత్పన్నం 'కార్బన్ డై ఆక్సైడ్'.
- ఈస్ట్ కణాలకు అమ్మోనియం సల్ఫేట్, అమ్మోనియం ఫాస్ఫేట్ లవణాలను ఆహారంగా అందిస్తారు.
- ఈ ప్రక్రియలో ఆల్కహాల్ 15-20 శాతానికి చేరగానే ఈస్ట్ కణాలు చనిపోయి కిణ్వ ప్రక్రియ ఆగిపోతుంది. ఈ ద్రావణాన్ని 'వాష్' అంటారు.
- కిణ్వ ప్రక్రియలోకి గాలి చేరితే అందులోని ఆక్సిజన్ ఇథనోల్‌ను 'ఇథనోయిక్ ఆమ్లం'గా ఆక్సీకరణం చెందించి ఆల్కహాలిక్ ద్రావణాల రుచిని పాడు చేస్తుంది.
- వాష్‌ను 'అంశిక స్వేదనం' చేయడం ద్వారా 96 శాతం ఆల్కహాల్‌ను పొందవచ్చు. దీన్ని 'రెక్టిఫైడ్ స్పిరిట్' అంటారు. ఇందులో 'ఎజియోట్రోపిక్ మిశ్రమం' ఏర్పడటం వల్ల వంద శాతం ఆల్కహాల్‌ను పొందలేం.
- మిగిలిన 4 శాతం నీటిని తొలగించడానికి సున్నం ఉపయోగిస్తారు.
- వంద శాతం ఆల్కహాల్‌ను అబ్సల్యూట్ ఆల్కహాల్ అంటారు.
- పారిశ్రామిక ఆల్కహాల్‌ను దుర్వినియోగం (మద్యంగా సేవించడం) చేయకుండా ఇథైల్ ఆల్కహాల్‌కు 'పిరిడీన్', 'మిథనోల్'ను కలిపి సరఫరా చేస్తారు. దీన్ని 'అసహజ స్పిరిట్' (డీనేచర్డ్ స్పిరిట్) అంటారు. దీన్ని తాగితే అంధత్వంతోపాటు మరణం కూడా సంభవించవచ్చు.
- ఇథైల్ ఆల్కహాల్‌ను ఔషధాల తయారీలోనూ ఉపయోగిస్తారు.
- బీర్, వైన్, బ్రాందీ, విస్కీ, రమ్, జిన్ మొదలైన మత్తు పానీయాల్లో ఆల్కహాల్ విభిన్న శాతాల్లో ఉంటుంది.
- సంక్లిష్ట కార్బోహైడ్రేట్లున్న బార్లీ, రైస్, గోధుమ లాంటి ధాన్యం గింజలు లేదా ద్రాక్ష లాంటి ఫలాల నుంచి ఈ మత్తు పానీయాలను తయారు చేస్తారు.

వివిధ మత్తు పానీయాల్లో ఇథైల్ ఆల్కహాల్ శాతం

పానీయం	ఆల్కహాల్ శాతం
బీర్	4 - 5
వైన్	10 -16
రమ్	15 - 40
బ్రాందీ, విస్కీ	40 - 50
బ్రీజర్	4 - 7
కల్లు	5 - 8
వోడ్కా	40

- మొలాసిస్‌లో 50 శాతం చక్కెర ఉంటుంది.
- ఇథైల్ ఆల్కహాల్‌ను 'స్పిరిట్ ఆఫ్ వైన్' అని కూడా అంటారు.
- మిథైల్ ఆల్కహాల్ విషపూరితమైంది. దీన్ని 'ఉడ్ స్పిరిట్' అంటారు. దీన్ని 'కలప' నుంచి విధ్వంసక స్వేదనం ద్వారా తయారు చేస్తారు.
- సాధారణంగా నల్ల బెల్లం నుంచి గుడుంబా; బార్లీ నుంచి బీర్; ద్రాక్ష నుంచి వైన్, బ్రాందీ; మొలాసిస్ నుంచి రమ్; మొక్కజొన్న నుంచి జిన్; పొటాటో నుంచి వోడ్కా; మాల్ట్ నుంచి విస్కీ రూపొందిస్తారు.
- ఎక్కువ మోతాదులో ఆల్కహాల్ తీసుకోవడం వల్ల రక్త ప్రసరణ, నాడీ వ్యవస్థలతో పాటు కాలేయం దెబ్బతింటుంది. చిన్న పేగుల్లో ఆమ్లత్వం పెరిగి చిన్న కురుపులు ఏర్పడి జీర్ణ వ్యవస్థ దెబ్బతింటుంది. గుండె సంబంధ వ్యాధులు కూడా వస్తాయి.

కల్తీ కల్లు

తాటి, ఈత చెట్ల నుంచి సహజసిద్ధమైన కల్లు లభిస్తుంది. ఇందులో సుమారు 4 నుంచి 8 శాతం వరకు ఆల్కహాల్ ఉంటుంది. ఇది పులుస్తున్న కొద్దీ ఆల్కహాల్ పరిమాణం పెరుగుతుంది. సాధారణంగా ఈ కల్లు గ్రామీణ ప్రాంతాల్లో స్థానిక వినియోగదారులకే సరిపోతుంది. అందువల్ల పట్టణ ప్రాంతాల్లో కల్తీ కల్లు తయారు చేస్తున్నారు. కేవలం లీటరు సహజ కల్లును ఉపయోగించి నీళ్లు, ఇతర రసాయనాలను కలిపి 100 నుంచి 150 లీటర్ల కల్తీ కల్లు ఉత్పత్తి చేస్తున్నారు. ఒక పెద్ద ట్యాంకును నీటితో నింపి అందులో కొంత సహజ కల్లు కలుపుతారు. దానికి చక్కెర కంటే 600 రెట్లు తీపిదనం ఉండే కృత్రిమ తీపికారిణి శాకరిన్, మత్తు కోసం యూరియా, క్లోరాల్ హైడ్రేట్, డైజీఫాం, ఆల్ప్రజోలాం లాంటి మత్తు పదార్థాలను కలుపుతారు. సిట్రికామ్లం, సోడియం బైకార్బొనేట్, మెగ్నీషియం సల్ఫేట్ లాంటి స్థిరీకరణులను కూడా ఉపయోగిస్తారు.

- మత్తు పదార్థాలు నేరుగా కేంద్ర నాడీ మండలంపై పనిచేస్తాయి. వీటికి బానిసైన వారికి ఇవి అందకపోతే.. కాళ్లు, చేతులు వణకడం; రక్తపోటు, హృదయ స్పందన రేటు పెరగడం; నిద్ర రాకపోవడం; పిచ్చిగా ప్రవర్తించడం లాంటి రుగ్మతలకు లోనవుతారు.
- కల్తీ కల్లు బాధితులకు మానసిక రుగ్మతలు నయం చేయడానికి 'లొరజిపామ్' ఔషధాన్ని ఉపయోగిస్తున్నారు.

గతంలో అడిగిన ప్రశ్నలు

1. రసాయనికంగా టేబుల్ షుగర్ అనేది?
   1) గ్లూకోజ్ 2) ఫ్రక్టోజ్
   3) సుక్రోజ్ 4) లాక్టోజ్
2. కిణ్వ ప్రక్రియ ద్వారా ఇథైల్ ఆల్కహాల్ నుంచి లభించేది?
   1) ఫార్మలిన్ 2) వెనిగర్
   3) పెర్ హైడ్రాల్ 4) ఉడ్ స్పిరిట్
3. వెనిగర్ రసాయన నామం?
   1) ఇథైల్ ఆల్కహాల్
   2) ఎసిటికామ్లం (ఇథనోయికామ్లం)
   3) సిట్రికామ్లం 4) మిథనోల్
4. కిందివాటిలో అతి తక్కువ ఆల్కహాల్ ఉండే పానీయం ఏది?
   1) విస్కీ 2) రమ్
   3) సారాయి 4) బీర్

సమాధానాలు

1) 3; 2) 2; 3) 2; 4) 4.

మాదిరి ప్రశ్నలు

1. మొలాసిస్ కిణ్వ ప్రక్రియలో గ్లూకోజ్‌ను ఇథైల్ ఆల్కహాల్‌గా మార్చే ఎంజైమ్?
   1) డయాస్టేజ్ 2) ఇన్వర్టేజ్
   3) జైమేజ్ 4) మాల్టేజ్
2. ఏ రకమైన ఆల్కహాల్ సేవించడం వల్ల అంధత్వం వస్తుంది?
   1) ఇథైల్ ఆల్కహాల్
   2) మిథైల్ ఆల్కహాల్
   3) బెంజైల్ ఆల్కహాల్
   4) ఎమైల్ ఆల్కహాల్
3. చక్కెర తయారు చేసిన తర్వాత మిగిలే మాతృ ద్రావణాన్ని ఏమంటారు?
   1) వాష్ 2) మొలాసిస్
   3) ఉడ్ స్పిరిట్ 4) ఫార్మలిన్
4. కల్తీ కల్లులో వాడే మత్తు పదార్థం ఏది?
   1) క్లోరాల్ హైడ్రేట్ 2) డైజీపాం
   3) ఆల్ప్రజోలాం 4) పైవన్నీ
5. చక్కెరను కిణ్వ ప్రక్రియ చేస్తే నిరంతరం ఏర్పడే సమ్మేళనం ఏది?
   1) మిథైల్ ఆల్కహాల్
   2) ఇథైల్ ఆల్కహాల్
   3) ఎసిటికామ్లం
   4) ఎసిటలీన్

సమాధానాలు

1) 3; 2) 2;
3) 2; 4) 4;
5) 2.

There is a lot to be said about...



BANK EXAMS

GENERAL ENGLISH

Directions (Q. No. 1-10):

Read each sentence to find out whether there is any grammatical mistake/ error in it. The error, if any, will be in one part of the sentence, mark the number of that part with error as your answer. Mark (5) as your answer, if there is "No error".

1. He has a scheme (1)/ which he thinks is preferable (2)/ than that proposed (3)/ by the planning commission. (4)/ No error (5)
2. The details (1)/ are the matters (2)/ for future (3)/ considerations. (4)/ No error (5)
3. The rise and fall (1)/ of the British Empire (2)/ were (3)/ Historical processes. (4)/ No error (5)
4. Information technology (1)/ as well as (2)/ management are (3)/ taught here. (4)/ No error (5)
5. This is the only one (1)/ of his ideas (2)/ that have not found (3)/ favour with biologists. (4)/ No error (5)
6. He has promised (1)/ to buy shares (2)/ in whatever company (3)/ you are interested. (4)/ No error (5)
7. One has to reckon with paying (1)/ for supporting services (2)/ although it may not be apparent (3)/ from the glib sales talk of the bank personnel. (4)/ No error (5)
8. There is a general perception in our society (1)/ that public administrations and business executives (2)/ sit in their air-conditioned chambers and quietly administer (3)/ the affairs of the states or business. (4)/ No error (5)
9. The greatest need (1)/ of the hour is (2)/ we must learn (3)/ to work together as a team. (4)/ No error (5)
10. A virtuous man, (1)/ under all misfortune of life, (2)/ still finds an inward comfort (3)/ and satisfaction. (4)/ No error (5)

Directions (Q. No. 11-15):

Which of the phrases (1), (2), (3) and (4) given below each sentence should replace the phrase underlined in the sentence to make it grammatically correct? If there is no error, mark (5) No correction required as your answer.

11. I should have <u>liked to have visited</u>.
    1) liking to visit
    2) like to visit
    3) like to have visited
    4) likes to visit
    5) No correction required
12. <u>It was being a very hot day,</u> I remained indoor.
    1) Being a very hot day
    2) Been a very hot day
    3) It is a hot day
    4) It been a hot day
    5) No correction required
13. Please excuse <u>me</u> being late.
    1) mine 2) my
    3) with 4) from
    5) No correction required
14. He fled lest he <u>would</u> be killed.
    1) will being 2) may
    3) should 4) might have
    5) No correction required
15. The river <u>has over flown</u> its banks.
    1) have over flown
    2) have been over flown
    3) has overflowed
    4) has over flowing
    5) No correction required

Directions (Q. No. 16-20):

Rearrange the following six sentences (A), (B), (C), (D), (E) and (F) in a proper sequence to form a meaningful paragraph and then answer the questions given below.

A. Records going back to the fourth century A.D. refer to tea.
B. No one knows when tea was first discovered or how it came to be such a popular drink.
C. By the eighteenth century A.D. most Chinese were drinking tea both because they liked it as a beverage and for its medicinal value.
D. It was called Cha Ching, which translated means Tea Scripture.
E. The beverage is generally accepted to have originated in China hundreds of years ago.
F. Tea was so popular that one of the most distinguished poets of Tang dynasty a man called Lu Yu, even wrote a holy scripture about it.

16. What is the FOURTH sentence after rearrangement?
    1) A 2) B 3) C 4) D 5) E
17. What is the THIRD sentence after rearrangement?
    1) A 2) B 3) D 4) F 5) E
18. What is the SECOND sentence after rearrangement?
    1) A 2) B 3) D 4) E 5) F
19. What is the FIRST sentence after rearrangement?
    1) B 2) A 3) C 4) D 5) E
20. What is the LAST sentence after rearrangement?
    1) A 2) B 3) C 4) D 5) F

Directions (Q. No. 21-25):

Each question below has a blank/ two blanks, each blank indicating that something has been omitted. Choose the word/ set of words from the five options for each blank that best fits the meaning of the sentence as a whole.

21. There is a lot to be said about the ___ changes that technology has brought __ in the financial sector.
    1) alternate; along
    2) alternative; within
    3) attitudinal; about
    4) alternatively; forth
    5) attitude; with
22. Although seat belts have been shown to ___ lives, people give a number of __ for not using them.
    1) prosper; treason
    2) prefer; resign
    3) pamper; alternates
    4) save; reasons
    5) protect; cause
23. To create a scientific temper, there has to be a widely shared ___ to and belief in the value of science, particularly among the political ___.
    1) commitment; elite
    2) promise; choice
    3) assurance; best
    4) dedication; leaders
    5) pledge; privilege
24. The same sciences which had led us away from nature are now ___ the miracle of creation.
    1) discovering 2) unfolding
    3) inventing 4) revealed
    5) projected
25. Man's basic ___ is a fact and is the emotional factor for all the bloody violence that has marked human history since the beginning.
    1) fierceness
    2) violence
    3) aggressiveness
    4) assertiveness
    5) ferociousness

Directions (Q. No. 26-30):

Read the following passage carefully and answer the questions given below it. Certain words have been printed in **bold** to help you locate them while answering some of the questions.

By coach, by train, by ship and by plane, millions of tourists annually depart from home like migrating summer birds. They provide the best possible evidence to prove that the world is not really as big as it used to be. For the modern tourist is no Marco Polo. He ventures forth into the unknown and returns home in a matter of weeks, and years. Furthermore, he is armed with pamphlets, maps and weighty guide books which tell him where to go and how to get there; and where to stay, what to see and what to eat when he arrives. There are travel agencies everywhere to cater for his needs and make all the necessary preparations for him. They make out ambitious programmes and promise to **whisk** him through as many as six countries in fourteen days or, if he is in a hurry, they will cover much the same ground in eight or less.

It is a small wonder that the tourist is a busy man. He no sooner sets foot on foreign soil than he is rushed to his hotel and thence is immediately taken on a conducted tour of the city by night. In the morning he goes through another **arduous** course of sight-seeing. He has barely had the chance to recover, or, indeed, to find out exactly where his hotel is located, before he is off again to yet another part of the country. It is not even a bird's eye view he gets. Rather, it is a snap-shot view.

26. Today, the world ___
    1) is not as big as it was in the past.
    2) is full of tourists
    3) can be toured in a matter of days
    4) has a lot of travel agents
    5) has different modes of transport
27. According to the passage:
    1) The hectic schedule of the tourist is described
    2) It deals with how the tourist enjoys his tour
    3) highlights the tourist's problems during the tour
    4) Defines the tourist as a nomad
    5) Defines the tourist as a confused person
28. Which of the following statements is false?
    1) Travel agencies provide the tourist with all the necessary information
    2) The tourist is a wanderlust
    3) The tourist wants to derive maximum benefit from his hard earned money
    4) The tourist does gets sufficient rest during his tour
    5) Each country welcomes the tourist for the foreign exchange he brings with him
29. The synonym of **whisk** is:
    1) Catapult 2) Leisure
    3) Walk 4) Decelerate
    5) Jaunt
30. The antonym of **arduous** is:
    1) Fatigue 2) Formidable
    3) Facile 4) Former
    5) Flaunt

Answers

1) 3	2) 2	3) 3	4) 3	5) 3
6) 3	7) 5	8) 4	9) 3	10) 2
11) 2	12) 5	13) 2	14) 3	15) 3
16) 3	17) 1	18) 4	19) 1	20) 4
21) 3	22) 4	23) 1	24) 2	25) 3
26) 1	27) 5	28) 4	29) 1	30) 3